UNIVERSAL LIBRARY

OU_206191

UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No T294 1 M3   Accession No 9

Author M82S

Title శివపురాణము

This book should be returned on or before the date last marked below

[illegible]గ్రంథమాలిక 3.

శివపురాణము

(మూఁడవసంపుటము.)

సంపాదకుఁడు

నడకుదుటి వీరరాజుపంతులు.

రాజపోషకులు.

మహారాజరాజశ్రీ

శివపురాణము.

(మూడవ సంపుటము.)

మూ[illegible]సహితము.

నడకుదుటి వీరరాజు పంతులు

సంపాదకులు.

వెల రు ౧-౮-౦ లు.]

పి ఠా పు ర ము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల.

౧౯౨౬.

పీఠిక.

మనపూర్వుల పవిత్రవీరధర్మములు, పావనవిబుధచారిత్రములు, విమలసాంఘికనియమములు, విశుద్ధవిజ్ఞానవిషయములు సవిమర్శముగ, సులభముగఁ దెలియునట్లు మహాపురాణములు, ఉపపురాణములు, ఇతిహాసములు, శాస్త్రములు మొదలగు నుత్తమగ్రంథములు వ్యాసాది మహర్షులచే సంస్కృతభాషను రచియింపఁబడియున్నవి. కాని, గీర్వాణ భాషాప్రచారము తగ్గియున్న యిక్కాలమున మనయాంధ్రదేశమునం దట్టియుద్గ్రంథములు దుర్గ్రాహ్యములై నామమాత్రావశిష్టములై యున్నవి. కావున మిత్రసమ్మితములును, పురుషార్థచతుష్టయసంపాదకములును, భుక్తిముక్తిమార్గప్రదర్శకములును, సకలతత్త్వరత్నాకరములును, అవశ్యపఠనీయములును నగునిట్టిసద్గ్రంథములను సులభశైలిని వచనరూపమున నాంధ్రీకరించి యాంధ్రమహాజనులకుఁ గరతలామలకము లగునట్లు చేయుటకై యీయుద్యమము ప్రారంభింపఁబడినది.

ఇంతకుమున్ను ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయమువారు, ఇట్టియుద్దేశముతోనే అష్టాదశపురాణాంతర్గత మగుశివపురాణమున మొదటిరెండుసంపుటములనుమాత్రము దెలుఁగునఁ బ్రకటించియున్నారు. వారియనుమతి ననుసరించి యారెండుసంపుటములను ఈగ్రంథమాలికకుఁ బ్రథమ ద్వితీయకుసుమములుగా నంగీకరించి మంగళప్రదమును, శివతత్త్వప్రతిపాదకమును నగు నిమ్మహాపురాణమును బ్రప్రథమమున సంపూర్తి గావింప నెంచి యీమూఁడవభాగమును బ్రకటించితిమి.

ఈసనత్కుమారసంహిత యించుకంత పెద్దది యగుటచే అది యంతయు నిందు ప్రకటింప వలనుపడదయ్యెను. ఇందు మిగిలినభాగమును, వాయవీయసంహితలోని పూర్వభాగమును జేర్చి రాఁబోవు సంపుటముగాఁ బ్రకటింతుము. ఇఁక మూఁడుసంపుటము లగును.

ఇట్లే యింతటినుండి రెండుమాసముల కొకసంపుటముగా సంపుటము 1 కి 200—250 పుటలవంతున డెమ్మీ౮పైజున పదునెనిమిది పురాణములను, ఉపపురాణాదులను క్రమముగా వచనరూపమున నాంధ్రీకరించి సంవత్సరమున కాఱుసంపుటములుగాఁ బ్రకటించుచు నాంధ్రదేశమున మాయోపినకొలఁది భాషాసేవ నొనర్ప సంకల్పించితిమి.

కొందఱు మిత్రులయాలోచనము ననుసరించి చందాదారులకు సుకరముగ నుండునట్లు మనీఆర్డరుకమ్మిషన్‌సయితము మేమే భరించి అన్నివ్యయములతోను ఒక్కొక్కసంపుట మొక్కొక్క రూపాయకు మాత్రమే చందాదారుల కందించునట్లు లేర్పాటునుగూడఁ జేసితిమి. కావున శివపురాణము మొదటిరెండవసంపుటములను గోరుచందాదారులకు పోస్టేజి మనీఆర్డరుకమ్మిషనులు మేమే భరించి రు 2-0-0 లకు మాత్రమే యిచ్చుచున్నాము.

ఇందులమాయుద్దేశము సాధ్యమైనంతవఱకు దేశభాషాసేవ సేయుటయు, మనపురాణధర్మములను మనవారు సులభముగఁ దెలిసికొనునట్లొనర్చుటయుమాత్రమే యని పాఠకమహాశయులు గ్రహింపకపో రని తలంచెదము.

ఇట్టిసదుద్యమములు దేశభాషాభిమానులగు నాంధ్రమహాజనుల నిరంతరసాహాయ్యప్రోత్సాహములవలనఁగాని నిరంతరాయముగఁ గొనసాగనేరవు. కాఁబట్టి యాంధ్రసోదరసోదరీమణు లెల్లరును మాసదుద్యమము నాదరించి చందాదారులుగను, సహాయులుగను, పోషకులుగను, రాజపోషకులుగను నుండుట కంగీకరించి మాకెల్లవిధములఁ జేయూఁత నొసగఁగోరుచున్నాము.

పురాణగ్రంథమాలిక
పిఠాపురము.

నడకుదుటి వీరరాజుపంతులు,
సంపాదకుఁడు.

విషయసూచిక.

పుట.

౧	సృష్ట్యారంభవర్ణనము	౩
౨	సప్తద్వీపవర్ణనము	౯
౩	పాతాళవర్ణనము	౧౬
౪	నరకవర్ణనము	౧౯
౫	భువనకోశవర్ణనము	౨౩
౬	మహాదేవస్వరూపవర్ణనము	౨౬
౭	రుద్రమాహాత్మ్యకీర్తనము	౩౦
౮	రుద్రారాధనవిధి	౩౩
౯	బ్రహ్మగీత	౪౧
౧౦	శివపురవర్ణనము	౪౩
౧౧	రుద్రలోకవివరణము	౪౯
౧౨	శివమాహాత్మ్యము	౫౧
౧౩	శివస్తోత్రకథనము	౫౩
౧౪	శివలింగార్చనవిధి	౫౮
౧౫	ముక్తిక్షేత్రవర్ణనము	౬౭
౧౬	శ్రేష్ఠస్థానాఖ్యానము	౭౦
౧౭	లింగోద్భవకథనము	౭౪
౧౮	పుష్పదానాదిఫలవివరణము	౮౦
౧౯	పూజాఫలకథనము	౮౩
౨౦	పూజావిధానము	౮౯
౨౧	ఉపాసనవిధి	౯౧

౨౨	సోమాష్టమీవ్రతవిధానము	౧౦౦
౨౩	సోమలక్షణాష్టమీవిధానము	౧౦౬
౨౪	వివిధదానప్రశంస	౧౦౭
౨౫	వివిధోపాసాదిఫలకథనము	౧౧౫
౨౬	నియమనిరూపణము	౧౨౦
౨౭	చంద్రశేఖరత్వహేతుకీర్తనము	౧౨౯
౨౮	విభూతిమాహాత్మ్యము	౧౩౩
౨౯	రుద్రవృత్తాంతకీర్తనము	౧౪౧
౩౦	అష్టషష్టిక్షేత్రవివరణము	౧౪౯
౩౧	శివవిభూతిమాహాత్మ్యము	౧౫౧
౩౨	ధ్యానఫలకథనము	౧౫౩
౩౩	యోగాఖ్యానము	౧౫౬
౩౪	యోగవిధి	౧౫౯
౩౫	ధ్యానమాహాత్మ్యము	౧౬౨
౩౬	కాశీవాసనిర్దేశము	౧౬౪
౩౭	వివిధయోగవిధి	౧౬౬
౩౮	యోగలక్షణము	౧౬౮
౩౯	షడంగయోగాదికథనము	౧౫౮
౪౦	శరీరనిరూపణము	౧౭౧
౪౧	నాడీవివరణము	౧౭౪
౪౨	అవిముక్తక్షేత్రమాహాత్మ్యము	౧౭౮
౪౩	హరికేశచరిత్రము	౧౮౧
౪౪	దండపాణివరప్రదానము	౧౯౧
౪౫	ఓంకారేశ్వరవర్ణనము	౧౯౨

శ్రీయైనమః.

శివపురాణము.

సనత్కుమారసంహిత.

సర్వజ్ఞు విశ్వతోముఖు
సర్వేశ్వరు సర్వభూతసంభవహేతున్
శర్వు నభవు నపరాజితు
సర్వమయు భజింతు మిష్టసంసిద్ధులకున్.

వేదాదుల కాదిస్వరం బని చెప్పంబడినయోంకారమే మహేశ్వరస్వరూపము. సర్వమంగళమయుం డగునామహేశ్వరదేవుఁడే పంచభూతములమూలంబున నిఖిలజీవులను సృజియించును. ఆయాదిదేవుఁ డగునుమాపతి సర్వజ్ఞానసంపాదకుఁడు. పరమతత్త్వస్వరూపుఁడు. స్వయంప్రకాశుఁ డగునాపరమేశ్వరుఁడు తనమూర్తిత్రయవికారముల వలన నవతారసమూహమును సృష్టించుచుండును. అభవుండగునాతఁడు నిఖిలజీవరక్షణంబునకై తన్ను మూఁడుభాగములుగా సృష్టించుకొనును. భగవంతుం డగుమహేశ్వరుఁడు స్వయముగా నేకస్వరూపుఁడయ్యును బ్రహ్మాదిసంజ్ఞావశంబునఁ ద్రివిధంబుల విరాజిల్లుచుండును.

వ్యయుం డగుశివుండు నిత్యముక్తుండు. మఱియుఁ ద్రిభువనహితాభిలాషి. ఆదేవుఁడు జ్వాలామయుం బగుమహాశూలము, భీమకాళనిసమూహము మొదలగుక్రీడాపరికరములచే యోగమాయతోఁ గ్రీడించుచుండును. అమ్మహాదేవుఁడు తాండవసమయమునఁ దనశరీరమునం దర్ధభాగమును బత్నిగాఁ జేసి జగంబులకు స్థితిని, లోకానుగ్రహంబును గావించుచుండును. నిరంతరశివచింతానిమగ్నులగువారిహృదయముల కవిదితం బగునది యీజగంబునం దెద్దియును లేదు. కావుననే నేనును సర్వేశ్వరునియెడలం గలభక్తిబలంబుచేతనే తత్కథితం బగుశివపురాణమును జెప్పఁగలుగుచున్నాఁడను.

పూర్వము నాచేఁ జెప్పంబడిననైమిశారణ్యమునందలి పవిత్రాశ్రమంబునఁ గాలయోగవేత్తలలో నగ్రగణ్యుండును, జగద్గురుండును, దపస్వియు, బ్రహ్మచారియు, ధర్మాత్ముండును, సుబుద్ధియు, లక్షశ్లోకసమంచితమహాభారతప్రణేతయు, సత్యవతీనందనుండును, బరాశరతనయుండును, బ్రహ్మర్షియు నగువ్యాసభగవానుండు దేవగణపరివృతుం డగుబ్రహ్మదేవునివలెనే ఋషిగణపరివేష్టితుండై బ్రహ్మకథితంబును, బ్రహ్మపదప్రతిపాదకంబును, బ్రహ్మనామాభిహితంబును నగువేదమును జతుర్భాగములుగా విభజించి శిష్యులచే వేర్వేఱుగా నధ్యయనముసేయించుచుండెను. వారందఱును సుఖోపవిష్టులై యుక్తమసంభాషణంబులు గావించుచున్నయవసరంబున నచ్చటి కధ్యాత్మధర్మాశ్రయుండును, బ్రహ్మపుత్త్రుండును, శుభనిదానుండు నగుసనత్కుమారుం డేతెంచి పరమానుగ్రహంబున వారికి దర్శనం బిచ్చెను. అనంతరము ధర్మజ్ఞుం డగు నమ్మునివరుండు మహర్షు లర్పించిన యర్ఘ్యాచమనీయంబులను యథావిధిగఁ బరిగ్రహించి ప్రశంసితవ్రతుం డగు నాతఁడు వేదోక్తవిధిచే నాబ్రహ్మర్షులను బూజించెను. అనంతర మమ్మహర్షుల

యనుజ్ఞంగాంచి సనత్కుమారుండు కుశాసనంబున నాసీనుండై యుం డెను. అప్పు డమ్మునులు లింగపూజావిధి, దేవదేవారాధనము, శివ మందిరనిర్మాణఫలము, సంవత్సరవ్యాప్తం బగుశివపూజాఫలము, ఆవ ర్తకవిధి, పునరావర్తకవిధి, మూర్తివిభాగము, మంత్రవిధి, మహాత్ముఁ డగురుద్రునియష్టస్థానములుమొదలగువిషయములంగూర్చి సనత్కుమా రునిఁ బ్రశ్నించిరి. భగవంతుండును, బ్రహ్మనందనుండు నగుసనత్కు మారయోగీంద్రుండు తపోబలానురూపంబులగు నాసనంబులపై నుప విష్టులైయున్న మునిగణంబులచేఁ బరివృతుండై బ్రహ్మర్షిపరివృతుం డగువనజాసనుంబోలి యధికతేజోవిరాజితుండయ్యెను. అట్లు సాధుగణ మధ్యస్థితుం డగుసనత్కుమారయోగీంద్రుంగూర్చి మహర్షు లందఱు నంజలిబద్ధులై యిట్లు ప్రశ్నించిరి.

సృష్ట్యారంభవర్ణనము.

మహాత్మా! మేము నీవలనఁ బవిత్రంబును నవినశ్వరంబునగు శివపురాణమును వినఁ గుతూహలముతో నుంటిమి. మాకు శివచరిత్ర మును బోధింపుము. త్రిభువనములయందలిసకలవిషయముల నెఱింగి యున్న నీకుఁ దెలియని దేదియును లేదు. అనుటయు బ్రహ్మపుత్త్రుం డగు సనత్కుమారుండు బ్రహ్మర్షిగణంబులచే నిట్లు ప్రార్థింపఁబడి యిట్లని చెప్పందొడంగెను. మునివరులారా! వినుఁడు! దేవతాదుల యెదుటఁగూడ గోపనీయం బగు నీసనాతనశివపురాణమును నేనిప్పుడు యథార్థరూపమున ననువదించెదను. సాధుజను లీపురాణశ్రవణంబు గావించి శివునియందుఁ జిత్తసమర్పణంబు సేసి శివపరాయణులును, శివ చింతానిమగ్నులు నై విశేషరూపమునఁ గృతార్థు లగుచుందురు. వేదతుల్యంబగునీపురాణ మతిపవిత్రంబును, యశస్కరంబును, నాయు రారోగ్యకరంబును, స్వర్గప్రదంబును, సర్వాభీష్టదాయకంబు నై నది.

దేవదేవుం డగుమహేశ్వరుని సంకీర్తనము పరమమంగళజనకంబును, విశేషించి శ్రద్ధావంతు లగువారి కైహికాముష్మికశుద్ధివిధాయకంబు నై యున్నది. తపోధనులారా! నేనిప్పుడు పరమార్థానుసారంబుగ నమ్మహాదేవునిచే భాషింపఁబడినశివపురాణమును మీయెదుట సంకీర్తనంబు గావించెదను. తొల్లి నేను సర్వజ్ఞుం డగు దేవదేవునింగూర్చి వినిన దంతయును సంక్షేపముగ ననువదించెదను. ఏమనిన—నూఱేండ్లకైనను దీనిని సవిస్తరముగఁ జెప్పఁజాలము. ఇందు బ్రహ్మవిష్ణూత్పత్తియు, హరివిరించిసంవాదంబును, సప్తద్వీపంబులయు సప్తవర్షంబులయు నాఖ్యానంబును, నూర్ధ్వాధోలోకకధనంబును, సూర్యచంద్రాదిగ్రహవిషయంబును, సనత్కుమారవిక్రమంబును, దదారాధితుం డగు మహాదేవుని వర్ణనంబును జెప్పంబడును. మఱియు వరదానసంబంధంబును, మునిశిష్యసమాగమంబును, మేరుశృంగంబున బ్రహ్మవిష్ణుమహేశ్వరభవనంబులును, రుద్రవిభీషణసంవాదంబును, సకలతీర్థఫలంబును, శివలింగపూజనంబును, శివలింగోత్పత్తియుఁ, దల్లింగంబునుండి ప్రళయోత్పత్తియు, లింగపూజావిధానంబును, వర్షవ్యాప్తం బగుమహాదేవార్చనంబుచేఁ గలుగునుత్కృష్టఫలంబును, ఆవర్తనపునరావర్తనాదివ్రతవిధియు, ముక్తిభేదానుసారంబుగ మహాదేవపూజావిధానంబును, మహేశ్వరుని స్థానరూపాదులప్రాధాన్యంబును, పరమాత్ముం డగు శివునిపరమదివ్యతత్త్వంబును, నతిపవిత్రరహస్యంబును, శివాష్టకంబును, బ్రహ్మవిష్ణుసమ్మోహనంబును, లింగస్థాపనఫలంబును, బుష్పదానఫలంబును, ధూపవిధియు, మాసఫలంబును, నుపవాసనియమంబును, నుత్తమదానవిధియు, అష్టమీచతుర్దశీవ్రతాదులయనుష్ఠానఫలంబును, నామాష్టమీవిశిష్టాష్టమీవ్రతఫలంబును, నతిలోకవిజ్ఞానసంపన్నుండగు మహేశ్వరునివిభూతియు, విశుద్ధాచారవిధియు, నుత్తమయోగవిధియు,

యోగనాడీకథనంబును, గాశీధామమహాత్మ్యంబును, నోంకారవర్ణనంబును, యక్షేశ్వరమాహాత్మ్యంబును, దీర్ఘవర్ణనంబును, నందీశ్వరుని శివారాధనంబును, నంద్యభిషేకంబును, మహాదేవమాహాత్మ్యంబును, త్రిపురాసురవధయు, శ్రీకృష్ణదేవమాహాత్మ్యంబును, శ్రీకృష్ణారాధనంబును, సకలధర్మాశ్రియుం డగుమహాదేవునిసంకీర్తనంబును, జ్ఞానప్రశంసయుఁ, బరమంబగు మోక్షవిచారంబును, వస్తువిచారంబును నీమొదలుగాఁగలయెల్లవిషయంబులను వరుసగా వర్ణించి చెప్పెదను. నేనిప్పు డాశ్చర్యజనకం బగుమహేశ్వరము క్తివిభాగమును సవిస్తరంబుగ సంకీర్తనంబు గావించెదను—

ప్రథమము దీవిశ్వ మంతయు నష్టాంతంబును, నలక్షణంబును, నంధకారమయంబునై యుండెను. అందు సర్వాకారణుండును, మహాయోగీంద్రుండు నగురుద్రుం డేకమాత్రుండై యుండెను. ఆపరమేశ్వరుండు స్వయంబుగ నాత్మభావనంబు గావించి తన యిచ్ఛానుసారంబుగ మొట్టమొదట మనంబును, దరువాత నహంకారంబును సృజియించెను. అహంకారమునుండి పంచభూతంబులు నుత్పన్నంబు లయ్యెను. శబ్దస్పర్శరూపరసగంధంబులును, ప్రాణాపానవ్యానోదానసమానాదివాయువులును, సత్వరజస్తమోగుణంబులును, నాభగవంతుం డగురుద్రునుండియే సంభవించెను. బ్రహ్మయు, విష్ణుండును నాతనియందే జనియించిరి. బ్రహ్మవిష్ణువిమోహనార్థంబుగా శివుఁడే మహత్స్వరూపంబుగా సంభూతుం డయ్యెను. నిరాకారుం డగుశివుం డుత్పత్తిశూన్యుండు. ఆతనికిఁ గారణు లెవ్వరును లేరు. ఆతనికంటె నధికులుగాని, మంగళకరులుగాని మఱియెవ్వరును లేరు. హరిబ్రహ్మలాతనినుండియే జనించి ప్రతికల్పంబునను జగన్నిర్మాణంబు గావించి సకలంబును సృష్టించుచుందురు. తచ్ఛ్రీలుం డగురుద్రుం డనేకవిధం

బుల సకలజీవసంహారంబు సేయుచుండును. డెబ్బదియొక్కయుగం బులు మన్వంతరం బనంబడును. పదునాల్గుమన్వంతరము లొకకల్పం బు. ఇట్టియొకకల్పంబు బ్రహ్మ కొక్కదివసం బగును; మఱియొక కల్పంబు రాత్రి యగును. ఈవిధముగా ముప్పదిదినంబులు బ్రహ్మ కొకమాసంబును, నిట్టిపండ్రెండుమాసంబు లొకవత్సరంబు నగును. ఇట్లు బ్రహ్మాయువు శతవర్షంబులు. ఇట్టిశతవర్షంబులును మహాదేవున కొక్కనిమేషం బగును. బ్రహ్మమొదలుగ నల్పకీటంబువఱకును గల సకలజీవాయువులును నమ్మహాదేవునినిమేషమధ్యమునందే యిమిడి యున్నవి. సర్వగ్రహంబులయు, సర్వదేవతలయు జీవనంబులుగూడ నింతలోనివే. స్థావరజంగమస్వరూపంబును, సప్తలోకాత్మకంబు నగు నీవిశ్వ మంతయుఁ బరమేశ్వరుని నిమిషలీలామాత్రంబు. భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనలోకము, సత్యలోకము, బ్రహ్మలోకమునను నీసప్తలోకంబులకును, సుతలము, తలము, తాలము, వితలము, పాతాళము, రుక్మసౌవర్ణికము, శర్కరాభూమి, విజయము ననునీయష్టవిధపాతాళంబులకును నాదిమధ్యాంతరంబులయందు రుద్రుం డవస్థితుండై యుండును. మహేశ్వరుండు తనక్రీడార్థమై యీలోకములను సృష్టించి యున్నాఁడు. బ్రహ్మలోకపరిమాణగతివిశేషంబుల ననంతరంబు వర్ణించెద. పృథివియు, నంతరిక్షంబును, దిక్కులును, విదిక్కులును, బర్వతంబులును, సముద్రంబులును, స్థావరంబులును, జంగమంబులును, దేవతాసమూహంబును, చతుష్పాదద్విపాదసమూహంబును మొదలగువానిపరిమాణంబులఁ జెప్పెదను. స్థావరంబులపరిమాణంబు సహస్రగుణాధికంబు; తక్కినవాని పరిమాణంబు క్రమంబుగఁ బాదపాదహీనంబు. సర్వజ్ఞుండును, స్వయంభువు నగు నీశ్వరుం డీదేవమానవాదులకంటెఁ బరుండు. ఈదేవమానవాదులకు

శివభక్తిమూలంబున యథాసమయంబున, యథోచితంబుగ బ్రహ్మ సాక్షాత్కారం బగుచుండును. అవ్యయం బగుశివస్వరూపజ్ఞానము నుండియే లోకంబునఁ గర్మప్రవృత్తి యగుచున్నది. అట్టిజ్ఞానంబును గూర్చియే యెల్లరును నమస్కరించు చుందురు. ఉత్పత్తివిహీనుం డయ్యు నుత్పన్నసంజ్ఞకుండును, గుణాతీతుండును, నిర్మలుండును నగు శంకరునుండియే జ్ఞానం బుత్పన్నం బగుచున్నది. శ్రోత్రకాములగు మహర్షులకును, భక్తులకును, సకలజీవులకును, విశేషించి బ్రహ్మపరా యణులకును హితార్థమై మహేశ్వరునిచేఁ జెప్పఁబడినయీజ్ఞానము పురాణములయందు సవిస్తరముగా వర్ణితమై యున్నది. ఈశ్వరుండు తన కిష్టసాధనేచ్ఛగలిగినప్పుడు సృష్టికార్యంబునఁ బ్రవృత్తుం డగుచుం డును. నే నాదిమధ్యాంతశ్స్థితుండ ననుజ్ఞానముతోనే యవ్యయుండును, బురాణపురుషుండును, నేకమాత్రుండు నగుశివుండు బ్రహ్మాండలీలలఁ గావించుచుండును. ఆయీశ్వరునుండియే కాలం బుత్పన్నం బయ్యెను. ఈవిశ్వం బంతయును గాలస్వరూపమే. ఇందు గాలవ్యతీతం బగున దేదియును లేదు. భగవంతుం డగుకాలుండు ధ్యాననిమగ్నుండై శివాజ్ఞానుసారంబుగ సృష్టికార్యంబునకు సంకల్పించి ప్రప్రథమంబునఁ బ్రకృతిదేవిని సృజియించెను. ఆప్రకృతినుండి బ్రహ్మయు, విష్ణుండు నుదయించిరి. అనంతరము బ్రహ్మదేవుండు మహేశ్వరాదేశంబున బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులను సృజియించెను. మఱియు, భూమి, అంతరిక్షము, సముద్రములు, శైలములు, దిక్కులు, మానవులు, నదులు, తీర్థములు, మెఱుములు, ఉఱుములు, రోహితములు, ఇంద్ర ధనుస్సులు, ఉల్కలు, ధూమకేతువులు, జ్యోతిష్పాతములు, సహస్రా ధికవిధంబు లగుస్వేదజంబులు:-యూకమక్షికమత్కుణములు మొదలగు వానిని సృష్టించెను. ఇట్లుత్పన్నం బైనయీసకలంబును మరలఁ గ్రా

నిచే నిషేధితంబగుచుండును. అనుటయు వ్యాసుండు బ్రహ్మ యెట్లుద యించెనో, సృష్టి యెట్లయ్యెనో, పృథ్వీధరుం డగుదేవునకు బ్రహ్మత్వం బెట్లుసిద్ధించెనో సవిస్తరంబుగఁ దెలుపవలయు ననుటయు సనత్కుమా రుండు మరల నిట్లనియెను.

ప్రథమమునం దీసకలంబు నంధకారమయంబై, యేదియు నప్ర త్యక్షంబై యుండెను. అప్పుడు పరమేశ్వరుం డగుశివుండు యోగావ లంబనంబున నెల్లమొదలఁ గ్రీడింప సంకల్పించి దుర్లభం బగుసత్త్వస్వ రూపతేజంబును సృజించి తనయందున్న రజోగుణస్వరూపం బగు వహ్నిచే ధారణంబు గావించెను. ఆసత్త్వగుణసహితం బగురజోగుణం బునలనఁ దమోగుణం బుత్పన్నం బయ్యెను. ఆగుణత్రయమువలన జలంబును, దానినుండి పృథ్వీతన్మాత్రయు, దానినుండి సూర్యస్వరూపుఁ డగుకాలుండును నుదయించిరి. ఆసూర్యతేజమునందే సర్వంబును బ్ర కాశితం బయ్యెను. మహేశ్వరుఁడు ప్రథమంబున జలస్వరూపియై యాతమంబును విదారితంబుఁ గావించెను. అప్పుడు సృష్టిప్రవృత్తుం డగుజలరూపశంకరునుండి యొకయండంబును, దానినుండి నారాయ ణుండు నుదయించిరి. మఱియు నాజలానలసంయోగంబున వాయు తేజంబు లుత్పన్నంబు లయ్యెను. విస్తృతం బగువాయువువలన నాకా శంబును, జలాగ్నిమారుతాకాశంబులనుండి విశాలం బగుపృథ్వియు సంభవించెను. ఇదియే మహేశ్వరుని యవ్యక్తమమూర్తి. మహాభూత సృష్ట్యనంతరమున మహాదేవుం డర్ధనిమేషకాలము జలంబులఁ బ్రవేశిం చెను. జలనివాసంబువలననే యాతనికి నారాయణనామంబు గలిగెను. అప్పు డాజలంబులనుండి సహస్రసూర్యప్రభావంతంబును, సువర్ణమ యంబు నగునొకయండం బుదయించెను. భగవానుం డగుబ్రహ్మ దేవుఁడు దానియందు బహువత్సరంబులు వసియించి యనంతరము

మహాదేవాదేశంబున యథాకాలంబున నావిర్భూతుం డయ్యెను. అనంతర మాతఁడు సృష్టికాలమధ్యంబున నాకాశంబును, అష్టదిక్కులను, నిత్యజలాధారంబు లగుసాగరంబులను సృజియించెను.

సప్తద్వీపవర్ణనము.

ప్రకృతినుండి యవ్యక్తం బగుమహత్తత్త్వ ముదయించెను. మహాౘసం బగునదియే బ్రహ్మాండస్వరూపము. మహత్తునుండి బ్రహ్మ యుదయించుటచే దానికి బ్రహ్మాండనామంబు గలిగెను. ఆబ్రహ్మకు సముద్రసమూహము శోణితము; ఆకాశం బుదరంబు; పవనంబు నిశ్వాసంబు, ఆకాశతిమంబులు శ్రోత్రంబులు; చంద్రసూర్యులు నేత్రంబులు; ఊరుయుగళంబు సుమేరువు, పృథ్వి వక్షస్థలంబు—రసాతలంబునకువెనుక జలంబును,దానివెనుక నాగగణంబును, దదనంతరము మరల నాకాశంబును, దానివెనుక మరల జలంబును, జలాంతంబున నంధకారంబును, దానివెనుక నగ్నియు, దానివెనుకఁ బృథ్వియుం గలవు. ఈపృథ్వి సముద్రంబులు, నంధకారము, తేజము, జలము, రసాతలము, నాగగణము, నంధకారము నను సప్తపదార్థంబులచేఁ బరివృతంబై యున్నది. అండధారణంబగుటంజేసి మహాత్ముం డగుబ్రహ్మదేవుని భవనము బ్రహ్మాండం బనియు, మహాధారణంబనియుఁ జెప్పంబడుచు న్నది. ప్రధానపురుషునిచే సృజింపఁబడినదగుటచే జలంబునకు నారంబను పేరు గలిగెను. పూర్వమం దాజలంబుల వసించుటచేతనే పురుషోత్తమునకు నారాయణనామంబు గలిగెను. ఈవిశ్వంబున క్షరుండును (జీవుఁడు) నక్షరుండు (ఆత్మఁడు) నను నిరువురే పురుషులు. బహుసహస్రయుగపరిమితంబు లగునేకకల్పంబులు గడచినవెనుకనే భూరాది లోకసృష్టియైనది. అనంతరము పంచభూతాత్మకం బగుజీవసృష్టియయ్యెను. జరాయుజములు, అండజములు, ఉద్భిజ్జములు, స్వేదజములు

నని జీవులు చతుర్విధంబులు ; దేవయోను లష్టవిధంబులు. మనుష్యో
నేకవిధమాత్రింకు. మానవజాతి యేకప్రకారంబయ్యును జతుర్వర్ణ భే
దంబుచే నానావిధంబులఁ దోఁచుచున్నది. పృథివియు, నాకాశంబును,
స్వర్గంబు ననునివి భువనంబులు. నదులు, సముద్రంబులు, పర్వతంబులు
మొదలగుస్థావరజంగమపదార్థంబుల పరిమాణంబునకు భూపరిమాణంబు
సమానంబు. మఱియు దివ్యంబగుభువనం బొకటి కలదు. దానిని
మూఁడుభాగములుగ విభజించుకొని దేవత లందు నివసించియుందురు.
ఆత్రిభువనంబులును గోటియోజనవిస్తీర్ణంబులు. ఆభువనమధ్యంబున
నుండి బ్రహ్మయు, విష్ణుండును మహేశ్వరోపాసనంబు గావించుచుం
దురు. శివక్రీడాస్థానంబులు స్వయముగా శివునిచేతనే కల్పింపఁబడియెను.
ఆయాస్థానంబులయందు శివలింగపూజ గావించుట సర్వోత్తమకా
ర్యంబు. నాల్గువేలయేబది (8550) శతయోజనవిస్తీర్ణం బగుజంబూద్వీ
పము మొదలగుద్వీపంబులయందలి జీవులు తమయభీష్టసాధనంబునకై
శివపూజలం గావించుచుందురు. ఆపరమేశ్వరుండు జంబూద్వీపంబున
మహాదేవనామంబునను, గోమేదద్వీపమున గిరిజేశ్వరనామంబునను,
శాల్మలిద్వీపమునఁ బశుపతినామంబునను, కుశద్వీపంబున హరనామం
బునను, క్రౌంచద్వీపంబునఁ వృషధ్వజనామంబునను, శాకద్వీపంబున
శంకరనామంబునను, పుష్కరద్వీపంబున ఫాలలోచననామంబునను,
విఖ్యాతుండై యుండును. ఆయాద్వీపములం దాయానామంబులతో
శివపూజం గావించినవారు శివానుగ్రహంబున నక్షయభోగంబులును,
మహాపాపనివృత్తియు నగును.

జంబూద్వీపము, గోమేదద్వీపము, శాల్మలిద్వీపము, కుశద్వీ
పము, క్రౌంచద్వీపము, శాకద్వీపము, పుష్కరద్వీపము ననునివి సప్త
ద్వీపంబులు. జంబూద్వీపంబు లక్షయోజనంబులవఱకును జంబూ

వృక్షంబులు వ్యాపించియుండును. వానిఫలంబులరసం బమృతమువలె రుచికరమైనది. ఆజంబూవనంబునకు ద్విగుణపరిమాణంబగు నాద్వీపము తనపరిమాణంబునకు ద్విగుణితం బగులవణసముద్రముచే నావరింపం బడి యున్నది. జంబూద్వీపమున సప్తవర్షంబులు (ఖండములు) గలవు. పుణ్యాత్ము లగువా రిచ్ఛామాత్రంబున సప్తవర్షంబులను గమనాగమనంబులు సేయఁగలుగుచుందురు. ఆవర్షసప్తకంబున భారతవర్షంబు ప్రధానంబు. భారతవర్షముకూడఁ దొమ్మిదిభేదంబులచే నొప్పారుచున్నది. దానికి సప్తకులపర్వతంబులును సప్తవర్గంబులు. ఇవి మధ్యమవర్షంబునకుఁ బూర్వపశ్చిమంబుల విరాజిల్లుచున్నవి. భారతవర్షంబునకు దక్షిణంబున నపసవ్యముగా నిలావృతవర్షంబు (క్రౌంచవర్షము) గలదు. అది యుత్తరదక్షిణంబుల నిందద్రధనురాకృతిం గలిగి ద్రోణరూపభూవిన్యాసంబుగలవర్షచతుష్టయంబుచే విరాజిల్లుచున్నది. హిమవర్షంబును, రమ్యవర్షంబును, క్రౌంచవర్షంబును, భవవర్షంబును, గిరివర్షంబును, భారతవర్షంబును, గింపురుషవర్షంబునునివి సప్తవర్షంబులు. భారతవర్షంబునకుఁ బూర్వభాగంబున మాల్యవంతంబును, బశ్చిమంబున గంధమాదనంబు ననుపర్వతంబులు గలవు. పిమ్మటఁ జతుర్ద్వారసహితంబును, జతురస్రంబు నగుమధ్యమమండలంబుగలదు. సుమేరుశృంగంబున నుత్తరంబుగా నీలశ్వేతంబులగు పర్వతరాజంబు లంతటను వ్యాపించి యున్నవి. కాలజ్ఞానవిశారదులగువా రీశైలంబులను సహస్రసంఖ్యగాఁ బరిగణించి యున్నారు. జంబూద్వీపంబున జంబూఫలరసమయం బగుజలంబున దేవభూషణంబగు కాంచనం బుత్పన్నమగుచున్నది. దాని నుత్తరంబున మేరునామకంబగు మహామహీధరంబు గలదు. అది యాద్వీపంబునకు మధ్యభాగంబునఁ గర్ణికవలె విరాజిల్లుచున్నది. ఆమ్మహాశైలంబు చతురశీతిసహస్రయోజనంబుల (84000)

పొడవు గలిగి పాదప్రదేశంబున దశసహస్రయోజన (10,000) పరిమితంబై, పార్శ్వప్రదేశంబుల షడ్వింశతిసహస్ర (26000) యోజనపరిమాణంబు గలదై యుండును. ఆమేరువును బ్రదక్షిణించి పోయిన చో దానివెనుకనే కైలాసపర్వతంబు గలదు. ప్రకృష్టం బగునాపర్వతంబు చతురశీతియోజనంబుల (84) వ్యాసముగలదై యుండును. అందలి చిత్రసానువులయందుఁ గాని, కందరంబులయందుఁ గాని, దరులయందుఁగాని సూర్యసంతాపము గలుగ నేరదు, చంద్రతారాప్రకాశము వ్యాపింపనేరదు. ఆగిరిప్రభావంబుఁ బొ[illegible] వర్ణింపఁజాలఁడు. జితక్రోధులును, జితలోభులును, జితేంద్రియులును, జితక్లములును, శివచింతానిమగ్నులును, శివపూజాపరాయణులు నగు పుణ్యాత్ములుమాత్రమే యాపుణ్యశైలమునఁ బ్రవేశింపఁగలుగుదురు. స్వధర్మపరాయణులగు గృహస్థులును, గోబ్రాహ్మణహితక్రియానిరతులు నగువారు పరమేశ్వరానుగ్రహంబున నీకైలాసధామంబును జేరుచుందురు.

ఈకైలాసంబునకు దక్షిణంబున శతసహస్ర యోజన (1,00,000) విస్తీర్ణంబులును, పంచవింశతిసహస్రయోజనోన్నతంబులు నగునీలనిషధహేమకూటహిమవంతంబులు వ్యాపించి యున్నవి. పశ్చిమంబునఁ బర్వతత్రయసంభూతం బగుసింధునది ప్రవహించుచుండును. పూర్వభాగంబున నలిని, హ్రాదిని, ప్లావిని యనునామంబులచే మూఁడునదులు ప్రవహించుచుండును. జంబూద్వీపంబునఁ బ్రధానంబైనది గంగానది. అది యన్నినదులకంటెను బవిత్రంబైనది. ఆగంగానది శతసహస్రంబులగునుపనదులచే విలసిల్లుచున్నది. ఈభూమియందు గంగానదీసమానంబులగుపవిత్రతీర్థములును, బర్వతంబులును, బరమపావనంబు లగు దేవతీర్థంబులును గూడఁ గలవు. వానిం

గూర్చి యనంతరము వర్ణించెదను. ఇప్పుడు జంబూద్వీపయథార్థస్వరూపమును వర్ణించితిని. ఇఁకఁ దక్కినయాఱుద్వీపంబులంగూర్చియుఁ జెప్పెదను. అవియాఱునుం గలసి జంబూద్వీపపరిమాణంబునకు ద్విగుణపరిమాణంబు గలవై యుత్తరదిగ్భాగంబున విలసిల్లుచున్నవి. జీవులు స్వర్గభోగంబుల ననుభవించి యనంతర మవశిష్టపుణ్యఫలభోగార్థమై యీద్వీపంబులయందుఁ బ్రవేశించుచుందురు. లవణము, ఇక్షురసము, సుర, సర్పి, దధి, క్షీరము, శుద్ధజలము ననునీసప్తసముద్రంబులును ప్రత్యేకముగ సప్తద్వీపంబులను బరివేష్టించి యుండును. ఈవిశ్వంబునందు సహస్రసహస్రద్వీపంబులు మన కవిదితంబులై యున్నవి. ఈసప్తద్వీపములనుమాత్రము నేను సంక్షేపముగా వర్ణించుచున్నాను. ఈ సకలద్వీపవిషయంబులను నాకేపేక్షకయిన సవిస్తరంబుగఁ జెప్పఁజాలము. ప్లక్షద్వీపంబునఁ బ్లక్షవృక్షంబును, శాల్మలిద్వీపంబున శాల్మలివృక్షంబును, కుశద్వీపంబునఁ గుశగుచ్ఛంబును, క్రౌంచద్వీపంబునఁ గ్రౌంచపర్వతంబును, శాకద్వీపంబున శాకవృక్షంబును, పుష్కరద్వీపంబునఁ బుష్కరవృక్షంబును గలవు. ఈద్వీపంబులఁ గలవృక్షంబులన్నియుఁ బరిమాణంబున నుత్తరోత్తరద్విగుణితంబులై యుండును. ఆవృక్షంబుల ఫలరసం బమృతోపమానంబు. తదాస్వాదనంబు దీర్ఘాయుష్కరంబు. ఆద్వీపంబులయందు జరారోగశోకాయాసంబులేమియును లేవు. ఆషడ్ద్వీపంబులవారును నిత్యయౌవనులై యుందురు. వారు యౌవనముతోనే జననమరణంబులఁ గాంచుచుందురు. వారికి యౌవనావస్థకంటె నితరావస్థానుభవము లేనేలేదు. అందలిసతీమణులు చక్రవాకసధర్మిణులై యాత్మేశ్వరులకంటె నన్యులయెడఁ బ్రియత్వంబు నపేక్షింపకుందురు. అందలిభూమి మణిమయమైనది, వాలుకాప్రదేశము కాంచనరజోమయమైనది. అచ్చటివృక్షంబులు సర్వకాలంబుల

యందును బుష్పసుగంధఫలాశ్రింబులై యుండును.

ఈసప్తద్వీపములయందును సప్తకులాచలంబులు గలవు. ఆకుల పర్వతంబులఁ బరివేష్టించి శతసహస్రంబులగు నదులును నుపనదులును బ్రవహించుచుండును. ఆపర్వతరాజంబులఁ బరివేష్టించి శృంగవంతంబు లగు ననేకమహీధరంబు లంతటను వ్యాపించియుండును. వాని యందు విద్యాధరులును సిద్ధులును, మహర్షులును, గంధర్వులును, దానవులును, విహంగులును, నురగులును, యక్షులును విహరించుచుందురు. పర్జన్యుం డందు వర్షింపఁజాలఁడు. అందు గాలవిపర్యయంబు లేదు. కాని కల్పాంతంబునందుమాత్రము వానికిని నాశంబు గలదని మహాదేవుండు చెప్పియున్నాఁడు. ఆద్వీపంబులయందలి పర్వతపంక్తులు నిజప్రభావంబుననే సముజ్జ్వలంబులై యుండును. అఱువదివేలపర్వతంబులు మాలికారూపంబున నందలికులపర్వతంబులచుట్టును బరివేష్టితంబులై యుండును. అవిగాక యింకను సహస్రసహస్రాధికంబులగు పర్వతంబు లందుఁగలవు. అవి గణనాతీతంబులు. అందు శుక్లదంతులును, బ్రియంవదులు నగుపురుషులు విరాజిల్లుచుందురు. వారల కెట్టిదుఃఖాయాసంబులును లేవు. వారి నెవ్వరును బీడింపఁజాలరు. ఆద్వీపంబులయందు జనించినపురుషులు తపోధనులును, దీర్ఘాయుష్మంతులు నై యుందురు. వారికిఁ గామగమనంబు గలదు.

ఇఁక జంబూద్వీపంబునఁ గాలపరిమాణంబు వర్ణించెదను. కృతయుగంబును, త్రేతాయుగంబును, ద్వాపరయుగంబును, గలియుగంబు ననునివి చతుర్యుగంబులు. మానవాబ్దసంఖ్యచే నీసకలయుగపరిమాణంబును బురాణవాక్యానుసారంబుగఁ జెప్పెదను. పదునేడులక్షలయిరువదియెనిమిదివేలవత్సరంబులు గృతయుగంబునకును, బండ్రెండులక్షలయాఱువేలవత్సరంబులు త్రేతాయుగం

బునకును, ఎనిమిదిలక్షలయెనిమిదివేలవర్షంబులు ద్వాపరయుగంబున
కును, బదిలక్షలయిరువదియెనిమిదివేలసంవత్సరంబులు కలియుగంబున
కును బరిమాణంబులు. ఈరీతిగా డెబ్బదిరెండుయుగంబులకొక మన్వం
తరం బగును. పదునాలుగుమన్వంతరంబు లొకకల్పంబు. ఇట్టికల్పం
బులు రెండైనవో బ్రహ్మ కహోరాత్రసమన్వితం బగు నొకదినం
బగును. అట్టి దినపరిమాణానుసారంబుగా శతవత్సరంబులు బ్రహ్మ
యుష్కాలం బని నిర్దిష్టంబయ్యెను. బ్రహ్మయుష్కాలము మహేశ్వ
రున కొకనిమిషమాత్రంబు. ఈశ్వరుండు తననిమిషమధ్యంబుననే
బ్రహ్మమొదలు సూక్ష్మకీటంబులకును గలసకలజీవులను సృజించు
చుండును. ఆసృష్టియంతయు నాదేవునినిమిషమధ్యముననే నశించు
చుండును. చంద్రసూర్యాదిగ్రహగణంబులజీవితంబులుగూడ నట్లే—
మహాదేవునినిమేషకాలము మహాకల్పనామంబునం బ్రసిద్ధంబు:-ఇప్పుడు
ద్వీపవర్షంబులంగూర్చి సంక్షేపంబుగం జెప్పితిని. ఇతరద్వీపంబులవివి
ధావస్థలంగూర్చియుం దెలిపితిని. అందు భారతవర్షము నవఖండసమ
న్వితంబని చెప్పితిని. ఇంద్రద్వీపము, కశేరువు, తామ్రపర్ణము, గభ
స్తిమంతము, నాగద్వీపము, సౌమ్యము, గాంధర్వము, చారణము,
స్వాదూదకము, నను నివి నవఖండంబులు. అందు నవమంబగుస్వా
దూదకద్వీపము సాగరంబున కుత్తరతటంబున మహత్తరమై విలసిల్లు
చున్నది. అది పృథ్వి కాదిభూతంబగుటచే సర్వశ్రేష్ఠము. పృథ్వికి
ద్విగుణపరిమితంబు లగులోకాలోకపర్వతంబులు భూమిచుట్టును బరివే
ష్టించి యున్నవి. ఆస్థానమునుండియే లోకపరిమాణంబును, లోకవి
స్తారంబు నగుటంజేసి వానికి లోకాలోకపర్వతనామంబు గలిగెను.
అచ్చటిజీవులు మనస్సిద్ధిసంపన్నులును, నీరోగులును, చిరజీవులును,
సువర్ణమయసుందరాకారులు నై యుందురు. సముద్రాధిదేవతలును,

దిక్పాలురు నాపర్వతంబులపై నుందురు. ఈలోకాలోకపర్వతసహితంబుగా భూపరిమాణంబు త్రిగుణంబు.

—♦ పాతాళవర్ణనము. ♦—

ఇఁకఁ బాతాళంబునుగూర్చి వర్ణించెదను. పాతాళంబున వివిధరత్నసంశోభితం బగుభోగవతీనామకసుందరనగరంబు గలదు. అందు పరమానందంబున నాగరాజగణంబు నివసించి యుండును. మఱియు సిద్ధగణంబులును, భరతాదిమునిగణంబులును, వాసుకి, తక్షక, కర్కోటక, ధనంజయ, కాళియ, పవన, పూరణ, మణిమాల, భద్ర, కౌశిక, వసు, ధుంధుమార, కంబళ, అశ్వతర, తిత్తిరి, హరిభద్ర, బలాహక, కరవీర, పుండరీక, సంవృతాదినాగగణంబులును, అనంతాది నాగరాజగణంబులును నందు నివసింతురు. ఆనగరంబు విచిత్రంబు లగుధ్వజసహస్రంబులచేఁ బరిశోభిత మైయుండును. అందమూల్యవసనభూషణాలంకృతలును, బరిపూర్ణమనోరథలు, నప్సరస్సుందరీసమానలు నగుయువతీమణులు నిరంతరమును, హాస్యనాట్యగీతావాద్యవిలసితలై యుందురు. ఆభోగవతీనగరప్రజలకు జరాశోకసంతాపంబులు లేవు. పరస్పరాసూయాభయంబులు లేవు. అందలివారందఱు నన్యోన్యసాహాయ్యనిరతులును, బ్రహృష్టహృదయులును, మనోరథసిద్ధులునై యుందురు. ప్రభామయం బగునానగరంబునకుఁ, జతుర్దిశలను వజ్రవైడూర్యాదిమణిమయప్రదేశంబులు నింద్రనీలమహానీలరత్నాదులచే నలంకృతంబు లగుస్వర్ణమయస్తంభసహస్రంబులు విరాజిల్లుచుండును. అందలినదులు నిరంతర జలప్రవాహపరిపూర్ణంబులు. పాయసకర్దమకలితంబులగుకృత్రిమనదులును, ఘృతపూర్ణంబులగుకుల్యలును, కుందేందుచంద్రసన్నిభంబు లగునన్నపర్వతంబులు, నిరంతరపుష్పఫలశోభితంబు లగువృక్షంబులు నందు విరాజిల్లుచుండును. అందలిబహు

జలాశయంబులు దుగ్ధపూర్ణంబులును, మధుపూర్ణంబులు నై యుండు.
తాంబూలరాగాధరలును, ప్రియంవదలు నగునచ్చటియువతీమణులు
తఱచుగ భర్తృభోగినులయ్యు నక్షతలై, బహుప్రసూత లయ్యును
నిత్యయౌవనలై యుందురు. అచ్చటిపురుషులు సర్వదా నిజభార్యాను
రక్తులు. పారదార్యము వారెఱుంగనే యెఱుంగరు. సర్వాభీష్టసిద్ధు
లగునాత్మీయులతోఁ గూడియుండు నందలిస్త్రీపురుషు లూర్ధ్వతిర్యగ్గ
తులు గలిగి యుందురు. ఆనాగలోకమునం దొకభాగము కోటియో
జనంబులవ్యాసంబు గలిగియుండును. నాగలోకంబంతయు దానికి ద్వి
గుణపరిమాణంబు.

ఇఁక హిరణ్యపురముంగూర్చి చెప్పెదను. హిరణ్యపురంబు
కోటియోజనంబులచే జతురస్రంబై యుండును. అందు నిరంతరపుష్ప
సుగంధవిలసితంబులును, ఫలసహితంబులు నగుననేకోద్యానంబులును,
విచిత్రశబ్దకలితంబులగు ననేకపర్వతకందరంబులును గలవు. అందలి
రమణీమణులు మధురభాషిణులును, సుకుమారిణులును, నిత్యయౌవన
లునై యుందురు. పురుషులు రూపసంపన్నులును స్వదారనిరతులు
నై యుందురు. అందు సుధాధవళితంబులగు కుడ్యంబులచే నలంకృ
తంబు లగుస్వర్ణమయమందిరమ్ములు గలవు. అందలిజీవు లందఱును
విమానచారులును, స్థిరయౌవనులు నై యుందురు. అవికలాంగులును,
శుక్లదంతలును, శుక్లాంబరలును, చంద్రికాసమానశుక్లవర్ణలును, అప్స
రస్సమానసుందరీమణులు నగునందలిరమణీమణులు చక్రవాకసధర్మిణు
లై యుందురు. ఉద్వేగంబును, నీర్ష్యయు, గోపంబును, నసూయయు
వారి కెంతమాత్రమును లేవు. ముక్తామణీమాలికావిశిష్టంబును, సుఖ
చిరబహిర్ద్వారశోభితంబు నగునప్పురమ్మునఁ దత్సుందరీమణులు నిరతా
నందులగు సిద్ధులంగూడి యానందానుభవమ్మునఁ జెలంగుచుందురు.

ఆపురశ్రేష్ఠంబును సంపూర్ణముగ వర్ణించుటకు బహువత్సరంబులు పట్టును. అచ్చట విష్ణుభక్తిపరాయణు లగుప్రహ్లాదాదిదైత్యులు నివసించి యుందురు. వారియనుగ్రహంబుననే లోకమ్ములన్నియును నిలిచి యున్నవి. పరాపరలోకసముదయమ్ములవహించు లోకధారకగణమ్ములు బ్రహ్మాదిదేవతలను ధరించియుందురు. ఈసమస్తమును సురభి వహించి యుండును. సుధన్వుం డీభూమిని వహించియుండును. సర్వాంగ, సుసర్వాంగ, సులభా, చషకాదులు గ్రమంబుగఁ బూర్వపశ్చిమోత్తరదక్షిణమ్ముల సర్వదా వహించి యుందురు. ఈసురభిప్రభృతులయనుగ్రహమ్మునసే బ్రహ్మాదిదేవతలు జీవించి యున్నారు. ఇచటిశుభ్రమందిరమ్ములును, ప్రాసాదమ్ములునుగూడఁ జిత్రవిచిత్రమ్ము లగుధ్వజమ్ములచే నలరారుచుండును. సర్వాభీష్టప్రదములగు కల్పవృక్షములును, మఱియుఁ జిత్రవిచిత్రమ్ము లగునితరవృక్షములును, స్వర్గమునందలి వానికంటె నతిరమణీయమ్ము లగుజలాశయమ్ములు నిందుఁ గలవు. పూర్వంబున బ్రహ్మదేవుండు యథేప్సితగుణసమంచితమ్మగు నీనగరమును సృజియించెను. అందలిప్రజలు నిరంతరము నఖిలాభీష్టసిద్ధులై యుండుటచే నానగరీలలామమ్మునకుఁ గామనామము విఖ్యాతమయ్యెను. అందుఁ బాయసపూర్ణమ్ము లగుబహుసహస్రపాత్రమ్ములు గలవు. అచ్చటి సామాన్యగృహంబులఁగూడ సకలపదార్థమ్ములును సుఖజనకమ్ములై యుండును. అందలి ప్రతిగృహశ్రేణియు శరత్కాలహ్రదమ్ముఁ బోలి నిర్మలంబై యుండును. అందెల్లకడలును దేవాధిష్ఠితములై, సహస్రాధికంబు లగునమృతకుండంబులు, పాయసభాజనములుమొదలగువానిచే విలసిల్లుచుండును. అచ్చటిజలం బమృతతుల్యంబు. నానావిధాలంకృతం బగునానగరమ్మునం దొక్కభాగమును వర్ణించుటను బహువత్సరంబులకై నను దేవతలకై నను సామర్థ్య

మ్మలేదు—నాగగణమ్ములు మొదలగుపాతాళవాసులు సూక్ష్మజీవు లగుటంజేసి వారిభవనము లతిసూక్ష్మములు నతిచిత్రములు నై యుండును. అందుచే వానిని సంపూర్ణముగ వర్ణించుట శక్యము గాదు. నాగరాజగు ననంతునకు బ్రహ్మవిష్ణుపురమ్ములకును, స్వర్గపుర మ్మునకును సమానమ్మును, సర్వాభీష్టదాయకమ్మును, నసామాన్యంబు నగుపురమ్మగలదు. అది యనేకగుణపరిపూర్ణంబై దేవతలచేఁ బ్రశం సింపఁబడుచుండును.

—♦ నరకవర్ణనము. ♦—

ఇఁక నేకమన్వంతరస్థితంబును, దివ్యంబును నగుయమపురం బునుగూర్చి చెప్పెదను. రౌరవంబును, రోధంబును, వాలంబును, శూకరంబును, కుంభీపాకంబును, గళగ్రహమ్మును, అసిపత్రవనమ్మును యమశూలియు, భైరవమ్మును, ఏకపాషాణమ్మును, అసితాళవన మ్మును, ఊర్ధ్వకమ్మును, శూలమును, వైతరణియు, కరంభవాలు కయు, శృంగాటకవనమ్మును, ఘోరమ్మును, అంధకారమ్మును, మొదలుగాగల యనేకనరకమ్ములు యమాధీనములై యుండును. జీవులు తమతమకర్మానుసారముగా నాయానరకములయందుఁ, బాప ఫలముల ననుభవించుచుందురు. పాములచేఁ గఱపించుటయు, అంప ములచేఁ గోయించుటయు, నతిదుస్సహంబులగు వైతరణీ దుర్గంధజలమ్ములఁ ద్రోయించుటయు, శాల్మలీవృక్షమునుండి యాక ర్షించుటయు, యంత్రసూత్రములచే బిగించి లాగించుటయు, కుంభీ పాకమ్మున మర్దించుటయు మొదలుగాగలపీడనములీస్థానమునందే జర గుచుండును. కూటసాక్ష్యము లిచ్చినవారు రౌరవనరకమ్మునను, పర హింసానిరతు లగువారు రోధకనరకమ్మునను, బ్రహ్మస్వహారణులు శూకరకుంభీపాకాది నీచనరకములను గూలి పాపఫలముల ననుభవిం

చుచుందురు. పరధనాపహారియగుపాపాత్ముండు గళగ్రహనరకమునం గూలి బహుసహస్రవర్షమ్ములు పీడితుండగుచుండును. స్త్రీహంతకుం డగువాఁడుపూతిమాంసనరకమునఁ ద్రోయఁబడి లక్షవర్షంబులు మాటి మాటికిఁ బీడింపఁబడుచుండును. ధనధాన్యములను, సువర్ణంబును దొంగిలించినవాఁడు భయంకరయమశూలనరకమునఁ బడును. మాతృ హంతకుండు శతవర్షములు శూచీముఖనరకపతితుండై పీడింపఁబడును. పితృహంతకుఁడు యాతనామయంబగు నధోముఖనరకంబునఁ బీడితుం డగును. దేవద్రవ్యవినాశకుం డగువాఁడు సర్వమయం బగువైతరణి యందుఁ బతితుండై యేకవింశతివర్షంబులు ఘోరనరకంబునను, గ్రామధ్వంసకుం డతిదారుణం బగునసిపత్రవనంబునను, ధర్మమూల మ్ములగు తపోవ్రతాచరణాదులను ద్వేషించినవాఁడు చిరకాలమధో ముఖపతితుండై కఠోరంబగు భైరవనరకమ్మునను, మిత్రదారా పహారి యతిభీషణం బగునేకపాషాణనరకమ్మునను, శరణాగతున కభ యం బొసంగియు మరలనపకారమ్ము సేసి ఘాతుకుండగువాఁడు నిస్సంశ యమ్ముగ నసితాళవననరకమ్మునను, బరదారరతులును, బరద్రవ్యాప హారులు నగువారు భయంకరం బగునసిపత్రవనమ్మునను బీడింపఁబడు చుందురు. సాక్షియై యసత్యముచెప్పినవానిని శూలనరకమ్మున నూర్ధ్వ పాదుంగావించి బంధించి యాతనినాలుకం గోయుదురు. మఱియు నాతని దేహమ్మును సుతీక్ష్ణాగ్రంబగుహలమ్ముచే దున్నింతురు. బ్రాహ్మణో త్తములశిఖాయజ్ఞోపవీతాదులను నిందించినవారు యమశాసనమ్మున శృంగాటకవననరకమ్మున కొక్కింపఁబడి మహావైతరణీనదియందుఁ బీడింపఁబడుదురు. స్త్రీపురుషహస్తచ్ఛేదమ్ము గావించినకౄరులు ఘోరంబగుకరంభవాలుకానరకమ్మునను, గృహదాహకులగునశౌధ కులు దుఃఖసాగరమ్ములకుఁ బ్రధానస్థానమ్ము లగుమహాఘోరారాధ

కౌరవమక్షికాదిభీకరనరకంబులఁ బతితులై బహుసహస్రవర్షమ్ములవఱకును యాతనల ననుభవించుచుందురు.

యాతనామయంబు లగునిట్టినరకస్థానంబులే కాక యమపురంబున నింకను నానావిధంబులగుశుభప్రదేశంబులుగలవు. అవి పాపాత్ముల కతిదూరస్థంబులు ననవగతంబులు నై యుండును. ఆశుభస్థానంబు లన్నియుఁ బుణ్యాత్ములకు క్షణమాత్రగమనయోగ్యంబులు. అందు సత్పురుషవిహారంబులగుసుందరరాజమార్గంబులును గలవు. మునీంద్రా! దుస్తరంబగునరకమునుగూర్చి సంక్షేపముగ వర్ణించితిని. జననమరణగర్భక్లేశములును, అజ్ఞానభయమును, అవిద్యాదుఃఖమును, వనవాసకష్టమును, హింసాయాజ్ఞికులపరితాపమును, సాంఖ్యయోగసంతాపమును, రాగద్వేషాదులఁ బరిత్యజింపనసాధ్యంబగుటం జేసి మోక్షాభిలాషు లనుభవించుదుఃఖమును నీమొదలగుదుఃఖమ్ములన్నియు నరకవిషయములనియే యెఱుంగునది. కావున బహువిధప్రయత్నములచే సకలదుఃఖవిషయములును బరిత్యజింపవలయును. మఱియు సిద్ధాన్నముచే యజ్ఞము సేయవలయును. పంచమహాయజ్ఞముల నాచరింపవలయును. ఏదిదుఃఖవినాశకం బగునో యట్టియజ్ఞ మాశ్రయణీయం బగును. విద్వాంసుఁ డగువాఁడు జాత్యహంకారవినాశకం బగుజ్ఞానము సాధించి యాశ్రయింపవలయును. ఏమనిన—భవకారణం బగునహంకారమునశించినవో సకలదుఃఖములును నశింపఁగలవు. కూటసాక్షులకు రౌరవపతనమును, జీవఘాతుకులకు వైతరణీపతనమును, బరహింసాపరుల కసిపత్రపతనమును, నిశ్చితములు. శివశాస్త్రానుసారముగ శివోపాసనము సేయువారి కహింసాధర్మమును, శివసాక్షాత్కారఫలమును, లభించును. శివమాయామోహితు లగుదుర్వృత్తులంగూర్చి పూర్వమే చెప్పంబడియెను. అవిద్యామూలంబునసే

జీవులకు స్వర్గనరకభోగములగుచుండును. అవిద్యచేతనే వారు మహాంధ కారనిమగ్ను లగుచుందురు. ధర్మవిదు లగువారు విద్యాధర్మఫలోద యంబగు మోక్షము నధిగమింతురు. బ్రహ్మాండంబుల కధిపతులగు దేవతలుగూడ స్థావరాదులను సృష్టించుచు ధర్మజ్ఞులయ్యు నవిద్యామూ లంబున సుఖదుఃఖంబుల ననుభవించుటయే గాని కేవలసుఖంబునందఁ జాలరు. అట్టిమహాదుఃఖము కామతత్పరులగువారి కలంఘ్యంబు. వేదోపదిష్టధర్మవిధులగు బ్రాహ్మణులు మోక్షమునే సారభూతము గా భావింతురు. యమలోకమున సుఖదుఃఖభోగానంతరమున జీవు లీయిహపరలోకముఁజేరి స్వర్గనరకము లెట్లనుభవించునదియు, మానవ జన్మం బెట్టిక్లేశకరంబై నదియు సమస్తమును వర్ణించెదను. గర్భవాసభో గానంతరము నరకభోగమును, దదనంతరము తిర్యఙ్మానవదేవత్వము లును గలుగును. తిర్యఙ్మానవదేవత్వములు పరిణామశీలములు. కాల క్రమమున విహంగము మానవుఁడుగను, దేవతగను బరిణమింపఁగలదు. దేవమానవులు, పక్షులుగను, దేవతలుమానవులుగను, మానవులు దేవ తలుగను బరిణమించుచుందురు. కావుననే యీపరిణామాదు లన్నియు నరకములని చెప్పంబడియెను. అట్టినరకమును దరింపఁగోరుబ్రహ్మ నిష్ఠులగువారు సుఖలాభముకొఱకు సర్వజ్ఞుండును, సర్వసమదర్శియు నగుసర్వేశ్వరు నాశ్రయించుచుందురు. గర్భవాసమునకుమూలకార ణంబగుదుఃఖమును, గర్మమును నశియించినచో నరకభయము దూరము గాఁగలదు. సంసారచక్రారూఢు లగుజీవులు యంత్రచక్ర ములవలెఁ బరిభ్రమించుచుందురు. కావున సంసారచక్రవినాశము కొఱకు శివచక్రము నాశ్రయింపవలయును. శివచక్రారూఢు లగుజ్ఞాను లకు దోషము లంటఁజాలవు. అట్టివారు మాయాధీనంబగు కర్మకృత దోషసమూహామునుండి విడివడి యుందురు. శివజ్ఞానమున శివభక్తి

సంపన్నులగువారియెడల శివుండు ప్రియుండై యుండును. వారిపాప పుంజంబు లగ్నియందలి తృణంబులవలె దగ్ధములై పోవును.

—♦ భు వ న కో శ వ ర్ణ న ము. ♦—

ఓద్విజవరులారా! నేనిప్పుడు పృథ్వీతలమ్మునకుఁ జతుర్దిశలను గలద్వీపసముద్రాదులంగూర్చి వర్ణించియుంటిని. ఇఁకబ్రహ్మలోకపర్యంతమును గలయూర్ధ్వలోకములను వర్ణించెదను. ఈభూమికిఁ బైని లక్షయోజనములదూరమున సూర్యలోకమును, దానికి లక్షయోజనములమీఁదఁ జంద్రలోకమును, దానికి లక్షయోజనములపైని గ్రహతారాగణనివాసంబును నీరీతిగా మీఁదమీఁద నితరజ్యోతిర్గణలోకములును గలవు. అంతరిక్షంబునం గలగ్రహతారకాదిగణంబు లన్నియు నేకమన్వంతరకాలంబువఱకును, వెలుంగుచు, సంచరించుచు ననంతరము పతితంబు లగుచుండును. మన్వంతరభేదంబుల ననుసరించి యాకాశంబున మేఘంబులును, గ్రహంబులును వేఱువేఱువిధంబులఁ దోఁచుచుండును. మేఘస్థానము దశసహస్రదశయోజనము లున్నతంబై యుండును. అందు నవవిధంబు లగుమేఘంబు లాగ్నేయంబులనియుఁ దక్కినవి వారుణంబు లనియుఁ గీర్తింపఁబడుచున్నవి. వానికూర్ధ్వంబున సూర్యలోకంబుగలదు. సూర్యలోకంబున కవ్వల దేవగణపూజితంబును, మహాత్మ్యసంపూర్ణంబునగు ప్రధానస్థానంబుగలదు. సూర్యలోకంబున ననేకములగు దేవవిమానములు గలవు. అందలివారెల్లను సూర్యసమతేజులై యుందురు. సత్కర్మనిరతులును, ఆత్మచింతకులు నగునఱువదివేలమందిమహర్షులు సుప్రశస్తం బగుసూర్యభగవానునిదివ్యరథంబును సేవించుచుందురు. ఆయుపాసకులతోఁ గలసి యఱువదివేలమంది మహాత్ములగునాగులును, హాహాహూహూప్రభృతిగంధర్వులును, రాక్షసగణములును, అఱువేలమందియప్సరలును

విరాజిల్లుచుందురు. మఱియు గీతవాద్యమధురనాదమ్ములచేఁ బూర్ణ ములును, ఘంటాసమన్వితములును, వివిధరత్న విభూషితములును, విచిత్రధ్వజ శోభితములును, రత్నకింకిణీనాద కలితములును, నానార త్నోజ్జ్వలములును, సర్వకామ సమృద్ధములును, గావ్యశబ్ద సమన్విత ములును, సుందరీసహస్రవిలసితములును, గల్పవృక్ష సమంచితములు నగుశతసహస్రవిమానము లందుసంచరించుచుండును. మఱియు గగన చరములును, వాయురథకలితములు నతిసుందరములు నగుమేఘ ములు సర్వత్ర సంచరించుచు జలముల వర్షించుచుండును. సూర్య లోకమున జలదసమూహము సప్తవిధముల విభక్తంబై నిర్మలజల ములతో నిండి వివిధాంశములతో స్వర్గపథము నాశ్రయించి యప్సరలు, దేవతలు, సిద్ధులు మొదలగువారితోఁ గలసి సంచరించు చుండును. సూర్యలోకమునఁ బుణ్యాత్ములకు నివాసములును, ప్రకా శమానములును, విచిత్రములు నగు దివ్యగృహములు బహుసహ స్రమ్ములు గలవు.

ఆస్థానమున దేవగణమ్ములు విహారేచ్ఛచే విమానస్థులై వచ్చి క్రీడించుచు భోగసంపన్నులై యంతరిక్షమున విరాజిల్లుచుందురు. ఆకాశసంబంధమగుజలమంతయు సూర్యతేజస్సంభూతమైనదియే. సం సారమునుత్తరించినమహాత్ములు సూర్యలోకమున నివసించుచుందురు. ఆసూర్యలోకమున నూర్ధ్వమున వైవస్వతలోకము గలదు. అందు శుచిమంతులగు దివ్యులు శతసహస్రవిమానపరిశోభితులై సంచరించు చుందురు. దానికూర్ధ్వమున నంతకంటెను సుందరమును విశాలము నగుసోమలోకము గలదు. అందు యజ్ఞకర్తలును, మంత్రారాధన తత్పరులును, సోమయాజులును, ధనధాన్యవస్త్రప్రదాతలగుక్షత్రియ గణమ్ములును నివసించియుందురు. దాని కూర్ధ్వమ్మున మహాత్ములకు

ఋషులకు నివాసమును, సముజ్జ్వలము నగులోకముగలదు. యజ్ఞ
మ్ములం గావించినబ్రాహ్మణులు దివ్యవిమానారూఢులై యందు
విహరించుచుందురు. అచ్చటివా రందఱును దివ్యవసనధారులును,
దివ్యాలంకారభూషితులు నై యుందురు. అదియే యాకాశగంగకును,
సకలగ్రహములకును స్థానము. దానికవ్వల మహర్షిపూజితం బగు
నొకలోకము గలదు. మహారణమున వీరమరణము గాంచినమహా
పురుషు లందు నివసించుచుందురు. అది స్వర్గమునం దింద్రునియమరా
వతీపురమును బోలి శోభిల్లుచుండును.

ఋషిలోకమున కూర్ధ్వమున నింద్రలోకమును, దానికూ
ర్ధ్వమునఁ గోటిసూర్య ప్రభావంతమును, లక్షకోటిసాధ్య పరివృత
మును, దేవలోకమునకుఁ జతుర్గుణపరిమాణము నగుధ్రువలోకము
నుగలవు. అది సనత్కుమార, కార్త్తికేయ, నందనప్రభృతులకు నివా
సము. శయ్యావస్త్రహిరణ్యాదిదానములఁ గావించినవా రందు సుఖ
భోగము లనుభవించుచుందురు. దాని కూర్ధ్వమునఁ బ్రశంసనీయం
బగుజనలోకంబు గలదు. తారాలోకంబున కుపరిభాగంబున బ్రహ్మ
లోకంబు గలదు. అందు సిద్ధగణంబులును, మునిగణంబులును, స్వ
యముగఁ జతుర్ముఖుం డగుబ్రహ్మయు, సప్తర్షిగణంబును, ధ్రువుం
డును, మహామతి యగువిష్ణుదేవుండును విహరించుచుందురు. దాని
కవ్వల సత్యలోకంబును, దదుపరి విష్ణులోకంబును, గోలోకంబును
గలవు. భూలోకంబున కుపరిభాగంబున నీలోకంబు లన్నియు యథా
క్రమంబుగా నున్నవి. బ్రహ్మాండమున కూర్ధ్వభాగంబున బ్రహ్మ
లోకంబు గలదు. దానికి శతకోటియోజనంబులమీఁదఁ గేవలము
జ్ఞానులకు మాత్రమే గమనయోగ్యంబగు నొకలోకంబు గలదు.
అందుఁ బ్రవేశించినంతనే జ్ఞానోదయం బగును. శివానువదులుదక్ష

నితరు లెవ్వరును నాస్థానమును జేరఁజాలరు. శివానుగ్రహంబును, యోగంబును, నైష్ఠికబ్రహ్మచర్యంబును ఆలోకప్రాప్తికి సాధనంబులు. భగవంతుం డగుశివుఁడే యందు బ్రహ్మనై విరాజిల్లుచుండును. ఒకప్పు డింద్రాదిసకలదేవతలును, సమస్తమహర్షిగణంబులును, నచ్చటికి వచ్చి యీబ్రహ్మదేవుని పాదకమలంబులకుఁ బ్రణమిల్లి తదీయాదేశంబున నందుఁ బరమానందముతో యథాస్థానములం దుపవిష్టులై యుండిరి. అప్పుడు బ్రహ్మదేవుఁడు ‹‹ఓమహాభాగులారా! మీకుఁ గుశలమే కద! మీకోరిక యేమి? మీ రెందుకొఱకువచ్చితిరి?'' అని ప్రశ్నించెను. అప్పుడు దేవతలు ‹‹ఓదేవదేవా! మాకు వరంబులతోఁ బ్రయోజనంబు లేదు. ఈజగమంతయును సృజించినమీచే మేమిట్లునుగఁబడితిమి. ఇంతకంటె మాకేమికావలయును? సహస్రవరంబులకంటె మాకు మీదర్శనమే యధికమైనది. మహాత్మా! మాకొక ప్రబలసంశయము గలిగినది. దానిని మీరు నివారింపవలయును. అతిదుర్లభంబును, గోపనీయంబును, ఉత్తమంబు నగునొకప్రశ్నముం గావించెదము.'' అని ప్రార్థించిరి.

ఇట్లు చెప్పి సనత్కుమారుండు ‹‹ వ్యాసమునీంద్రా ! ఇచ్ఛాద్వేషవివర్జితులును, జితక్రోధులును, జితేంద్రియులును, ధ్యానయోగపరాయణులును, ఈశ్వరజ్ఞానసంపన్నులును నగునైమిశారణ్యమునిపుంగవులు భృగ్వంగిరాదివృద్ధర్షులను మున్నిడుకొని బ్రహ్మసభయందు నేనిదివఱ కొకప్పుడు పరమాత్ముండగుశివునియొద్ద నేవిషయముంగూర్చి యడిగితినో యావిషయమునే ప్రశ్నించిరి. నే నాపురాతనేతిహాసంబు సర్వంబును సంకీర్తించెదను. దివ్యప్రభామయం బగు బ్రహ్మసభ కామమయాభిధానంబున విరాజిల్లుచుండును. పరమాత్మైక్యసంపన్నులగుపురుషులుమాత్రమే యాసభ నవలోకింపఁగలరు. అచ్చట సూర్య

రశ్మిగాని, చంద్రకాంతి గాని, తారకాప్రకాశము గాని యేమియును లేదు. తమోతీతుం డగుశివుఁడుదక్క నాప్రదేశము నితరు లెవ్వరును బ్రకాశింపఁజేయఁజాలరు. పాపంబును, సదాచారవిహీనతయు శివ భిన్ను లగునెల్లవారికిని గొలఁదియో, గొప్పయో యుండకపోదు." తమోగుణప్రకాశమే పాపంబును, దమోగుణాప్రకాశమే పుణ్యాంబు నగుచున్నవి. కేవలయోగమే మహామాయను, సర్వపాపములను నశింపఁజేయును. యోగధ్యానమువలననే జన్మాంతరకిల్బిషంబులుగూడ నశించును." అనిచెప్పుటయు వ్యాసుండు విశుద్ధచిత్తుండై వినయభక్తి పూర్వకంబుగ సర్వజ్ఞుం డగుసనత్కుమారుం గాంచి యిట్లనియెను.

మహాదేవస్వరూపవర్ణనము.

పరమయోగీంద్రా! నీయనుగ్రహమువలన సంశయనివారణం బుఁ గావించుకొనవలయు నని యిచ్చగించుచున్నాఁడను. మునీంద్రా! నాయీసంశయమును నివారింపుము. ఇట్టి సందిగ్ధాంశంబులకు సదు త్తరంబు లీయఁగలవా రీమూఁడులోకంబులందును నీకంటె నధికు లెవ్వరున్నారు? మహేశ్వరానుగ్రహబలంబున మీ కట్టిసామర్థ్యంబు గలదు. కావున మీ రిప్పుడు మహాదేవుం డగు రుద్రుని మాహా త్మ్యంబు వర్ణింపుఁడు. అనుటయు సనత్కుమారుం డిట్లనియెను. పరి దృశ్యమానం బగునీచరాచరప్రపంచము పూర్వమునం దిట్లే యున్నది. ఒకప్పు డిదియంతయును జలార్ణవమైపోయెను. అప్పు డగ్ని, వాయువు, సూర్యుఁడు, దశదిశలు, చంద్రుఁడు, నక్షత్రములు, ముహూర్తములు, కరణములు, దేవతలు, రాక్షసులు, గంధర్వులు, పిశాచగణంబులు, నసురులు మొదలగువా రందఱును మహేశ్వరతేజంబుచే నాచ్ఛన్ను లై యుండిరి. ఆకస్మికముగ నిట్లగుటం గాంచి మోహితుండనై నేనొ క్కింతసేపు నిశ్చేష్టభావంబుతో నుంటిని. అనంతరము భగవానుం

డగురుద్రదేవుండు లక్షకోటిసహస్రజీవులహితంబుకొఱకు సుదర్శనీయరూ బును, మనోహరంబును నగుతనసుందరవదనకమలమును వికసింపఁ జేసి మేఘదుందుభిస్వరంబున హాసంబు సేయుచు నిట్లు ప్రబోధించెను.

నేను కేవల మేకమాత్రస్వరూపుండను. నాకంటె రెండవవాఁ డెవ్వఁడును లేఁడు. ప్రతియుగంబు నీసమస్తంబును నన్నునుండియే యు త్పన్నం బగుచుండును. ఓమూఢులారా! మీరేల శుష్కవిచారంబు సేయుదురు? మాయాదేవిసాహాయ్యంబుకొఱకు నేను రుద్రుని సృజిం చితిని. ఆతఁ డీసమస్తప్రపంచమును సృజించెను. స్థావరజంగమాత్మకం బగునీప్రపంచము పూర్వమెట్లుండెనో నూతనసృష్టియందు నట్లేయుం డును. ప్రజాపతి యన్నాధిదేవత. అన్నమే జీవులకు జీవనము. సకల జీవసముదాయంబు నన్నంబునుండియే యుత్పన్నం బగుచున్నది. యజ్ఞోత్పత్తి గూడ నన్నమునుండియే. యజ్ఞము నిఖిలకర్మంబులకు ను త్పత్తిస్థానము. సకలయజ్ఞంబులును బ్రహ్మయజ్ఞంబున కంతర్భూతము లు. ఋగ్యజుస్సామవేదంబులును, గల్పోపనిషత్తులును, మంత్రంబులు ను, అరణ్యకంబును, రహస్యాథర్వణంబులును బ్రహ్మయజ్ఞంబునఁ బ్ర తిష్ఠితంబులై యుండును. ఏకాక్షరంబగునోంకారమే పరబ్రహ్మంబని షడంగప్రస్తావంబున సాంఖ్యయోగవిశారదులు చెప్పుదురు. బ్రహ్మాక్ష రాత్మకం బగునీయోంకారము సావిత్రినుండి యుత్పన్నమైనది. శక్తి యు, బ్రహ్మయు, విష్ణుండును నేనుఁగూడ నాయోంకారమును బూజిం చుచుందుము. ఓంకారమే యజ్ఞప్రదర్శకమైనది. అని యుపదేశించి మహాదేవుం డంతర్హితుం డయ్యెను. కమలగర్భుం డగుబ్రహ్మదేవుం డావాక్యంబుల నాలకించి యనాయాసంబుగ నిత్యముక్తుం డగుమహే శ్వరునిం బొందఁగలిగెను. మహేశ్వరుండు పంచమూర్తులచే విరాజిల్లు చుండును. అందుఁ బ్రథమమూర్తి యూర్ధ్వరోమవిశిష్టమై భయంకర

మై యుండును. ద్వితీయమూర్తి సూర్యకిరణోపమంబై ప్రదీప్తంబై యుండును. పరమాత్మ యగుచంద్రమూర్తియే యాతనితృతీయమూర్తి. కుబేరునిమహాతనువు పరమేశ్వరుని చతుర్థమూర్తి. ఆదేవునిపంచమమూర్తి పరమపదం బగుబ్రహ్మస్వరూపమే. ధ్యాననిమగ్ను లగు విజ్ఞాను లాబ్రహ్మస్వరూపము నవలోకించుచుందురు. భగవానుండగు రుద్రుం డీపంచవిధంబుల నుదయించుచుండును. ఆదేవునిప్రథమమూర్తి నిరంతరమును క్రీడించుచుండును. ద్వితీయమూర్తి తపశ్చరణంబు గావించుచుండును. తృతీయమూర్తి లోకసంహారంబు సేయుచుండును. చతుర్థమూర్తి ప్రజాసృష్టి సేయుచుండును. పంచమమూర్తి విజ్ఞానభావంబున సర్వజగంబు నావరించియుండును. ఆతఁడె సర్వేశ్వరుండును, సర్వజీవావస్థితుండును, సృష్టిప్రళయసంపాదకుండును, సకలజీవరక్షకుండును, ఈశానుండు నని కీర్తింపఁబడుచుండును.

మఱియు నాతఁడు జీవులయుత్పత్తిప్రళయంబులను, గతిసంగతులను, విద్యావిద్యలను నెఱింగినవాఁడగుటచే భగవానుం డనియు, మహాత్ములకంటె మహాత్స్వరూపుఁడును, మహాత్ములగు బ్రహ్మాదులచేఁ బూజితుండును, మహత్పదార్థం బగుజగంబునకుఁ గారణుండు నగుటం జేసి మహాదేవుండనియు, సచరాచరపూర్ణం బగుత్రైలోక్యంబునకు సంహారకరుండును, పశుస్వరూపు లగుజీవులకుఁ గర్మబంధమోచకుండును నగుటచేఁ బశుపతి యనియుఁ, దల్లియుఁ, దండ్రియుఁ, బ్రియుండును స్వయముగఁ దానేయై స్వయముగ నవతరించినవాఁడగుటచే స్వయంభువనియు, నేకమస్తకచ్ఛేదనంబు గావించి దానిని ధరించుట కారణంబుగా బ్రహ్మాదిఋషులచేఁ గపాలి యనియు, ఈలోకత్రయంబును బ్రళయకాలంబున నాతనియందు నిలయంబు నందుటం జేసి శంకరుం డనియు. తనయందే విశ్వమంతయు నుతఁబ్రోతంబగుటయు.

దనకంటె నెవ్వరు నధికులు లేకుండుటయుఁ గారణంబుగా విశ్వేశ్వరుం డగునీశానుండనియు, మహాత్ములకంటె మహాత్ముండును, లోకంబులకు మహైశ్వర్యప్రదాయకుండును, బ్రహ్మాదిమహావ్యక్తులచేఁ బూజితుండు నగుటచే మహేశ్వరుం డనియు, సచరాచరంబగుప్రపంచమున సకల జీవులు నాతనియనుగ్రహమునసే బ్రహ్మజ్ఞులగుటవలనను, బృహత్స్వరూపుఁడును, స్వయంప్రకాశుఁడు నగుటవలనను నాతఁడు బ్రహ్మ యనియుఁ గీర్తింపఁబడుచుండును. అతిగుహ్యాతమం బగుబ్రహ్మపదార్థ మప్రత్యక్షవిషయము గాదు. కాని ప్రకృతిసంబంధవశంబున నా బ్రహ్మము నీలలోహితనామంబున వ్యవహరింపఁబడుచుండును. ఆ బ్రహ్మము జీవులప్రాణమయకోశంబులకును సంఛన్నంబై యుండును. ఏదేవదేవేశ్వరునిసాక్షాత్కారంబునఁ జిరానందలాభంబు గలుగునో యట్టికేవలుం డగురుద్రుండు ప్రకృతిభిన్నుండై యుండును. మన మందఱమును బ్రాకృతికులము. రుద్రుండు మనకు దేవుండు. మనము దేవగణంబులకు దేవతామూర్తులము. దేవగణంబులు బ్రాహ్మణులకు దేవతలు. బ్రాహ్మణులు తక్కినయందఱకును దేవతలు. ఈరీతిగా రుద్రుఁడు దేవదేవేశ్వరులకును బరమదైవతమై యున్నాఁడు.

ఈసత్యము నెవ్వఁడు గ్రహించి నిత్యమును గీర్తించుచుండునో యాతనివిపత్సమూహ మంతయు నిశ్చయముగా వినష్టంబు గాఁగలదు.

—: రుద్రమాహాత్మ్యకీర్తనము. :—

పంచభూతంబులును, దత్కారణంబులును, సమస్తప్రపంచమును విరూపాక్షునుండియే యుత్పన్నంబగుచుండును. విష్ణుదేవుం డాతని పార్శ్వమునుండియు, దక్కినదేవతలందఱు నాతనిలింగస్వరూపమునుండియు నుత్పన్నులగుచుందురు. అనాదియు, నక్షయుండును, భగవా

నుండును నగుశివుండే లింగస్వరూపము. వేయిమాట లేల? అతిగుహ్యతమంబగుతత్త్వమును సంక్షేపించి చెప్పెదను. బ్రహ్మయు, విష్ణుండును ఇంద్రుండును, సకలదేవతాగణంబులునుగూడ నాతనినిమేషకాలమాత్రావస్థితులై యుందురు. బ్రహ్మాదులకుంగూడఁ జేయశక్యముగాని కార్యములును, వారికెఱుంగరానిపరమరహస్యతత్త్వములును నాతనికి సులభములై యుండును. మహాదేవుం డగురుద్రునినియమంబు లచింతనీయములైనవి. సర్వవ్యాపి యగునాతఁ డసమానబలపౌరుషములు గలవాఁడు. ఆదేవునిమాయ నెవ్వరు నెఱుంగఁజాలరు. భక్తిమాత్రప్రియుం డగునాతని నెవ్వరును భక్తిమూలంబునం గాక పడయఁజాలరు. రుద్రుఁడు నిత్యసంస్మరణీయుఁడు. రుద్రునియందే పరమపదము నిలిచి యున్నది. రుద్రునివంటిదైవమును మేమెందును జూచి యుండలేదు. నిరంతరభక్తిభావంబున మహేశ్వరచింతానిమగ్నులగువారు దురాచారులయ్యును భావితాత్ములగుపరమమునీంద్రులతోఁదుల్యులై యుందురు. వివిధపాపవిలిప్తు లయ్యును మహేశ్వరశరణాగతులై నిత్యము నాతని భజించువారు సంసారదుఃఖంబుల నుత్తరించి సర్వోత్కృష్టులై యుందురు. నిరంతరము నశ్వమేధాదియజ్ఞంబులు సేయువారుగూడ వారియున్నతపదంబును బడయఁజాలరు. దేవదానవగంధర్వయక్షరాక్షసాదులు నిరాఘాటముగ సకలలోకసంచారు లయ్యును, కేవల భక్తగణమాత్రలభ్యంబగురుద్రలోకమున రుద్రానుమతంబు లేక ప్రవేశింపఁజాలరు. ఆరుద్రుండు సంతుష్టుం డైనచో విష్ణుత్వంబును, ఇంద్రత్వంబును, అమరత్వంబును, దేవతాగణసహవాసంబును, త్రిభువనాధిపత్యంబునుగూడఁ బ్రసాదించును. ఆపరమేశ్వరునియందు నిశ్చలభక్తులై యుండువారికి శివలోకంబున నున్నతపదలాభంబు గలుగును. నిరంతరపాపకార్యానుష్ఠానంబులచేఁ గలుషితచిత్తులగువారు

గూడ భగవంతుండగురుద్రుని భక్తిపూర్వకంబుగ ధ్యానించి మహేశ్వరసాక్షాత్కారంబును బడయఁజాలుదురు. దేవతాగణంబులకును ప్రభుండును, ఆదిదేవుండును మహాదేవుండు నగురుద్రు నసమానభక్తి భావంబున సర్వదాస్మరించువారి కెట్టిభయంబులును గలుగవు. నిరంతరము మహేశ్వరసంకీర్తనంబు సేయువారిని మోహావేశింపఁజాలదు. దేవదేవసంకీర్తనంబునఁ జండాలాదులైనను దేజస్వులగుబ్రాహ్మణులై సర్వపాపవినిర్ముక్తులై రుద్రలోకంబు నధిగమింపఁగలరు. అక్షరద్వయ సమంచితం బగురుద్రనామమును నిరంతర ముచ్చరించువిచక్షణులు నీలకంఠసంకీర్తనవశంబున బాపవిముక్తు లగుదురు. స్వధర్మభ్రష్టులును సకలపాపకలుషితులు నగువారుగూడఁ గేవలధ్యానపరాయణులై మహేశ్వరు నాశ్రయించి తమపాపంబులనుండి యుత్తీర్ణు లగుదురు.

ఈప్రపంచమున నిత్యంబును నూతనంబుగాఁ బెక్కుగర్భంబుల జన్మించి నశించుచుండు జీవులు భక్తిభావంబున మహాదేవు నాశ్రయించి ధ్యానించుచుండుటవలన భవదూరులై గర్భవాసదుఃఖమునుండి విముక్తు లగుదురు. అంతరంగంబు శివాధీనంబు గావించినమానవులు సకలపాపవిముక్తులై దేవతాగణంబులతోఁ జేరి విచారించుచుందురు. నిత్యాగ్నిహోత్రులును, బహుదక్షిణాన్విత యజ్ఞానుష్ఠానపరులును గూడ శివభక్తులషోడశాంశమునైనను బోలఁజాలరు. శివచింతాతత్పరు లగువారిలో ముముక్షులగువారికి మహేశ్వరానుగ్రహంబునఁ బరమపదలాభంబు గలుగును. సాంఖ్యయోగసంభవకరుండును, సర్వవ్యాపకుండును, అవ్యయుండును, నిత్యుండును, మహాదేవుండు నగువిరూపాక్షునియనుగ్రహంబులేక సిద్ధుండగుట కెవ్వఁడు సమర్థుండు కాఁగలఁడు? తీర్థంబులలో దివ్యమంగళస్వరూపుండును, పవిత్రంబులలోఁ బరమపవిత్రస్వరూపుఁడు నగువ గేవుండు సర్వజనశరణ్యుఁడు. సర్వభూతేశ్వరుం

డగువిరూపాక్షుండు సర్వజీవాంతర్గతుండై యోంకారము నధిగమించి యుండును. నిష్కళుండును, బ్రధానపురుషుండును, మహాలింగలక్షణుండును, దుస్తరతాపోపశమనుండు నగునాతనిఫలస్వరూపమును దెలిసికొనుట యెట్లు? క్షీరంబులయందు ఘృతంబును, గాష్ఠంబులయందగ్నియు, భూమియందు జలంబును, జలంబులయందు శైత్యంబును నెట్లుండునో యట్లే యీశ్వరునియందు దేవతలును, ఋషులును, బ్రహ్మమానసపుత్త్రులును విలీనులై యుందురు. స్తుతిహోమచిహ్నితుండయ్యును ననిర్దేశ్యుం డగునయ్యీశ్వరుం డనామయంబును, నిష్కళంబు నగులింగస్వరూపముచే విరాజిల్లుచుండును. ఏకముహూర్తమధ్యంబున మహాసాగరోద్భూతం బగుహాలాహలంబు జీర్ణము గావించుకొన్నవిభుం డగునమ్మహేశ్వరునిదివ్యస్వరూపమును దేవగంధర్వభూతసిద్ధయక్షపన్నగాదు లెవ్వరును గనుంగొనఁజాలరు. పార్థివలింగస్వరూపంబున విరూపాక్షు నర్చించువారికిఁ బితృమానుషనాగభయంబులు గలుగవు. వారివంక యముండు తేఱిచూడఁజాలఁడు. వారికిఁ గుంభీపాకాదినరకపతనంబు లేదు. వారు కామగమనంబు లగువిమానంబుల నధిరోహించి యింద్రలోకంబునఁ దేవతలతోఁ గూడ విహరించుచుందురు.

రుద్రారాధనవిధి.

రుద్రు నెట్లారాధింపవలయునో, యాతఁ డెట్లు ప్రసన్నుం డగునో యానతీయవలయు నని మహర్షులు ప్రశ్నించుటయు బ్రహ్మయిట్లుపదేశించెను. మునీంద్రులారా! పూర్వ మొకకోటియుఱువదివేల యేఱువందలవత్సరములు విష్ణుదేవుండు శూలపాణియగు మహాదేవునారాధించెను. అనంతర మమ్మహేశ్వరుండు సంతుష్టుండై, విష్ణునకు

సాక్షాత్కరించి శాంతిస్వరంబుతో “ హరీ! సకలయుద్ధంబులయం దును నీకు విజయం బగును. సుదర్శనమహాచక్రధారణంబున నీవతి బలశాలి వయ్యెదవు. నాయందు భక్తిగలనీకు మత్సమానబలంబు లభించును.” అని వరం బిచ్చెను. అదిమొదలుగ విష్ణుదేవుండు శివా నుగ్రహంబున నజయ్యుండును, బరమతేజోమయుండునునై సమస్తప్ర పంచమును బరిపాలించుచుండెను. మహాదేవుం డగువిరూపాక్షుండు తొల్లి బ్రహ్మనగునాచే నారాధితుండై పరమానుగ్రహంబున నన్ను విశ్వతోముఖునిగను, సంహారకర్తగను గావించియున్నాఁడు. అందుచే నేను ప్రతియుగంబునను దాతను, సమాహర్తను, గోప్తను, సంహర్తను నగుచుందును. ఆదేవునిప్రసాదంబుచేతనే నాకు సురాసురపితామహ త్వంబును, వేదాధిపత్యంబును, శాశ్వతత్వంబును, భావివర్తమాన విశ్వంబునకుఁ బ్రభుత్వంబును లభించెను. మఱియు నేను షడంగసహి తంబగు వేదచతుష్టయంబును, పారిభాషాసహితం బగుసాంఖ్యంబును, నిష్కళత్వంబును, దివ్యం బగుబ్రహ్మలోకంబును బడయఁగలిగితిని. ఇట్లే పూర్వ మింద్రుండు జలానిలమాత్రభోజనుండును, జర్మవసనుం డునై దివ్యంబును, గష్టసాధ్యంబు నగుపాశుపతవ్రతంబు నాచరించెను. అప్పుడు పినాకపాణి యగువిరూపాక్షుండు ప్రసన్నుండై యింద్రునకు మహావజ్రప్రదానంబు చేసి బలవంతునిగను, గణాధిపతిగను గావించెను. మరలఁ దచ్ఛ్రీకరణమువలననే శక్రునకు స్వర్గపురంబు లభించెను. వృత్ర వైరి యగునింద్రుం డాస్వర్గంబున విరాజిల్లుచుండెను.

మునివరులారా! పూర్వము నామానసపుత్త్రుం డగుసనత్కు మారుండు సప్తసహస్రసంఖ్యాకంబు లగువిమానంబులతోఁ జంద్ర సూర్యప్రభావంతంబు లగువిమానంబుల నధిరోహించి కమనీయతేజ స్సంపన్నుండై సుందరీజనసహస్రంబు తన్నుఁ బరివేష్టింప విహరించు

చుండెను. ఆతం డీశ్వరదత్తబలగర్వంబున ననుపమానంబులును, సువర్ణమణిఖచితంబులు నగునందలిసుందరమందిరంబులయందు సూర్యతేజోమయు లగుపురుషగణంబులతోఁ గలసి నృత్యగీతవాద్యకుశలు లగు గంధర్వాప్సరోగణంబులు దన్నుఁ గొలువ శివశైలంబును బాదంబులచేఁ బీడించుచుఁ గ్రీడించుచుండెను. ఆతనియనుగ్రహముచే ననేక రాజన్యులు శివపూజాధురంధరులై సకలలోకసంచారలాభంబు గాంచిరి. ఆతఁడు దుష్టశిక్షణంబును, శిష్టరక్షణంబును గావించుచుండెను. ఆతనిగృహారామమునందలి సకలవృక్షములును సకాలముఁ బుష్పఫలవిలసితంబులై యొప్పారుచుండెను. ఆస్థానమున ద్వారరక్షకులును, శైలవాసులును, పాతాళవాసులును, అంతరిక్షసంచారులును, స్వర్గవాసులును, నక్షత్రగణాశ్రితులును, స్థావరజంగమాకృతు లగుసకలజీవులును బరమేశ్వరుం డగురుద్రదేవునిపార్శ్వంబున సుస్థిరులై యుండిరి. ఆదేవు నాశ్రయించి పరివేష్టించియు న్న వారందఱును నిర్భయంబుగా నుష్ణనిశ్వాసంబుల విడుచుచుండిరి. ఆపార్శ్వంబునం గలగృహంబులును బాదపంబులును దివ్యములైనవి. రుద్రపార్శ్వంబునం దధివసించియున్న ప్రమథగణంబులు కుందేందుసదృశంబు లగుకమలకుసుమమాలికలనాఘ్రాణించుచుండిరి. ఆగణంబులశరీరవర్ణంబులును, బరిణామంబులును దరగతి కొక్కవిధంబుగా నుండెను. ఇట్లు మేరుమందరపరిమాణంబున నొప్పారుప్రమథగణసమూహంబుచేఁ బరివృతుండై, గ్రహగణపరివృతుం డగుసూర్యదేవునింబోలి దేవేశ్వరుం డగుసనత్కుమారుండు గణాధీశుం డగుమహాదేవు నారాధించుచుండెను. శివారాధనబలంబున భీషణపరాక్రమశాలియు, నమితతేజస్వియు నగుసనత్కుమారునివిషయమున నేను గాంచినదానిం జెప్పితిని.

ఈగణసమూహవర్ణనము [illegible]

ఠించువారును, ప్రతిపర్వంబునను పఠించువారును, సర్వాభీష్టసిద్ధులై యమృతత్వంబు నంది రుద్రలోకంబునఁ గోటివత్సరంబులు పూజితులై యుందురు. దీనిని సతులఋతుకాలంబునఁ బఠించువా రపత్యసంపన్ను లగుదురు; యుద్ధకాలంబునఁ బఠించువారు విజయు లగుదురు. జితేంద్రియులును, శ్రద్ధాపరాయణులునై యాహారసమయంబుల బ్రాహ్మణసాన్నిధ్యమున నిత్యమును దీనిని బఠించువారికి నూఱుసారులు రుద్రాధ్యాయపఠనంబును, గోటిసారులు వేదపఠనంబును గావించిన ఫలంబు లభించును. అట్టివారు పాపాత్ములైనను రుద్రలోకంబు నధిగమింపఁగలుగుదురు. ప్రభాతకాలంబున భక్తిపూర్వకంబుగ దీని నాకర్ణించువాఁడు పాపవిముక్తుం డగును.

అప్పుడు సనత్కుమారుండు సమాగతుం డగు బ్రహ్మదేవు నుద్దేశించి యిట్లనియెను. తండ్రీ! పూర్వులగుపితృపితామహాదు లెల్లరును భగవానుండగురుద్రునిదేవతేజోమయంబగునూర్ధ్వనిలయంబు నవలోకించుచు సర్వభూతంబులయందును మాన్యులై యీశ్వరానుగ్రహంబున నుత్తమలోకవాసంబు గాంచి యున్నారు. పూర్వంబున సిద్ధగణంబులుగూడ నిట్లే మహాదేవప్రసాదంబున సిద్ధిలాభంబు నంది గర్వితులై యుండుటయేగాని శ్రేష్ఠతత్త్వంబు నెఱుంగకయేయున్నారు. అకృతకార్యుం డగుబాలకునివలె విమానంబులను, రత్నంబులను, వివిధంబులగునుత్తమగృహంబులను గాంచి నేనును ముగ్ధుండనై యున్నాను.ఇట్టివానిచే నిర్బంధితుండ నైతి నని నాకు బోధయగుచున్నది. అందుచే నాకతిదుస్సహం బగుసంతాపంబు గలుగుచున్నది. కావున దేహపరిత్యాగంబు సేయవలయు నని సంకల్పించుకొంటిని.అనుటయుఁ బుత్త్రునియీవాక్యంబుల నాలించి బ్రహ్మదేవుండు క్షణకాలంబు ధ్యానవిమగ్నుండై చింతాబలంబున శివసాక్షాత్కారంబు గాంచి తన

కుమారుండగుసనత్కుమారుని బరమభక్తాగ్రేసరునిగా నెఱింగి యాస నమునుండి సముత్థితుండై సర్వజీవోత్పాదకుండును, సంహారకుండును, శాశ్వతుండును, భూతనాథుండును, నీశ్వరుండు నగుమహాదేవుండకు నమస్కరించి యిట్లని చెప్పందొడంగెను.

వత్సా! ఎవ్వనినుండి స్థావరజంగమాత్మకంబగునీవిశ్వమంతయు నుత్పన్నం బయ్యెనో యట్టిమహాదేవుండు ప్రభువులకు మహాప్రభుండు ను, యోగీంద్రులలోఁ బ్రధానయోగీంద్రుండు నై యున్నాఁడు. అంబికానాథుండగుతద్దేవుండు పూర్వ మొకప్పుడు శోకార్తుం డగునందీ శ్వరుంగాంచి ‹‹పుత్త్రా! శోకించుట యుచితము గాదు. జన్మగ్రహ ణంబు గాంచిన యెవ్వఁడు జరాశూన్యుఁడు గాఁగలిగియున్నాఁడు?" అని యూఱడించి దయాళుండై యాతని కఖిలలోకంబులను జూపించె ను. ఆత్మసాక్షాత్కారముమాత్రము సుదుర్లభమైనది. కుమారా! ప్రమథులందఱు నీరీతిగా విష్ణుదేవునిచే గాణపత్యలాభంబు నందిరి. అకృతమతు లగువారిలో బ్రహ్మనిష్ఠుం డొక్కండును లేఁడు. ఎవ్వఁడు జ్ఞానియై మహాదేవుని భజించునో యాతనికి గాణపత్యమన నెంత? ముక్తి పర్యంతము నాతఁడధిగమింపఁగలఁడు. కావున నవశ్యంభావి యగునీ సుఖంబు నెడల నీవన్యవిచారంబు సేయక పోయి యాపరమేశ్వరుని భజింపుము. దయాళుం డగునాతఁడు నీకాత్మదర్శనసాధనం బగుయో గంబును బ్రసాదింపఁగలఁడు. మున్ముందుగా సుదుర్లభంబగుగాణ పత్యంబును బ్రసాదింపు మని యద్దేవునిఁ బ్రార్థింపుము. పూర్వము భగవానుండగువిష్ణుదేవుండును బ్రథమంబున గాణపత్యంబునే యభ్య ర్థించి యనంతర మాత్మదర్శి యయ్యెను. కావున గాణపత్య మొక్కటి యే యాత్మదర్శనంబునకుఁ బ్రధానోపాయంబు. ఇప్పుడు నీవు శివ

మంత్రజపంబునకుఁ గడంగి క్రమంబుగ సద్దేవునిసాక్షాత్కారంబుం బడయుము.

అని యిట్లు బ్రహ్మదేవుం డుపదేశించుటయు సనత్కుమారుండు మానసజపంబుచే మహాదేవుని ధ్యానింప నారంభించెను. అనంతరము సభక్తికంబుగ నాతం డొనరించిన ఋగ్యజుస్సామవేదోక్తంబులగు వివిధమంత్రజపంబులచేతను, వివిధస్తవంబులచేతను, వివిధారాధనంబుల చేతను మహాదేవుండు సంతుష్టుండై ప్రసన్నుండయ్యెను. అప్పుడు సనత్కుమారుండు ధీమంతుండగు నమ్మహాదేవునకుఁ బ్రదక్షిణంబు చేసి యిట్లని స్తుతింపందొడంగెను. మహాదేవా! నీవు చరాచరప్రీతికరుండవు. ధర్మాత్ముండవు. వరదాతవు. సర్వశ్రేష్ఠుండవు. సర్వభూతపోషకుండవు. సర్వతేశ్వరుండవు. యముండవు. భూతసంసారకారణుండవు. గోపతివి. త్రిదశేశ్వరుండవు. సాంఖ్యయోగేశ్వరుండవు. కర్మకుమారుండవు. కమలేక్షణుండవు. శతసూర్యాగ్నినేత్రుండవు. చారునేత్రభూషితుండవు. చతుర్ముఖుండవు. చతుర్దంష్ట్రుండవు. చతుర్బాహుండవు. చతుర్వ్యూహుండవు. చతుర్మూర్తివి. చతుర్వక్త్రుండవు. చతుర్నేత్రుండవు. చతుష్పథుండవు. వాయుకాలాగ్నిరుద్రస్వరూపుండవు. దిగ్వాసనుండవు. మేఘవాహనుండవు. జలాధారుండవు. అనంతుండవు. ధర్మాధర్మయుక్తులగుజీవగణంబుల కధీశ్వరుండవు. శుభకరుండవు. శ్రీకంఠుండవు. కలినాశకుండవు. విష్ణువరదుండవు. సముద్రబడబానలుండవు. దేవాసురుల కజయ్యుండవు. దేవాసురపరాయణుండవు. కపర్దివి. శూలహస్తుండవు. అజుండవు. పరమగతివి. తాపసులకుఁ బరమశ్రేయంబవు. పరమపదుండవు. జీవగణంబులయల్పాధిక్యంబు లెఱింగినవాఁడవు. సూర్యస్వరూపుండవు. అసితాంగుఁడవు. సితాంగుఁడవు. అసితాయతలోచనుఁడవు. నీవు బ్రహ్మచేఁ బ్రస్తుతుండవు. నీనాభిపంకజంబున బ్రహ్మ

దేవుండు నివసించియుండును. నీవు నీలంబులు సుగ్రింబులు నగు జటలను ధరించితివి. శంఖచక్రగదాధరుండవును, లక్ష్మీయుతుండవగుట చే విష్ణుస్వరూపుఁడవు నగునీకు నమస్కారము. మఱియు గృహస్థుండ వును, బ్రహ్మచర్యుండవును, వానప్రస్థుండవును, భిక్షుండవును, వేద కల్పోపనిషన్మంత్రాదులకుత్పత్తిస్థానుండవును, విభుండవును, సర్వలో కంబుల కీశ్వరుండవును, గౌరణుండవునగునీకు నమస్కారము. దేవా! నీవు పశుపతివి. బ్రహ్మాండసహస్రంబుల ధరించితివి. శతసహస్రయో జనవిస్తృతుండవగుభగవంతుఁడవు. భూతభవిష్యద్వర్తమానస్వరూపుఁ డవు. శాశ్వతంబులగుభూర్భువస్స్వర్లోకములు నీయందే యుత్పన్నము లైనవి. నీమార్గములను, నీవాక్యములను నెవ్వరు నెఱుంగఁజాలరు. మహాయోగివి. యోగేశ్వరుండవు నగునీకు నమస్కారము.

అని యిట్లు సనత్కుమారుండు ప్రస్తుతించుటయు నమ్మహా దేవుండు కమండలుదండధరుండును, జంద్రచూడుండును, వ్యాఘ్రచర్మ పరిధానుండును, సింహచర్మోత్తరీయుండును, రుద్రాక్షమాలావిభూషి తుండును, నాగయజ్ఞోపవీతుండును, గణసమూహపరివృతుండును నై జటాశిఖండ, పట్టిస, ఖట్వాంగ, వజ్ర, శూల, బాణ, హలాయుధంబు లను, జంద్రకళామృగచర్మకపాలభీకరచాపంబులను ధరించి వృషభ వాహనారూఢుండై సనత్కుమారునియెదుటసాక్షాత్కరించెను.సూర్య చంద్రాగ్నినయనుండగునమ్మహాదేవుని సనత్కుమారుండు పరమానం దంబున సందర్శించెను. అనంతరమమ్మహాదేవుండు "సనత్కుమారా! నేను నీయెడల సంతుష్టుండ నైతిని. నన్నవలోకింపుము. దృఢవ్రతుం డవును, విశుద్ధుండవు నగునీకు శుభమగుఁగాక! నేను ప్రసన్నవదనము తోఁ జెప్పుచున్నాను. నీవభీష్టం బగువరంబును బ్రార్థింపుము. నీకు క్షేమంబగుఁగాక" అని యనుగ్రహించెను.అప్పుడు సనత్కుమారుండు

“మహాదేవా! మహేశ్వరుండ వగునీదర్శనంబు లభించుటయే నాకు వరంబు. పూర్వము బ్రహ్మదేవునివలన నేను మీదివ్యతత్త్వంబంతయు నెఱింగితిని. మీరు నాయెడలఁ బ్రసన్నులై వరంబు ననుగ్రహింపఁ దలంచితిరేని నాకు మీయెడల నిరంతరభక్తి వర్ధిల్లునట్లు వరంబు దయచేయుఁడు. మీకంటె నన్యులను నేనెన్నఁడైన ధ్యానించితినేని నాయపరాధంబును క్షమింపుఁడు. సామానసికంబులగుకామలోభంబులను, సర్వేంద్రియలోభంబుచేఁ గలుగు పాపంబును క్షమింపుఁడు. ప్రాణాపానవ్యానోదానసమానంబులును, సర్వేంద్రియంబులును, మనంబులును నీవేగదా. ప్రభూ! నీచే నఖిలభూతంబులును యథాకాలంబున సృష్టిస్థితిలయంబులఁ గాంచుచుండును. ఎవ్వనిమనంబు నీభక్తిచే నిర్మలంబు గాకుండునో యాతనిచేఁ బ్రదత్తంబులగువస్తువులను దేవతలు పరిగ్రహింపరు. బ్రహ్మయును మీసృష్టియే. కావున నేను బ్రహ్మపదంబును వాంఛింపను. దేవా! నీవు నాగగంధర్వపిశాచరాక్షసాదిస్వరూపుఁడవై యుండియు మరల వారికిఁ బ్రభుండవై విరాజిల్లుచుందువు. ఈవిశ్వమంతయు నీయదియే గావున నేను త్రికరణశుద్ధిగా నీకంటె నన్యులను భజింపఁజాలను.” అని సనత్కుమారుండు ప్రార్థించుటయు భూతేశ్వరుండును, ఉమాపతియు, నగుమహేశ్వరుం డిట్లనియెను.

పరమయోగీంద్రా! నీకు శుభ మగుఁగాక! ప్రధానమునిగణంబులయందు శ్రేష్ఠుండవగు నీకు నానామంబు లన్నియును గోచరింపఁ గలవు. నాలోకమునందలి సకలవ్యక్తులకునుగూడ నవేద్యములగుసకలనామంబులును నీకు సువిదితంబు లగును. దీని కెట్టిసంశయమునులేదు. భవిష్యత్కాలంబున మహాతపస్వి యగుపరాశరనందనుం డుదయింపఁ గలఁడు. ఆధర్మాత్ముండు జ్ఞానియు, సూక్ష్మదర్శియునై వేదవిభాగంబు సేయఁగలఁడు. కమలదళలోచనుండగునాతఁడు నీశిష్యుఁ డగును. నీవు

నిర్మలంబును, విశుద్ధంబును, జ్ఞానమయంబును, కామగమనంబును, అమూల్యరత్నఖచితంబును, ముక్తాజాలాచ్ఛన్నంబును, హేమమయంబును, హేమవేదిసమంచితంబును, దివ్యధూపసురభిళంబును, సుందరకేతనాన్వితంబును, సురాసురసేవితంబును, సూర్యసంకాశంబును, సర్వలోకోజ్జ్వలంబును నగుదివ్యవిమానంబు నధిరోహించి దేవదానవగణపూజితుండవై నాలోకంబునకు రాఁగలవు. అచ్చట మదాదేశంబున నీకు సర్వోత్కృష్టం బగునైశ్వర్యంబు లభింపఁగలదు. అని చెప్పి భగవంతుం డగుమహాదేవుం డంతర్హితుం డయ్యెను.

బ్రహ్మగీత.

బ్రహ్మ యిట్లు చెప్పందొడంగెను. మహాదేవునివరపుత్త్రుం డగుటచే నంబికానందనుండును, బ్రహ్మమానసపుత్త్రుండు నగుసనత్కుమారుండప్పు డీశ్వరానుగ్రహంబున దివ్యదేహలాభంబుగాంచి త్రిభువనంబుల సంచరింపందొడంగెను. మహాదేవుం డగునీశ్వరుఁడే ప్రతియుగంబునను, దాతయుఁ, గర్తయు, సంహర్తయు నై యుండును. సృష్టిస్థితిలయకార్యంబు లాతనివే. ఆయుమాపతిని యజ్ఞేశ్వరుఁడనియు, కృతాంతుఁడనియు, హోత యనియు, హవ్యస్వరూపుఁ డనియు యజ్ఞవిదు లెఱుంగుదురు. విషయేంద్రియసంబంధంబును మహేశ్వరస్వరూపమే. ఆతఁడు జ్ఞానాతీతుఁడు. ప్రశాంతుఁడు. నిర్మలుఁడు. వ్యక్తుండయ్యు నవ్యక్తుఁడు. జ్ఞానాజ్ఞానస్వరూపుఁడు. సాంఖ్యయోగస్వరూపుఁడు. తత్త్వజ్ఞానగమ్యంబగుశివస్వరూపమును దర్శించినవారు మాత్రమే యీసత్యంబు నెఱుంగుదురు. ఎవ్వరు ప్రాణాయామాది మూలంబున జితేంద్రియులై, స్వయంశుద్ధులై యోగీశ్వరులకుఁ బరమపదస్వరూపుఁడును, సంసారవిమోచనంబున కేకమాత్రప్రభుండును,

అవినశ్వరుండును, యోగప్రయోగస్వరూపుండును, ఓంకారమూర్తియు నగునీశ్వరుని ధ్యానించుచుందురో యట్టియోగీంద్రులు తపోబలంబున నాతనిం బడయఁగలరు. దేవగణదుర్లభంబును, శాశ్వతంబును, విశుద్ధంబు నగునీయోగాచారమునుగూడఁ బరిత్యజించి భేదజ్ఞానవిరహితంబగువ్రతాచరణంబు గావించువారశాంతభావముతో శివవదనవివరంబున విలీనులు కాఁగలరు. సరోవరమునందలికమలములను జలంబులంటనియట్లే ప్రధానంబగునీశివశ్రుతినాకర్ణించువారిని బాపములంటఁ జాలవు.

అనియిట్లు బ్రహ్మదేవుం డానతిచ్చుటయు ధర్మపరాయణు లగు మహర్షులావాక్యంబు లాకర్ణించి యందఱును గమలాసనునిపాదంబులకుఁ బ్రణమిల్లి యిట్లుప్రార్థింపనారంభించిరి. దేవా! ధ్యానమే పరమధర్మం బనియుఁ బరమపదంబనియు నుపదేశించితివి. కావున నట్టిధ్యానకరణంబునకు మాకనుజ్ఞ నొసంగుము. మేము నిస్పృహులమై పోయెదము. అని ఋషులప్పుడు ధూపములు,దీపములు,అలంకారములు, ఉపహారములు మొదలగువానితోడను, జపములతోడను, ప్రణవపూర్వకనమస్కారములతోడను, నృత్తగీతవాద్యానుష్ఠానములతోడను మహాదేవోపాసనము గావింప నారంభించిరి. అద్దేవుం డిట్లు పూజితుండై సాక్షాత్కరించి వారి కుపయుక్తవరప్రదానంబు లాచరించెను. అవ్యయుం డగుమహేశ్వరుం డిట్లు భక్తు లగువారి కభీష్టదానంబులు సేయుచుండును. ఆమహాదేవుండు సకలాభీష్టదాతలయందు నగ్రగణ్యుఁడు. భక్తవత్సలుఁడు. బ్రాహ్మణాదిచతుర్వర్ణములయందును దయామయుఁడు. సకలతీర్థమయుఁడు. ఎవ్వఁడు విషయాసక్తచిత్తుం డయ్యును భక్తిపూర్వకముగఁ ద్రిరాత్రోపవాసంబు చేసి నిత్యము నీశ్వరు నారాధించునో యాతనికిఁ గర్మనైష్ఫల్యంబు గలుగదు. ఈశ్వరచింతాసక్తులై యు

స్నను నెవ్వరిబుద్ధి భోగాసక్తిని విడువఁజాలదో యట్టివారికిఁగూడ సూక్ష్మంబును, అభౌతికమును నగుయోగజదేహలాభంబు సిద్ధించును. శివాశ్రితులగువారు సంపూర్ణముగా నిష్కల్మషులును రజోగుణరహితులు నగుదురు.

ఇట్లు యతిగణంబుల నుద్దేశించి బ్రహ్మచేఁ జెప్పంబడినయీబ్రహ్మగీతను భక్తిపూర్వకముగఁ బఠించువారును వినువారును రుద్రలోకము నధిగమింతురు. దేవాలయమునఁగాని, బ్రాహ్మణసన్నిధానమునఁగాని దీనిని బఠించువారికి సకలకార్యసిద్ధియగును. ఈబ్రహ్మగీతాతత్త్వమును సంపూర్ణముగ నెఱింగి నిర్మలచిత్తంబున నిత్యమును బఠియించు శివభక్తులు జరామరణవిరహితులై శివసాయుజ్యంబు నందుదురు.

శివపురవర్ణనము.

సర్వోత్కృష్టంబు లగుబ్రహ్మవిష్ణురుద్రలోకంబుల పరిమాణాదులంగూర్చి సవిస్తరంబుగ బోధింపు మని వ్యాసుం డడుగుటయు సనత్కుమారుం డిట్లనియెను. వ్యాసమునీంద్రా! నలుదెసలయందు నెనుబదియాఱువేలయోజనంబులపరిమాణంబున విస్తృతంబై, అంతియపరిమాణంబున నున్నతంబై పర్వతరాజంబగుమేరుశైలము స్వర్గమర్త్యపాతాళంబులవఱకును వ్యాపించి స్తంభరూపంబున నిలిచియున్నది. స్వర్ణకాంతిమయం బగునాగిరివరంబు దేవగణంబుల కాశ్రయంబు. ఆగిరిశృంగంబులు వివిధకుసుమంబులచే మనోహరంబులై యుండును. ఆశైలదరీకందరములు మయూరమధురనాదంబులచే విలసిల్లుచుండును. శుకపికశారికాదివిహంగములును, గజవ్యాఘ్రభల్లూకాదిమృగములును, మృగరాజములు నందు విహరించుచుండును. అందు స్వర్ణస్తంభశోభి

తము లగుగృహసమూహములు గలవు. ఆసుందరపర్వతమునఁ బ్రహ్మా
నదేవగణములును, కుబేరాదియక్షగణములును, నారీగణసహితులగు
చిత్రసేనాగంధర్వులును, విద్యాధరగణములును, గంధర్వరాజసహితు
లగుహాహాహూహూతుంబురుప్రభృతులును బరమానందమున విహ
రించుచుందురు. చంద్రకిరణములవలె నతివిమలము లగుజలములతోఁ
బ్రవహించుచుండు నందలినిర్ఝరప్రవాహశబ్దము లాలించి మేఘగంభీర
స్వనములుగ భావించి మయూరము లానందనృత్యములు గావించు
చుండును. అందలిగంగాజలపతనస్థానమునందు దేవతాగణము లాత్మ
సాన్నిధ్యమున నింద్రియగణంబులం బోలి భాసిల్లుచుందురు. సుంద
రం బగునాభూమీధరంబు నాశ్రయించినజీవు లందఱును స్వర్ణవర్ణులై
యనుపమానం బగునాగిరిమూర్ధంబున వర్ధిల్లుచుందురు. అందలిసురభి
ళానిలంబులు పవిత్రంబులును, మధురస్వరసమంచితంబులు నై యుం
డును. దేవతాదుర్లభంబును, సర్వోత్కృష్టంబు నగుస్వర్గం బచ్చటనే
యున్నది. అత్యున్నతం బగునాశైలంబున సూర్యచంద్రాదిగ్రహం
బులు ప్రకాశింపఁజాలవు; మేఘములు నివసింపఁజాలవు; పర్జన్యుండు
వర్షింపఁజాలఁడు. శివానుగ్రహంబు లేక దేవతలును మహర్షులునుగూడ
నామహీధరమును మనసుచేనైన దర్శింపఁజాలరు.

అందు వాసనావిరహితు లగుమహాత్ములకు నివాసయోగ్యం
బును, సువర్ణమయంబు నగువిజయభువనంబును, విజయానదియును
విరాజిల్లుచుండును. ఆపురంబునం దష్టాదశసహస్రయోజనపరిమితంబు
లును, సువర్ణప్రాకారశోభితంబులును, రమ్యకేతనమాలికావిలసితంబు
లును, రమణీయంబులు నగుదివ్యమందిరంబులు గలవు. ప్రతిగృహం
బును ద్వారసహస్రంబులచే భాసిల్లుచుండును. ప్రతిద్వారంబునను
బాలార్కసదృశకాంతిసంపన్నులును, పవిత్రకర్ములు నగుబ్రాహ్మణులు

ప్రకాశించుచుందురు. మఱియుఁ బూర్ణకుంభపరిశోభితంబులును, విపులముక్తాదామవిరాజితంబులును, వివిధపుష్పహారవిలసితంబులును, అగురుధూమసురభిళంబులును, బుష్పమాలికాసమన్వితంబులు నగుస్వస్తికాదిగృహంబు లందెన్నియో గలవు. ఆపురంబు రక్షకగణంబులచే సురక్షితంబై విపులైశ్వర్యసమంచితంబులును, బ్రాకారవేష్టితంబులు నగుగృహపంక్తులచే నిండియుండును. అందుఁ గైలాసగిరిశృంగంబుల వలె విరాజిల్లుప్రాసాదంబులు గలవు. అందలిస్వర్ణభవనంబులు జ్వాలానిలసన్నిభప్రదీప్తంబులై యుండును; కొన్నిమణిమయగృహంబులు శరత్కాలోదితగ్రహంబులవలెఁ బ్రకాశించుచుండును. ఆపర్వతరాజంబున మహాదేవునివిశాలభవనంబు గలదు. అందుఁ బ్రపంచమునందలి సకలపదార్థంబులును గలవు. అది సప్తసహస్రస్తంభంబులపై నిర్మింపఁబడినది. దానికి నలుదెసలను విశాలంబు లగుపరిష్కృతప్రదేశములును, రమ్యకాననంబులును గలవు. ఆభవనంబు ముక్తాదామభూషితంబు లగుగవాక్షమాలికలతోడను, సుందరయవనికాసమంచితంబు లగువిపులద్వారంబులతోడను రమణీయంబై యుండును. ఆద్వారంబు లన్నియు వివిధరత్నకేతనసమన్వితములై యుండును. అందు సుందరపుష్పఫలభూరుహంబులును, బారిజాతంబులవలె సుందరవరవర్ణంబు లగుస్వర్ణకదళీవృక్షంబులతోఁ గూడినయారామంబులును, నదులును, తటాకంబులును, బర్వతంబులును, వాపీకూపప్రహ్రదాదులును గలవు. ఆజలాశయంబు లన్నియు సరసకమలవిసితంబులును, మదభ్రమరఝుంకారస్వనకలితంబులు నై యుండును. అందలికదంబభూరుహపల్లవంబులపై శుకపికశారికామయూరాదివిహంగములు విహరించుచుండును.

ఆశివపురంబున కేనిమిదిపురద్వారములు గలవు. అందుఁ దూర్పునను న్నమొదటిశ్రీద్వారమునందు పద్మమాలికావిభూషితుండును,

దపోనిధియు, శైవుండు నగుమహాసిద్ధుండు నివసించియుండును. అనంతరము లక్ష్మీద్వారంబునందు మహాబలవంతుండును, నీలనీరదదీర్ఘకాయుండును, భగవానుండునగుమహాకాలుండు శూలపాణియై నిలిచియుండును. దానికి దక్షిణమున శివాజ్ఞచే మహాబలుం డగుగండకర్ణుండు నివసించు శివపురంబు గలదు. ఆసమీపముననే యనేకవిధబ్రాహ్మణులు నివసించియుందురు. పశ్చిమంబున వరుణద్వారము గలదు. మహాత్ముం డగుగణేశ్వరునిచేఁ బరిపాలితంబగునచ్చట నందీశ్వరుండుండును. ఉత్తరమునఁ గీర్తిద్వారముగలదు. అందును బ్రాహ్మణులు నివసించియుందురు. వరుణార్కసదృశుండగుమహేశ్వరుం డాద్వారమునకు రక్షకుండై వివిధములగుక్రీడాపరికరంబులచే నందుఁ గ్రీడించుచుండును. జితక్రోధులును, జితలోభులును, జితేంద్రియులును, రుద్రభక్తులునగు బ్రాహ్మణ్యులు భక్తిబలంబుచే నీశివలోకమును జేరఁగలుగుచుందురు. శాస్త్రాభ్యాసనిరతులును, వేదజ్ఞులును, యోగులును, నిరంతరశివభక్తులును, ధార్మికులును, గృహస్థులు నగుబ్రాహ్మణులును, ధర్మయుద్ధమున రణరంగమరణము గాంచినవారును, గోమిత్రరక్షణమునకును, ధర్మరాజ్యపాలనమునకును బ్రాణత్యాగంబు చేసినవారును నగుక్షత్రియులును, జితేంద్రియులును, సత్యవ్రతులును, స్వధర్మపరాయణులు నగు వైశ్యులును, మఱియు బ్రాహ్మణహితాభిలాషులును, రుద్రేంద్రవిష్ణుగతప్రాణులును, సహస్రగోదాతలును, భూసురవస్త్రాదిదాతలును, సకలజీవప్రియంవదులును, వేదపారనిరతులును, ధ్యానాసక్తులును, వ్రతానుష్ఠానపరాయణులును, ప్రచురదక్షిణలతో యథావిధిగ యజ్ఞంబులు చేసినవారును శివలోకము నధిగమించి యథాసుఖంబుగఁ గాలయాపనము సేయుచుందురు. అట్టివారు చిరకాలము శివలోకసుఖంబు ననుభవించి యనంతరము భూలోకమున విశుద్ధబ్రాహ్మణకులమున నవతరించి చిరా

నందభోగులై లోకంబు నానందింపఁజేయుచుండురు. ఇది సకలార్థ సంపన్నంబును, సర్వాభీష్టసాధకంబు నగుశివభువనవృత్తాంతంబు—

ఇఁక రజతశృంగమునందున్న విష్ణుదేవునిసర్వోత్తమభువనంబును గూర్చి చెప్పెదను. ఆవిష్ణుపురంబున కాశ్రయం బగుసుమేరురజతశృంగము చంద్రికిరణనిర్మలంబై ప్రకాశించుచుండును. అది త్రిసహస్రయోజనపరిమితంబును, విచిత్రకేతనాలంకృతంబును, వివిధాలంకారవిభూషితంబును, దివ్యరజతప్రాకారావృతంబును, మహాదేవప్రభావంబున సకలసుఖభోగస్థానంబునై విరాజిల్లుచుండును. ఆలోకంబు దివ్యరత్నఖచితంబులును, విచిత్రంబులునగుపురద్వారములతోడను, రజతమయంబులగుసహస్రద్వారంబులతోడను నొప్పుచుండును. అందు ద్విసహస్రస్తంభశోభితంబగునున్నతప్రాసాదము గలదు. ఆపురమధ్యమునఁ గైలాసపర్వతముం బోలి సుందరంబును, వివిధరత్నసమాకీర్ణంబును, నానావృక్షలతాపరివృతంబును, గైరికాదిధాతుచిత్రితంబును, చతుర్ద్వారసమన్వితంబును, విష్ణుపదనామకంబును నగునొకరజతమయభవనంబు గలదు. ఆభవనముఖద్వారంబున హృదయజ్ఞుండును, బలవంతుండును, శ్రీకృష్ణతుల్యాకారుండు నగుద్వారాధ్యక్షుండు కాచుకొనియుండును. పశ్చిమద్వారమునందు విష్ణుదేవునకుఁ బ్రాణప్రియుండును, మహాకాయుండు నగుహరిభద్రుండు ద్వారపాలకుఁడై యుండును. ఆపురంబున సువర్ణకమలశోభితంబును, హంసచక్రవాకాదిజలవిహంగసమన్వితంబును, అభిమతవిహారోపయుక్తంబు నగుమధుమతీనది ప్రవహించుచుండును. నిరంతరశివపూజాధురంధరులును, నిత్యాగ్నిహోత్రులు నగువారందు భయశోకశూన్యులై బహుకాలంబు సుఖంబులనుభవించి యనంతరము భూలోకంబున సత్కులమునం దవతరించి శక్త్యనుసారంబుగఁ బుణ్యకర్మంబులాచరించి మరల నచిరకాల

మునసే యాలోకంబు నధిగమించుచుందురు. ఇది విష్ణులోకవృత్తాంతంబు.

ఇఁక బ్రహ్మలోకంబునుగూర్చి ప్రశంసించెదను. మేరుపర్వత తృతీయశృంగంబున లోహితరత్నమయంబును, బద్మాకారంబును, ద్విసహస్రయోజనపరిమితంబును, మణిమయంబును, సువర్ణప్రాకారపరివృతంబును, విశోకనామకంబు నగుబ్రహ్మపురంబు గలదు. అది విచిత్రశిఖరత్రయాలంకృతమై, సూర్యచంద్రనిభసముజ్జ్వలంబై యుండును. అందు సహస్రస్తంభప్రతిష్ఠితంబును, ప్రాసాదశ్రేణీపరివృతంబును, బహుగవాక్షశోభితమును, చతుర్ద్వారసమన్వితంబు నగునొకభవనము గలదు. అందు దివ్యరత్నాలంకారభూషితుండును, సజలజలదశ్యాముండును, సూర్యానలసన్నిభతేజోమయుండును ద్వారాధిపనామకుండు నగుద్విజశ్రేష్ఠుండు ద్వారపాలకుఁడై యుండును. ఉత్తరద్వారమున సాంధ్యారుణకాంతివిలసితుండగు పరయముండను బ్రహ్మపుత్త్రుండు నిలిచియుండును. ఆశ్రేష్ఠపురమున నద్వితీయవేదజ్ఞుండును, సురశ్రేష్ఠుండును, బ్రజాపతియు, భగవానుండు నగుబ్రహ్మదేవుండు విహరించుచుండును. అందు సువర్ణవాలుకామయుం బగునమృతనది ప్రవహించుచుండును. ఆనదీజలపానంబున నగరవాసులెల్లరును జరాశోకశ్రమశూన్యులై యుందురు. ఆబ్రహ్మలోకంబును వేదాధ్యయతత్పరులగు సుకృతులును, జితేంద్రియులును, సత్యపరాయణులుఁ నగుమహాత్ములు వడయఁగల్గుదురు. మఱియు యజ్ఞకర్తలును, దాతలును, గురుజనప్రియకార్యనిరతులును, భిక్షామాత్రజీవులగు తీర్థవాసులును, క్రోధశూన్యులును, ధర్మాసక్తులునగుబ్రాహ్మణులును, యోగధ్యానపరాయణులును, నిరంతరబ్రహ్మనిష్ఠులు నగువారికి బ్రహ్మసాక్షాత్కారము సులభంబై యుండును. బ్రహ్మలోకార్థులై నిష్పాపకర్మానుష్ఠానంబు

గావించువారు శోకమోహశూన్యులై పరమస్థానంబగుబ్రహ్మలోకం బుఁ జేరి, బహుసహస్రకల్పంబు లందు సుఖభోగంబు లనుభవించి పిదపఁ గర్మశేషంబున భూలోకప్రాప్తులై విశుద్ధాచారసంపన్నులై యథావిధిగ యజ్ఞాదిక్రియల నిర్వర్తించుచుఁ బరమసుఖలాభంబు లందఁగలరు. జితక్రోధులును, జితేంద్రియులును, సాత్వికులు నగు మహాత్ములు జ్ఞానబలంబున సర్వపూజ్యంబగు బ్రహ్మలోకంబు నందఁ గలరు. ఈ బ్రహ్మలోకంబు సనాతనంబని కీర్తింపఁబడుచున్నది.

మునీంద్రా! పర్వతరాజం బగుమేరుశైలంబున మూఁడుశిఖర ములయందును బూర్వోక్తం బగుభువనత్రయంబు విరాజిల్లుచుండును. ఆభువనములయందు నివసించు దేవగణంబులు సర్వసిద్ధిసంపన్నులును గామరూపులునై యిచ్ఛానుసారంబుగ విహరించుచుందురు.

బ్రహ్మాత్మోపదిష్టం బగునీత్రిభువనసంకీర్తనము నతిభక్తిపూర్వక ముగ నాలించువారును, బఠించువారును శోకమోహశూన్యులై సర్వాభీష్టముల నందఁగలుగుదురు. దీనిని శ్రద్ధతోఁ బఠించినమహా పాతకుండైనను మహాదేవప్రసాదమునఁ బరమపదప్రాప్తుం డగును.

రుద్రలోకవివరణము.

వ్యాసదేవుండు పుణ్యకర్మమాహాత్మ్యంబునుగూర్చియు, రుద్ర దేవప్రియంబులగుపవిత్రస్థానంబులనుగూర్చియు, బ్రహ్మండగర్భంబున లోకోత్పత్తింగూర్చియు బోధింపు మని ప్రశ్నించుటయు సనత్కుమా రుం డిట్లనియెను. మానవపరిమాణానుసారంబుగా లక్షయోజనముల కూర్ధ్వమున బ్రహ్మలోకమును, దద్విగుణితదూరమున విష్ణులోకమును దానికిఁ గోటియోజనములమీఁద శివలోకంబును గలవు. పంచభూతా తిరిక్తం బగుషష్ఠపదార్థము బ్రహ్మలోకం బనియు, సప్తమము విష్ణు

లోకం బనియు, సప్తమము రుద్రలోకంబనియు, నీలోకత్రయంబే త్రి విష్టపంబనియుఁ బ్రసిద్ధము. అందు బ్రహ్మవిష్ణుమహేశ్వరప్రభృతులును, ప్రజ్ఞాబలవంతులగు దేవమానవగణంబులును నివసించియుందురు. ఆ త్రిభువనములలో నర్ధభాగంబగు రుద్రలోకంబు యోగిగణాశ్రయంబై యుండును. అందు శతసహస్రరుద్రులును, శతకోటివిష్ణుదేవులును గలరు. శివప్రసాదమున వారందఱును ఖడ్గయష్టిధరులును, బుష్ప సుగంధకలితులును, శూలపాణులును, ద్వేషశూన్యులును, గతకిల్బిషు లును, బాలచంద్రావతంసులును, వృషభవాహనారూఢులునై విరా జిల్లుచుందురు. బ్రహ్మవిష్ణులోకములవారు త్రిభువనవిఖ్యాతులును, మహాత్ములునై యుందురు. అందలిభూప్రదేశము రత్నమయంబును, సువర్ణవాటికామయంబునై యుండును. అందుఁ జంద్రసూర్యప్రకాశము గాని, వాయుసంచారముగాని లేదు. దేవతలుగూడ నందుఁ బ్రవేశింపఁ జాలరు. అందలివారందఱును సాక్షాత్సదాశివమూర్తులై యుందురు. అచ్చటిప్రాసాదంబులును, బురద్వారంబులును నానావిధచిత్రచిత్రితం బులై యుండును. ఆశివలోకమున బ్రాహ్మణాదిగృహస్థు లందఱును సన్మార్గసంచారులై మహాదేవునిబూజించుచు, నిత్యమును రుద్రాధ్య యమును బఠించుచు గంధపుష్పాదులచే నిరంతరమహాదేవారాధనంబు నఁ బాపవిముక్తులై సూర్యసమతేజోనిధులై ప్రకాశించుచుందురు. ఆ రుద్రలోకమున కధోభాగంబుననే సకలలోకంబులు నున్నవి. సదా శివునిద్వితీయలోకంబు సర్వభువనంబులకును ద్విగుణపరిమితంబై యుం డును. విష్ణులోకమునకు ద్విగుణపరిమితంబును ద్వితీయంబు నగుభవ లోకంబునందు మహాయోగింద్రుం డగునీశ్వరుండు భూతగణపరివృ తుండై క్రీడించుచుండును.

అందొకదివ్యభవనంబున మాయానాథుండగుశివుండు నివసించి

యుండును. మఱియు నాస్థానంబున సర్వసమృద్ధంబులగుదివ్యమందిరంబు లనేకములు గలవు. సర్వనామకం బగుపవిత్రస్థానము చతుర్థలోకంబు. పరమపవిత్రం బగునగ్నిస్థాన మాదేవునిపంచమలోకంబు. నిత్యాగ్నిహోత్రులగువారికాస్థానంబు లభించును. దానికవ్వలమహాదేవుని యుగ్రనామకంబగుషష్ఠస్థానంబు గలదు. అది యగ్నిలోకమునకు ద్విగుణపరిమితంబై యుండును. అచ్చటఁ బరమేశ్వరుండు శివభక్తులగు యోగీంద్రులతోఁ గలసి భస్మధారియై లోకానుగ్రహంబుకొఱకుఁ గ్రీడించుచుండును. శమదమసంపన్నులును, సర్వభూతదయాపరులును శివపూజాతత్పరులును, స్వధర్మానుష్ఠాననిరతులును, భిక్షామాత్రోపజీవులును, మహాయోగులు నగువారు పాశుపతం బగునాదివ్యస్థానమును జేరఁగలుగుదురు. అందుఁ జేరినవారికిఁ బునర్జన్మంబు లేదు. దాని కూర్ధ్వంబున నాస్థానంబునకు ద్విగుణపరిమితంబగు మాహేశ్వరం బను సప్తమస్థానంబు గలదు. అందాద్యాప్రకృతిసహితుండగుమహాదేవుండు శైవగణపరివృతుండై యుండును. మఱియు సర్వభూతేశ్వరుం డగు నమ్మహాదేవుండు కామరూపధారియై నిఖిలభూతంబులయందును బ్రవేశించి యానందవర్ధనంబు గావించుచుండును. ఇట్టిశివలోకంబులసంఖ్యకును, బరిమాణంబులకును నిర్ణయంబు లేదు. ఆదిదేవుం డగునాతఁ డిచ్ఛామాత్రంబున సహస్రబ్రహ్మలోకంబులను, గోటిదేవలోకంబులను సృష్టించుచుండును. ఇన్నింటికిని బైభాగమున నమ్మహేశ్వరునిస్థిరస్థానంబు గలదు.

—♦ శివ మా హా త్మ్య ము. ♦—

ఆదివ్యస్థానంబును బరమేశ్వరానుగ్రహంబు లేక బ్రహ్మాదిదేవతలును, యోగులును, నాత్మీయులగు నన్దిపూర్ణాగణేశ్వరాదులును

గూడఁ జేరఁజాలరు. అందు శతకోటియోజనవిస్తీర్ణం బగునుపవీరం బున నివసించి యవ్యయుం డగుశివుండు సమాధిసుఖంబు ననుభవించు చుండును. ఆదేవునినయనద్వయంబు సితాసితప్రభంబై యుండును. అందొకనయనంబునుండి యశస్విని యగునుమాదేవి యుదయించుటచే నాతనికి వామలోచనుం డనునామంబు గలిగెను. ఆదేవి యాతని వామపార్శ్వంబున నాసీనయై యుండును. మఱియు నద్దేవునిదక్షిణ నయనమునుండి శుక్లవర్ణం బగుజలబిందువు వెలువడి భూతాదిసకల లోకంబులను నిర్గమించి భూలోకంబునఁ బ్రవేశించి యందు గంగానా మంబునఁ బ్రఖ్యాతం బయ్యెను. యోగనిమగ్నుండైన యాదేవుని ప్రథమకార్యంబు గంగోత్పాదనము. యత్నశీలుం డగుబ్రహ్మ నుపే క్షించియుఁ గామదేవు నశరీరుం గావించుట రెండవకార్యము. బ్రహ్మ ముఖచ్ఛేదనంబు గావించి కపాలంబును ధరించుట మూడవకార్యము. విష్ణుదేవునకుఁ జక్రప్రదానంబు సేయుట నాల్గవకార్యంబు. దక్షయజ్ఞా వసరంబున వీరభద్రావిర్భావనంబు పంచమకార్యంబు. బాలార్కకాం తిభాసితు లగురుద్రగణంబులచేఁ బరివృతుండై హిమాలయంబు నధి గమించి యందంధకాసురసంహారంబు గావించుట షష్ఠకార్యంబు. ఆదేవుని ద్వితీయపరివార మప్పటిరుద్రగణంబులకు ద్విగుణితంబై యుండును. తృతీయపరివారము సువర్ణవర్ణు లగుమూఁడుకోట్లరుద్ర గణంబులతోఁ గూడియుండును. చతుర్థపరివారము నీలవర్ణులగు నెను బదికోట్లరుద్రగణంబులతోడను, పంచమపరివారము దానికి ద్విగుణం బుగను, గైరిక, విమల, నీలవర్ణంబులగు రుద్రగణంబులచేఁ గ్రమం బుగ షష్ఠసప్తమాష్టమపరివారంబులును విరాజిల్లుచుండును. ఈసమస్తపరి వారగణంబులలోఁ గొందఱు బ్రహ్మానుచరులుగను, గొందఱు విష్ణుపు రోగాములుగను జరించుచుఁ ద్రైలోక్యంబునను సృష్ట్యాదికార్యంబులఁ

గావించుటకు సమర్థులై యుందురు. ఇట్లానందమయంబును, విశుద్ధం బును, బరమంబు నగుశివస్థానముంగూర్చి సంకీర్తనంబు సేయువారు సురాపాయులును, పితృహంతకులును, గోఘాతుకులును, గురుదారాసక్తులును నై యున్నను పాపవిముక్తులై పవిత్రశివస్థానంబు నధిగమించి నిత్యసుఖులై యుందురు. విశుద్ధులును, శివపరాయణులును, బ్రహ్మనిష్ఠులు నగువారి కట్టిపదంబు సులభసాధ్యంబై యుండును.

—: శి వ స్తో త్ర క థ న ము. :—

సనత్కుమారుం డిట్లనియెను. వ్యాసమునీంద్రా! సకలపాప భయనివారకం బగునొకవిషయముం జెప్పెద నాకర్ణింపుము. పూర్వ కాలంబున బ్రహ్మేంద్రాదిదేవతలు మహాదేవమాహాత్మ్యంబు నాకర్ణించుకుతూహలంబున మేరుశైలంబుఁ జేరి పరమేశ్వరు నాశ్రయించి యుండిరి. అప్పుడు సత్యాశ్రయుండును, శాంతుండును, వినీతుండును, జితేంద్రియుండు నగువిభీషణుం డట కేతెంచి సర్వభూతేశ్వరుం డగు నీశ్వరునకు సవినయంబుగ సాష్టాంగప్రణామంబు చేసి “దేవదేవా! వృషభధ్వజా! ఈదేవతాగణంబులకును బ్రార్థనీయం బగునాసందేహమును దీర్పవలయును.” అని యభ్యర్థించుటయు శంకరుం డిట్లనియెను. మహారాజా! విభీషణా! నీవడిగిన యీవిషయం బతి గోపనీయంబు. ఛాగలాంగము, భద్రకర్ణము, గోకర్ణము, వారాణశి, ఉజ్జయిని యనునీపంచస్థానంబులును, మహాదేవుని శ్రేష్ఠనివాసస్థానంబులు. ఈసకలస్థానంబులను దర్శించినంతమాత్రమున జీవులకు మోక్షపదలాభంబు గలుగును. అందు విశేషించి కాశీక్షేత్రంబున నేను నిత్యసన్నిహితుండనై యుందును. ఇది పరమ రహస్యంబు. ఎవ్వఁ డోంకారస్వరూపి యగుమహాదేవుని ధ్యానించుచుండునో యాతనియె

డల నేను నిత్యంబును సంతుష్టుండనై యుందును. అట్టివాని కశ్వమేధఫలంబు లభింపఁగలదు. పూర్వోక్తంబు లగుపంచస్థానంబులయందు నేస్థానంబున నేను జాగరూకుండనై జీవులకు ముక్తిదానంబుసేయుచుందునో యట్టికాశీక్షేత్రంబున సుకృతిరహితులకు దుర్లభంబును, నగ్నిప్రాకారపరివృతంబును, దేవతామందిరపరివేష్టితంబు నగుమధ్యభవనంబు గలదు. మఱియు రమణీయం బగుహరిశ్చంద్రపదంబున రుద్రరూపంబునను, యోగీశ్వరప్రదేశం బగుపద్మపురియం దాదికేశవరూపంబునను, తిరువనంబున దండధరుండనై మహాకాలరూపంబునను, నేను విరాజిల్లుచుందును. భైరవంబును, గమలంబును నాదిగాఁగలస్థానంబులయందాయామూర్తులం దాల్చియుందును. మఱియుఁ గాలంజలపర్వతంబునఁ గర్కోటేశ్వరుండనై యుందును. భూతేశ్వరంబునఁ వామకూటుండనై, పరమగుహ్యం బగుకేదారంబునఁ గేదారనాథుండనై తోఁచుచుందును. ఆకేదారంబున దేవదారువనంబున నేనెల్లప్పుడును విహరించుచుందును.

ఇవియే పరమగుహ్యంబు లగునాపవిత్రస్థానంబులు. నిరంతరమును నన్ను ధ్యానించుచుండునాభక్తు లీదివ్యస్థానంబుల నివసించి సర్వశ్రేష్ఠులై యుందురు. ఆపుణ్యక్షేత్రయాత్రలఁ గావించువారు చిరకాలము రుద్రలోకనివాసులగుదురు. పాపాత్ములైనను, ఘోరకర్ములైనను, స్త్రీలైనను, నపుంసకులైనను, మ్లేచ్ఛులైనను మఱియెవ్వరైన నెల్లయుఁ బవిత్రంబు లగునాదివ్యక్షేత్రములను దర్శింపఁగలిగినచో నిఁక వారెట్టియపవిత్రస్థలంబుల మృతులైనను, శివసాయుజ్యంబు నందఁగలుగుదురు. అట్టిపుణ్యాత్ములకు నేననుగ్రహపూర్వకముగ గణాధిపత్యంబును బ్రసాదింతును. భక్తులగువారు సకలపాపవిముక్తులై నాసన్నిధానంబునఁ బరమగతిలాభంబు నందుదురు. అట్టివారికి యజ్ఞ

దానాదిసత్కార్యంబులతో నిమిత్తంబు లేదు. నాదు భక్తిబలంబున నన్నుం జేరి యజ్ఞదానాదిఫలంబు లనుభవించుచుందురు. అతికఠోరం బగుతపంబు నాచరించుటవలనఁ గలుగుఫలంబు నన్నుఁ బూజించుట చేతనే లభింపఁగలదు. మదీయం బగుశివలింగంబు సర్శించువారికి మాఘమాసంబునఁ బ్రయాగతీర్థస్నానఫలంబును, శతాహోరాత్రస్నానఫలంబును, శతచాంద్రాయణానుష్ఠానఫలంబును లభించును. గోమూత్రమిశ్రితంబగుయవాహారంబును, భిక్షాలబ్ధంబగుశాకాన్నభక్షణంబును గావించి సహస్రసువర్ణదానంబులు సేయువారి కెట్టిఫలంబు గలుగునో నన్నుఁ బూజించువారి కట్టిఫలంబు లభింపఁగలదు. నాలింగార్చనంబు గావించుబ్రాహ్మణుల కష్టశతప్రస్థపరిమితంబగుతిలదానంబు చేసినఫలంబు లభించును. మహాపాతకములు గావించినవారుగూడ మల్లింగార్చనంబునఁ బరమగతిం గాంచఁగలరు. తపశ్చరణంబును, మానసపూజయు, దానంబును, యోగాభ్యాసంబును, కఠోరవ్రతాచరణంబును, శివలింగార్చనంబుతో సమములు గాఁజాలవు. విభీషణా! నేను ప్రతియుగమునను సృష్టిస్థితిలయంబులఁ గావించుచుందును. సర్వభూతకారణం బగుపరమాత్మను నేనే. బ్రహ్మయు, విష్ణుండును, జంద్రుండును నేనే. పరిదృశ్యమానంబగునీసమస్తంబును నాస్వరూపం బని యెఱుంగుము. పరమప్రమాణంబులగు శాస్త్రంబులకు నేనే కర్తను. మఱియు నింద్రాదదేవగణంబులును, వసంతాదిఋతువులును, గంగాదినదులును, వాసుక్యాదినాగగణంబులును, కైలాసాదిపర్వతంబులును, బ్రహ్లాదాదివైష్ణవగణంబులును, లవణాదిసముద్రంబులును, స్థావరజంగమస్వరూపంబు లగుసమస్తమును మత్స్వరూపంబనియు, నాకంటె నన్యం బగుపదార్థంబేదియు లేదనియు గ్రహింపుము. వత్సరముగాని, మాసముగాని, పక్షముగాని, యేకాహోరాత్రముగాని శివపూజాపరా

యఁణుండగువాఁడు నాయందు సత్యబుద్ధి యగుటంజేసి సర్వాభీష్టంబు లను బడయఁగలఁడు. పవిత్రహృదయముతో విశుద్ధబ్రాహ్మణునకు దీపదానంబు చేయువానికి శివలోకగమనమును, సువర్ణదానము సేయు వానికి గణాధిపత్యలాభమును గలుగును. అర్ఘ్యపాత్రప్రదాతలకును, ధూపదాతలకును నాయనుగ్రహమున బవిత్రగతిప్రాప్తి యగును. శివ లింగార్చనమున బహుయజ్ఞానుష్ఠానఫలంబును, సర్వాభీష్టసిద్ధియు నగు ను. పుణ్యాత్ము లగునట్టివారిదోషములు నశించి యుత్తమగతిప్రాప్తి యగును. శివపూజాపరాయణులగువారికిఁ ద్రికరణంబులఁ గావించిన పాపంబులు నశింపఁగలవు. ఏకవత్సరము శివలింగార్చనము గావించిన వానియెడల నేను సంతుష్టుండనై వానికి గణాధిపత్యంబును బ్రసాదిం తును. ఎవ్వనిచిత్తము తీర్థస్నానంబులకును, శివధ్యానంబునకును, బరా ఙ్ముఖంబు గాకుండునో యాతనియింటఁ బ్రభాసపుష్కరప్రయాగాది తీర్థంబులు సుస్థిరంబులై యుండును.

శివసేవావిహీనుం డగునరాధముండు కోటితీర్థంబుఁ బరిభ్రమిం చినను వృథాశ్రమంబు కాఁగలదు. అట్టివారికిఁ బుణ్యలాభంబు గలు గనేరదు. పాపచిత్తులగువారు నన్ను దర్శింపఁజాలరు. మదర్చనామా త్రంబున మాసోపవాసఫలంబు లభించును. అరణ్యముననుగాని, గిరిగు హాంతరముననుగాని, గృహంబుననుగాని యేకాగ్రచిత్తంబున నన్నర్చించు వాఁడు మరణానంతరంబున రుద్రగణలోకంబున గణాధిపత్యలాభంబు నందును. శివమాహాత్మ్యప్రకాశకం బగునీయధ్యాయమును బఠించు వాఁడును, గీర్తించువాఁడును సర్వపాపవిముక్తుండై శివలోకంబున సద్గతి లాభంబు నందఁగలఁడు. ఈమాహాత్మ్యంబును నిత్యధారణంబు గావిం చుశివపూజాపరాయణుఁడు దారుణనరకంబును దప్పించి సూర్యచంద్రాదు లచే స్వప్రకాశితంబగుదివ్యస్థానమున నపరిమితతేజస్సంపన్నుఁడై ప్రకా

శించుచుండును. దేవార్చనాదిపుణ్యకార్యప్రారంభములయందు మంత్రరూపంబును, సర్వభూతనమస్కృతంబును నగునీమాహాత్మ్యమును విశుద్ధభావముతోఁ బఠించువారును, గవచరూపంబున ధరించువారును నాయనుగ్రహంబున సకలపాపవిముక్తు లగుదురు.

అని యిట్లు సర్వేశ్వరుం డానతిచ్చుటయు విభీషణుండు భక్తిపూర్వకంబుగ నిట్లని వినుతింప నారంభించెను. సర్వభూతేశ్వరా! విశ్వతోముఖుఁడవు, అక్షయుఁడవు, అప్రమేయుఁడవు, పురాణుఁడవు, పురుషోత్తముఁడవు నగునీకు నమస్కారము. అగ్నియు, అనలుండును, అఘోరుండును, భక్తనదీసాగరుండును, దేవగణప్రభుండు నగునీకు నమస్కారము. సర్వలోకపూజనీయుండ వగునోదేవదేవా! అక్షమాలాలంకృతా! మహాప్రభూ! నీభక్తుండ నగునాకష్టైశ్వర్యములను బ్రసాదింపుము. సర్వభూతంబులకును నీ వేకమాత్రశరణ్యుండవు. సకలర్షిగణంబులును నిన్నారాధించుచుందురు. మహాత్మా! ఉత్తమవరప్రదానంబున నన్ననుగ్రహింపుము. మోక్షంబును, ఇంద్రుండును, అగ్నియుఁ, బుణ్యంబులగుధర్మకార్యంబులయందుఁ బండితులసంకల్పంబును నీస్వరూపంబులు. తుష్టియు, శరీరంబును, మేధయు, బుద్ధియు, కామ్యంబులును, మనంబును నీవ. అతివిశుద్ధంబును, శివంబు నగునీరూపమును దేవతలును, ఋషులును సందర్శించుచుందురు. నీవు శాంతిస్వరూపుఁడవు. పరమాత్మవిదుండవు. నిఖిలజీవానందవర్ధనుండవు. పరమేశ్వరా! రుద్రా! త్రిలోకవర్తనుండ వగుశివా! నీకు నమస్కారము. విశ్వమూర్తీ! నీచరణంబులును, నయనంబులును, మస్తకంబులును, వదనంబులును నెల్లయెడల నిండి యున్నవి. నీ వప్రమేయుండవు. యోగీశ్వరుండవగునీ విచ్ఛామాత్రంబున దేహధారణంబు గావించుచుందువు. నీభూతభవిష్యద్రూపంబుల నేమెంతమాత్రము నెఱుం

గంజాలము. ప్రభూ! నీస్వరూపం బెట్టిదై ననేమి. అట్టినీమూర్తికి నమస్కారము. అని యనేకవిధంబుల స్తుతించుచున్నవిభీషణుం గాంచి మహాదేవుండు ప్రసన్నహృదయంబున నిట్లనియెను.

విభీషణా! అతిపవిత్రంబును, దేవగణపూజితంబును, మదుక్తంబు నగునీసంవాదమును బఠించువాని కశ్వమేధఫలంబు లభించును. బ్రహ్మచింతాపరులై లింగార్చనంబు గావించువారికిని, అష్టమీచతుర్దశీతిథులయందు శివమాహాత్మ్యశ్రవణంబు సేయువారికిని, శ్రద్ధావంతులకును, శివభక్తులకునుమాత్రమే మదుక్తం బగునీరహస్యంబు నుపదేశింపవలయును. కాని యన్యుల కుపదేశింపరాదు. ఈశివస్తవంబు నాకర్ణించువారికి స్వర్గలాభంబు గలుగును. ఇందెంతమాత్రమును సందియంబు లేదు.

శివలింగార్చనవిధి.

యజ్ఞయాగాదులును, మహాదానంబులును, బుణ్యతీర్థయాత్రలును, మొదలగుసత్కార్యంబు లాచరింపకుండఁ దత్తత్ఫలంబులు లభియించునుపాయం బానతీయవలయు ననివ్యాసదేవుం డడుగుటయు సనత్కుమారుం డిట్లనియెను. మునీంద్రా! కౌశికియు, ధర్మార్థమోక్షదాయిని యగుభగవతిగంగానదియు, కురుక్షేత్రంబును, ప్రయాగయు, నైమిశారణ్యంబును, పుష్కరప్రభృతితీర్థంబులును, త్రివేణియు, పయోష్ణియు, గండకియు, బ్రహ్మావర్తయు, అతిపవిత్రం బగుయమునయు, గంగాద్వారంబును, సహస్రాశ్వంబును, భద్రకర్ణహ్రదంబును, దృషద్వతియు, కరతోయయు, మహానది యగులోహితయు, సరయువును, సరిత్పతి యగుసాగరంబును, కోకయు, అరుణయు, తామ్రయు, శోణహ్రదంబును, గోదావరియు, నర్మదయు, వేత్రవతియు, కృష్ణయు,

కావేరియు, వితస్తయు ననునివి సారస్వతతీర్థంబు లని సాధుజనులు ప్రశంసించుచుందురు. ఇట్టితీర్థములనిరంతరాశ్రయ మేకమాత్రశివలింగ పరిణామఫలమున షోడశాంశమైనను గాఁజాలదు. ఏకమాసమాత్రం బగుశివలింగార్చనంబువలన బహువర్షములు వివిధతీర్థయాత్రాలం గావించినఫలము లభించును. సచరాచరం బగునీత్రైలోక్యంబును శివలింగోత్పన్నంబే కావున శివలింగంబు సర్వతీర్థమయంబు. ధ్యానయోగంబుచే శివలింగార్చనంబు గావించినచో ముహూర్తమధ్యంబున నసంఖ్య తీర్థఫలప్రాప్తియు, ముక్తిలాభంబును గలుగును. ఈవిశ్వమంతయును శివలింగమునుండి యుత్పన్నం బైన విధంబును, శివలింగస్వరూపంబును, శివలోకప్రాప్తు లగువారికిఁ బునరావృత్తియు, అపునరావృత్తియు నగు విధంబును దొల్లి నేను బ్రహ్మదేవునివలన వినియుంటిని. దానిని నీకు వినిపించెద నాకర్ణింపుము.

సృష్ట్యాదియందు మహేశ్వరుండు ప్రకృతిసంగతుండై నప్పుడు మహావాయువు ప్రాదుర్భూతంబయ్యెను. ఆవాయువునుండి యగ్ని యుదయించెను. ఆయగ్నినుండి కోటిసూర్యసమప్రభం బగులింగం బుత్పన్నం బయ్యెను. ఆలింగంబు శతయోజనవిస్తీర్ణంబును, లక్షయోజనోన్నతంబును, బహుసువర్ణమణిభూషితంబును, బ్రహ్మాంతప్రభాకరతేజస్సంపన్నంబు నై యుండెను. అప్పు డాలింగమును గాంచి బ్రహ్మాదిదేవగణములు విష్ణుసహితముగా సంజ్ఞాహీనులై సుదుఃఖితులగుచుండిరి. మఱియు విరూపాక్షుం డగునీశ్వరుండును, సత్వరజస్తమోగుణములును, క్షేత్రజ్ఞుం డగుపురుషుండును, ప్రకృతియు, సాంఖ్యయోగమును, పర్వతములును, నదీనదములును, సాగరములును, హ్రదములును, పృథివియు, అంతరిక్షమును, గ్రహములును, నక్షత్రములును, దిక్కులును, విదిక్కులును, మాసములును, వత్సరములును,

సమస్తము నాలింగమున విలీనములై పోవుచుండెను. భగవానుండగు నీశ్వరుండు లింగమునుండియే పుత్త్రరూపమున బ్రహ్మదేవుని సృజించి యాతనికిఁ బ్రజాపాలనకార్యమును నియోగించెను. అనంతరము లీలాగర్భమునుండి దేవలోకపూజనీయుం డగువిష్ణుదేవుని సృజించెను. అందఱును బూర్వస్మృతిలోపమున లింగమునం దంతర్హితులై పోయిరి. పూర్వము నిఖిలబ్రహ్మాండమును జలమయం బైనప్పు డాజలమధ్యమున మహాతేజోమయమును, గోళాకారమును నగుమహాదేవునిబృహల్లింగము జ్వాలాభీలమై సకలజీవభయంకరమై ప్రకాశించుచుండెను. ఆ లింగం బగ్నిరూపం బగుటచేఁ దనతేజమున స్వర్గమర్త్యాదిలోకముల నాక్రమించి తేజోమండలమధ్యమున వెలుఁగొందుచుండెను. ఆతేజముచేఁ ద్రిభువనములును దగ్ధములై పోవుచుండెను. దేవదానవగంధర్వయక్షరాక్షసాదులును, బంచభూతములును, స్థావరజంగమస్వరూపములగుసకలపదార్థములును, శివమాయామోహితములై యాశివలింగముచే నాకర్షింపఁబడిపోవుచుండెను. అదృష్టాకర్షణవేగమునఁ బ్రవృద్ధం బగుమహాప్రభంజనము విజృంభించి భీకరశబ్దములచే గగనవిదారణముగావించుచుండెను. అట్లాశివలింగతేజముచే ననేకజీవకోటులు దగ్ధంబులై యింకను దహింపఁబడుట కగ్రసరములగుచున్నసమయమునఁ జైతన్యవిహీనులై దుఃఖితహృదయులై యున్నబ్రహ్మాదిదేవగణములు విష్ణుసహితులై యమ్మహాలింగమును సమీపించి శివమాయామోహితులై, భీతిభావమునఁ బరస్పరముఖావలోకనము గావించుకొనుచు బలవిహీనులై యమితతేజోమయుం డగుమహాదేవుని ధ్యానించుచు నిద్రాభిభూతులై పోయిరి. అనంతరము వారు పూర్వస్మృతివశమున జ్ఞానలాభము నంది యఖిలశరణ్యుం డగుమహాదేవు నాశ్రయించి సర్వభూతేశ్వరుం డగువానిని నిట్లు సన్నుతింప నారంభించిరి.

ప్రభూ! నీవు కుమారుండవు. కుమారరూపముననే జన్మించితివి. నీవు సర్వతోముఖుండవు. దేవదేవా! సర్వభూతోత్పాదకా! ప్రణవమును, వషట్కారమును, దండనయు నీస్వరూపములు. బ్రహ్మాదిదేవగణములును, బృహస్పతిప్రముఖులగుఋషిగణములును, యజ్ఞనిచయములును, నింద్రుండును, భగవానుం డగువిష్ణుండును నీయందే జనియించి నీలోననే విలీను లగుచున్నారు. పరాశక్తి యగుమాయాదేవిసాహాయ్యమున మే మీశ్వరుండ వగునిన్ను దర్శింపఁగలుగుచున్నాము. అని యిట్లు ప్రస్తుతించుటయు మహాదేవుండు ప్రసన్నుండై వారికిఁ బరమవిజ్ఞానమును, బరమైశ్వర్యలాభమును, జరామరణరాహిత్యమును, బరమరూపమును, గామగమనమును, స్వర్గధామమునఁ బూజ్యత్వమును బ్రసాదించి యంతర్హితుం డయ్యెను. సర్వజీవసంహారకాలమున జగంబంతయు నేకార్ణవంబై యున్నప్పుడు శివుం డొక్కఁడుమాత్రమే యుండి మరల విశ్వసృజనంబు గావించుచుండును. ఇట్లే సృష్ట్యవసానకాలమునఁ బ్రళయమును, బ్రళయావసానకాలమున సృష్టియు నగుచుండును. భగవంతుం డగుబ్రహ్మదేవుండు ప్రజాపతియైయుండును. త్రిరాత్రములు భక్తిపూర్వకముగఁ గావించినశివలింగార్చనమువలన శతాశ్వమేధఫలంబును, ఏకమాసలింగార్చనంబువలన సహస్రాశ్వమేధఫలమును మాసత్రయలింగారాధనమున సహస్రరాజసూయఫలమును, లభియించును. సర్వతీర్థస్నానమును, సర్వస్వదానమును, నానావిధయజ్ఞానుష్ఠానంబును నియమోపవాసపూర్వకం బగువివిధవ్రతాచరణమునుగూడమాసత్రయశివపూజనమునకు సమములు గాఁజాలవు. జితేంద్రియుండును, శమదమసంపన్నుండునై తొమ్మిదిమాసములు శివార్చనము గావించునానికి సర్వాభీష్టములును సిద్ధించును. మఱియు హిమవంతము, మందరము, మేరువు, కైలాసము, గంధమాదనము, వింధ్యము, [illegible], ఘుర

శ్చంద్రము, మహేంద్రము, మలయము మొదలగుపర్వతములును, వాలఖిల్యాదిమహర్షులును, నైమిశారణ్యవాసు లగుతపోధనులును, అప్సరోగణములును, మాతృగణములును, తారాగ్రహగణములును, పితృగణములును, చారణోదుంబరసిద్ధవిద్యాధరగణములును శివలింగార్చకుల కభీష్టసాధనము గావించుచుందురు. శివలింగమునఁ బరమవిశ్వాసియై యుండుమానవునియెడల వృషభధ్వజుండగుమహాదేవుండు ప్రసన్నుండై యుండును. ఏకదినమాత్రశివపూజారతుండగువాఁడు పాకయజ్ఞములను, హవిర్భాగములను గావించినఫలము నందఁగలఁడు. అట్టివాని కేకాదశరుద్రస్థానముల శివారాధనము చేసినఫలము లభించును.

బ్రహ్మపుత్త్రుం డగుసనత్కుమారుండును, పులస్త్యుండును, పులహుండును, క్రతుండును, గణనాయకుండును, నందీశ్వరుండును, మహాకాలుండును, భృగుండును, అంగిరుండును, మరీచియు, దధీచియు, యముండును, శుక్రుండును, బృహస్పతియు, చ్యవనుండును, జమదగ్నియు, ఉతంకుండును, అగస్తియు, ప్రజాపతిశ్రేష్ఠుండగుదక్షుండును, ఆతనిపుత్త్రసప్తకంబును, భగవానుం డగుమనువును, ప్రహ్లాదుండును, నముచియు, అత్రియు, వసిష్ఠుండును, భగవానుం డగుకశ్యపుండును, మహాతపుండగుగౌతముండును, భరద్వాజుండును, సుపండితుం డగు విశ్వామిత్రుండును, ద్వాదశాదిత్యులును, అష్టమనువులును, రుద్రులును, మరుత్తులును, అశ్వినీకుమారులును, సాధ్యవిద్యాధరపన్నగగణములును, ఋషులును, విశ్వేదేవతలును, ధర్మార్థకామదేవతలును, ఏలాపత్రంబును, క్షీరోదంబును, పుష్కరంబును, భగవతిగంగయు, శ్మశానదేవతలును మొదలగువారందఱును శివలింగార్చనంబువలననే యెల్లయెడల విఖ్యాతచరిత్రులైరి. ఇది సృష్టిప్రళయసంకీర్తనంబు.

వ్యాసమునీంద్రా! క్రీడాపరికరములచే బాలకుఁడు క్రీడించువిధ

మునఁ బరమేశ్వరుండు భూతసంఘములతోఁ గ్రీడించుచుండును. ఆతని కార్యమువలన మనము వ్యాకులచిత్తులమై శివయజ్ఞానుష్ఠానము గావింపవలయునని తెలిసికొనుచుందుము. బ్రహ్మ, విష్ణుదేవుఁడు, ఇంద్రుఁడు, సూర్యచంద్రులు, వాయువు, యముఁడు, కాలుఁడు, మృత్యువు, వరుణుఁడు, కుబేరుఁడు, అగ్ని, వేదములు, ఇతిహాసములు, గాయత్రిమొదలగువారందఱును శివారాధనమువలననే శ్రేష్ఠపదలాభము నందఁగలిగిరి. భక్తిపూర్వముగఁ దపోనుష్ఠానము సేయుచు శివలింగసామీప్యమున శివగృహమున వల్మీకమృత్తికతో విలేపనము గావింపవలయును. సమ్మార్జనముచే శతగుణఫలమును, విలేపనముచే సహస్రగుణఫలమును లభించును. పుష్పోపహారధూపములు విలేపనసదృశఫలములు. శివలింగమునకు జలాభిషేకముచే దశాపరాధములును, క్షీరాభిషేకముచే శతాపరాధములును, ఘృతాభిషేకముచే సహస్రాపరాధములును బరిమార్జితము లగును. పరార్థియగువాఁడు శివలింగమునకు ఘృతక్షీరాభిషేకములఁగావించి ఘృతయుత మగుగుగ్గులుధూపము నర్పింపవలయును. దశసువర్ణపుష్పములు శివున కర్పించువానికిఁ గోరినకోరికలు సిద్ధించును. విధిబోధిత మగుబాహ్యపూజాదికముకంటె జపయజ్ఞము దశగుణాధికఫలదముగావున లక్షరుద్రాక్షమాలికచే రుద్రనామము జపించువారికి దశగుణాధిక మగుశివపూజాఫలము సిద్ధించును. జపయజ్ఞముకంటె మానసపూజ శతగుణములును, దానికంటె మానసికధ్యానము సహస్రగుణములును, ఫలాధిక మగును.

మహాదేవపూజార్థము తదుపయుక్తము లగుతృణగుల్మలతాదులను ఛేదించుటగాని, ఫలపుష్పపత్త్రాదులను గోయుటగాని హింస గానేరదు. అది యుత్తమధర్మమే కావున నట్టివారికి స్వర్గగమనమున కెట్టియాతంకము నుండదు. శ్రద్ధాపరులై నిశ్చలచిత్తమున శివలింగా

ర్చనము గావించువారికి సకలఫలసిద్ధి యగును. నిరంతరశివలింగార్చనాపరులగువా రిహలోకమున నెట్టికష్టమును ననుభవింపక, పరకాలమున స్వకర్మార్జితము లగుశ్రేష్ఠస్థానములఁ బూజింపఁబడుచుందురు. కల్పాంతరములయందు శివలింగములు స్థాపింపఁబడినదివ్యక్షేత్రములయం దేకాగ్రచిత్తమున యథావిధిగ లింగసంస్థాపనము గావించి భక్తిపూర్వకముగఁ బవిత్రభావముతో నేకవత్సరము నిత్యారాధనము సేయువారు సహస్రకోటికల్పములు రుద్రలోకమున శివసహితముగ నేకత్రనివాసము గాంచఁగలరు. ప్రతిదినమును బూజార్థమై గంధమాల్యములు సమకూర్చనివాఁడు శివపూజాపరాయణుం డయ్యును నధార్మికుండును బాపకర్ముఁడు నగును. కావున నానందహృదయుండై భక్తుం డగువాఁడు గంధమాల్యములతో శివారాధనము గావింపవలయును. భక్తశ్రేష్ఠుం డగువాఁడు తనయభీష్టసిద్ధికొఱకు సర్వభూతాంతర్యామియు, సర్వభూతజనకుండును, సర్వభూతేశ్వరుండును, సర్వమయుండును, భక్తప్రియుండును, భగవానుండు నగువిరూపాక్షుని శివలింగరూపమున నిత్యము నర్చించుచుండవలయును. శివలింగస్థితమగు పర్యుషితమాల్యము నెత్తి పరిశుభ్రము సేయువానికి సహస్రగోదానఫలము గలుగును. శుచియును నియమవంతుండునై శతరుద్రవిధానమున శివలింగాభిషేకము సేసినవానికిఁగూడ నట్టిఫలము సిద్ధించును. స్త్రీశూద్రమ్లేచ్ఛాదులకు నమస్కారసహస్రముచేతనే యట్టిఫలము లభించును. అట్టివారికిఁ బ్రణవమంత్రవివర్జితం బగునమశ్శబ్దమే విహితమైనది. నిజమంగళాకాంక్షియగువాఁడు విశుద్ధజలములచే నిత్యమును మహాదేవాభిషేకము సేయుచుఁ జందనాదులచే నంగరాగమును, సువాసితపుష్పమాల్యములచే నలంకారమును జేయుచుండవలయును. పుష్పవస్త్రోపహారనైవేద్యములచే సర్వదా సర్వేశ్వరుని బూజించువాఁడు

మహాదేవానుగ్రహంబున మనోరథసిద్ధుం డగును. శివధర్మనిరతుండగు వాఁడు నియమపూర్వకంబుగాఁ బరమేశ్వరుని సువర్ణకలశంబులతోఁ గాని, రజతకలశంబులతోఁగాని, ఉదుంబరకలశంబులతోఁగాని, మృణ్మయకలశంబులతోఁగాని జలాభిషేకంబు సేయుచు, అమూల్యమణిమిశ్రితంబుగా స్వర్ణప్రదానంబు చేసి, నవరత్నహారంబుల భక్తిపూర్వకంబుగా సమర్పించి, మనోజ్ఞంబు లగుసంగీతంబులచేతను, వివిధమధురమంగళవాద్యంబులచేతను సద్దేవుని సంతుష్టుం గావించి యర్చింపవలయును.

ఎవ్వఁడు విశుద్ధనియమంబున స్తవంబులచేతను, వాద్యంబులచేతను, నమస్కారంబులచేతను, సర్వస్వప్రదానంబులచేతను, మనఃపూర్వకంబు లగుప్రియవస్తుప్రదానంబులచేతను,మఱియు ననేకవ్రతానుష్ఠానంబులచేతను సర్వదా భగవదారాధనంబు గావించునో యట్టివాఁడు సర్వపాపవిముక్తుఁడును, బరమపవిత్రుండునై స్వర్గాదిలోకంబులయందభీష్టభోగంబుల ననుభవించి యనంతరము సర్వదుఃఖవివర్జితం బగురుద్రలోకంబు నధిగమించి సర్వశ్రేష్ఠులై విరాజిల్లుచుందురు. మఱియుఁ బూర్వోక్తవ్రతాదినియమానుష్ఠానంబు సేయుచుఁ ద్రిసంధ్యలయందును విశుద్ధభావంబున మహాదేవు నర్చించువారు సర్వదుఃఖవివర్జితులును, సర్వపాపవినిర్ముక్తులు నగుదురు. పూర్వకాలంబున మహాదేవుండు తనపూజావిధానం బంతయును యోగసాధనసంపన్నుం డగునొకబ్రాహ్మణున కుపదేశించెను. ఆతఁడు పూర్వోక్తవిధానంబున మహాదేవు నారాధించి ముక్తుండయ్యెను. మునీంద్రా! ఇఁక శివమూర్తివిశేషంబుల నభివర్ణించెద నాలకింపుము. సర్వజీవోత్పత్తికి హేతుభూతం బగునమ్మహాదేవుని యైంద్రీనామకం బగుప్రథమమూర్తి పూర్వదిక్కునం దింద్రునాశ్రయించి యుండును. దక్షిణానామకం బగునాతనిద్వితీయమూర్తి

సంహారకార్యప్రవృత్తుం డగుయము నాశ్రయించి దక్షిణంబునను, తృతీయం బగువారుణీమూర్తి సకలజీవసంతుష్టిదాయకంబై వరుణు నాశ్రయించి పశ్చిమంబునను, వరదానామకం బగుచతుర్థమూర్తి సర్వసుఖసంపాదకమై కుబేరు నాశ్రయించి యుత్తరంబునను, పంచమమూర్తి తపోమయంబై మ హా ము ని య గు క పి లు నా శ్రి యిం చి పాతాళంబునను, వైష్ణవీనామకం బగుషష్ఠమూర్తి వేదయాగాదులకేకమాత్రశరణ్యంబై విష్ణుదేవు నాశ్రయించి యూర్ధ్వంబునను విరాజిల్లుచుండును. ఈమూర్తులు గాక సర్వజీవసుఖసంపాదకంబును, నిరుపాధికంబును, జ్ఞానస్వరూపంబు నగు నొకమూర్తి గలదు. ఆమూర్తిని జరామరణభీరు లగుయతీంద్రు లారాధించుచుందురు.

పూర్వోక్తప్రకారంబున నీశ్వరుని గ్రహింపఁగలవారు పాశుపతవ్రతంబుఁ జేసినవారగుదురు. వాఁడు సర్వవ్యాపకుం డని గ్రహించినవారికి దుఃఖంబు లేదు. జ్ఞానులగువార్లు తెలిసికొని యదృచ్ఛాలాభసంతుష్టులై యుందురు. వ్యాసమునీంద్రా! సృష్టి, ప్రళయము, శివమూర్తివిభేదము, శివలింగపూజావిధానము, శివసంతుష్టికరంబు లగు విశేషారాధనవిధులు మొదలగువిషయములను సంక్షేపముగ నీకెఱింగించితిని. మహాదేవునిసకలమూర్తులకంటెను దక్షిణామూర్తి పరమపూజనీయ మైనది. అదియే వృత్తి, శ్రద్ధ, సుఖము, కామము, మఱియు జీవగణంబులసర్వాభీష్టంబులను బ్రసాదించుచుండును. మునీంద్రా! యోగమగ్నుండై విశుద్ధచిత్తంబున నీదక్షిణామూర్తి నారాధింపవలయును. చిత్తశుద్ధియే సర్వకామార్థసిద్ధికి సాధనమైనది. నీకిప్పు డుపదేశించినపరోత్కృష్టం బగునీశివలింగపూజావిధానమును, భక్తిశ్రద్ధలతో నిచ్ఛాపూర్వకంబుగ నాకర్ణించువారు పరమగతిలాభంబు నందఁగలరు. ఈశ్రవణంబున సకలవ్యాధులును, సకలదుఃఖంబులును నశింపఁగలవు.

శివలింగదర్శనంబును, ప్రశంసనంబును, స్తవాదికంబును, శివలింగపరిమాణశ్రవణంబును, శివనామకీర్తనంబును శోకనాశకంబులు. పూర్వోక్తకార్యంబులు గావించినవా రెట్టివారైనను, నశ్వమేధాదియజ్ఞఫలంబు నంది శివలోకప్రాప్తు లగుదురు. బ్రహ్మోక్తం బగునీశివేతిహాసము క్రోధమోహవినాశకంబును, సర్వపాపసంహారకంబును నై వెలయుచున్నది. శివమందిరమునం దీయితిహాసము నొకసారి పఠించినచో నశ్వమేధయజ్ఞఫలంబు లభింపఁగలదు. దీనిని నిత్యంబును భక్తియుక్తుఁడై పఠించువాఁడు సర్వపాపవిముక్తుండై యంతంబున శివసాయుజ్యంబు నందఁగలఁడు.

ముక్తిక్షేత్రవర్ణనము.

త్రిభువనంబులయందును దివ్యంబులగుశివస్థానంబు లెన్ని యున్నవి? ఏయేస్థలంబులయం దిమ్మహాదేవుఁడు నిత్యసన్నిహితుండై యందలిభక్తజనంబుల ననుగ్రహించుచుండును? అట్టి సకలతీర్థముల నామంబులును, అందు శివానుగ్రహంబుకొఱకు భక్తజనంబులు గావింపవలసినయారాధనక్రమంబును సవిస్తరంబుగాఁ దెలుపవలయు నని వ్యాసుండు ప్రశ్నించుటయు సనత్కుమారుం డిట్లు చెప్పందొడంగెను.

ఆదిదేవుండును, పింగళుండును, కపర్దియు, భక్తవత్సలుండును, సర్వదేవతారాధితుండు నగుపరమేశ్వరునకు నమస్కారము. వ్యాసమునీంద్రా! సర్వజీవహితకరం బగుశివక్షేత్రచరిత్రంబుఁ జెప్పెద నాకర్ణింపుము. ఆదేవుఁ డసంఖ్యరూపంబులతో నఖిలజీవులయందును నిండియుండును. భక్తజనంబు లనేకనామంబులతోడను, అనేకరూపంబులతోడను నాతని నారాధించుచుందురు. బ్రహ్మ, విష్ణుదేవుఁడు, సూర్యుఁడు, స్కందుఁడు, అగ్ని, ఇంద్రుఁడు, చంద్రుఁడు, కుబేరుఁడు, వాయువు, వరుణుఁడు, ఉమాపతి, మరుద్గణము, కపిలుఁడు, అశ్వత్థుఁడు,

బుద్ధి మొదలుగాఁగలనామంబులతో సమ్మహాదేవునే యుపాసకు లుపాసించుచుందురు. భక్తి లేశమాత్రము నారాధించినఁ బరమేశ్వరుం డా రూపముతోనే సాక్షాత్కరించి వరప్రదానంబు గావించుచుండును. ఆదేవునిదివ్యక్షేత్రసంఖ్యం గూర్చి కీర్తించుటకు సహస్రవర్షంబులైనను జాలవు. కావున సంక్షేపముగ నభివర్ణించెద నాకర్ణింపుము. భూలోకంబున సర్వోత్తమంబగురుద్రపదము, మాహేశ్వరపదము, శ్లేష్మాతకము, అవిముక్తము, మహాలయము, గోకర్ణము, భద్రకర్ణము, స్వర్ణము ననునివి యష్టస్థానములు.

అందు మహాదేవుండు నిత్యసన్నిహితుండై భక్తజనంబుల నుద్ధరించుచుండును. అందు మాహేశ్వరపదంబు దేవదేవర్షిసిద్ధసేవితంబై యలరారుచుండును. అది యోజనద్వయదీర్ఘంబును, నంతియవిస్తారంబు నై యుండును. ఆదివ్యస్థానంబున మృతులగువారికిఁ బునరావృత్తిరహితంబగుశివపదంబు లభించును. ఈదివ్యస్థలంబులయందు మరణించినవారు పాపాత్ములైనను రుద్రలోకప్రాప్తు లగుదు రని తొల్లి భగవతి యానతిచ్చియుండెను. శ్లేష్మాతకక్షేత్రంబున మహాదేవుండు సర్వదా యక్షరాక్షసనాగపిశాచపరివృతుండై యుండును. యోజనద్వయపరిమితంబగునీస్థానంబున మేను దొరంగినపురుషుండు ముక్తుం డగును. యోజనద్వయచతురం బగురుద్రపదక్షేత్రంబున రుద్రదేవు నారాధించి దేవదానవగంధర్వాదులు తపోధనులలో సర్వశ్రేష్ఠులైరి. మహాదేవునకు నిత్యావాసంబగునచ్చట దేహత్యాగంబు గావించినవారికి గాణపత్యలోకలాభంబు గలుగును. మేరుశైలమధ్యంబున నర్ధయోజనవిస్తీర్ణం బగుసువర్ణక్షేత్రంబున భగవానుండగుత్రిలోచనుని విష్ణుండును, ఇంద్రుండును, చంద్రుండును, సూర్యుండును, వాయుదేవుండును, అశ్వినీకుమారులును నిత్యము నారాధించుచుందురు. అవిముక్తక్షే

త్రంబున నోంకారగమ్యుండును పరమాత్ముండును, భగవానుండును, సనాతనుండును నగుదేవుండు విశ్వేశ్వరనామంబునఁ బూజింపఁబడు చుండును. ఆక్షేత్రంబున సర్వతేజోమయంబును, సురసిద్ధగణదుర్లభం బును, కల్యాణమయంబు నగుదివ్యలింగంబు విరాజిల్లుచుండును. అందుఁ గలియుగంబున మహాదేవుం డంతర్లింగస్వరూపుఁడై భక్తరక్ష ణంబు గావించుచుండును. ఆకాశీక్షేత్రంబున నిత్యసన్నిహితుండును, ఓంకారస్వరూపుఁడు నగువిశ్వేశ్వరుని దేవర్షిగణంబులును, రాజర్షిగణం బులును ధ్యాననిష్ఠులై నిత్యంబును బ్రణామస్తవంబులచే నారాధించు చుందురు. మఱియు, వేదాధ్యయనసంపన్నులును, వ్రతానుష్ఠానతత్ప రులును నగుసిద్ధర్షిగణంబులు నిత్యయోగానుష్ఠానంబున నిర్మలప్రశాంత హృదయులై యచ్చటికర్దమేశ్వరప్రభృతిపంచస్థానంబులయందును ని రంతరసుస్థిరుండై యున్నపరమేశ్వరు నుపాసించుచుందురు.

ఆపంచాయతనంబున నచింత్యుం బగుపరమేశ్వరునిశాంతిమయ మూర్తి విరాజిల్లుచుండును. ఆదివ్యస్వరూపంబున మహాత్ములగుజ్ఞాను లు విలీను లగుచుందురు. యోజనద్వయపరిమితంబగునాకాశీక్షేత్ర మును విశ్వేశ్వరుం డొక్కప్పుడును విడిచియుండఁడుగావున నయ్యవిము క్తక్షేత్రం బనుపమానమైనది. ఇచ్చోట భద్రకర్ణక్షేత్రంబునం దీశ్వరుని బ్రహ్మాగ్నిచంద్రేంద్రాదులును, విష్ణుండును, బృహస్పతియు, నదీనద సముద్రంబులును, ద్వీపంబులును, ఓషధులును, సకలజీవులును సర్వ దా సేవించుచుందురు. అత్యుజ్జ్వలం బగునీస్థానము పరమపవిత్రమైన దని పూర్వమే చెప్పంబడియెను. దానితో సమానంబగుక్షేత్రంబు లేదు. అది యతిపవిత్రంబును, రమణీయంబును, బరమేశ్వరునకు నిత్యనివాసంబు నగుటచే నతినియమపూర్వకంబుగ నిత్యమును నేఁడును నివసించియుండును. ఆదివ్యక్షేత్రంబు నిత్యంబును సిద్ధజనపరివృతంబై

యుండుటచే నధర్మపరులును, బాపాత్ములు నగువారి కగమ్యంబై యుండును. బ్రహ్మావర్తంబునకు దక్షిణంబుననున్న పురాతనపుణ్యస్థానం బగునీమహాధననామకక్షేత్రమునందు నిత్యంబును సిద్ధర్షులు తపస్సంసక్తులై యుందురు. ఈసకలక్షేత్రంబులయందును బురాతన మహర్షులు తపంబు గావించి సర్వసిద్ధులను, దివ్యమాహేశ్వరభోగంబులను, అక్షయశక్తులను బడయఁగలిగిరి. మునీంద్రా! అతులంబును, పుణ్యజనకంబును, పాపవినాశకంబును నగుశివస్థానమాహాత్మ్యంబు నభివర్ణించితిని. దీని బ్రాహ్మణులుగాని, శివభక్తిపరాయణులగుమఱియెవ్వరుగాని పఠించినచో వారికి వేదపారఫలంబు లభించును. అతిప్రశంసనీయంబును, బుణ్యప్రదంబునగు నీవిషయము నన్యదేవతారాధకులకును, శఠులకును, క్రూరులకును, ఆత్మశ్లాఘాపరాయణులగునీచులకును నుపదేశింపఁ దగదు.

—♦ క్షేత్రస్థానాఖ్యానము. ♦—

వ్యాసమునీంద్రుండు సనత్కుమారుం గాంచి యిట్లనియెను. మునీంద్రా! మఱియు నితరంబు లగునుత్తమస్థానంబులమాహాత్మ్యంబును, గోపనీయంబులగుతీర్థంబులును, దేవగృహంబులును, వానిని సేవించుటవలనిఫలంబును విస్పష్టంబుగ బోధింపుము. పూర్వోక్తవాక్యశ్రవణంబున నాకింకను దృప్తి జనించుట లేదు. దేవదేవుండును, మహాత్ముండు నగుశంకరునిమాహాత్మ్యం బింకను వినవలయుననియే కుతూహలమగుచున్నది. అనుటయుఁ బరమతేజస్వియగుసనత్కుమారుండు మృదుమధురవచనంబులతో నిట్లని చెప్పందొడంగెను. వ్యాసమునీంద్రా! అత్యాశ్చర్యకరంబును, బాపనాశకంబు నగువాక్యము నాకర్ణింపుము. మంగళకరంబగునీపవిత్రవాక్యములకు బ్రతిపర్వమునందును

పఠించునట్టియుఁ, గవచరూపంబున ధరించునట్టియుభక్తుల కిందఱిలోక ప్రాప్తియగును. పవిత్రంబులగునీవాక్యములు, భగవానుండగునీశ్వరునిచే స్వయముగఁ జెప్పంబడినవి. సావధానుండవై యాకర్ణింపుము. ఛగలాండము, కురుండము, ముకుటము, మండలేశ్వరము, కాలంజరవనము, గదగండము ననునీసకలస్థానంబులయందును, భగవానుండగు నీశ్వరుండు దేవగణపూజితుండై ప్రమథగణసహితంబుగఁ బరమానందంబున సర్వదా విహరించుచుండును. ఈస్థానంబులన్నియుఁ బ్రత్యేకముగఁ జతుర్దశయోజనవిస్తీర్ణంబులును, సిద్ధగంధర్వాదిసేవితంబులునై యుండును. ఆస్థానంబులను దర్శించి యందేకాహోరాత్రంబు వసించి, సర్వంబును బరమేశ్వరాధీనంబు సేసి, పితృతర్పణాదిమూలంబున విగతకిల్బిషుండై పవిత్రుం డగుభక్తునకు రాజసూయాశ్వమేధయాగఫలంబు సిద్ధించును. అంతంబునం దాతనికిఁ బరమేశ్వరుండు ప్రసన్నుండై ముక్తిప్రదానంబు గావించును. ఆదివ్యక్షేత్రంబులయందు దేహత్యాగంబు సేయువారు దేవతలైనను, దానవులైనను, శివప్రియులైనను, అప్రియులైనను నగుదురుగాక! అట్టివా రిహలోకంబున ననుపమైశ్వర్యంబులను, బరంబున నీశ్వరసాయుజ్యంబును బడయఁగల్గుదురు. పూర్వోక్తస్థానంబులయందు మునిగణపరివృతుఁడును, సురగణపూజితుండునై యుండుమహాదేవునిమాహాత్మ్యంబు శ్రద్ధతో నాకర్ణించువారు సాధారణదుర్లభంబగుసద్గతిని గాంచఁగలరు.

మహాపురాదివర్ణనము.

సనత్కుమారుం డిట్లనియెను. వ్యాసమునీంద్రా! పరమరహస్యంబు లగుదివ్యక్షేత్రంబులఁగూర్చియు, పరమేశ్వరుండు భక్తుల ననుగ్రహించువిధముంగూర్చియు నెఱింగించెద నాకర్ణింపుము. పూర్వము

వాలఖిల్యాదిమునీంద్రులును, విగతకల్మషు లగుమహర్షులును బరమేశ్వరుని సందర్శించి యీవిషయంబునే ప్రశ్నించుటయు భక్తవత్సలుండును, బ్రభుండు నగుమహాదేవుండు వారిభక్తికి సంతుష్టుండై దయాపూర్వకంబుగ వారికి దర్శనం బిచ్చెను. ఆమహర్షులు మహాదేవసందర్శనంబున నానందసాగరనిమగ్నులై యావృషభధ్వజునకు భక్తితోఁ బ్రణామంబు లాచరించి కృతాంజలిపుటులై యిట్లు ప్రార్థింపఁదొడంగిరి. ప్రభూ! నీవు నీభక్తుల మగుమాసకలమనోరథంబులను దీర్చుటకు సమర్థుండవు. నీవచింత్యుండవు గావున వరసహస్రంబులచే నైనను నీదర్శనము దుర్లభమైనది. మేము నీదయకుఁ బాత్రుల మగుదుమేని మాకీవరంబును బ్రసాదింపుము. మేమిప్పు డతిగుహ్యంబులగుభవదీయపవిత్రస్థానంబుల నెఱుంగవలయు నని కుతూహలపడుచుంటిమి. ఇంతకంటె మాకెట్టికోరికయును లేదు. అనుటయు మాయారహితుండును, భక్తప్రియుండును, అనాదిదేవుండు నగురుద్రుండు పుణ్యాభిలాషులగు నమ్మునులయెడఁ బ్రసన్నుండై యిట్లు బోధింపఁదొడంగెను. మునీంద్రులారా! మహాపురము, చక్రపురము, శ్రీపర్వతము, జాప్యేశ్వరము, ఆమ్రాండికేశ్వరము, దేవదారువనము, మహాభైరవము ననునివి గోప్యంబులగు పవిత్రస్థానములు. ఈసకలస్థానంబులను భక్తిశ్రద్ధలతో దర్శించుభక్తుండు నాకతిప్రియుండు. అట్లు గావించుసామర్థ్యంబు లేకున్నచో నీదివ్యక్షేత్రనామంబులను భక్తిపూర్వకంబుగ నుచ్చరించుచుఁ బుష్పోపహారచందనాదులచేతను, నమస్కారంబులచేతను నన్నుఁ బూజించినను మత్పదప్రాప్తి లభించును. బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులలో నెవ్వరైనను, అనాచారు లగుమ్లేచ్ఛులైనను, సకాములై కాని, నిష్కాములై కాని పూర్వోక్తస్థానంబులయందు నన్నుఁ బూజించువారు సుస్థిరం బగుగాఁక నత్యల్పకాలంబునంది యింద్రలోకంబునఁ బూజ్యులై యుందురు.

మఱియు నాక్షేత్రంబులయందు మృతులగువారికిఁ గూడ స్వర్గఫలంబు సిద్ధించును. ఆక్షేత్రంబులయందు శ్రద్ధాపూర్వకంబుగఁ బితృదేవతల నుద్దేశించి కుశాస్తరణంబునఁ బిండతిలోదకప్రదానంబు గావించు మహాభాగుఁడు తనపితృగణంబులతోఁగూడ ననంతకాలము స్వర్గలోకస్థితుండై యుండును. ఇది సర్వజీవదుర్లభంబగునిగూఢవిషయము. అతిగుహ్యంబగునీయాఖ్యానమును భక్తితో నాకర్ణించువారు స్త్రీలైనను, శూద్రులైనను, మ్లేచ్ఛులైనను మఱియెవ్వరైనను సద్గతిలాభంబు నందఁగలరు.

కావునఁ బండితులగువారు దీని నధ్యయనంబు గావింపవలయును. అశాంతుఁడును, అహితకారియు, కర్కశుండును, అపవిత్రుండును శఠుండును, ఖలుండును, చపలుండును, నిష్ఠురుండు నగువాని కీరహస్యాఖ్యానంబు నుపదేశింపఁజనదు. పుత్రశిష్యుఁడును, ప్రియశిష్యుఁడును, ఆత్మశ్లాఘాహీనుఁడును, ప్రశాంతతపస్వియు, ప్రియంవదుఁడును, శివభక్తుఁడును, శ్రోత్రియుఁడును, యతియు, జ్ఞానవంతుఁడు నగువాని కీ పవిత్రవిషయంబు నెఱింగింపవలయును. ఈయధ్యాయమును బ్రతిపర్వంబునను బ్రాహ్మణులకు వినిపించువాఁడును, దీనిని దాళపత్రంబున లిఖించి ధరించువాఁడును రుద్రలోకప్రాప్తుం డగును. వేదశాస్త్రోక్తం బగునీవిషయము పరమరహస్యం బని పండితులు చెప్పుదురు. కావున నిది యతిగుహ్యం బని నిర్దిష్టం బయ్యెను. పూజనీయములగు నీసకలక్షేత్రములను దర్శించి యందుఁ దపోనుష్ఠానంబు గావించువానికిఁ జిత్తం బతినిర్మలమును, కల్యాణమయము నగును. పూర్వోక్తస్థానములయందును, గంగాద్వారమునందును నేను నిలయపూర్వకముగా నివసించియుండును. ఆద్యంబులగునీక్షేత్రంబులయందు భగవానుండగు మహేశ్వరుని నిత్యము నారాధించువారు సర్వపాపవిముక్తులగుదురు.

ఆత్మమహాత్ములకుఁ బునరావృత్తిరహితం బగుశివసాయుజ్యంబు లభించును.

మునీంద్రా! ఈశ్వరాధిష్ఠానంబు లగుదివ్యక్షేత్రములంగూర్చి నీకు సంక్షేపముగాఁ జెప్పితిని. ఈపవిత్రచరిత్రము నాకర్ణించువాఁడు నిష్ఠురుండైనను సద్గతిలాభము నందఁగలఁడు. సదాచారసంపన్నుఁడై యీమాహాత్మ్యము నాలకించువానికి సర్వాభీష్టములును సిద్ధించును. ఈయుత్తమస్థానముల నిత్యము నెవ్వఁడు యథార్థరూపమునఁ గీర్తించుచుండునో యాతఁడు దుర్గతిదూరుండై రుద్రలోకావాసుం డగును.

—♦ లింగోద్భవకథనము. ♦—

బ్రహ్మవిష్ణుమహేశ్వరులయందుఁ గర్మప్రభావముచే నెవ్వరధికులో భూతభవిష్యద్వర్తమానవిదుండవగునీవు విస్పష్టముగ నెఱింగింపవలయు నని వ్యాసుండు ప్రశ్నించుటయు బుద్ధిమంతులలో నగ్రగణ్యుం డగుసనత్కుమారుం డిట్లని చెప్పందొడంగెను. మునీంద్రా! ఈవిషయంబునఁ బురాతనేతిహాసంబు గలదు. పూర్వకాలమున మహారాజగుబలిచక్రవర్తి త్రైలోక్యవిజయుండై విజృంభించుటయు, భగవానుం డగువిష్ణుదేవుండు స్వకీయప్రభావమున నాతని బంధించి మరలఁ ద్రిలోకములను వశపఱచుకొనియెను. దైత్యులందఱు నాతనిపరిభావమునకు భీతులై పోయిరి. అప్పుడు క్షీరసముద్రతీరమున విశ్వమూర్తియై నిలిచియున్నవిష్ణుదేవునిసన్నిధికిఁ బ్రహ్లాదాదులు చనుదెంచి సనాతనుం డగుదేవదేవుని సందర్శించిరి. మఱియు, సిద్ధసాధ్యవిద్యాధరగణంబులును, నదీనదసాగరంబులును, బ్రహ్మర్షులును, అప్సరోగణంబులును, గంధర్వులును సర్వాభీష్టప్రదుండగునాదేవదేవు నవలోకించి పరమానందహృదయారవిందులై యిట్లు వినుతింపనారంభించిరి.

దేవదేవా! నీవు కామక్రోధభయాహంకారములకు స్రష్టవు; ప్రతిపాలకుఁడవు. ప్రభూ! నీవే యీత్రిలోకములను సృజించి పరిపాలించుచుందువు. ఇప్పుడు నీయనుగ్రహమునసే త్రిభువనములకు నక్షయ కల్యాణము లభించినది. నీప్రభావముచేతనే దుష్టాసురసంహారమును, బలిబంధనమును నైనవి. పూర్వమునఁగూడ నీవు దుష్టశిక్షణము సేసి స్థావరజంగమాత్మకంబగునీవిశ్వమును సంరక్షించితివి. నీవు దేవగణశరణ్యుండవు. యోగీశ్వరుండవు. జగత్ప్రభుండవు. నిత్యుండవు. సర్వరక్షకుండవగునీకు సమస్కారము. అని యనేకవిధముల వినుతించుచున్న మహాత్ములగువారిం గాంచి పురుషోత్తముం డగువిష్ణుదేవుం డిట్లనియెను. సురశ్రేష్ఠులారా! సకలబ్రహ్మాండములకు నాదికారణుండగుసర్వేశ్వరుం గూర్చి చెప్పెదను వినుండు! 'పూర్వకాలమున బ్రహ్మదేవుండు సర్వభూతదయాపరుండగు నమ్మహాదేవునియనుగ్రహముచేతనే సృష్టికర్తృత్వలాభమునంది తనమాయాబలమున నీలోకసప్తకమును సృజియింపఁ గలిగెను. ఆమహాదేవప్రసాదముననే నేనును సర్వశ్రేష్ఠత్వలాభము నందితిని. ప్రళయకాలమున ననిర్వచనీయం బగునంధకారముచే నీ జగంబంతయు నాచ్ఛన్నంబై నప్పుడు నేనీభువనత్రయమును గ్రసించి మాయాబలముచే సహస్రశీర్షుండను, సహస్రలోచనుండను, సహస్రపాదుండను, శంఖచక్రగదాధరుండనునై విమలసముద్రజలముల నేకాంతముగ శయనించియుంటిని. అప్పుడు కృష్ణవర్మపరిధానుఁడును, కమండలుభూషితుఁడును, విమలప్రభుఁడును, జగత్ప్రభుండు నగుకమలాసనుండు నాయెట్టయెదుట సాక్షాత్కరించి యొక్కనిమేషమధ్యమునఁ బురుషోత్తముండును, లోకపితామహుండు నగునాతఁడు నన్ను సమీక్షించి ''ఓయీ! నీవీసముద్రజలమధ్యమున నేలశయనించియుంటివో యాలసింపక యథార్థముగఁ జెప్పుము. నేను సర్వలోకకర్త నగునన్నా

దేవుండ నని యెఱుంగుము.

అనుటయు నేనిట్లు చెప్పితిని. కమలాసనా! నేను సర్వలోకం బుల సృష్టిస్థితిలయంబులఁ గావించుజగత్ప్రభుండనగు నారాయణుఁడను. అనియీవిధముగా మేమిరువురమును వాదోపవాదంబులఁ గావించుచు న్నయవసరంబున నుత్తరదిగ్భాగంబున నతిభయానకం బగునొక తేజఃపిం డము మాకు దృష్టిగోచరంబయ్యెను. ఆతేజఃప్రభావంబున నితరంబు లగుజ్యోతిర్గణంబులన్నియుఁ బ్రజ్వలింపనారంభించెను. క్రమముగా నా జ్యోతిర్మండలము భూమ్యంతరిక్షంబులకు వ్యాపించి వర్ధిల్లుచుండుటం గాంచి మేముభయులమును విస్మయావిష్టహృదయులమైపోయితిమి. ఆ జ్వాలామధ్యంబున ద్వాదశాంగుళపరిమితంబును, దుర్నిరీక్ష్యంబును, దుర్నిరూప్యంబును, దుస్సహంబును, అతిస్థూలంబును, అధికతేజస్సంప న్నంబును, మహాబలయుతంబును, జ్వాలామాలికాపరివృతంబును, సకలజీవభయంకరంబును, దారుణంబును, నిర్మలంబు నగునొకతేజో లింగంబు గానంబడియెను. అప్పుడు బ్రహ్మదేవుండు నన్నుం గాంచి యిట్లనియెను. నారాయణా! మనమిరువురము నీతేజోలింగంబునాద్యం తంబు లరసివత్తము రమ్ము! దీనిమూలంబు గాంచునంతవఱకును నీవధో లోకగమనంబు గావించి పరిశీలింపుము. నేనూర్ధ్వగామినై పోయెదను. అని యీవిధంబుగా మేముభయులమును నియమంబు చేసికొన్న పిమ్మట మహావ్రతుం డగుబ్రహ్మదేవుండు యోగంబుచే మనోవేగం బున నూర్ధ్వంబునకుఁ బోవుటయు, నేనుగూడ మనోజవంబున నధోదే శంబున కరిగితిని. మేమిరువురము నిట్లు సహస్రవర్షంబు లాతేజోమయ లింగానుసంధానంబు సేయుచుండియు నాద్యంతములఁ గనుంగొనఁ జాలక యతిపరిశ్రాంతులమై క్రిమ్మఱి సముద్రజలంబులఁ జేరితిమి. మహాబలవంతులమయ్యును మేమిప్పుడు భయవిస్మయాభిభూతులమై,

మాయామోహితులమై, జ్ఞానహీనులమై, కొంతకాలంబువఱకు నేమియు నెఱుంగజాలకపోయితిమి. అనంతరము వనజోదరుండు ధ్యానబలంబుచే సర్వకాలంబులకుఁ గారణుండును, సర్వభూతంబులయుత్పత్తివిలయంబులకుఁ గర్తయు, సర్వవ్యాపియు, భగవానుండు నగుమహాదేవుని లింగస్వరూపునిగా నెఱింగి, అవ్యక్తుండును, అనంతుండును, శూలపాణియు నగునద్దేవునకుఁ బ్రణమిల్లి కృతాంజలిపుటుండై యిట్లు స్తుతింప నారంభించెను.

త్రిలోకనాథా ! సురేశ్వరా ! భూతనాథా ! సత్వగుణావలంబీ ! సత్త్వకారణా ! అనంతా ! నీకు నమస్కారము. దేవా ! నీవుబ్రహ్మకు బ్రహ్మవు. పరమాత్ముఁడవు. యోగీశ్వరులపరమపదంబవు. సూర్య తేజస్సంపన్నుండవు. కామదేవుఁడవు. రుద్రుఁడవు. కార్తికేయుఁడవు. అవ్యయుఁడవు. ప్రభూ ! వేదశాస్త్రంబులును, యజ్ఞంబులును, వషట్కారోంకారస్వాహాకారనమస్కారంబులును, పుణ్యవ్రతంబులును, బ్రహ్మచర్యాదినియమంబులును, మంత్రంబులును నీవ. నీవు సర్వవ్యాపివి. కామక్రోధసంభూతంబులగుదుఃఖస్వరూపంబులును, ఇచ్ఛాద్వేషశమదమక్రియావ్యాధులును నీకంటె నన్యంబులు గావు. నీవు సుఖదుఃఖాతీతుండవు. ఋతువత్సరంబులును, విద్యావిద్యలును, ఇంద్రియంబులును, ఇంద్రియవిషయంబులును, నీవ. స్థూలసూక్ష్మవిశ్వరూపుండవగునీరూపంబనిర్వచనీయమైనది. నీవు తేజంబులకుఁ దేజంబవు. శబ్దస్పర్శరూపరసగంధంబులును, జలంబులును నీస్వరూపంబులు. నీవు భూపతివి. జగత్పతివి. ఆకాశమూర్తివి. ఛందోరూపుఁడవు. లోకనాథుఁడవు. అక్షయుఁడవు. నీవు సర్వభూతంబులకును సృష్టిస్థితిలయకారణుండవై త్రిభువనంబులను ధరించియుందువు. దేవా ! నీపశ్చిమవదనంబునుండి వరుణుండును, సుందరంబగునీయుత్తరముఖంబునుండి భూర్భువ

శుభశ్లోకంబులును, సర్వజీవులును సంజాతులైరి. నీవు ప్రజానాథుం డై బహువిధంబులఁ గ్రీడించుచుందువు. జగన్నాథా! సురాసురవసు రుద్రగణంబులును, వరుణుండును, అశ్వినీకుమారులును, సిద్ధవిద్యాధర నాగయక్షాప్సరోగణంబులును, యోగసిద్ధులును, బ్రహ్మర్షులును, ఆకాశసంచారులగుచారణులును, తపోధనులగుమునులును, సహస్రాధి కులగుసిద్ధతపస్వులును మహాబలపరాక్రములు నజరామరులు నగుప్రమ థులును నిన్నుండియే యుత్పన్నులైరి. మఱియు సహస్రమస్తకుఁడగు ననంతుఁడును, వసువును, వాసుకియు, అధికతేజోబలసంపన్నుఁ డగు గరుడుండును, ధర్మార్థకామకీర్తిమోహంబులును, వాయువును, అగ్ని యు, సముద్రంబులును, నీవలననే సంభవించెను. లక్ష్మి, సతి, కాళిక, గాయత్రీదేవి, సంపత్తు, కీర్తి, సిద్ధి, మేధ, లజ్జ, స్మృతి, తుష్టి, పుష్టి, నందాదేవి, జయాదేవి, సరస్వతి, మొదలగుదివ్యమూర్తులకు నీవే కార ణుండవు. మహాభాగా! శుక్లకృష్ణపక్షంబులును, దివారాత్రంబులును, కాలంబును, నిమేషముహూర్తంబులును, నక్షత్రగ్రహగణంబులును, అశ్వ గోమేషాదికంబులును, యజ్ఞహవ్యాదులును, పరిదృశ్యమానంబు లగు సకలపదార్థములును నీయందే సంభూతంబు లయ్యెను. దేవదేవా! జీవులు రజోగుణంబుచేతను, మాయచేతను, సంఛన్నులై నిన్ను దర్శింపఁ జాలకున్నారు. ఆత్మసాక్షాత్కారసమర్థు లగుయోగీంద్రులును, నిత్య ముక్తులునుమాత్ర మనాయాసముగ నిన్ను దర్శింపఁగలుగుదురు. మాయాతమస్సంఛన్నం బగునీవిశ్వమంతయు ననిత్యమైనది. నీవొక్కఁ డవుమాత్రమే సనాతనుండవు. పురుషోత్తముం డగువిష్ణుండును, నేనును నీయందే యుత్పన్నులమైతిమి. నీయందాద్యంతమధ్యంబుల నెఱింగిన వారొక్కరును లేరు. అనుభవైకవేద్యంబగునీస్వరూప మబోధ్యమై నది. అనాదిదేవా! నీవేకమాత్రధ్యేయుండవు. పరమపవిత్రుండవు.

పరాత్పరుండవు. పరమసూక్ష్మమూర్తివి, పురుషోత్తముఁడవు. పురాణపురుషుఁడవు. అవ్యయుఁడగుపరమేశ్వరుఁడని మునీంద్రులు నిన్నుఁ బ్రశంసించుచుందురు. నీవసమస్తకంబులుసూర్యతేజోమయంబులు. నీవు వజ్రపినాకపాణివి. అంశుమాలివి. భూతనాథుఁడవు. కామసంహారుఁడవు. భస్మవిభూషితశరీరుఁడవు. సూక్ష్మస్వరూపుఁడవు. విధాతవు. యముఁడవు. అనంతమూర్తివి. భూతభవిష్యద్వర్తమానస్వరూపుఁడవు. అలౌకికవాసా! అవిముక్తనాథా! నీకు నమస్కారము. నీవు సర్వమయుండవయ్యును సకలంబునకు నూర్ధ్వంబగుపరమపదంబున నివసించియుందువు. ఓహిరణ్యగర్భా! హిరణ్యరేతా! హిరణ్యవాసా! నీకుఁ బ్రణామంబులు. నీకరచరణనయనమస్తకంబులును, సర్వరూపంబును, సర్వంబునుగూడ హిరణ్మయమ్మైయుండును. దేవా! నీలకంఠా! నీవు లోకకళ్యాణకరుండవగుపార్వతీశ్వరుఁడవు. నీలలోచనా! సహస్రమూర్తీ! సర్వజగద్గురూ! నీకు వందనము. భవా! నీవు భూతగణంబుల నాడీరూపకమగుయజ్ఞోపవీతమును ధరించువాఁడవు. సకలజీవులును నిన్ను యజ్ఞకర్మాదులచేఁ బూజించుచుందురు. నీవు సిద్ధచారణమహర్షిగణంబుల కేకమాత్రపూజనీయుండవు. అసంఖ్యయజ్ఞస్వరూపుఁడవు. కల్పనహాసవిభూషితుఁడవు. ఋషభా! పద్మనాభా! అవ్యయా! ఆత్మస్వరూపా! నీకునమస్కారము.

అని వనజోదరుండు బహుప్రకారముల వినుతించుటయు వరదుండును, బ్రీతుండునగుమహేశ్వరుండు సంతుష్టుండై యేకగ్రీవుండును, సుందరుండును, నానాభరణభూషితుండును, నానామణివిచిత్రాంగుండును, నానాగంధానులేపనుండును, పినాకపట్టిసవజ్రశూలధరుండును సర్వయజ్ఞోపవీతుండును, కౌపీనపరిధానుండును, కోటిసూర్యప్రభామయుండును, మేఘదుందుభిగంభీరస్వరుండునునై దివ్యరూపమున సాక్షా

త్కరించి త్రైలోక్యభీకరముగాఁ బెద్దనవ్వునవ్వి, అశనికోటివినిందితం బగుభీమస్వరమున "మహాత్ములగు బ్రహ్మవిష్ణులారా! నేను మీయెడలఁ బ్రసన్నుండనైతిని. మీరు నిర్భయులై నారూపమును సంపూర్ణముగ నవలోకింపుఁడు. వనజాసనా! నీవు నాదక్షిణభుజంబవు. మఱియు నీవిష్ణుండవు యుద్ధంబులయం దపరాజితం బగునావామబాహువు. మీ రిరువురును నాతనయులు. ఓసువ్రతులారా! మునీంద్రులకనురూపం బగువరంబు నర్థింపుఁడు." అని యానతిచ్చుటయు హరివిరించు లానందితహృదయులై యద్దేవునిచరణకమలంబులకుఁ బ్రణమిల్లి యిట్లు ప్రార్థించిరి. ప్రభూ! నీవు మాయెడలఁ బ్రసన్నుండవై వరప్రదానంబు సేయఁదలంచితేని—పరమేశ్వరా! మాకు నీయందలిభక్తి నిశ్చలంబై యుండునట్లనుగ్రహింపుము. అని కోరుటయు భగవంతుం డగుమహేశ్వరుండు మీరు విశేషముగఁ బ్రజాసృష్టి గావింపుఁ డని యభిలషిత వరప్రదానంబు లొసఁగి యంతర్ధానము నొందెను. వ్యాసమునీంద్రా! జగత్కారణుండును, జగత్స్రష్టయు, సర్వజితుండు నగునద్దేవదేవుని మాహాత్మ్యమును సంక్షేపముగఁ బ్రశంసించితిని. దీని నాకర్ణించువారికి స్వర్గంబును, ఆయువును, శుభలాభంబును గలుగును. పవిత్రుండును, జితేంద్రియుండును, బ్రహ్మచారియు, యోగాసక్తుఁడునై యీమాహాత్మ్యమును బఠించువానికి యక్షరాక్షసదైత్యగ్రహపిశాచభయంబులు గలుగవు. అట్టిపుణ్యమూర్తి యశ్వమేధయజ్ఞఫలంబును బడయ గలఁడు.

—♦ పుష్పదానాదిఫలవివరణము. ♦—

శివలింగస్థాపనము, పుష్పపూజనము, క్షీరాద్యభిషేచనము మొదలగువానిఫలంబులంగూర్చి యానతీయవలయు నని వ్యాసుం

ప్రశ్నించుటయుఁ ద్రికాలజ్ఞుండును, సర్వధర్మసారంగతుండు నగుసనత్కుమారుం డిట్లనియెను. పరాశరనందనా! శివలింగస్థాపనంబుచే సప్తాగ్నిష్టోమాదియాగఫలంబును, బహుసువర్ణదక్షిణలతోఁ గావింపఁబడినపుత్త్రికామేష్టిఫలంబును సిద్ధించును. శివలింగస్థాపకుఁ డగువాఁడు శివునిచేఁ బుత్త్రరూపంబున సంరక్షింపఁబడుచు, అయుతార్బుదకోటి వర్షంబులు శివలోకావాసుం డగును. ఒక్కశివలింగమును బ్రతిష్ఠించినవారు స్త్రీలైనను, బురుషులైనను, క్లీబులైనను జిరకాలమువఱకును శివసన్నిధిని నివసించియుందురు. మహాదేవునకు సుగంధచందనప్రదానము సేయువారు ప్రతిమాసమును గంగాదిపుణ్యనదీజలములయందు నిరంతరస్నానములఁ గావించినఫలమును బడయఁగలరు. మహేశ్వరునకు సురభిచందనాదిప్రదానమువలన భూసువర్ణాదిదానములకంటెఁ జతుస్సహస్రగుణాధికఫలము సిద్ధించును. శివలింగాభ్యంగదానము చందనదానముకంటెను షష్టికోటిగుణాధికఫలదంబు. శివలింగమునకు క్షీరాభిషేచనము గావించినచో సువర్ణభూషితములగుచతుష్షష్టిసహస్రగోవులను దానము చేసినఫలము లభించును. ముఖవాద్యాదిసమన్వితముగాఁ బ్రతిపక్షమునను శివలింగాభిషేకముసేయువాఁడు యావజ్జీవమును బ్రతిమాసమునను త్రిషవణస్నానము గావించినఫలము నందఁగలఁడు. మహాదేవుఁడు వారిశతాపరాధములను క్షమింపఁగలఁడు. శివోద్దేశమునఁ బుష్పదానము నాచరించినచో సహస్రగోదానఫలము సిద్ధించును. భక్తులు తామరపువ్వులు, గన్నేరుపువ్వులు, సంపెంగపువ్వులు, అర్కపల్లవములు, బిల్వపత్త్రములు మొదలగువానిచే సర్వదా శివలింగము నర్చించుచుండవలయును. ఎప్పు డేవస్త్రప్రదానముచే శివార్చనముగావింపవలయునో చెప్పెదను వినుము.

శ్రావణశుక్లపక్షమున నుత్పలములచేతను, భాద్రపదశుక్లపక్షము

నఁ బుండరీకములచేతను, ఆశ్వీనశుక్లపక్షమునఁ గుశలచేతను, ఉత్తరేణి చేతను శివపూజ గావింపవలయును. సర్వకాలములయందును మహాదేవుని శ్వేతకుసుమములచేతనే పూజింపవలయును. బకపుష్పము, కరవీరపుష్పము, అర్కపుష్పము, దుత్తూరపుష్పము ననునీచతుర్విధకుసుమములగంధమును శంకరుండు విశేషముగ నాఘ్రాణించుచుండును. ఎన్నఁటికిని బకపుష్పమును, పద్మమును, నిర్మాల్యములు గానేరవు. సహస్రకరవీరంబులకంటె నొక్కయుత్పలమును, సహస్రచంపకంబులకంటె నొక్కదుత్తూరమును నధికఫలప్రదములైనవి. మఱియు సహస్రదుత్తూరపుష్పములకంటె నొక్కనాగపుష్పమును, సహస్రనాగపుష్పములకంటె నొకపున్నాగమును, సహస్రపున్నాగపుష్పములకంటె నొక్కకర్ణికారమును, సహస్రకర్ణికారములకంటె నొక్కబృహస్పతీపుష్పమును శ్రేష్ఠములైనవి. మహాదేవున కధికసంతోషదాయకం బగుబిల్వపత్త్రముకంటె నధికం బగుపుష్ప మేదియునులేదు. భక్తులు సుగంధకలితములగుపవిత్రవస్తువు లన్నిటితోడను మహాదేవారాధనము గావింపవచ్చును. కాని నీలపుష్పములచే నాదేవు నెన్నఁడు నర్చింపరాదు. ఒక్కబిల్వపత్త్రముచే శివునిబూజించినవాఁ డతుష్షష్టిపుష్పములచే నర్చించినఫలము గలుగును. ప్రతిపక్షమును యథానియమముగఁ బుష్పములతో శివుని బూజింపవలయును. నిత్యమును భక్తిపూర్వకముగాఁ బుష్పపత్త్రాదులచే శివపూజ సేయువానికి దుర్దశలు గలుగవు గావునఁ బుష్పపత్త్రములచే శివారాధనము గావించుట యవశ్యకర్తవ్యము. పుష్పాభావమునఁ బత్త్రములచేఁ బూజింపవచ్చును. భక్తిశ్రద్ధలతో శివునకు దీపనైవేద్యము లర్పించువాఁడు శివత్వప్రాప్తుఁడై పూజ్యుం డగును. మహాదేవు నేకభావముతో నారాధించిన నష్టైశ్వర్యఫలము లభించును. ఆయీశ్వరుని సర్వగతునిగా భావించి యెల్లయెడల నారా

ధించువాఁడు మహాపుణ్యమును, శివసాయుజ్యమును బడయఁగలఁడు.

—♦ పూజాఫలకథనము. ♦—

పరమేశ్వరుఁడగుమహాదేవు నేయేవిధముగా నారాధించి భక్తప్రియుఁడగునాతఁడు ప్రసన్నుఁడగునో యింకను వినఁగోరెద నని వ్యాసుండు ప్రశ్నించుటయు సనత్కుమారుఁ డిట్లనియెను. సాత్యవతేయా! పూర్వకాలమునం దయుతసూర్యతేజోమయుఁడును, ప్రమథగణేశ్వరుఁడు నగునందికేశ్వరుఁడు మహాదేవమాహాత్మ్యమును దెలిసికొనఁగోరి యాదేవదేవునిసన్నిధింజేరి చరణకమలములకుఁ బ్రణమిల్లి “ప్రభూ! నేను భవదీయంబగుమాహాత్మ్యమును వినవలయునని యభిలాషపడుచుంటిని. కావున దయతో నాకెఱింగింపవలయును.” అని ప్రార్థించుటయు మహేశ్వరుండు ప్రసన్నుండై యానందికేశ్వరునుద్దేశించి దేవీసాన్నిధ్యమునఁ దనమాహాత్మ్యము నభివర్ణించి చెప్పెను. ఆనందికేశ్వరునివలన దానిని నేను వినఁగలిగితిని. మునిశ్రేష్ఠా! పూర్వము భగవానుఁడగుమహేశ్వరుఁడు తనమాహాత్మ్యముంగూర్చి పార్వతి కిట్లుపదేశించెను. వరవర్ణినీ! ఎవ్వఁడు కైలాసగిరిసన్నిభంబగురమణీయమందిరమునందు మదీయంబగులింగమును, మత్సహచరగణములను బ్రతిష్ఠించునో యాతఁ డణిమాద్యష్టసిద్ధులను బడసి యంతమునందు మదావాసమును జేరఁగలఁడు. నన్నుద్దేశించి కర్షమాత్రసువర్ణప్రదానము చేసినవానికిఁ గైలాసశిఖరమునందు బాలార్కసదృశంబగుసువర్ణమందిరమున సుస్థిరావాసము సిద్ధించును. దేవీ! నన్నుఁగూర్చి సువర్ణదానముగాని, గోదానముగాని చేయువాని కక్షయఫలము సిద్ధించును. మదుద్దేశముగా వృషభదానమును, తిలమిశ్రితం బగునన్నదానమును గావించువాఁడు సర్వాభీష్టప్రదాయకమును, సిద్ధిప్రియమును నగుస్థానలాభము నందు-

గలఁడు. నాయనుగ్రహముచే నాతఁడు రత్నవృషభాదిలాభమునుగాంచి పాపవిముక్తుండగును. జపములచేతను, ఉపవాసాదివ్రతములచేతను, రుద్రసూక్తాదిజపములచేతను, పాయసాది వివిధోపహారనివేదనములచేతను, నృత్యగీతవాద్యాదులచేతను నిత్యము నన్నర్చించువాఁడు బ్రహ్మలోకప్రాప్తుండై బ్రహ్మసాక్షాత్కారముం గాంచి నారదాదిమహామునీంద్రులచేఁ బూజితుండగుచుండును. నాప్రీతికొఱ కగ్నిష్టోమాదియాగములఁ గావించువాఁడు దేవలోకంబుఁ జేరి మహేంద్రునియేకాసనమున దేవతలచేఁ బూజింపఁబడుచుండును. దేవీ! ప్రతిదినమును బ్రాతఃకాలమున నన్నర్చించువాఁ డద్వితీయసంపద్విభవుం డగును. మధ్యాహ్నసాయంకాలములయందు సన్నారాధించువాఁడు యక్షకులమున జన్మించి యతిబలవంతుండును, యక్షప్రభుఁడును గాఁగలఁడు. మదీయలింగప్రతిష్ఠాపనము చేసి ధూపదీపచందనాదులచే నిత్యమునర్చించువాఁ డింద్రాదిలోకపాలురకుఁ బ్రభుండగును. అతనికి మాయామోహము గలుగదు.

ఎవ్వఁడు మదీయంబగుమందిరమును సమ్మార్జనంబు గావించి, గోమయాదులచేవిలేపనాదిసంస్కారము లాచరించునోవాఁడు పూర్వోక్తభక్తగణంబులకంటె సహస్రగుణాధికుండగును. బంగారముచేతను, వెండిచేతను నాలింగమును బూజించువారు శివలోకమున గాణపత్యలాభముం గాంచఁగలరు. శివలింగమునకుఁ దైలాభ్యంగన మాచరించువారు వారికంటెను బంచశతగుణాధికులై యుందురు. తైలాభ్యంగముకంటె నభిషేచనఫలంబు ద్విగుణితంబు. అందు గంగోదకాభిషేచనమును, బంచగవ్యాభిషేకమును, గర్పూరదానమును ద్విసహస్రగుణాధికఫలదంబులు. క్షీరాభిషేకము వానికంటెఁ బంచశతగుణంబులును, మాల్యదానమంతకంటెఁ బంచశతగుణంబులును నధికమైయుండును. అర్ఘ్యాచారం

చువారు నాయనుగ్రహముచే శివలోకంబున గాణపత్యలాభముంగాంచఁ గలరు. మధురభాషిణీ! అగురుచందనప్రదానము పూర్వోక్తకర్మంబులకంటె శతసహస్రగుణాధికమైనది. గంధద్రవ్యదానము దానికంటె దశగుణములును, మాల్యప్రదానమంతకంటెను బంచశతగుణములును నధికంబగును. నిర్మాల్యగ్రహణము దత్సమానమైనది. ధూపంబును, కృష్ణాగురుచందనప్రదానమును గాంచినఁజతుస్సహస్రగుణాధికంబును, కృష్ణాగురు, చందన, ధూపదానం బంతకంటె ద్విగుణితంబును నగును. ఘృతసహితమగుధూపదానము చతుర్గుణాధికము. ఈసకలోపచారంబులచే నన్నుఁ బూజించువారిసహస్రాపరాధములను నేను క్షమింతును. ఒకసంవత్సరము నియమపూర్వకముగా మత్సన్నిధిని కృష్ణసారగుగ్గులుధూపంబు సేయువాఁడు సంకీశ్వరసమానుం డగును. దేవీ! మత్ప్రియంబుగా ఘృతప్రదానమును, గాయత్రీమంత్రపూర్వకముగా నైవేద్యసమర్పణమును గావించి బ్రాహ్మణులకు దక్షిణలొసఁగువాఁడు, దివ్యమూర్తిని, దివ్యజ్ఞానమును, మోక్షలాభమును బడయుటకు సమర్థుం డగును. ఆతనిచే నివేదింపఁబడినపదార్థములు నతిపవిత్రములుగా నెఱింగి పితృదేవతలు పరిగ్రహింతురు. తన్నివేదికములగుఘృతోదకాదు లిహపరములయందుఁ జిరకాలమువఱకును ఫలప్రదములై యుండును. శ్రద్ధతో నొకసంవత్సరము కమలబీజాన్నముం బోలికోమలప్రకృతియు, పాపవినాశకుఁడును నగుమహాదేవుని ఘృతాభిషేకరూపమున నారాధించువాఁ డెవ్వఁడైనను మృత్యుముఖమునం బడక గాణపత్యలాభముం గాంచగలఁడు. పూజాద్రవ్యములలోఁ బ్రధానంబగుదీపదానమును శివలింగసా[illegible]చువాఁడు రుద్రగణతుల్యప్రభావశాలి[illegible]హణపూర్వకముగా భూ[illegible] సంచ[illegible]ములయందలి యష్టమీచతుర్దశులయం

దు విధివిధానమున భక్తిపూర్వకముగా మహాదేవునకు ఛత్రదానముచే యువాఁ డింద్రతేజుఁడై మహాదేవసాయుజ్యము నందగలఁడు. దేవీ! నీకునునాకును భక్తుం డగువాఁడు నియమయుక్తుఁడైనను, నియమరహితుఁడైనను నాయనుగ్రహముచే నెట్టిఫలసిద్ధిం గాంచగలుగునో చెప్పెదను వినుము.

మద్భక్తుం డగువాఁడు స్వచ్ఛందనిరతుండై విహంగముంబోలి వ్యోమచారియై, యజితుండును, సర్వలోకపూజ్యుండును స్వర్గాధిభోగ సంపన్నుండును గాఁగలఁడు. మత్కథాశ్రవణమాత్రంబున నాయందు భక్తినిరతులగువారు మదనుగ్రహంబున గాణపత్యలాభముం గాంచఁగలరు. వారికి మదీయంబులగుపుణ్యస్థానంబుల సేవించినఫలము సిద్ధించును. అట్టివారికి మృత్యుభయంబులేదు. నిష్కాముఁడై త్రికరణ శుద్ధిగా భక్తితో నన్నుపాసించువాఁడు ప్రళయకాలమునందుఁగూడ జీవించియుండును. ప్రతిపదంబునను విఘ్నములం గాంచుచుఁ దమోగుణావేశముచే నున్మత్తుఁడై భక్తినిరతుండు గాఁజాలనివాఁడు నిత్యవ్యాధిగ్రస్తుండగును. సత్యసంధులును, జితేంద్రియులును, సమాధిసంపన్నులు నేకాగ్రచిత్తులునై సర్వదా నన్ను భావించువారికి శతకోటియుగముల కైనను నపాయము గలుగఁబోదు. అల్పధనశాలియగుటచే విధిపూర్వకముగా నన్నర్చింపఁజాలనివాఁడు కేవలమాత్రభక్తితో నన్నుపాసించినచో నేను వానికి సర్వాభీష్టములను బ్రసాదింతును. ఉత్తమగతిలాభమునకు మదర్చనాదికముకంటె నితరమార్గములేదు. ఇదిదేవతలకైనను నవేద్యమగుపరమరహస్యము. ఇంకను నతిగుహ్యం బగువిషయమును జెప్పెద నాకర్ణింపుము.

దేవీ! ఆత్మీయులగు నీవును, స్కందుండును బ్రతిమారూపమున నన్నర్చించినదానికంటె నితరులు లింగరూపమున నారాధించుట

మే నాకధికప్రియమని యెఱుంగుము. నేను దేవగణపూజితుండనై వారికి మోక్షదానము సేయుచుందును. ధూపదీపగంధమాల్యకాంజన రక్తవస్త్రాదులచే నన్నర్చించువారు గాణపత్యలాభముం గాంచఁగలరు. ఏకరాత్రోపవాసిమై నన్నారాధించువానికిఁ బుండరీకఫలమును, సకల యజ్ఞఫలమును లభించును. అతనికి స్వర్గమునందు విపులభోగానుభవము గలుగును. పవిత్రుఁడై నియమపూర్వకముగా భక్తితో నన్నభిషేకించువాఁడు భువనత్రయము నతిక్రమించి శివలోకము నధిగమింపఁ గలఁడు. సాంఖ్యయోగకుశలు లగువారుభక్తిపూర్వకముగా నన్నుపాసించి శివలోకావాసు లగుచుందురు. భిన్నభావులై యితరదేవతల నుపాసించువారు దారుణు లగుదురు. దేవీ! దేవతలైనను ధ్యానయోగ వ్యతీతమగుతపస్సుచే నన్నవలోకింపఁజాలరు. ధ్యానముచేతనే నాదర్శ నలాభము గలుగును. ఇతరదేవతల నారాధించుభక్తులకు నియమితఫలలాభంబగుచుండును. కానిమద్భక్తులపుణ్యఫలంబునకుమాత్రము పరిమాణము లేదు. ప్రళయకాలమునందు స్థావరజంగమాత్మకములగు సకలపదార్థములకును వినాశము గలదు; గాని నాభక్తులకుమాత్రమెన్నఁటికిని నాశములేదు. భక్తిపరతంత్రులై శ్రద్ధతో నెవ్వరేదేవతనుపాసించినను నేను వారి కామూర్తితోఁ బ్రసన్నుండ నగుచుందును. నన్ను సర్వమయునిగా భావించి సకలపదార్థములందును మత్స్వరూపమును దర్శించువాని కెన్నఁటికిని వినాశంబు గలుగదు. నేనును విమవకుండ నాతని ననుసరించి యుందును. మనోబుద్ధులను సత్యమునం దర్పించి భక్తితో నన్ను భావించువాఁడు మదనుగ్రహంబున సర్వపాపవిముక్తుండగును. సర్వవిధపాపాచారి యయ్యును సర్వదా నన్ను స్మరించువాఁడు శివలోకంబుఁ జేరి మత్సందర్శనలాభముం గాంచగలుగును. సకలకార్యారంభములయందును సర్వదా నన్ను ధ్యానించి స్మరించు

చుండువాఁడు ధర్మార్థకామమోక్షంబులు సర్వోత్కృష్టఫలభోగి యగును. షడంగన్యాసపూర్వకముగా నిత్యము నన్నర్చించువానికి మత్సాయుజ్యలాభము గలుగును. దుత్తూరపుష్పము, చంపకప్రసూనము, బిల్వపత్రము, మొదలగువానిని నాకు నివేదించినను, అలసభావము లేకుండ వానిచే భక్తిపూర్వకముగ నన్నర్చించినను గాణపత్యలాభము సిద్ధించును. ప్రశస్తములగు పద్మములచేతను, అర్కపుష్పములచేతను నన్నుఁ బూజించినను, సహస్రకరవీరపుష్పములు నాకు నివేదించినను బూర్వోక్తఫలప్రాప్తి యగును.

అర్కపుష్పములు వేయింటిచేఁ బూజించుటకంటె నొకకమలకుసుమమునఁ బూజించుట యధికఫలదాయకము. సహస్రకమలకుసుమములతో నొకబకపుష్పమును, కుందపుష్పమును సమానమైనవి. సహస్రకుందకుసుమములును నొకబకప్రసూనమును సమానము. సహస్రబకపుష్పములకంటె నొకయుత్పలము శ్రేష్ఠమైనది. సహస్రోత్పలములకంటెను నేకమాత్రబిల్వపత్త్రి మధికఫలదంబు. శివపూజకుఁ జంపకదుత్తూరకుసుమములు సమానములు. ఒక్కదినముమాత్రము భక్తిపూర్వకముగా నీసకలప్రసూనములచేతను, జందనాద్యుపచారములచేతను నన్నారాధించువానికి,సంవత్సరము ప్రతిదినమునొక్కొకపుష్పముతో నన్నుఁబూజించినఫలము లభించును. బకప్రసూనముతో నన్నుఁ బూజించువాని కేనుబదిరతులసువర్ణమును దానము చేసినఫలము లభించును. నిశ్చలభక్తిపూర్వకముగా నన్నారాధించువాఁడు నావలెనే త్రిశూలధారియు, వృషారూఢుండు నై మత్సాయుజ్యము నందిగగనభాగమున వాయువుంబోలి యెల్లయెడల విహరించుచుండును.

దేవీ! నానిర్మాల్యమును బాదములతో స్పృశించువాఁడు షష్టిసహస్రవర్షంబులు తిర్యగ్జాతులయందు జన్మించుచుండును. ముప్పది

మూఁడువేలమంది దేవదానవరాక్షసులు ధర్మకామార్థసిద్ధికై నిత్యమును నన్నుఁ బూజించుచుందురు. సకాముఁడైనను, నిష్కాముఁడైనను నెవ్వఁడు నిత్యము నీశివమాహాత్మ్యమును బఠించుచుండునో, వినుచుండునో యాతఁడు శివలోకమును జేరి మహాదేవునకుఁ బ్రియుండై యుండును.

—♦ పూజావిధానము. ♦—

దేవదేవుఁడగుశంకరుఁ డెట్లు సంతుష్టుఁడగునో, పుష్పాభావమున నాతని నెట్టివస్తుప్రదానమున నర్చింపవలయునో, ఏపువ్వులచేఁ బూజించిన నెట్టిఫలము గలుగునో, శాస్త్రసమ్మతము లగునేయేముద్రలచేఁ బుష్పదానము గావించిన మహత్ఫలం బగునో, శివపూజ యేవిధముగా నాచరింపవలయునో, ధూపదానోపవాసములవలన నెట్టిఫలము గలుగునో దయతో నెఱింగింపవలయు నని వ్యాసదేవుండు ప్రశ్నించుటయు సనత్కుమారుం డిట్లు చెప్పఁదొడంగెను. మునీంద్రా! పూర్వకాలమునం దొకప్పుడు భగవతి పార్వతీదేవి దేవగురుండును భూతనాథుండును, భగవానుండు నగుమహాదేవునుద్దేశించి ‘‘నాథా! ఏవిధముగా మిమ్మారాధించిన మీరు సంతుష్టులగుదురు? మానసికజపము, పూజ మొదలగునెట్టికర్మములచే జీవులకు ముక్తిలాభం బగును? ఈవిషయములను బరమానుగ్రహముతో నాకెఱింగింపుము” అని ప్రార్థించుటయు మహాదేవుండు మందహాసముసేయుచు సాధువాదపూర్వకంబుగా నిట్లనియెను. దేవీ! భక్తానుగ్రహార్థమై నీయడిగినప్రశ్నము సర్వోత్తమమైనది. పుష్పములు రక్తపీతాదివర్ణవిలసితములును, నిర్గంధ, సుగంధ, దుర్గంధ, నానాగంధకలితంబులును, సూక్ష్మకంటకాకులితంబులునై వివిధరీతుల నలరారుచుండును. వీనిలో నేపుష్పములచే నేదేవతలు

బూజింపవలయునో చెప్పెదను. సుగంధశుక్లపుష్పములచే దేవతలను, దుర్గంధకుసుమములచే దానవులను, కఠినక్షుద్రకంటకప్రసవంబులచే రాక్షసులను, అకాలప్రసవములగువనప్రసూనములచేఁ బితృదేవతలను బూజింపవలయును.

అని చెప్పుటయుఁ బార్వతీదేవి ‹‹హృదయేశ్వరా! వివిధకుసుమములచే మిమ్ముఁ బూజించుటవలనను, మీగృహసమ్మార్జనవిలేపనములవలనను, ధూపదీపాదిదానములవలనను, అభ్యంగాభిషేచనములవలనను, నృత్యగీతవాద్యాద్యుపచారములవలనను భక్తుల కెట్టిపుణ్యఫలము లభించునో యానతీయవలయును" అని ప్రార్థించుటయు శంకరుం డిట్లనియెను. దేవీ! సకలద్రవ్యములయందును, సమస్తవస్తువులయందును బహుమూల్యమైనదగుటచే సువర్ణము సర్వశ్రేష్ఠమైనది. కావున భక్తవరుం డగువాఁడు సువర్ణముచే నన్నుఁ బూజించినచో నాతఁడు నాయనుగ్రహమున శివలోకపూజితుండై దశసహస్రవర్షము లప్సరోగణసహితముగా శివలోకమున విహరించుచు భోగావసానసమయమున మరల భూలోకమునం దవతరించును. ఎనుబదికర్షములప్రమాణమైనను, ఏకాదశమాషప్రమాణమైనను గలకాంచనమును భక్తిపూర్వకముగా నాకర్పించువాని కపారపుణ్యఫలము సిద్ధించును. ఒక్కొక్కపుష్పముగూడ సువర్ణమువలెనే ఫలప్రదమైనది. నాకతిప్రియములగు ద్రోణపుష్పమును, కుందకుసుమమును, బిల్వపత్త్రమును సువర్ణసమంబులు. జపాకుసుమమును, నాగపుష్పమును సువర్ణముకంటె ద్విగుణఫలదంబులు. జాతీమల్లికాచంపకపుష్పములు బహుసువర్ణసమానములు. ఘృతాభావమైనప్పుడు భక్తిపూర్వకముగాఁ దైలదీపముచే నన్నారాధించువాఁడు శతకోటివత్సరములు శివలోకమునఁ బూజితుండై దీపదానప్రభావముచే నందుఁ జంద్రునివలె విరాజిల్లుచుండును. మద్గృహసమ్మా

ర్జనము దీపదానముకంటె శతగుణాధికఫలదంబు ; గృహవిలేపనము సహస్రగుణాధికఫలదం బగును. ధూపదీపపుష్పోపహారాదులచే నన్నుఁ బూజించుట యంతకంటెను శతగుణాధికఫలదంబు. శతసహస్రమాలికాదానముకంటె జపము శతగుణాధికం బగుచున్నది. భక్తప్రదత్తములగు నగురుచందనాదిసుగంధధూపము లేకవింశతిసువర్ణసదృశంబులు. భక్తులు ఘృతచందనాదులచే శివలింగాభ్యంగనంబును, క్షీరంబులచే నభిషేచనంబును, ఘృతసహితముగా ధూపసేవనంబును గావింపవలయును. దేవమానవు లీవిధి ననుసరించియే నన్నర్చింపవలయును. పితృగంధర్వయక్షపన్నగరాక్షసాదులకుఁగూడ నిదియే పూజావిధానంబు.

పార్వతీ! ఈసకలవిషయములును లోకహితార్థమై నీయెదుటఁ బ్రశంసించితిని. యథావిధిగ నన్నారాధించువాఁడు యథాకాలంబున నందిపదలాభము నందఁగలఁడు. కాలాంతరమునందాతఁడు కేవలవృషధ్వజుం డగుప్రమదనాథుండు గాఁగలఁడు. వ్యాసమునీంద్రా! భగవానుం డగుమహాదేవుండు లోకహితసాధనంబునకై యుపదేశించిన యీపుష్పదానవిధానంబు యథారూపమున నీకు వినిపించితిని. దీనిని భక్తితోఁ బ్రతిదినమును బఠించువాఁడును, వినువాఁడును, ప్రతిపర్వమునను భక్తులకు వినిపించువాఁడును పాపవిముక్తులై శివలోకమున సుస్థిరులై యుండఁగలరు.

—♦ ఉపవాసవిధి. ♦—

వెండియు సనత్కుమారుం డిట్లనియెను. పరాశరనందనా! ఒకప్పుడు దేవగంధర్వమునిగణంబులు పరమగుహ్యంబును బురాతనంబు నగునుపవాసవిధింగూర్చి సంక్షేపముగ నాకర్ణించి యంతమాత్రంబునఁ దనివినందఁజాలక భగవానుండును, త్రిలోచనుండును, త్రిపురశాసకుం

మును నగుమహాదేవునివలన విస్పష్టముగఁ దెలిసికొనవలయు ననుకుతూహలములో సిద్ధగంధర్వగణపరివృతులై హిమాలయంబునకుం జని యమ్మహాదేవు నిట్లు వినుతింపనారంభించిరి. మహాదేవా! నీవింద్రాగ్నియమస్వరూపుఁడవు. సనాతనుఁడవు. ధర్మార్థకామములును, మనీషివర్యులమానసస్సంకల్పమును నీస్వరూపంబులు. తుష్టియు, స్థైర్యంబును, మేధయు, శ్రద్ధయు, కామంబును, మానంబును నీవే. నీప్రసాదంబుచే నీభక్తులు దుఃఖప్రదంబగుభీషణనరకమునుండి యుత్తీర్ణు లగుచుందురు. నీభక్తగణంబులు విహరించుచోట వారితేజముచే సూర్యచంద్రులు హీనప్రభులగుచుందురు. మనీషిగణంబులు దేవపితృకార్యంబులయందు భవదీయమంత్రము నీవిధముగానుచ్చరించుచుందురు. సురశ్రేష్ఠా! శ్రద్ధతో నియమవంతుఁడై నీమాహాత్మ్యమును బఠించువాఁడును, బత్త్రంబున లిఖించి ధరించువాఁడును విగతకిల్బిషుం డగును. జగన్నాథా! నీవు సర్వభూతేశ్వరుఁడవు. సర్వవ్యాపివి, పంచముఖుండవునగునీకు నమస్కారములు. దేవా! నీవవ్యయుఁడవు. అప్రమేయుఁడవు. పురుషోత్తముఁడవు. పంచభూతములును నీస్వరూపములు. దేవాదిదేవా! నీకు నమస్కారము.

అని వినుతించుటయు భగవానుం డగుమహాదేవుండు ప్రసన్నుండై యిట్లనియెను. సురవరులారా! మత్పూజావిషయంబున జాతీయూథికామల్లికాపుష్పములు పంచసువర్ణములకును, రక్తోత్పలాదిపుష్పములు సప్తసువర్ణములకును, బిల్వపత్త్రంబును, అశోకపుష్పమును, దశసువర్ణంబులకును, సకేసరంబు లగునాగపుష్పము లేకాదశసువర్ణములకును, స్థలపద్మము ద్వాదశసువర్ణములకును, సురభిళంబు లగుకాంచనవర్ణపుష్పములు త్రయోదశసువర్ణములకును, పద్మకుసుమము ద్వాత్రింశత్సువర్ణములకును, కుశపుష్ప మష్టాశీతిసహస్రసువర్ణములకును, అర్కపు

ష్పము త్రిసహస్రసువర్ణములకును, బకపుష్ప మశీతిసువర్ణములకును, దుత్తూరపుష్పము శతసహస్రసువర్ణములకును సమానంబు లని చెప్పంబడియెను. అర్క, కరవీర, కుశ, దుత్తూరపుష్పములచే భక్తియుక్తుఁడై నన్నుఁ బూజించువాఁడు గాణపత్యలాభముం గాంచును. ఈసకలపుష్పసుగంధములను నే నతిప్రియంబుగ నాఘ్రాణించుచుందును. కృష్ణాష్టమియందును, చతుర్దశియందు నపరాహ్ణకాలంబున మన్నామోచ్చారణము సేయుచు నీసకలపుష్పములచేతను నన్నుఁ బూజించువాఁడు నాలోకంబున నెల్లవారిచేతను బూజితుండై సకలలోకవిహారలాభంబు గాంచి నేను పూజింపఁబడుస్థానములందెల్ల లెన్నగాఁ బూజింపఁబడుచుండును. ఏకాగ్రచిత్తంబున నన్నారాధించువాఁడు నరకాదుల నుత్తరించి శివపదలాభంబు గాంచఁగలఁడు. దేవత లాతనికి విఘ్నములఁ గూర్పఁజాలరు. ఆతఁడు మదనుగ్రహంబున నిహపరలోకసుఖసంపన్నుం డగును. ఆతనికిఁ దపోయోగవ్రతానుష్ఠానములతో నిమిత్తము లేదు. క్లేశసాధ్యములగు తపోనియమాదియాతనలచే నాతఁడు కృశింపనక్కఱలేదు. సర్వయోగేశ్వరుండ నగునన్నుపాసింపక కేవలబ్రహ్మవాదు లగువారు మిథ్యాశబ్దపాశంబులచే బంధితులును, వంచితులునై పోవుదురు.

మఱియు ధారోష్ణంబు లగుక్షీరంబులచే మదీయంబగులింగము నభిషేకించి, పూజించి యభిమతానుసారముగా నివేదన మాచరించువాఁడు శతసహస్రకోటివర్షములు హిమాలయమునందుఁ బూజితుఁడై యుండును. శివమంత్రదీక్షితుఁ డగుభక్తుఁ డొక్కకృష్ణాష్టమీదినమున నేస్థలమునందైనను, ఏవిధానముచే నైనను నన్ను భక్తితోఁ బూజించి ధారోష్ణంబు లగుక్షీరములచే మదీయం బగుశివలింగము నభిషేకించిన వో నాతఁడు నాకతిప్రియుండై నాలోకమున మత్సన్నిధాన

మునఁ గోటియుగంబులవఱకును నివసించియుండును. సరళదేవదారు ధూపములచే నన్నర్చించువాఁడు నూటయేఁబదిరెండు కనకకుసుమములచే నన్నుఁ బూజించిన పుణ్యముం గాంచి షష్టిసహస్రవర్షములు శివలోకమున నానందభోగము లనుభవించుచుండును. నాపూజాసమయమున సఘృతంబు లగు గురుగుగ్గులముల దహనంబు సేయువాఁడు కోటిసహస్రయుగములవఱకును శివలోకమునఁ బూజితుం డగును. అంధకారవినాశనమునకై యొకసంవత్సరము యథాకాలమున నన్నుద్దేశించి దీపదానము చేయువానిహృదయాంతరమునందు భక్తిప్రియుం డగుశంకరుఁడు, నిరంతరమును సుస్థిరుండై యుండును. ఉపవాసియై యెవ్వఁడు శివలింగసన్నిధిం జేరి కృతాంజలిపుటుఁడై ‘‘దేవదేవా! అంగుష్ఠమధ్యమునందు సులక్షణమగుయవరేఖచే విలసిల్లునీకు నమస్కారము. సర్వభూతనమస్కృతుండ వగునీవు సర్వజీవశరణ్యుండవు. మహామతీ! నీకు వందనములు. అక్షయములైన యష్టైశ్వర్యములను నాకుఁ బ్రసాదింపుము.” అని ప్రార్థించునో యాతనికి మహత్తరం బగుశ్రేయము లభింపఁగలదు.

అనుటయు మహాదేవి యగుపార్వతి యిట్లనియెను. త్రిలోకనాథా! నిఖిలలోకారాధ్యా! నీవు నిఖిలజీవహితకరంబు లగువిషయములను బోధించుటకు సమర్థుఁడవు. దేవా! మానవు లేవిధముగా నేకాలమున నుపవాసవ్రతం బాచరించిన నెట్టిఫలంబును గాంతురో సవిస్తరముగా నుపదేశింపవలయును. అనిప్రార్థించుటయు మహాదేవుం డిట్లు చెప్పందొడంగెను. ప్రియా! పూర్వము నైమిశారణ్యవాసు లగువాలఖిల్యాదిమునిగణంబులకును, ఫణికులును, దరిద్రులును, దుఃఖజీవులు నగువారికిని నాచేఁ జెప్పంబడిన యోగమార్గానుసారం బగుదివ్యోపవాసఫలవిధానము నిప్పుడు సవిస్తరముగా నీకు బోధించెదను. సావధా

నచిత్తముతో నాకర్ణింపుము.

మద్భక్తుం డగువాఁడు పంచమి, షష్ఠి, పూర్ణిమాతిథులయం దుపవాసము చేసిన వోఁ బ్రియదర్శనుండును, మహాజ్ఞానియుఁ, బరమభాగ్యసంపన్నుండు నై యుండును. కృష్ణాష్టమీకృష్ణచతుర్దశులయందు మత్ప్రియంబుగా నుపవసించువాఁడు బహుధనాఢ్యుఁడును, బహుపుత్త్రవంతుఁడును, విద్వాంసుఁడును గాఁగలఁడు. శుక్లాష్టమీచతుర్దశులయందుపవసించువారు జ్ఞానులును బరమసుందరులు నగుదురు. నవమినాఁడేకాహారియై శివపూజ గావించువాఁడు కృషిజీవియై బహుధనపుత్త్రలాభముం గాంచఁగలుగును. ద్వాదశినాఁ డిట్లు గావించిన వో ధనవంతుఁడును విద్వాంసుఁడు నగును. ఒకసంవత్సర మమావాస్యాంతర మగుత్రిరాత్రోపవాసంబు గావించుచు శివపూజ నాచరించువాఁడు శతసహస్రవర్షంబులు స్వర్గలోకపూజితుండై యుండును. ఇట్లే యొక సంవత్సరము ప్రతిమాసమునందును త్రిరాత్రోపవాసవ్రతం బాచరించువాని కాకాశపథంబున నప్సరోగణసహితముగా విమానవిహారభాగ్యంబు లభింపఁగలదు. అతఁడు కాలాంతమునం దొకప్పుడు స్వర్గచ్యుతుం డయ్యును సత్కులప్రసూతుండు గాఁజాలును. నియమోపవాసియు, నేకాహారియునై కార్తికమాసంబున దీపప్రదానము సేయుచు, మార్గశీర్షమాసంబున నితరాహారములఁ బరిత్యజించి కేవలజలపానమాత్రంబునఁ గాలక్షేపము సేయుచు, మరల పౌషమాసమునం దేకాహారియై యామాసాంతమున విశుద్ధబ్రాహ్మణసమారాధనంబు గావించి దక్షిణలతో వారికిఁ దృప్తింగూర్చువాఁడు మరణానంతరంబున హంససారసమన్విత మగువిమానము నధిరోహించి దేవగణపూజితుం డగుచు మహాత్ములగువారు నివసించు దివ్యలోకంబులయందు విహరించుచుండును. అతఁ డాలోకంబులయందు లక్షవర్షంబులవఱకును సుఖభోగం

బులనుభవించుచునుండి మరల భూలోకమునందు శ్రేష్ఠకులంబునం దవతరించి పూర్వజ్ఞానసంపన్నుండై సర్వదా ధర్మాచరణంబు సేయుచు నెన్నఁటికిని దుర్దశాపన్నుండుగాక మఱిప్రియుండై యుండును.

మాఘమాసంబునఁ ద్రిరాత్రోపవాసమాచరించి యుపవాసాంతమున శివపూజచేసి వివిధాన్నపానాదులచే బ్రాహ్మణులను సంతుష్టులం గావించి యథాశక్తిని దక్షిణల నర్పించువానికి బ్రహ్మజ్ఞానమును షష్టిసహస్రవర్షములు శివసాక్షాత్కారలాభమును, గామరూపంబును, గామగమనమును, వైశ్వానరతేజోమయంబగుదివ్యలోకంబునఁ జిరనివాసంబును, సిద్ధించును. అనంతర మాతఁడు సకలజనమాననీయం బగు బ్రాహ్మణకులమునం దవతరించి సార్వభౌమపూజితుండగును. మఱియు నేకాహారనియమములతో ఫాల్గుణమాసమును గడపుచు మాసాంతమున శివపూజనంబు సేసి యథాశక్తి దక్షిణలతో బ్రాహ్మణసమారాధనము గావించువాఁడు శతయోజనవిస్తీర్ణంబును, అగ్నిసదృశతేజోమయంబు నగువిమానము నధిరోహించి బ్రహ్మలోకమునఁ దేజోమూర్తియైవిహరించుచుఁ జిరకాలముండి పిమ్మట వేదవిదుండును, విజ్ఞానసంపన్నుఁడును, ధర్మజ్ఞుఁడును, వినీతుఁడును, పరమయాజ్ఞికుఁడును, అనుకూలదారుఁడు నగుబ్రాహ్మణుఁడై యవతరించును.

దేవీ! ఈవిధముగాఁ జైత్రమాసము నతిక్రాంతముగాఁ జేయుచు మాసాంతమున నన్నారాధించి యథావిధిగ సద్బ్రాహ్మణుల నన్నపానాదిసంతృప్తులం గావించి యోపినకొలఁది దక్షిణల నొసఁగువాఁడు త్రింశత్సహస్రవర్షములు స్వర్గలోకమునఁ బూజితుఁడై యుండి మరల భూలోకమున గోసహస్రదాతయై జన్మించును. ప్రియా! మద్భక్తుం డగువాఁడు జ్యేష్ఠమాసంబున నేకాహారుండై పూర్వోక్తప్రకారముగ నాచరించి తత్ఫలంబును బడయఁగలఁడు. ఈమాసమునం

దొక్కదినమైన భక్తితో నేకభుక్తంబు సేయువాఁడు మహాపాతకవిముక్తుండు గాఁగలఁడు. మాసాంతంబువఱకును యథానియమముతో నుండువానికిఁ బునర్జన్మమే లేదు. ఈశ్వరప్రభావముంగూర్చియు, వర్షవ్యాప్తమగునుపవాసవిధానముంగూర్చియు సంక్షేపముగ నెఱింగించితిని. సర్వాభీష్టసాధకమును, అక్షయము నగునీయుపవాసవిధానమును భక్తితో నాకర్ణించువారు పితృలోకమున నిజపితృగణంబులతో సుఖముగఁ గాలయాపనము సేయఁగలుగుదురు. దీనిని బఠించి బ్రాహ్మణునకు గోదానంబు సేయువారు సూర్యసమతేజంబును, నిర్మలంబును, దేవకాంతాగణసమన్వితంబు నగువిమానము నధిరోహించి దశసహస్రవర్షపర్యంతము స్వర్గలోకమున సుఖవిహారంబు సేయుచు ననంతరము ప్రసిద్ధమానవకులంబున నుదయించి సర్వదుఃఖరహితులై సకలబంధవిముక్తులై శతవర్షములు రాజత్వలాభముం గాంచఁగలరు. దేవీ! ఇంతకంటెను బరమగుహ్యంబగువిషయమును దెల్పెదను. పూర్వోక్తవిధానంబున నన్నారాధించువాఁ డేకవింశతికల్పంబులవఱకును బునర్జన్మంబు నందఁడు. పిమ్మట నాతఁడు రాజధర్మము నాశ్రయించియు ధర్మపరిత్యక్తుండు గానేరఁడు. ఆషాఢమాసమున సప్తమి, అష్టమితిథులయందొక్కసారిమాత్రము ఫలభక్షణమాచరించి మదీయం బగుదక్షిణామూర్తినుపాసించువాఁ డనంతపుణ్యఫలసిద్ధుం డగును.

శ్రావణమాసమంతయు నేకాహారియై కడపుచు మాసాంతమున శివారాధనమాచరించి వివిధాన్నపానాదులచే బ్రాహ్మణులను సంతుష్టులుగఁజేసి శక్తికొలఁది దక్షిణలనర్పించువాఁడు హంససారససహితంబగువిమానము నారోహించి నానాస్థానంబుల విహరించుచు నయుతవర్షములు చంద్రలోకమునఁ బూజితుఁడై సుఖముగ నివసించియుండును. ఆతనియెడలఁ బితృగణంబులు ద్విసహస్రవర్షంబులవఱకును సంతు

ష్టులై యుందురు. అనంతరమవాఁడు భూలోకమున దేవగంధర్వపూజితుఁడును, పుత్త్రపౌత్త్రసంపన్నుండు నగుబ్రాహ్మణుఁడై పుట్టి పరమబ్రహ్మవిదుం డగును. ఈరీతినే భాద్రపదమాసమునం దాచరించువాఁడు లక్షవర్షములు వాయులోకమునఁ బూజితుఁడై పిమ్మట భూలోకమునం దుత్తమకులంబున జన్మించి సర్వభూతశాసనసమర్థుఁడై సవిశేషంబుగ వేదాధ్యయనతత్పరుం డగును. మఱియు నిట్లే యాశ్వినమాసంబునఁ గావించువాఁడు శివస్థానుస్థింబగురాజసూయయజ్ఞమునకుఁ ద్రిగుణితమగు ఫలలాభము నంది షష్టిసహస్రవర్షములు సూర్యలోకమునఁ బూజితుఁడై యుండి యనంతరము మేధావియు, బలిష్ఠుఁడును, ధనవంతుఁడునై యుత్తమకులంబున జన్మించి సర్వజనసన్మానితుం డగును.

నిరంతరశివారాధనతత్పరులై యేకదినాంతరోపవాసంబులు సేయువారును, పక్షోపవాసులై పక్షాంతంబునను, మాసోపవాసులై మాసాంతంబునను భుజించువారును, కేవలశాకభక్షణంబుచేఁ గాని, జలపానంబుచేఁగాని, దినములఁ గడపువారును, సర్వదా జలశయనులై యుండువారును, ఫలమూలమాత్రభక్షణముచే బ్రహ్మచర్యవ్రతాచరణము గావించువారును, సంవత్సరమున షష్ఠభాగంబుగాక తక్కినదివసంబు లన్నియునుపవాసంబులతోఁ గడపువార నగుమర్త్యస్త్రీలు సహస్రాశ్వమేధవాజపేయఫలప్రాప్తులు గాఁగలరు. అహింసాపరాయణులై ప్రాతస్సాయంకాలములయందుమాత్రము భుజించి తన్మధ్యంబున జలపానంబునైనఁ గావింపక నియమముతో నుండువారు పౌండరీకయజ్ఞఫలసిద్ధు లగుదురు. హింసారహితుఁడై నాలుగుమాసములు గందమూలఫలాశనుఁడై యరణ్యమున నియమముతో సంచరించువాఁ డయుతవర్షములు స్వర్గలోకమునఁ బూజితుఁడై యుండి పిమ్మట నుత్తమకులంబున జనియించి యనామయదీర్ఘాయుష్కుం డగును. ద్వాదశ

వత్సపర్యంతము నహింసావ్రతనియమముచే నేకాహారియై యుండువాఁడు, నిశ్చయముగా సకలయజ్ఞఫలసిద్ధుం డగును. ఆపుణ్యమూర్తి చిరకాలంబువఱకును దివ్యవిమానారూఢుండై పుణ్యలోకంబులయందు విహరించుచు నిహలోకమునఁ బరమసుఖసంపన్నుండగును, బరలోకమునఁ బూజ్యుండునై యుండును. కాలక్రమంబున నాతఁడు పుణ్యలోకచ్యుతుండై యుత్తమకులంబున మహారాజై జన్మించి నీరోగదీర్ఘాయుష్కుండై మరల సత్కార్యాచరణంబున సకలయజ్ఞఫలసిద్ధిం గాంచి పుష్పకవిమానారోహణంబున దేవలోకవిహారంబు గావించుచు సుందరీసహస్రశోభితమగు రమణీయప్రదేశములందు సవిలాసముగఁ గ్రీడించుచు రమణీమణులమనోహరనూపురకాంచీకలనినాదములచే నిద్రించి శ్రావ్యంబులగు వేణువీణామృదంగాదివాద్యస్వనంబులచే మేల్కాంచుచు నిజాచరితతపంబున కనురూపంబు లగుసుఖభోగముల ననుభవించుచుండును.

రాగద్వేషవిరహితుండై ‘‘నమఃశివాయ’’ అనుపంచాక్షరీమంత్రమును దివంబునఁ బంచశతపర్యాయములును, రాత్రి సహస్రవారంబులును జపించువాఁడు వజ్రప్రవాళమణిమండితమగువిమానము నధిరోహించి చిరకాలమువఱకును స్వర్గంబున విహరించుచుఁ గాలక్రమంబున మహత్కులమునందు బలవంతుఁడును సుందరుఁడునై జన్మించి సర్వైశ్వర్యసంపన్నుం డగును. దేవబ్రాహ్మణప్రీతికరముగా దీపదానముం గావించువారు తత్ప్రభావంబున నక్షయసద్గతిలాభంబు నందుదురు. శ్రద్ధాయుక్తుండై బ్రాహ్మణులకుఁ బానీయప్రదానముం గావించువానికిఁ బుణ్యనదీమధ్యస్నానంబు లభించును. బ్రాహ్మణులకుఁ గర్పూరదానముసేయువారికి వివిధహర్మ్యశోభితంబగుగృహలాభంబు గలుగును. గోదానంబు సేయువాఁడు ధేనుగాత్రమునం దెన్నిరోమములు

లుండునో యన్ని వేలవత్సరములు స్వర్గలోకమునఁ బూజితుఁడై యుండి పిమ్మట సత్స్వభావసంపన్నుఁడును, విద్వాంసుఁడును, బరమసుందరుఁడు నై జన్మించును. నూతనవస్త్రదానముచేయువాఁ డక్షయఫలభాగియై నవసహస్రవర్షములు స్వర్గమునందు సుఖభోగము లనుభవించి పిమ్మట నుత్తమకులంబున జన్మించును. విశేషించి వేదోక్తవిధానంబున బ్రాహ్మణునకుఁ గన్యాదానంబు సేయువాఁడు దేవపూజితుండై స్వర్గలోకంబున బహువర్షంబులుండి పిమ్మట శ్రేష్ఠవంశంబున జన్మించును. శయ్యాదానము చేయువానికి షష్టిసహస్రవర్షములు స్వర్గావాసము లభించును.

వ్యాసమునీంద్రా! నీయెడలఁ బ్రేమవశంబున దానవిధానమును, సనాతనంబును, బవిత్రంబు నగునుపవాసవిధానమును నీకెఱింగించితిని. ప్రతిపర్వమునను దీనిని బఠించువాఁ డీపుణ్యకార్యంబుల నాచరించినఫలంబు నందఁగలఁడు. అసదాచరణంబువలనం గలుగుపాపం బాతని నెంతమాత్రము నంటఁబోదు. అతినియమముతో దీని నాకర్ణించువాఁ డనామయుఁడై దుఃఖపాపభయవిముక్తుఁడై పరమధర్మాత్ముం డగును. శ్రద్ధతో దీని నాకర్ణించువారు సత్యవాదులును, హింసాద్వేషరహితులు నగుమహాత్ములంబోలి యనంతధర్మలభ్యంబగు స్వర్గలాభంబు నంది దేవలోకపూజితులై యుందురు. నిత్యంబును బ్రభాతసమయమునందు మేల్కాంచి శ్రద్ధతో దీనిని బఠించువారికి సకలాభీష్టసిద్ధి యగును. అట్టివాని కెట్టికష్టములును దటస్థింపఁబోవు.

నామోష్టమీవ్రతవిధానము.

“త్రిభువనేశ్వరా! త్రినయనా! దేవదేవా! నీవు సంగ్రామమునందుఁ ద్రిపురవినాశము గావించితివి. రాక్షసులు నీయనుచరులు.

త్రిశూలపాణీ! రిపుంజయా! గంగాధరా! ప్రమథనాథా! దేవా! నీలకంఠా! నీవష్టవసువులకు నధీశ్వరుండవు. భూతగణపరివేష్టితుండవు. వ్యాఘ్రచర్మపరిధానుండవు. దేవాదిదేవా! భక్తవత్సలా! కపర్దీ! నీ వెట్టి యారాధనాదులచే భక్తులకుఁ బ్రసన్నుండ వగుదువు? తద్విధాన మెట్టిది? శాశ్వతఫలదాయక మగువ్రతమేది? నిన్నుపాసించుట యెట్లు? ఏనియమములచే నెట్టిపుష్పఫలాదులచే నేతిథియందు నిన్నుఁ బూజింప వలయును? ప్రసన్నుండవై యెఱింగింపుము." అని భగవతి పార్వతీదేవి ప్రశ్నించుటయు మహాదేవుఁడు చెప్పందొడంగెను.

చారునయనా! మద్భక్తుం డగువాఁడు చతుర్దశియందును, అష్టమియందును నుపవాస మాచరించి సకలోపచారములచే నన్నారాధింపవలయును. జితేంద్రియుఁడును, నిర్మలాంతఃకరణుండునునై మద్భక్తుం డష్టమీదినంబున గోక్షీరములచే మదీయం బగులింగాభిషేకం బాచరించి, ప్రతిష్ఠావిధానముచే మత్సాన్నిధ్యంబు గల్పించుకొని గంధమాల్యాదులచే నన్నర్చించి మచ్చింతాపరత్వంబున జపము సేయుచు సిద్ధమంత్రసాధనముం గావించి విధిపూర్వకముగా శాకమూలఫలాదులయ గ్రంబులఁ దునియించి నాకు నివేదింపవలయును. అనంతరము సాధకుఁడు నాసన్నిధిని విసమ్రుండై మోకరించి పరమభక్తిపూర్వకముగా నాచతుర్విధమూర్తులను మంత్రజపంబుచే నన్నుఁ బ్రసన్నుం గావించుకొనవలయును. ఈసకలకార్యములును శ్రద్ధతోఁ గావించినప్పుడే భక్తిప్రకాశము గాఁగలదు. అశ్రద్ధతో నివేదించిన ఖండ, ఖాద్యాది చిత్రపదార్థములును, దివ్యాన్నములును మత్పరిగ్రహయోగ్యంబులు గానేరవు. అట్లు గావించువానియెడల నేనెప్పటికిని బ్రసన్నుఁడను గాఁజాలను.

ఓవిశాలలోచనా! ‘‘వ్యాఘ్రముంబోలి యుచ్చగిత్రా, సింహ

రథారూఢుఁడై విహరించు కమలదళలోచనుఁ డగురుద్రునిఁ బ్రణవమూలంబున నావాహనము చేయుచున్నాను. ఆదేవుం డనుచరులగు సకలదేవగణంబులతోఁ బరమేశ్వరీసహితముగా నిటకు విచ్చేయుఁగాక!" అనుమంత్రంబుచే నన్నావాహనము చేసి "భగవతే మహాదేవాయ పార్శ్వగితాయ అనుచరాయస్వాహా!" అనుమంత్రముతో సూతక్రమలకఫలరసంబుల శివలింగాభిషేచనంబు గావింపవలయును. అనంతరము "ప్రదక్షిణం పరావర్తే సర్వమేవ ఉమాయుతే స్వాహా!" అనుమంత్రమును జపించుచుఁ బ్రదక్షిణము చేయవలయును. పిమ్మట "ప్రభూ! ఈజలము శాంతమైనది. శాంతతమమైనది. అమృతమయమైనది. అమృతతమమైనది. అతిపవిత్రమైనది. బ్రహ్మపవిత్రమైనది. సూర్యకిరణములచేఁ బవిత్రమైనది. దీనిని బరిగ్రహింపుము." అనుమంత్రముతోఁ బానీయమును, "ఆఘ్రేయః సర్వదేవానాం గంధోయం ప్రతిగృహ్యతామ్" ఇత్యాదిమంత్రముతో గంధప్రదానమును గావింపవలయును. "ఓప్రభూ! వేదమంత్రములచేతను, సూర్యకిరణములచేతను బవిత్రమైనయీపుష్పమును భక్తిపూర్వకముగా నర్పించుచున్నాను. దీనిని బరిగ్రహింపుము. నీకు నమస్కారము." అనిచెప్పుచుఁ బుష్పము నర్పింపవలయును. "ఓప్రజాపతీ! భక్తవత్సలా! నీకు నమస్కారము. నీవీధూపమును గ్రహింపుము." అని పలుకుచు ధూపమర్పింపవలయును. మఱియు "ఆపోజ్యోతిశ్చ" అనుమంత్రమును బఠించుచు "శివలింగస్వరూపా! ఈదీపమును గ్రహింపుము. నీకు నమస్కారము." అని దీపప్రదానము గావించి యనంతరము దేవతామనోహరం బగునుత్తమగంధనివేదనము చేసి "పూతో బ్రహ్మపవిత్రేణపూతః సూర్యస్యరశ్మిభిః ఆహారః సర్వదేవానాం నైవేద్యః ప్రతిగృహ్యతాంస్వాహా" అనుమంత్రముతో నైవేద్యము నర్పింపవలయును.

అనంతరం మహాదేవదేవు నుద్దేశించి ‘‘ప్రభూ! నేను యథాశక్తితో గంధపుష్పోపహారాదిప్రదానములచే నిన్నుఁ బూజించితిని. నీవు ప్రసన్నుండవై యీభక్తునియెడల దయాళుండవు గమ్ము.’’ అని ప్రార్థింపవలయును.

ఓ వరారోహా! ఇఁకఁ జతుర్దశీవ్రతవిధానంబు దెలిపెద నాకర్ణింపుము. భక్తుఁ డగువాఁడు చతుర్దశీదినమున రక్తచందనాదులచేతను, హరితాళాదివిలేపనద్రవ్యములచేతను మత్ప్రతిమామూర్తి కంగరాగము గావించి, కరవీరాదిసుగంధపుష్పములచే నర్చించి కదంబకింశుకాశోకాదిప్రసూనములను, నితరంబులగుపత్త్రఫలంబులను దూర్వలను నాకర్పించి నైవేద్యదానము గావింపవలయును. నైవేద్యప్రదానమునకశక్తుం డగువాఁడు జలమూలంబునఁ దత్కార్యము నిర్వహింపవలయును. మఱియు సఘృతం బగుగుగ్గులమును ధూపమంత్రము నుచ్చరించుచు మత్సన్నిధిని దహింపవలయును. అనంతరమున ‘‘భక్తప్రియా! లోకనాథా! మహాదేవా! విష్ణూ! హరిహరేశ్వరా! శ్రీవత్సలాంఛనా! పినాకపాణీ! శంఖచక్రగదాధరా! గంగాధరా! పార్వతీనాథా! జంబూద్వీపనాథా! త్రిభువనేశ్వరా! నీకు నమస్కారము. ప్రభుండగు భగవానుఁడును భగవతియగుపార్వతియు నాకుఁ బ్రసన్నులయ్యెదరుగాక!’’ అనునీస్తోత్రమును ప్రాతస్సాయంకాలపూజానంతరమునఁ బ్రతిదినమును బఠించువాఁడు ప్రతిదినమును గావించుపాపములనుండి విముక్తుం డగును. దేవీ! ఈపవిత్రస్తోత్రమును రజస్వలలగుస్త్రీలయొద్దఁ బఠింపఁగూడదు. దీని నాకర్ణించినపురుషుఁడు కురూపుఁడైనను సుందరుం డగును; మృతాపత్యయగుయువతి దీర్ఘాయుష్మంతులగు పుత్త్రులు గలది యగును. గృహమందైనను, విదేశమందైనను, మఱియెచ్చటనైనను భక్తిపూర్వకముగా నీస్తోత్రమును బఠించువానియెడల నేను సంతుష్టుఁడనై యాతని కిహపరసుఖంబులఁ జేకూర్చుచుందును. అని

యీప్రకారముగా మహాదేవుండు పార్వతీదేవికిఁ జతుర్దశ్యష్టమీపూజావిధులను బోధించెను.

అనంతరము వ్యాసమునీంద్రుండు "మహామునీంద్రా! మానవు లేరీతి నుపవసించి మహాదేవు నేవిధముగాఁ బూజింపవలయునో, అష్టమీతిథియం దాదేవు నేనామములతో నారాధింపవలయునో యనుగ్రహపూర్వకముగా నాకెఱింగింపుము" అని ప్రార్థించుటయు సనత్కుమారుం డిట్లనియెను. ఓసువ్రతా! పూర్వము భగవతి యగుపార్వతి హిమాలయంబున సమాసీనయై భగవానుం డగుమహాదేవునుద్దేశించి వ్రతవిధివిషయంబున నుపదేశింపు మని ప్రార్థించెను. ఆసమయమున మహాత్మునిచే నుపదేశింపఁబడిన నామాష్టమీవ్రతవిధానమును నేనాలకించినవిధముగా నీకెఱింగించెద నాకర్ణింపుము. ఈమాహాత్మ్యశ్రవణమువలన మానవు లకల్మషులై శివలోకప్రాప్తు లగుదురు. మార్గశీర్షమాసమునం దష్టమీతిథియందుఁ గేవలగోమూత్రమాత్రప్రాశనుండై గంధపుష్పాద్యుపచారములచే మహాదేవునిఁబూజించువాఁడు సర్వపాపవిముక్తుం డగును. విశేషించి యీతిథియం దుపవాసము చేయుటచేతనే యక్షయపుణ్యలాభం బగును. ఈవిధముగాఁ బౌషమాసాష్టమియందు ఘృతమాత్రభక్షణంబునఁ బరమేశ్వరునిఁ బూజించినచో బహుధర్మలాభం బగును. ఆదినమున నుపవాసముచేయుట యంతకంటెను బుణ్యప్రదమైనది. మాఘమాసమునం దష్టమియందు క్షీరపాయసభక్షణమాత్రంబున భగవంతుండగుదక్షిణామూర్తిని యథావిధిగఁ బూజించినను, ఆదినమునందు శుష్కోపవాసము చేసినను బహుతరపుణ్యలాభం బగును. ఈవిధముగా ఫాల్గునమాసాష్టమియందుఁ దిలమాత్రభోజనుండై శాంతభావముతోఁ ద్ర్యంబకునిఁబూజించినను, ఉపవాసము చేసినను అపారమగుధర్మలాభముం గాంచును. చైత్రాష్టమి

యందు యవభోజనంబు సేసి సనాతనుం డగుదేవునిఁ బూజించినను, వైశాఖమాసాష్టమియందు జలపానమాత్రంబున శాంతభావముతో సదాశివుని బూజించినను, ఆదినమునం దుపవసించినను బహుధర్మలాభంబగును. జ్యేష్ఠాష్టమియందు గోమయభక్షణము చేసి భగవానుం డగుదక్షిణామూర్తిని బూజించినను, ఉపవాసము చేసినను, ఆషాఢాష్టమియందు ఫలాహారియై నీలకంఠుని నిర్మలచిత్తముతో నారాధించినను, ఉపవసించినను, శ్రావణమాసాష్టమియందు లవణోదకపానమాత్రమున భగవంతునిబూజించి బ్రాహ్మణసంతర్పణమాచరించినను, భాద్రపదమాసాష్టమియందు దధిభక్షణంబు సేసి శివపూజ గావించినను, ఉపవసించినను,ఆశ్వీజమాసాష్టమియందుఁదండులోదకపానమాత్రంబునను, గార్తికమాసంబున దధిభక్షణమాత్రంబునను దక్షిణామూర్తిని బూజించినను, ఆతిథులయం దుపవాసము చేసినను నిస్సీమంబులగు నక్షయధర్మలాభంబు లందఁగలరు.

నిష్కపటభక్తియుక్తుఁడై దేవదేవుఁ డగునుమాపతిని గంధపుష్పమాల్యధూపాదులచే నిత్యము నర్చించుచు బ్రాహ్మణులకు సువర్ణదక్షిణలతో భోజనంబు లిడువాఁడు మరణానంతరమున శివలోకప్రాప్తుండై యందుఁ జంద్రశేఖరుఁడును, వృషభవాహనుఁడును, త్రినయనుండునై,దివ్యాప్సరోగణపరివృతుఁడై భవానీదేవివిహారించుపవిత్రప్రస్థానములయందు యథేచ్ఛావిహారము గావించుచుండును. అనంతర మాతఁడు సౌభాగ్యశాలియు, బుద్ధిమంతుఁడును, సకలశాస్త్రపారంగతుఁడును, సర్వభూతహితార్థియునై భూతలమునందు శ్రేష్ఠకులంబున జన్మించి రాజ్యలాభముం గాంచి ధర్మశీలుండును, మిథ్యాదండవిరహితుండునై విరాజిల్లుచుండును. నిత్యమును రుద్రదేవుని బూజించునాతఁడు మరల స్వర్గలోకమును జేరి రుద్రలోకమునం జెల్లవారిచేతను

బూజితుండై యుండును.

నామలక్ష్మ్యష్టమీవిధానము.

ఏసత్కర్మలముచేఁ గుజ్జులును, రోగులును, రౌద్రులునగువారు సులక్షణసంపన్నులును, సౌభాగ్యవంతులును, ప్రియదర్శనులు నై జన్మింతురో యీహాస్యముంగూర్చియు, అష్టమీవ్రతము సకలశుభప్రదాయకమగుటంగూర్చియు సప్రమాణముగ బోధింపవలయు నని సాత్యవతేయుండు ప్రశ్నించుటయుఁ బూర్వము మహాదేవుండు పార్వతీదేవి కుపదేశించినప్రకారము సనత్కుమారుం డిట్లు చెప్పందొడంగెను. ఎవ్వఁడు శివభక్తితత్పరుఁడై కార్తికమాసమునం దష్టమినాఁ డుపవసించి యహోరాత్రములు జాగరణము చేసి గంధమాల్యాదులచే మహాదేవు నర్చించి గోరోచనకుంకుమాదుల నివేదించునో యాతఁడు నాయనుగ్రహముచే విష్ణుపదనామకమగు రుద్రభవనమును జేరి దివ్యక్రీడాసక్తుఁడై యందుఁ బరమసుఖభోగము లనుభవించుచుఁ గాలయాపనము సేయుచుండును. అనంతరమాతఁడు మత్ప్రసాదముచే నచ్చటనే ముక్తిలాభమునొందును. ప్రతిపురుషుండును దనకు శివస్వరూపప్రాప్తి యగువఱకును మహాదేవునారాధించుచుండవలయును. అందువలన నాతఁడు సర్వలక్షణసంపన్నుఁడై శ్రేష్ఠకులంబున జన్మింపఁగలఁడు.

“దేవాదిదేవా! శూలపాణి! నీవు సంక్షేపముగనుపదేశించిన యీవిషయమును నేను సంపూర్ణముగ నెఱుంగఁజాలకున్నాను. అష్టమీవ్రతనిర్వహణసమయమునందు శరీరస్థానవిశేషములలో నేస్థానమునం దేనామముతో నిన్నుఁ బూజింపవలయునో సవిస్తరముగ బోధింపుము” అని పార్వతీదేవి ప్రశ్నించుటయు మహేశ్వరుం డిట్లనియెను. దేవీ! పార్వతీ! సావధానముగ నాకర్ణింపుము. మద్భక్తుం డగువాఁడు

నాథనామముతో మన్మస్తకమును, శంకరనామముతోఁ బదయుగళి
మును, అతిరుద్రనామముతో జంఘాద్వయమును, ఈశాననామముతోఁ
గటిప్రదేశమును, త్ర్యంబకనామముతో శేఫంబును, కపర్దినామ
ముతో నష్టాంగములను, శూలపాణినామముతో వక్షస్స్థలమును, వృష
ధ్వజనామముతో స్కంధదేశమును, త్ర్యంబకనామ
ముతోఁ గక్షదేశములను, గర్ణద్వయమును, త్రిపురఘ్ననామముతో
నయనయుగళమును, ఉమాపతి పశుపతినామములతో నాసాపుటమును,
శ్మశానవాసినామముతో భ్రూమధ్యమును, భూతనాథనామముతోఁ
గపోలద్వయమును, దక్షయజ్ఞవినాశినామముతో దంతపంక్తిని, జటిల
నామముతో జిహ్వను, పశుపతినామముతో శిరోదేశమును, శశాంక
శేఖరనామముతో మస్తకమును, ఉమాప్రియనామముతో లలాట
మును, గంగాధరనామముతోఁ గేశసముదాయమును, శివనామముతో
సర్వాంగములను యథావిధిగఁ బూజింపవలయును. అనన్యచిత్తముతో
విధిపూర్వకముగా నెవ్వఁ డష్టమీతిథియం దుపవసించి గంధమాల్య
ధూపదీపాదులచే భక్తియుక్తుఁడై నన్నుఁ బూజించి పూజాంతమునందు
నిజవిభవానుసారముగా బ్రాహ్మణారాధనమాచరించి యథాశక్తి
సున్నదక్షిణలర్పించి జలపూర్ణంబగుతామ్రఘటంబును, తైలపూర్ణం
బగుమృణ్మయపాత్రంబును దానము సేయునో యట్టిపుణ్యాత్ముఁడు
మరణానంతరమున స్వర్గలాభముఁ గాంచి మహేంద్రసన్నిధానమునం
దప్సరోగణపరివృతుండగుచు, దివ్యభూషణభూషితుండునై దేవమానాను
సారముగా సహస్రవర్షము లందు సుఖభోగము లనుభవించుచుండును.
అనంతరము కాలక్రమంబున నాతఁడు మహీతలమునం దుత్తమకుల
మున జన్మించి సర్వలక్షణసంపన్నుఁ డగుమానవశ్రేష్ఠుఁడై యెందును
లోపంబనుమాట లేక మహైశ్వర్యవంతుఁడై యుండును.

—♦ వివిధదానప్రశంస. ♦—

మహేశ్వరుం డిట్లనియెను. దేవీ! ఇప్పుడు నీకు దానధర్మాది విశేషములం గూర్చి విశేషించి చెప్పెద నాకర్ణింపుము. ఓభవానీ! అన్నమువలననే సమస్తజీవులకును దేహధారణ మగుచుండునుగావున నన్నదానముకంటెను బ్రశస్తములగు నితరదానము లేవియును లేవు. కావున నన్నదానమే యన్నిటికంటె నుత్తమమైనదని ప్రశంసింపఁబడుచుండును. అర్థులగువారికి సుసంస్కృతమును, వ్యంజనాదిసహితము నగునన్నదానమును గావించుపుణ్యాత్ముఁడు మయూరహంసశోభితమును, అభిలషితైశ్వర్యపరిపూర్ణమును, ప్రభాకరసదృశతేజోమయమును, రమణీయము నగుదివ్యవిమానము నధిరోహించి బహుకాలమువఱకును సమస్తలోకవిహారము గావించుచుండును. కాలక్రమమున నాతఁడు ధనధాన్యాదిసంపన్న మగుమానవకులమునం దుద్భవించి శుభరూప తేజోమయుండై విరాజిల్లుచుండును. ఉత్తముఁడగు బ్రాహ్మణునకు శక్త్యనుసారముగా నన్నదానము సేయువాఁడు తత్ప్రభావముచే బ్రహ్మలోకప్రాప్తుం డగును. ఎవ్వఁడే నొకప్పుడు బ్రాహ్మణునకు సుసంస్కృతమగు నన్నమును దానముచేయువాఁ డిహలోకమున శతగుణములును, బరలోకమున సహస్రగుణములును బుణ్యఫలలాభముం గాంచి పరమసుఖుం డగును.

అపరిశుభ్రమును, దుర్గంధదూషితమును, కుత్సితము నగునన్నము నవజ్ఞాపూర్వకముగా దానముసేయువాఁడు భీకరనరకమునందుఁ బతితుండై రాక్షసగణంబులచే నిరంతరమును బీడింపఁబడుచు నన్నాద్యుపభోగద్రవ్యవిహీనుండై బాధనొందుచుండును. నరకభోగాంతమునం దాతఁడు హీనకులమునం జనించి దుర్విలాసలంపటుఁడై యుండును. దేవీ! అన్నమే యఖిలపదార్థములకంటెను బ్రశస్తమైనది. దానిం

టెను బ్రశస్తమైనవస్తు వేదియును లేదు. సకలజీవాధారహేతువగుటచే నన్నము ప్రజాపతిస్వరూపముగాఁ బ్రశంసింపఁబడుచున్నది. అప్రజాపతి సంవత్సరస్వరూపుఁ డనియు, సంవత్సము యజ్ఞస్వరూపమనియుఁ జెప్పంబడును. ఆయజ్ఞమునుండియే స్థావరజంగమాత్మకము లగుసకల జీవగణంబులు నుత్పన్నము లయ్యెను. కావుననే యన్నము సకలపదార్థములకంటెను, అన్నదానము సకలదానములకంటెను శ్రేష్ఠంబు. అన్నమునుండియే సకలభూతములు నుద్భవించెను గావున సకలభూతములు నన్నమునే ప్రశంసించుచుండును.

దివ్యరసకలితమును, సురభిళమును, శీతలము నగుజలదానము చేయువాఁడు దివ్యాప్సరోగణపరివృతి మగుదివ్యవిమానము నధిరోహించి స్వర్గమునందు వరుణలోకంబున నెనుబదివేలవత్సరములు దేవతుల్యుండై సుఖనివాసంబు చేసి యనంతరము భూలోకమునందుఁ బవిత్రవంశమునందు జనించి మహైశ్వర్యసంపన్నుఁడై యుండును. భక్తిపూర్వకముగా నుత్తమబ్రాహ్మణున కన్నపూర్ణంబగుభాండమును దానముచేయువాఁడు పుణ్యాత్ముండై స్వర్గలోకమునఁ బూజితుండగును. ఈవిధముగా ననేకాన్నభాండములను గావించువానిపితృగణంబులు సుస్థిరపిండదానమును బరిగ్రహించినవారుంబోలి సంతుష్టులై యుందురు. యథాసమయపిండదానాభావముచేఁ గలుగునసంతుష్టి వారికెన్నఁడును సంభవింపదు. గోవులుమొదలగు వివిధజంతువులకు జలపానార్థమై తటాకాదినిర్మాణంబుగావించుసంపన్నుఁడు నిజపితృపితామహాదులను దరింపఁజేసి విష్ణులోకమునందు దేవతుల్యుఁడై యయుతవర్షంబులు నివసించి నిఖిలపూజితుఁడై నిత్యసుఖభోగంబుల ననుభవించుచుండును. అనంతర ముత్తమమానవవంశమున జన్మించి పరమభోగియు, ననామయుండును, దాతయు, యాగకర్తయు, సౌభాగ్యవంతుఁ

ఁడును, ప్రియదర్శనుఁడును నగురాజామాత్యుఁడై విరాజిల్లుచుండును.

ఓశుచిస్మితా! జలపూర్ణంబగునొకగర్తమును నిర్మించి యష్టపతాకాభిశోభితమును, విచిత్రధ్వజాలంకృతమును, బుష్పమాలికావిలసితము నగుదానిని సకలజీవోపయోగకరంబుగా నుత్సర్గంబు సేసి శక్తికొలఁది సదక్షిణంబుగాఁ బవిత్రబ్రాహ్మణారాధన మాచరించు మానవశ్రేష్ఠుఁడు తనపితృగణంబులనెల్లఁ బరితృప్తులం గావించుటయే గాక దివ్యాప్సరోగణమధురసంగీతసంపన్నమగు సుందరమణివిమానము నధిరోహించి వరుణలోకమున యథేచ్ఛావిహారియై చిరకాలమువఱకు నభీష్టభోగముల ననుభవించుచుండును. సువర్ణదానమును, గాంచనవర్ణభూదానమును, దిలదానమును, రత్నదానమును, గావించుపుణ్యాత్ములు లబ్ధమనోరథులై యింద్రలోకమున దివ్యవిమానము నధిరోహించి పరమానందభోగముల ననుభవించుచుఁ జిరకాలమువఱకును సుఖవిహారముఁ గావించుచుందురు. అనంతరము వారు భూలోకమునం దవతరించి యనాయాసముగాఁ దపఃఫలప్రాప్తులై సర్వైశ్వర్యసంపన్నులుగాఁగలరు. రాజమార్గములయందు మార్గస్థులకు నీడంగూర్చుటకై ఫలపుష్పసమన్వితంబులగువృక్షంబులను స్థాపించు దేవసము లగుమానవులు తమపితృగణంబులనెల్లఁ దరింపఁజేయఁగలుగుదురు. అట్టిఫలవృక్షములను సద్బ్రాహ్మణులకు దానము చేయువా రాతరుపుష్పఫలాదులను జీవులెన్నినాళ్లుసుఖముగా నుపయోగించుచుందురో యన్నివేలసంవత్సరములవఱకును జంద్రలోకమునం దసాధారణఫలభోగములచే విరాజిల్లుచుందురు. అట్టిపుణ్యపురుషులు తమపితృగణంబుల ననాయాసముగఁ దరింపఁజేయఁగలుగుదురు. ఫలదానము నాచరించువారు సువర్ణరత్నమయఫలలాభముం గాంచుటయేగాక పరమసుందరులును, బ్రియదర్శులును గాఁగలరు. సువర్ణమణినిర్మిత మగుపాత్రమును దానముచేయు

వాఁడు స్వర్గమునం దప్సరోగణపరివృత మగుదివ్యవిమానము నధిరోహించి పరమానందముతో బహుకాలము విహరించుచుండును. రజతపాత్రదానము సేయువానికి గంధర్వలోకమునం దూర్వశీలాభము ప్రాప్తించును. తామ్రపాత్రము దానము చేయువాఁ డధికబలశాలియై కుబేరలోకసుఖంబును గాంచును.

సకలపదార్థసంపన్నంబగుగృహమును దానము చేయువాఁడు సర్వాభీష్టసంసిద్ధుఁడై శతకోటిసంవత్సరములవఱకును బ్రహ్మలోకసుఖభోగముం గాంచి యనంతరము మహాదాతయు, మహాభోగియు నగుగృహస్థుఁడై భూలోకమునం దవతరించును. ఓషధీదానముసేయువాఁడు సంపూర్ణమనోరథుఁడై సప్తసహస్రవర్షములు చంద్రలోకసుఖంబు ననుభవించి పిమ్మట మహాభోగియై మహీతలమున జన్మించును. భూదానముసేయువాఁడు కామరూపియై సుందరవిమానము నధిరోహించి బహుసహస్రవర్షంబులవఱకును నానాలోకవిహారము సేయుచు సుఖభోగములనుభవించి పిమ్మట మహీతలంబున జన్మించి సర్వకామప్రదంబగు విశేషభూలాభముం గాంచఁగలుగును. నిర్మలహృదయముతో భక్తిపూర్వకముగాఁ బశుదానముం గావించువాఁడు చంద్రలోకమునందుఁ జిరకాలమువఱకు యథేచ్ఛావిహారియై యుండును. పరిశుభ్రమును, సుఖభోజ్యమును నగునన్నదానముం గావించువాఁడిహలోకమున రాజ్యేశ్వరుఁడై పరంబున స్వర్గభోగముల ననుభవించును. సమలంకృతశయ్యాదానము సేయువాఁడు శతాయుతవర్షములు పితృలోకమున సుఖావాసుఁడై యనంతరము భూలోకమున సద్వంశమున జనించి యనుకూలభార్యాసహితుఁడును, సర్వసిద్ధిసంపన్నుఁడును, బుత్త్రవంతుఁడునై సుఖించును. స్వర్ణాలంకారభూషితమును, సర్వలక్షణసంపన్నము నగు నుత్తమాశ్వమును దానము చేయువాఁడు బహువర్షంబులవఱకును వాయులోకభో

గింబుల ననుభవించుచుండును. యథావిధిని మంత్రసహితముగా న
శ్వయుతంబగు రథమును, దాసిని, కన్యను, గృహమును, కాదేని భూమిని
దానము చేయువాఁడు మహామహీశ్వరుఁడై జన్మించును. భూమిదేవి
ధేనురూపముతో నాపురుషశ్రేష్ఠునిగృహమునందుండి యాతనిధర్మఫల
స్వరూపముగా సకలాభీష్టప్రదానమును గావించుచుండును. జలధేను
దానము చేయువానికి బహురూపతటాకాదు లధీనములై యుండును.

సద్బ్రాహ్మణులను సురభిళప్రసూనములచేఁ బూజించి పుష్ప
మాలికాలంకృతములును జలపూర్ణములు నగుకలశములను దానము
చేసి వారిని భక్ష్యభోజ్యాదిపరితృప్తులం గావించి యనంతరము తిలపా
త్రలనువిశేషదక్షిణలను సమర్పించినచో సర్వాభీష్టములును సిద్ధించు
ను. ఈవిధముగా ధేనుదానముం గావించినచో బ్రహ్మలోకపర్యంత
మును బానీయశాలలను బ్రతిష్ఠించినఫలముం గాంచును. తిలపాత్రస
హితముగా వస్త్రదానము చేయువానికి సువర్ణసమృద్ధియు వివిధఫల
లాభంబును గలుగును. శాస్త్రానుసారముగా ఘృతదానము సేయువాని
కి సర్వశ్రేయములును గలుగును. ఘృతదానమును గ్రహించువాఁడు
“గోవులవలన ఘృత ముత్పన్నమగుచున్నది. ఘృత మీపృథ్వీతలమునఁ
బ్రతిష్ఠితమైనది. ఘృత మగ్నిస్వరూపము. ఘృతము దేవతాస్వరూపము.
ఇప్పుడట్టిఘృతమును నాకు దానము చేయుము.” అనుమంత్రమును బ
ఠించుచుఁ గైకొనవలయును. దాత బ్రాహ్మణులను సుగంధపుష్పమా
ల్యాదులచేఁ బరితృప్తులం గావించి యనంతరము ద్రవ్యదానము చేయ
వలయును.

గోప్రదానసమయమునందు సకలదేవతలు నాధేనుశరీరము
నాశ్రయించి యుందురు. బ్రహ్మదేవుఁ డాగోమస్తకమందును, మ
హేంద్రుఁడు కపాలమునందును, చంద్రసూర్యులు నేత్రములందును,

'వాయువు ప్రాణములందును, వైశ్వానరుఁడు ముఖమందును, సోముఁడు జిహ్వయందును, అశ్వినీకుమారులు కర్ణములందును, రుద్రులు శిరోదేశమునందును, లోకపాలకులును, సకలపన్నగగణంబులును పాదప్రదేశములందును నివసించి యుందురు. ఆగోవుజఠరమునందు సప్త సముద్రములును, గ్రీవమునందు సూర్యదేవుఁడును, స్తనప్రదేశమునందు సరిల్లలామయగు గంగాదేవియును, పార్శ్వదేశములందు వసుసాధ్యగణంబులును, పుచ్ఛమునందు విశ్వదేవగణంబులును, పురీషమునందు లక్ష్మీదేవియు, శ్వాసవాయువులందు నాగగణంబులును నిలిచి యుందురు. సకలమంత్రములును, యజ్ఞములును, దానములును, నియమములును, మహర్షులును, గ్రహములును, నక్షత్రములును, జ్యోతిర్మార్గులగు నితరగ్రహములును, దేవి యగుగాయత్రియు, విష్ణుదేవుండును, ఛందములును, వేదములును, లోకమాతృగణంబును, మేఘములును, వృష్టియు, ధర్మమును, నారాయణుఁడును, సకలభూతగణంబులును, నదులునుగూడ భగవతీమూర్తి యగునాగోవుశరీరమునందలి ప్రతిరోమకూపము నాశ్రయించి యుందురు. మఱియు యక్షరాక్షసులును, పిశాచములును, పక్షులును, యజ్ఞదక్షిణలును, అప్సరస్సుందరులును, గంధర్వులును మొదలుగాఁగలమహాత్ములందఱును గోశృంగముల నాశ్రయించి యుందురు. కావుననే గోవు సర్వదేవతల కాశ్రయస్థానమని ప్రశంసింపఁబడుచుండును. "ఓగోదేవీ! నీవు సర్వదేవమయివి; సర్వలోకమయివి; నీవు సర్వజీవులకును గారణమవు; సకలజీవులును నీకు నమస్కారముచేయుదురు. ఇట్టినిన్ను నేను దానము చేయుచున్నాను. నాకక్షయశుభంబులను బ్రసాదింపుము." అనుమంత్రమును బఠించుచుఁ గుశలు, తిలలు, తెల్లావలు, సువర్ణముమొదలగువానితోఁగూడ ధేనువును దానము చేయవలయును. ఇట్లు గోదా

ము చేయువాఁడు దేవతుల్యుఁడై సర్వస్థలములయందును సంపూర్ణమనోరథుఁడై యుండును. ఆధేనుప్రతిష్ఠానమునందును విపత్తులనుండి యాతని నుద్ధరించుచుండును. ఆతఁ డుత్తరజన్మమునందు సహస్రధేనువుల కధికారియై, మహైశ్వర్యవంతుఁడును, బుత్త్రపౌత్త్రాదిమహావైభవసంపన్నుఁడు నగును.

సువర్ణమయశృంగవతియు, రజతఖురసమన్వితయు, అర్ధప్రసూతయు, పయస్వినియు నగుధేనువును దానముచేయువాని కుత్తరజన్మమునందు జాతిస్మరణంబు గలుగును. క్షీరంబులు లేనిగోవును దానము చేసినను నది దాతను భీషణనరకమునుండి తరింపఁజేయును. బ్రహ్మచారులకు మృగచర్మదానము చేయువారు భూదానఫలప్రాప్తులై సర్వయోగాశ్రయు లగుదురు. యోగికైనను, బ్రహ్మచారికైనను, గృహస్థునికైనను నివాసస్థానమునుదానముచేయువాఁడశ్వమేధపౌండరీకాదియజ్ఞఫలంబును, సహస్రధేనులాభంబును, పూర్వస్మరణలాభంబునుగాంచి యచిరకాలంబుననే యోగసిద్ధుం డగును. కమండలుదానము గావించు నరశ్రేష్ఠుఁడు నిత్యానంతధర్మలాభముం గాంచఁగలుగును. రోగపీడితుఁడై చైతన్యశూన్యుఁడై యున్నదీనునకుఁ జికిత్స చేసి శక్తికొలఁది నుపచారాదులం గావించి యాతనిం దేల్చువాఁడు బ్రహ్మహత్యాది మహాపాతకములనుండికూడ విముక్తుం డగును. దరిద్రుండగు నుత్తమ బ్రాహ్మణునకు సువర్ణదానము గావించువాఁడు దశాశ్వమేధయాగిఫలలాభముం గాంచును.

ప్రియా ! సురమ్యంబులగు దానవిధులంగూర్చి సవిస్తరముగాఁ బ్రశంసించితిని. ఈసకలదానముల నేకకాలమునం దనుష్ఠించుపుణ్యపురుషుఁడు సార్వభౌముఁడై జనియింపఁగలఁడు. ఈదానమాహాత్మ్యమును బ్రతిదినము నాకర్ణించుచు శక్తికొలఁది దానములం గావించి

నను, ఎవ్వరైన దానములుచేయుచున్నప్పు డాసక్తితో నాలోకించినను స్వర్గలోకసుఖభోగంబు గలుగును.

— ♦ వివిధోపవాసాదిఫలకథనము. ♦ —

పరమేశ్వరుండు మఱియు నిట్లనియెను. దేవీ! పూర్వోక్తకల్యాణమయంబు లగుదానము లేవియును గావింపకయే కేవలోపవాసనియమము నాచరించినంతమాత్రమున నెట్టియుత్తమపుణ్యఫలము లభించునో మరల విస్పష్టముగాఁ దెలిపెద నాకర్ణింపుము. మార్గశీర్షమాసమంతయు నేకాహారియై గడపువాఁడు నిత్యమును నన్నారాధించుపుణ్యఫలమును గాంచఁగలఁడు. పౌషమాసమునం దిట్లు గావించినఁ బ్రహ్మోపాసనఫలంబును, మాఘమాసమునం దాచరించిన మహాలక్ష్మీలాభంబును గలుగును. ఫాల్గుణమాసము నిట్టినియమముతో నిత్యమును గడపువానికి సౌభాగ్యవతి యగుసుందరపత్నీలాభమును, మహైశ్వర్యప్రాప్తియు నగును. ఏమానవశ్రేష్ఠుఁడు చైత్రమాసము నేకాహారియై యతివాహితముగఁ జేయునో యాతఁడు సర్వైశ్వర్యసమంచితమగు సత్కులమునందుఁ బరమసుందరుఁడై జన్మించును. వైశాఖమాసమునం దిట్లు గావించువాఁడు ధనవంతుఁడును, జ్ఞాతిశ్రేష్ఠుఁడును, జ్ఞాతిపూజితుఁడు నగును. ఏకాహారియై జ్యేష్ఠమాసమును గడపువాఁడు సద్వంశమునందు జ్యేష్ఠపుత్త్రుఁడై జన్మించి యశేషభోగముల ననుభవించుచుండును. ఆషాఢమాసమునం దిట్లు చరించువాఁడు రాజపూజితుఁడై సంపూర్ణమనోరథు లగును. శ్రావణమాసము నీవిధముగాఁ గడపువానికి వాఁడు బలవంతుఁ డగుసేనానాయకుఁడై జన్మించును. భాద్రపదమాసమునం దేకభుక్తము చేయువానికిఁ దత్కర్మబలముచే ధనలాభము గలుగును. ఆశ్వీజమాసమునం దిట్లు నియమముతో నుండువానికిఁ

గృషివాణిజ్యలాభమును, అసంఖ్యపశులాభమును గలుగును. కార్తిక మాసమునం దిట్లు గావించువాఁ డశ్వమేధయాగఫలప్రాప్తుఁడై యగ్ని లోకమున సకలజనపూజితుం డగును. మార్గశీర్షమాసంబునం దేకభుక్తము సేయువాఁడు ప్రభాకరసదృశవిమానారూఢుఁడై యింద్రలోకమున యథేచ్ఛావిహారము గావించుచుండును.

ఓ దేవీ ! ఎవ్వఁడు సంపూర్ణముగా నొకసంవత్సరము నిత్యము నేకాహారుఁడై గడపునో యట్టివాఁడు మహారాజుగా జన్మించి మహేంద్రునివలె రాజ్యపాలనముం గావించును. ఒక్కయహోరాత్రము మాత్ర మేకాహారుఁడై గడపువానికి దశసువర్ణదానఫలము లభింపఁ గలదు. ప్రతిమాసమునందు నేకదినోపవాసంబు గావించువాఁడు పాపవిముక్తుం డగుటచే ఘోరనరకములకు దూరుఁడై యుండును. అతఁ డెన్నటికిని శమనునిదృష్టిపథమునఁ బడఁబోఁడు. ప్రతిమాసమునను ద్విరాత్రోపవాసము సేయువాఁడు కుబేరలోకమునఁ బరమసుఖభోగి యగును. ఏమానవు డతిపవిత్రుఁడై త్రిరాత్రోపవాసము చేసి చతుర్థదినమున భుజియించునో యాతఁడు గంధర్వలోకమున దేవతుల్యము లగునానందభోగముల ననుభవించును. అశ్రద్ధసేయక ప్రతిమాసమునను నాలుగుదినము లుపవసించి యైదవనాఁడు భుజించువాఁడు కొంతకాలము వాయులోకసుఖభోగియై యనంతరము స్వర్గప్రాప్తుం డగును. నిత్యనియమముతో నైదుదినము లుపవసించి యాఱవనాఁడు భుజించువాఁడు వరుణలోకమునఁ గొంతకాలముండి పిదప బ్రహ్మపదలాభముం గాంచును. ఆఱుదినము లుపవసించి యేడవనాఁడు భుజించువాఁడు దేవగణసేవితమును, సుఖకరము నగుసూర్యలోకమున సుస్థిరుఁడై యుండును. సప్తదినంబు లుపవసించి యష్టమదినమున భుజించువానికి వాయులోకగమనానంతరమున స్వర్గప్రాప్తియు, అష్టదినోపవాసంబు చేసి

నవమదినంబున భుజించువానికి వరుణలోకావస్థానంతరమున ననుపమ ఫలప్రాప్తియు, నవదివసోపవాసానంతరమున దశమదినమున భుజించు వానికిఁ బరలోకమున సాగ్నికులగువారియెదుట నగ్నితుల్యపవిత్రత్వం బును, సర్వదాసూర్యసన్నిభ తేజమును, ఉత్తరజన్మమున దశసుందర పత్నీప్రాప్తియు నగును.

ఏకాదశదినోపవాసముచే నేకాదశీవ్రతానుష్ఠానఫలమును, సకల యజ్ఞఫలంబును లభించును. ద్వాదశదినోపవాసముగావించువాఁడు శుక్రలోకమున దివ్యసుఖభోగము లనుభవించుచుండును. పిమ్మట నాతఁ డిహలోకమున జన్మించి ధనధాన్యసంపన్నుఁడును బవిత్రుఁడు నై యుండును.* ఈవిధముగాఁ జతుర్దశాహోరాత్రము లుపవసించు వాఁడు రణనాయకుం డగును. అర్ధమాసోపవాసము సేయువాఁడు స్వర్గమునందు మహేంద్రతుల్యుఁడై చిరకాలముండి యనంతరము మ హీతలమునఁ దాను జన్మించిన చోటనే ప్రధానుఁడగురాజగును. ఎవ్వఁ డు ధీరుఁడును, జితేంద్రియుఁడును, జితక్రోధుఁడునై యేకమాసోపవా సము గావించునో యాతఁడు సూర్యాగ్ని తేజస్సంపన్నమగురూపముం దాల్చి నిరంతరము నప్సరోగణపరివృతుఁడై దేవభావమున సకలజీవ పూజాస్తవంబులకుఁ బాత్రుఁడై దివ్యవిమానము నధిరోహించి సకల లోకములను విహరించుచుండును. అనంతరమాతఁడు బ్రహ్మలోకమున రాజోచితవస్త్రాలంకారవిభూషితుఁడై దశసుందరీవల్లభుఁడై విరాజిల్లు చుండును. పిమ్మట భూలోకమునం దాతఁడు బ్రాహ్మణుఁడై పుట్టి పరమైశ్వర్యభోగముల ననుభవించి క్రమముగా యోగసిద్ధుఁడై నిర్వా ణపదలాభముం గాంచఁగలుగును.

సుస్నాతుఁడై పవిత్రభావముతో నగ్నిహోత్రంబు గావించి

---

* త్రయోదశదినోపవాసప్రశంస యిందు విలుప్తమైపోయినది.

మనంబును విషయాంతరములనుండి మరలించి యుపవాసము నాచరించువాఁడు దు(గ్ధ)పాలనై శ్వానరుల కాశ్రయుం డగుటచే సకలమానవ పూజనీయుం డగును. ఎవ్వఁడు రాగద్వేషాదిదోషవిహీనుండై స్త్రీ శూద్రసంగపరిత్యాగముం గావించి నిత్యమును బగటివేళ ననాహారుండును, కుశాసనోపవేశనుండునై యథావిధిగ రుద్రగాయత్రీమంత్రమును రుద్రనామమును జపించుచు రాత్రికాలమున భుజించి భూశయ్యను శయనించుచు నీవిధముగా నెన్నిదినములాచరించునో యంతమంది బ్రాహ్మణులను నిమంత్రించి నిజవిభవానుసారముగా వస్త్రాలంకారతిల పాత్రదానాద్యుపచారములచే వారినిఁ బూజించి యొక్కొక్కనికి వేయింటినిగాని, నూటింటినిగాని ధేనువులను యథావిధిగ దానము చేసి హావిష్యభోజనముచే సంతృప్తులం గావించునో యట్టివాఁ డితరజనదుర్లభం బగువరలాభముం గాంచఁగలుగును.

నీలవృషభమును, బయస్విని యగుధేనువును దానము చేయువాఁ డాధేనువృషభములశరీరములం దెన్నిరోమములుండునో యన్నివర్షములు స్వర్గమునందు సుఖభోగముల ననుభవించును. అమావాస్యయందుఁగాని, అష్టమియందుఁగాని శ్రద్ధాయుక్తుఁడై సద్బ్రాహ్మణునకుఁ దిలపాత్రదానముం గావించువానికి బహుపుణ్యఫలప్రాప్తి యగును. నిశ్చలచిత్తముతో విధివిహితముగాఁ జాంద్రాయణవ్రతము నాచరించు మానవశ్రేష్ఠుఁడు తనపితృగణములను బరితృప్తులం గావించి పితృలోకము నధిగమించి దేవతుల్యుఁడై యక్షయసుఖభోగములం గాంచఁగలఁడు. ఓదేవీ! ఇది వివిధోపవాసవ్రతఫలవిధానంబు. ఇఁకఁ బవిత్రప్రాయశ్చిత్తవిధానముంగూర్చి ప్రశంసించెద నాకర్ణింపుము.

ఒక్క ప్రాజాపత్యవ్రతము నాచరించువాఁడు ప్రజాపతిసమానుఁడై ప్రజాపతిలోకమునందు సుఖభోగముల ననుభవించుచుండును.

సాధారణులకుఁ గష్టసాధ్యం బగుసాంతపనవ్రతాచరణంబువలన నఖిల కష్టవినాశనమును, నగ్నిలోకనివాసప్రాప్తియు నగును. ఏకాగ్రచిత్తముతో మహాసాంతపనవ్రతము నాచరించువాఁడు విజ్ఞానలాభముం గాంచి బ్రహ్మలోకము నధిగమింపఁగలుగును. విశుద్ధహృదయముతోఁ దులాపురుషదానముం గావించువాఁడు సకలపాపవిముక్తుఁడును, సకలదేవతాగణపూజితుండును, స్వచ్ఛందవిహారియునై విరాజిల్లుచుండును. అతికృచ్ఛ్రవ్రతాచరణముచే శివలోకగమనంబును, కృచ్ఛ్రాతికృచ్ఛ్రవ్రతాచరణంబున గాణపత్యప్రాప్తియు నగును. ఏమానవశ్రేష్ఠుఁడు త్యాగియై సర్వస్వమును దానము చేయునో యాతనికిఁ గోరినకోరిక లన్నియును సిద్ధించును.

మానవుఁ డీకర్మభూమియందుఁ గష్టసాధ్య మగునేవ్రతము నాచరించినను దత్ప్రభావముచేతనే సిద్ధుఁడై దేవత్వలాభముం గాంచఁగలుగును. ఒక్కసంవత్సరమువఱకు గోమూత్రముచే సంస్కరింపఁబడిన యావకముగాని, తిలపిష్టముగాని, కేవలవాయువుగాని యాహారముగాఁ బ్రతిదినమును సర్వదా నానామమంత్రమును జపించుచు నన్నుఁ బూజించువాఁ డశ్వమేధయాగఫలభోగియై బ్రహ్మలోకమును జేరి యశేషపాపవిముక్తుండును, సకలబంధపరిత్యక్తుఁడునై సూర్యసమతేజస్సంపన్నమగువిమానము నధిరోహించి బ్రహ్మదేవునింబోలి సర్వదా సర్వస్థానములయందును విహరించుచుండును.

దేవీ! ఈసకలవిషయములను సంక్షేపముగా నభివర్ణించితిని. ఈయన్నిటిలో నొక్క సత్కార్యమునైన నాచరించుమానవుఁడు తత్ప్రభావముచేఁ బాపవిముక్తుఁడై యిహలోకమున మహత్తరకీర్తిలాభమును బరలోకమున బ్రహ్మసాక్షాత్కారరూప ముక్తిలాభమును గాంచుట యేకాక మహైశ్వర్యతేజస్సంపన్నుఁడై యభీప్సితవరలాభముంగాంచి

సుఖమైయుండును. పూర్వోక్తంబు లగునీసమస్తవ్రతంబులును శూద్రు లగువారు మంత్రము లేకుండఁగనే యాచరింపవలయునని భగవానుం డగుప్రజాపతి యానతిచ్చెను. అమంత్రకకర్మానుష్ఠానముచేతనే శూద్రులకుఁ బాపవిముక్తి కాఁగలదు.

స్త్రీజనంబులకుఁ బతియే దైవతము. వారి కంతకంటె నితర దేవతలు లేరు. పతియే వారి కుత్తమగతి యనియుఁ, బరమధర్మమని యు, బరమపదం బనియు శాస్త్రములయందు నిర్దిష్టం బయ్యెను. కావున నారీమణి తనపతియానతిననుసరించి భక్తిపూర్వకముగా నీసకల ధర్మముల నాచరింపవలయును. అట్లు గావించునామెకు సంపూర్ణఫల లాభంబు గలుగును. పతియానతి లేకయుండ ధర్మాచరణమునకుఁగడం గినసతీమణికిఁ దత్ఫలప్రాప్తి లేకుండుటయేకాక పాపఫలముగూడఁ బ్రాప్తించును. ఏనారీమణి పతియనుమతిం బడసి మహత్తరధర్మకార్యాచరణంబును, ధర్మశాస్త్రపరనశ్రవణంబులను గావించునో యట్టిభాగ్యవతి యనంతఫలలాభముంగాంచి యిహపరలోకములయందు సర్వాభీష్టసంసిద్ధుల నంది సౌభాగ్యవతియు, స్వాధీనభర్తృకయునై విరాజిల్లును. మఱియు నామె స్వామిప్రియతమయై పుత్త్రవతి యగును. ఆమె కెన్నటికి నెట్టికష్టమును గలుగఁబోదు. ఓవరాననా! నీయెడలఁ బ్రేమ వశంబున నేనీపరమార్థమును నీకెఱింగించితిని.

—♦ ని య మ ని రూ ప ణ ము. ♦—

భగవతి యగుపార్వతి యిట్లనియెను. దేవా! లోకకర్తవు, ఈశ్వరుఁడవు, సర్వజ్ఞుఁడవు, శూలపాణివి. అపరాజితుఁడవు, త్రినయనుఁడవు నగునీకు నమస్కారము. భూతభవిష్యద్వర్తమానవిషయము లన్నియును నీకు విదితములగుటంజేసి నీవు సర్వగతుండ వైతివి. నాథా!

నేను నీయనుగ్రహపాత్రురాలనై తినేని, నాయెడల నీకుఁ బరిపూర్ణసౌహార్దము గలదేని నేనడిగినప్రశ్నమునకు సదుత్తరము నొసఁగుము. ప్రభూ! బ్రాహ్మణ, క్షత్త్రియ, వైశ్య, శూద్రులకు విధాయకములగు నియమములనుగూర్చియుఁ, దదితరనియమములవలనిఫలములంగూర్చియు నాకెఱింగింపుము. మఱియు నేయేతీర్థములు సంపూర్ణశుభఫలదాయకములో, యేయేస్థానములం దెట్టియోగధ్యానతపోనియమాదులు ఫలప్రదములో విస్పష్టముగ బోధించి నామనోవ్యాకులకారణంబగుసంశయమును భాస్కరుఁడు నీహారముం బోలి శమింపఁజేయుము. అనిప్రార్థించుటయు మహాదేవుం డిట్లు చెప్పందొడంగెను.

దేవీ! మానవుఁడు యథావిధిగ, దుష్కరనియమాచరణముం గావించినచో సంపూర్ణఫలలాభముం గాంచఁగలుగును. ఆపాతసుఖమయముగా నగపడుచుండు మానవత్వము కేవలమును జలబుద్బుదముం బోలి యనిత్యంబై నదగుటచే మానవున కెల్లవిధముల దుష్కరనియమాచరణం బవశ్యకర్తవ్యమైనది. అతిలోభులును, ధర్మద్వేషులు నగుమానవులు వర్తమానసుఖాసక్తులై పరిణామమునం దధికసుఖదాయకమగుఫలమునందుఁ బ్రవృత్తులు గాఁజాలకుందురు. ప్రతిజ్ఞాపూర్వకముగా నాత్మనియమములనాచరించువాఁడు సహస్రవర్షము లశేషపుణ్యఫలభోగము లనుభవించును. దేవతలు నియమాచరణముననే యసామాన్యమగుదేవత్వలాభముం గాంచఁగలిగిరి. నక్షత్రములు నియమాచరణముచేతనే సముజ్జ్వలతేజస్సంపన్నము లయ్యెను. ఓవరారోహా! మానవుఁ డెన్నటికి నాత్మనియమముల నతిక్రమింపఁగూడదు. నియమావలంబనమూలముననే వహ్ని ప్రజ్వలించుచుండును; సూర్యభగవానుఁడు ప్రకాశించుచుండును; వాయువు ప్రవాహిత మగుచుండును; పృథ్వి యీబ్రహ్మాండమును ధరించుచుండును. ఓశుభాననా! నీవును నియమపూ

ర్వకముగాఁ దపోనుష్ఠానముం గావించుటచేతనే సర్వపాపవిముక్తుఁ డైనా యధ్యాంగివి గాఁజాలితివి. ఇందెంతమాత్రమును సంశయములేదు.

ఏమానవుఁ డొకసంవత్సరము నియమపూర్వకముగా ధర్మకార్యాచరణముంగావించునో యాతఁడు బ్రహ్మలోకాదినానాస్థానముల యందు దేవతాతుల్యుఁడై సుఖవిహారము సేయుచుండును. పార్వతీ! నిత్యనియమానుష్ఠానపరుం డగు నొకపుణ్యాత్ముఁడు తననియమఫలము నెట్లుపొందఁగలిగెనో యావిషయమును సప్రమాణముగఁ దెలిపెద నాకర్ణింపుము. ఈచరిత్రము నిరంతరసత్క్రియాచరణతత్పరులగుసత్పురుషుల కతిప్రియమైనది. కావున సావధానవై యాలకింపుము.

పూర్వకాలమునఁ గాశీధామమునందుఁ దేవలనామమాత్రధారి యగు నొకబ్రాహ్మణుఁ డుండెను. ఆతనిపైతృకనివాసస్థానమాంధ్రదేశము. ఆతఁ డతివికురూపియు, జాతికర్మముల కయోగ్యుఁడును, పరద్రవ్యాపహారియు, నృశంసుఁడును, అపవిత్రుఁడును పాపాత్ముఁడునై స్వకులోచితధర్మంబులఁ బరిత్యజించి కపటవమ్రభావముతో సర్వదా పరనిందారతుఁడై దేవతలకును, దానవులకునుగూడ ధిక్కారపాత్రుఁడై యుండెను. అధార్మికుఁ డగునానాస్తికుఁడు నిరంతరము నాత్మశ్లాఘాపరాయణుఁడై వేదములనుగూడ నిందించుట కారంభించెను. ఆయపవిత్రుఁ డగువిప్రుఁడు పరద్రవ్యలోభముచే సంతోషించువాఁడు గావునఁ గాశీక్షేత్రమునందు శూద్రాదిభిన్న భేదమునుగూడఁ బాటింపక, దేవబ్రాహ్మణులకు నమస్కారములం గావింపక యొకసారినైనను బ్రణవమంత్రము నుచ్చరించుటయనుమాటయేలేక యథేచ్ఛావిహారియై కాలము గడపుచుండెను.

ఈవిధముగా నాతఁడు గృహస్థితం బగుసర్పముంబోలి యెల్లవారికి నుద్వేగకారిఁడై యగుచుండుటచే నాతనిసహవాసము నెవ్వరు నపే

క్షింపక యుండిరి. ఆఖలుండు జాతిచే బ్రాహ్మణుం డయ్యును, వేదము నం దొక్కయక్షరమునైన నుచ్చరించుట యనుమాట లేక దంతములు లేనిసర్పమువలెను, శృంగములులేని వృషభమువలెను, ఱెక్కలులేని పక్షివలెను, పుష్పములులేనివృక్షమువలెను, నగ్రగణ్యుండై యావారాణసి యందలిబ్రాహ్మణులనందఱను బీడించుచు నిరంతరధనాపహరణతత్పరుండై వాసము సేయుచుండెను. ఆపాపాత్ముండు ప్రియులు, నప్రియులు ననుభేదంబులేకుండ నాక్షేత్రమునం గలయెల్లవారికిని దుష్టసర్పముంబోలె నిరంతరదుఃఖసంపాదకుండై యుండెను. ఆతండు నిత్యము సంగడివీథులందుం దిరుగుచుం గాలక్షేపము సేయుచుండెను.

ఈవిధముగం దొమ్మిదేండ్లతక్కువగాశతవర్షములవయసు గడపినను, ఆదురాత్మునకు సద్బుద్ధి గలుగనేలేదు. ఇట్లుండం గొంతకాలమున కొకదినంబున సిద్ధగంధర్వపూజితుం డగుపంబుజపదుం డనునొక సిద్ధుండు సర్వదేవతావందితుండును, ఓంకారస్వరూపుండు నగుమహాదేవునిదర్శించుకుతూహలముతోం గాశీధామమునకు విచ్చేసెను. అచ్చట నాతం డితరసిద్ధమునిగణంబులచేం బూజితుండై నియమపూర్వకముగాం బంచాయతనసంస్థితుం డగునోంకారనాథుని దర్శించుటకై బయలుదేఱెను. కలికాలమునందు వివిధదుఃఖాదులచేం బీడింపంబడుచుండుమానవులు కాశీక్షేత్రమునందలిమత్స్యోదరీతీరంబునంగల పంచాయతనక్షేత్రమున నివసించియున్నమహాదేవుని దర్శించి ప్రణామంబు లాచరించి భవకారణములగుపాపములను దొలంగించుకొనుటకై సర్వదా పరమేశ్వరునకుం బ్రదక్షిణనమస్కారములం గావించుచుం దదాలయమునందు నివసించి తత్ప్రసాదరూపంబులగుజలాదుల నాహరించుచు సుఖవిహారంబు గావించుచుందురు.

ఓవిశాలలోచనా! ఆదివ్యస్థానమునందు సకలదేవతలు నదృశ్య

మూర్తులై సంచరించుచుందురు. అప్పుడు పరమసిద్ధుం డగునంబుజ పదుండును నిజస్వరూపము నుజ్జగించి యొకవికృతం బగురూపముం దాల్చి యాప్రదేశమునందుఁ బరిభ్రమించుచుండెను. ఆసమయము నందుఁ బూర్వోక్తకపటసిద్ధుం డగుద్విజాధముఁడు మహాత్ముఁ డగు నా సిద్ధపురుషుం దర్శించి యాతండును దనవలెనే వికృతాకారుఁడై యుం డుటం గాంచి యుపహాసరూపముగా భక్తియుక్తుండునుంబోలి చటాలు న లేచి యథోచితప్రణామాదులచే నాతనికిఁ గపటసన్మానములాచరిం చి ,,ఆహా! మీదివ్యదర్శన మపూర్వమైనది. మహాత్మా! మీ రెచ్చటి నుండి యేయుద్దేశములో నిచ్చటికి విచ్చేసితిరి? కమనీయతేజోమయు లగుమీరు దేవలోకమునుండి యేతెంచితి రని నాకు బోధయగుచు న్నది. మీవంటితపఃప్రభావసంపన్నులగుదివ్యపురుషుల నీభూమండల మునం దేనెచ్చటను గాంచియుండలేదు. కావునఁ దపోధనులగుమీరు స్వర్గమునుండియే యవతరించి యుందు రని నేను భావించుచున్నాను.

అనియనేకవిధముల నవ్విప్రాధముఁడు కపటవినయముతో సంభాషించుటయు నావాక్యముల నాకర్ణించి సిద్ధపురుషుండిట్లనియెను. మహాత్మా! మీరు స్వర్గవాస్తవ్యులగువారినందఱను బాగుగ నెఱింగి యుందురు. కావుననే యీవిధముగా ననుమానింపఁగలిగితిరి. నేను నిజముగా స్వర్గలోకమునుండియే యిచ్చటికి వచ్చియుంటిని. ఈవిష యమునం దెట్టిసంశయమును లేదు. మీకుఁ గావలసినసకలవిషయము లంగూర్చియు నన్నుఁ బ్రశ్నింపవచ్చును. నేను మీకు సంతృప్తికరము గాఁ బ్రత్యుత్తరముల నీయఁగలను. అనుటయు నావిప్రుండు మహా పురుషా! నీవు స్వర్గలోకమునందు నివసించువాఁడవే యైన వో నించుక సేపిటఁగూర్చుండి నావాక్యముల నాలింపుము. నీ వెన్నఁడైన నప్సర స్సుందరీరత్నమగురంభను సందర్శించితివేని నాకెఱింగింపు మనియెను.

ఆమాటకు సిద్ధుం డించుక యాలోచించి విప్రశ్రేష్ఠా! స్వర్గలోక వాసినులగునప్సరఃకాంతలలోఁ బేరు గాంచియున్నరంభను నేను బాగుగా నెఱుంగుదును. కావున నామెంగూర్చి నీవడిగినవిషయముల నన్నిటిని సంపూర్ణముగాఁ దెలుపఁగల నని చెప్పెను. బ్రాహ్మణుం డంతు లకానందించి మహాత్మా! స్వర్గలోకవాస్తవ్యులలోఁ జంద్రరేఖంబోలి మనోహారిణి యగురమణీమణిరంభ నెఱుంగనివాఁ డెవ్వఁడుండును? ఓ సాధుశేఖరా! నీవు మరల నెప్పుడైన స్వర్గలోకమునకుఁ బోవుదువేని నేను రంభ క్షేమము నడిగితి నని యామెతోఁ జెప్పుమని ప్రార్థించెను. సిద్ధుం డామాట కాశ్చర్యపడి యోద్విజసత్తమా! అప్సరోరమణులలో నగ్రగణ్య యగురంభను సందర్శించుటకై నేను మరల స్వర్గమునకుఁ బోవుట తటస్థించినచో నప్పుడు తప్పకుండ నీయాదేశమును బరిపాలించెదను. అని చెప్పి యాసిద్ధుండు బ్రాహ్మణుని సంతుష్టుం గావించి యాక్షణంబుననే వాయువేగగమనముతోఁ గమనీయం బగుస్వర్గనగరమునకుంబోయి యంబరమునుండి వెలువడినచంద్రరేఖంబోలి యప్పుడే గృహమునుండి బయలుదేఱి వచ్చుచున్నట్టియుఁ, బద్మవిరహిత యగు పద్మాలయయంబోలి మనోహరమూర్తియై విరాజిల్లుచున్నట్టియు సుందరీలలామయగురంభను సందర్శించెను.

ఆమెసుందరవదనము సంపూర్ణచంద్రమండలసదృశమై మనోహరమై యుండెను. ఆమెసకలాంగకములు ననంగదేవతాధిష్ఠితములై మనోజ్ఞములై యుండెను. మదగజకుంభస్తనియు, పీనవిస్తీర్ణకటిమండలయు, సమున్నతవిశాలవక్షోభాగయు, నయననాసికాదిసర్వాంగసుందరియు, సిద్ధప్రసిద్ధదేవగణమనోహారిణియు, శోభనాంగియు, నగునాదివ్యరమణీలలామ రక్తోత్పలదళసదృశములగుతనకోమలచరణంబులచే స్వర్గతలంబును బల్లవితంబుగాఁ జేయుచు వీణాపాణియై వచ్చుచుండుటం

గాంచి సుకృతాత్ముఁ డగునాసిద్ధుం డామెతోనిట్లనియెను. ఓవరాంగీ! వారాణసీధామంబున నివసించుచుండు నొకబ్రాహ్మణుఁడు నీక్షేమము నడిగియున్నాఁడు. నీకాతనితోడిపరిచయమున్నదో నాకుఁ దెలుపుము. అనుటయు దివిజకాంతారత్నమగురంభ యించుక యాలోచించి "నే నెంతగాఁ బ్రయత్నించిచూచినను నాకాతనితో సంబంధ మున్నట్లెంతమాత్రము నగపడుటలేదు." అని చెప్పెను.

సిద్ధశేఖరుం డారంభవాక్యములనాకర్ణించి "ఓయిందీవరాక్షీ! ఇఁక నీభవనంబునకుఁ బొమ్ము." అని చెప్పి యాతఁడు మరల వారాణసీనగరంబునకుఁ జనుదెంచి సిద్ధసహస్రపూజితుండై పంచాయతనక్షేత్రంబున నివసించియుండెను. అనంతరము గొంతకాలమున కాబ్రాహ్మణుండుమరల నచ్చటికి వచ్చి యాసిద్ధుని సందర్శించి "మహామునీంద్రా! అప్సరస్సుందరీరత్నమగు రంభను మీరు సందర్శించితిరా? మీకు దర్శనం బిచ్చినయాదేవాంగనాశిరోమణి నాప్రశ్నకేమని యుత్తరమిచ్చినది?" అని యడుగుటయు సిద్ధుండు "భూసురేంద్రా! నేను స్వర్గమునకుఁ బోయి రంభను దర్శించితిని. నీమాట లామెకు నివేదించితిని. అప్పుడామె కొంతసేపటివఱకు నాలోచించి మీరు ప్రశంసించినయాతఁ డెవ్వఁడో యాతనిపేరైన నేనెన్నఁడును వినియుండలేదని చెప్పినది." అనియెను.

అంతనాబ్రాహ్మణుండు "తేజోమయా! నేను బ్రాహ్మణుఁడను. నీవు నాయందు దయయుంచి మరల స్వర్గలోకమునకుఁ బోయి యారంభను దర్శించి నీవాబ్రాహ్మణు నెఱుంగకుండుటకుఁ గారణమేమని ప్రశ్నింపుము" అనివేడుటయు నాసిద్ధశ్రేష్ఠుఁడు బ్రాహ్మణునిప్రార్థనము నంగీకరించి మరల సుకృతిగణనివాసయోగ్యంబగుస్వర్గనగరమునకుం జని పృథునితంబినియు, పద్మరాగసమప్రభయు నగురంభం గాంచి మం

దహాసంబు సేయుచుఁ జంచలహృదయ యగునామె నుద్దేశించి ఓసుందరీ! నీకుఁ బరమప్రియుండును వారాణసీనగరవాస్తవ్యుఁడు నగునాబ్రాహ్మణుఁడు మరల "నిన్నింతగాఁ బ్రేమించుచున్న నన్ను నీవిట్లనాదరము చేయుటకుఁ గారణమేమి" అని ప్రశ్నించిరమ్మని నన్నుఁ బంపినాఁడు.

అనుటయు నాదివిజకాంతాశిరోమణి చిఱునవ్వు ముఖమండలమునఁ దులకింప సిద్ధసహస్రశ్రేష్ఠుండగునమ్మహాత్ముని సంబోధించి యిట్లనియెను. ఓసిద్ధశేఖరా! నీవు మరల నాబ్రాహ్మణునొద్దకుఁ బోయి నావాక్యములుగా నిట్లు చెప్పుము. ఓబ్రాహ్మణా! రంభతోఁ బరిచయము గల్పించుకొనవలయు నని నీకుఁ గుతూహలమున్నచో నీవు నియమవంతుఁడవు గమ్ము! ఆమూలమున నీవు స్వర్గలోకమును జేరఁగలవు. అని రంభయాబ్రాహ్మణునింగూర్చి చెప్పి యాసిద్ధశ్రేష్ఠునకుఁ బ్రణామం బాచరించి సకలాప్సరస్సఖీసహితముగా నందనవనమునకుం బోయెను.

అనంతరము దేవగంధర్వవందితుఁడగునాసిద్ధవర్యుఁడు మరలఁ గాశీధామమునకు వచ్చి స్వర్గసందర్శనసుఖమును స్మరించుకొనుచు నాబ్రాహ్మణుని సందర్శించి విప్రోత్తమా! సురసుందరీమణియగురంభకును సకలదేవతాగణంబులకును నీపరిచయమును గలిగించుకొనవలయునని యభిలాషయున్నచో నీవువిశేషనియమపరిజ్ఞానంబు గాంచి నియమానుష్ఠానముం గావింపు మని చెప్పెను. ఆవచనంబు లాకర్ణించి యాబ్రాహ్మణుండు సుస్థిరహృదయముతో సిద్ధశేఖరా! నేనీదినమునుండి పాషాణభోజనముం గావింప నని నియమము చేసికొంటిని. నీవు స్వర్గలోకమునకుఁ బోయి యారంభను మరల దర్శించి పూర్వము నిన్నుఁ బ్రశ్నించినవాఁడు పాషాణభోజనము చేయనని నియమము చేసికొన్నవాఁడుసుమా యని చెప్పుమనియెను.

సిద్ధుండును బ్రాహ్మణునియీవాక్యముల నాలించి యథోచిత సంభాషణలచే నాతని సంతుష్టుంగావించి మరలవాయువేగంబున స్వర్గపురమునకుం బోయి రంభను దర్శించి సుందరీ! పాషాణభోజనముచే యనని నియమము చేసికొన్నయాబ్రాహ్మణుని నీవెఱుంగవా? ఈసంగతి తెలిసికొని రమ్మని యాతఁడు మరల నన్నంపినాఁడని చెప్పెను. రంభయు నాబ్రాహ్మణుఁ డట్టి నియమము చేసికొన్నదినమునుండి యాతనింగూర్చి భావించుచుండెను. క్రమముగా నాబ్రాహ్మణునియసాధారణనియమమూలంబున సకలవస్తువులును రాత్రులయందు బ్రదీపకాంతిలోఁ బ్రకాశించువిధంబున దేదీప్యమానము లగుచుండెను. కాశీధామవాస్తవ్యులకందఱకును గేవల మప్రియుం డగునాబ్రాహ్మణుఁ డానియమప్రభావముచేతనే యెల్లవారికిని బ్రియుండయ్యెను. ఎన్నఁడు నాతని మందిరమునకుఁ బోవుట కిచ్చగింపనివారును దమగృహంబుల కెప్పుడు నాతఁడు వచ్చుట కంగీకరింపనివారునుగూడ నాతనిదర్శింపకుండజీవింపఁ జాలనంతటిస్థితికి వచ్చిరి.

ఆబ్రాహ్మణుఁడును గ్రమముగా నిర్జనస్థానమున నివసించి నియమపరిపాలనముంగావించుచుఁ బరమసిద్ధిలాభముం గాంచిబ్రహ్మమయుఁడై బ్రహ్మలోకప్రాప్తిం గాంచఁగలిగెను.

ఓదేవీ! పార్వతీ! యమనియమాదుల నల్పముగాఁగాని యధికముగాఁగాని యుపాసించునుపాసకులు స్వప్రభావముచేస్వర్గప్రాప్తులుగాఁ జాలుదురు. చిరకాలము యశస్కరములగుకర్మముల నాచరించువారైనను నియమవ్రతులవలెననాయాసముగా బ్రహ్మలోకమునుబడయఁజాలరు. ఓశతపత్రముఖీ! పర్వతాత్మజా! ఇఁక జెప్పవలసిన దేమున్నది? ఆ బ్రాహ్మణుఁడు నియమావలంబనమూలమున బ్రహ్మలోకమును జేరి శచీపతి యగుమహేంద్రునింబోలి స్వర్గనగరమునందు సుఖనివాసముం

గాంచఁగలిగెను. ఓసూర్యచంద్రతేజశ్శాలినీ! ఇది నియమఫలప్రకారంబు. కావున నియమమునందు సర్వదా విశుద్ధభావముతో నుండవలయును.

—♦ చంద్రశేఖరత్వహేతుకీర్తనము. ♦—

భగవతి యగుపార్వతి యీవిధముగా నియమఫలసంకీర్తనము నాకర్ణించి పరమానందహృదయముతో లోకకర్త యగునాత్మభర్త నుద్దేశించి మరల నిట్లనియెను, మహాదేవా! నియమఫలముంగూర్చి నీచేఁ జెప్పంబడినవిషయము నాకర్ణించితిని. ఆబ్రాహ్మణుఁడు దుష్కర్మనిరతుఁ డయ్యును నియమప్రభావముచే బ్రహ్మలోకప్రాప్తుండయ్యెను. ఓంకారేశ్వరప్రసంగవశమున నీచేఁ జెప్పంబడిన నిత్యనియమఫలంబు నాలకించితిని. కాని యిప్పు డతిగోప్యం బగు నింకొకవిషయముంగూర్చి విన వలయు నని నాకభిలాష గలుగుచున్నది. ఓసుధాకరసన్నిభా! నీవు నిరంతరమును నీమస్తకమునం దర్ధచంద్రుని ధరించుచుండుటకు నిమిత్తమును, నీకుఁ జంద్రశేఖరనామము గలుగుటకుఁ గారణమును విస్పష్టముగా నెఱింగింపవలయును. నీవు నీయర్ధశరీరమునందు నన్ను ధరించినవిధముననే చంద్రునిగూడఁ దలపై ధరించుటకుఁ గారణమేమి? ఎవ్వనిచరణరజోలేశమును దలఁదాల్చుటకు దేవతలుగూడ నభిలషించి ప్రార్థించుచుందురో యట్టినీయుత్తమాంగమునందుఁ జంద్రుఁ డేవిధముగా నధిరోహింపఁగలిగెను? పరమేశ్వరా! నేను నీసహధర్మిణి నగుటం జేసి నాయెడలఁ బరమానుగ్రహమును బ్రకటించుచు నీరహస్యమును విస్పష్టముగా నాకు బోధింపుము.

అని యీవిధముగాఁ దత్కథాశ్రవణమునకై యత్యుత్కంఠితయై పార్వతి ప్రశ్నించుటయు మహాదేవుండును ప్రేమపూర్వకముగా

నాగిరిరాజనందనం గౌఁగిలించుకొని యిట్లు చెప్పఁదొడంగెను. ఓసు ముఖీ! వినుము. నీవు పూర్వము సతీరూపమును బరిత్యజించినప్పుడు నేను నీవిరహమును సహింపఁజాలక నిర్వేదముతో నరణ్యావాసము సుఖకరం బగునని భావించి యాత్మమాత్రద్వితీయుఁడనై వనవనంబులకును బరిభ్రమింప నారంభించితిని. మఱియును దపశ్చరణంబునకు నిశ్చయించి గృహంబును బరిత్యజించి రమణీయములగు పర్వతగుహాంతరములయందును, నదీపులినములయందును, వృక్షవాటిగణంబుల సమీపమునందును, దరుషండములయందును, దేవోద్యానములయందును, సాధారణవనములయందును సంచరించుచు నిందీవరసమన్వితంబులగుజలాశయములసమీపమునందు నివసించుచుంటిని. నేనట్లు కఠోరతపోనియమము నవలంబించి యుండుటచే నప్పుడు నేనాశ్రయించిన సమస్తవృక్షములును, సమస్తపర్వతములును దపోనలంబుచే దగ్ధములై పోవుచుండెను. కొన్నిపర్వతములశృంగములు ధూమాకీర్ణములును, మఱికొన్నిపర్వతములశిఖరములు జ్వాలాభీలములునై నాతపఃప్రతాపముచే సకలపర్వతములును దగ్ధములగుట కారంభించెను. ఆతపస్తేజముచే సూర్యచంద్రాదిగ్రహగణంబులు ప్రభాహీనములై పోయెను. లోకనియంత యగుయముండు జరాపీడితునివలె నైపోయెను. మఱియు సురాసురసమన్విత మగుత్రైలోక్యమును బరిఖిన్నమైపోయెను.

అప్పుడు సకలదేవతలును, బ్రహ్మేంద్రసహితముగా మదీయమగుతేజముచే సమాకీర్ణులై మందరాచలశిఖరమునందుఁ జేరియుండిరి. ఆసమయమున సకలదేవతాధీశ్వరుఁ డగుమహేంద్రుఁడు బ్రహ్మదేవు నుద్దేశించి, మహాత్మా! ఈయద్భుతసంఘటనమునకు నిమిత్త మేమి? మేమీయగ్నిజ్వాలలచే నీవిధముగాఁ బీడితులమగుటకుఁ గారణమేమి? ఈదారుణానలజ్వాలలు చల్లారుట కుపాయమేమి? నిన్నాశ్రయించి

యున్న యాపన్నులమగుమాకు సదుపాయము నుపదేశింపుము. అని యింద్రుండు ప్రార్థించుటయుఁ జతుర్ముఖుండు సజలజలదగంభీరస్వరమునఁ నిట్లనియెను.

మహేంద్రా! ఎవ్వనితపఃప్రభావముచే నీత్రిభువనంబులును దగ్ధము లగుచున్నవో యామహాత్ముఁ డగుమహాదేవుని యసాధారణ విక్రమము నెఱుంగుటకు నేను సమర్థుండను గాఁజాలను. ఆమహాదేవునిసన్నిధిని మాసంబంధ మగునెట్టియధికారమును నిలువఁజాలదు. ఆతనియుద్దేశమునకు వ్యతిరేకముగా నెవ్వరు చరింపఁగలరు? నేనిప్పుడు జగత్కల్యాణముకొఱకు నీకు హితకరమగుమార్గమును బోధించెదను. వినుము. ఆరుద్రుండు చంద్రధారణంబు గావించునంతవఱకును సౌమ్యుండు గాఁజాలఁడు. కావున నీవిపత్సముద్రమునుండి తరింప నభిలషింతువేని రమ్ము. మనమందఱమును జంద్రుని వెంటఁబెట్టుకొనిపోయి యామహాదేవునిమస్తకమునందు సంస్థాపింతము. ఆపరమేశ్వరుఁడు సతీవియోగముచే దివసమునందలి వీతిహోత్రునింబోలి ప్రజ్వరిల్లుచు మనలనందఱను దహింపఁజేయుచున్నాఁడు. ఆదేవదేవుఁడు నిశ్చయముగా దేవతాస్వరూపుఁ డగుసుధాకరునిఁ దనయుత్తమాంగమునందు ధరింపఁగలఁడు. అప్పు డయ్యీశ్వరునిమస్తకమునందలిచంద్రచూడాశ్రితమణివినిర్మలశోభామయమై దారుణతపస్తేజమును సులభముగా నుపసంహరింపఁగలదు. ఇట్లు గావించినచో మనకార్యసిద్ధి యగుటయేగాక యాసదాశివుండును సంతుష్టుండు గాఁగలఁడు. మఱియు నాహిమాంశునిప్రభావముచే నాదేవునిసకలసంతాపమును దూరీభూతం బగుటచే నాతండును శాంతస్వరూపుఁడు గాఁగలఁడు.

అని యిట్లు బ్రహ్మదేవుం డుపదేశించుటయు నింద్రాదిసమస్తదేవతాగణంబులును లోకహితకరంబగునాయుపాయము నంగీకరించి

మంగళకరంబగు చంద్రరూపమణిరాజమునుండి యొకయమృతకుంభము
ను నొకవిషకుంభమును గ్రహించి యందఱును వినీతభావముతో మా
త్సన్నిధానమును జేరియుండిరి. అప్పు డేకహస్తపరిమాణములును,
వస్త్రావృతంబులు నగునయ్యమృతవిషకలశములు పుష్పవిశిష్టంబగుచం
దనముం బోలి మనోహరపరిమళకలితంబులై విరాజిల్లుచుండెను. ఆసమ
యమున వాయుప్రభృతు లగుసకలదేవతలహృదయములు నింద్రియ
ములును సుప్రసన్నములై యుండెను. అంతఁ బితామహుం డగువన
జాసనుఁడు మహాదేవుం డగునన్ను సంబోధించి దేవదేవా! అమృతవిష
పూర్ణంబు లగునీకలశములను దయతోఁ బరిగ్రహించి సన్నిధి నాశ్ర
యించియున్న యీయమరగణంబులకందఱకును భవదీయదివ్యదర్శన
లాభమును బ్రసాదింపు మని ప్రార్థించెను.

ఓపరమేశ్వరీ! అప్పుడు నేను బ్రహ్మదేవునివాక్యముల నాకర్ణిం
చి యాకలశద్వయమునందును ముందుగా నమృతకలశమును గైకొం
టిని. అది నాయుత్తమాంగమునం దిప్పుడు చంద్రరేఖారూపమునఁ
బరిణమించి విరాజిల్లుచుండెను. తదనంతరము నేనా రెండవవిషకుంభ
మును నామధ్యమాంగుళిచే స్పృశించి యాయంగుళితోనే నాగ్రీవదే
శమునందు విలేపనము చేసికొంటిని. దేవీ! నాయుత్తమాంగమునం
దమృతముండుటచేఁ జంద్రశేఖరుఁడనియు, గ్రీవదేశమునందు హాలా
హాలముండుటచే నీలకంఠుఁడనియు నానామద్వయము నాకప్పుడు లభిం
చెను. ఏకకాలముననే నామస్తకగ్రీవములయందుఁ జంద్రహాలాహా
లములు దైహికచిహ్నములవలెఁ బొడసూపఁదొడంగెను. సౌమ్యపదా
ర్థములన్నిటికంటెను నతిసౌమ్యుం డగు చంద్రుఁడు నాయుత్తమాంగ
ము నధిరోహించియుండుటచే నప్పుడు నాతపస్తాపమంతయును శీతలమై
పోయెను. అప్పుడా హాలాహాలముచే నాకంఠప్రదేశము శ్యామలవర్ణ

విభాసిత మయ్యెను.

ఓవామలోచనా! నేనప్పుడు దేవతలకందఱకును సౌమ్యుఁడను శివస్వరూపుఁడను నై ప్రసన్నభావముతోఁ బ్రియదర్శనుఁడనైతిని. ఆ విషామృతచిహ్నములచే నలంకృతుఁడ నై యున్న నేను పూర్వముకంటె ను మనోహరాకారుఁడనై యెల్లవారికిని దర్శనీయుండనైతిని. దేవీ! ఈదివ్యచరిత్రము నాకర్ణించువారు గాణాపత్యలాభముం గాంతురు. పుణ్యప్రదమును, సర్వదా శుభకరమును, పితృగణస్వర్గప్రాపకము నగు నీయితిహాసమును బఠించువారు సకలకలికల్మషవిముక్తులు గాఁగలరు. నిర్మలహృదయముతో నద్భుతం బగునీచంద్రజన్మాధ్యాయము నధ్యయనముసేయువానియెడల నేనతిప్రియుండనై దేహాంతమునం దాతనికి విషయసంపర్కవిరహిత మగుగాణపత్యపదలాభమును బ్రసాదింతును.

విభూతిమాహాత్మ్యము.

అవ్యయయు, నగేంద్రనందనయు, మహాభాగయు నగుపార్వతి దేవి సకలదేవతాధీశ్వరుం డగునిజేశ్వరునుద్దేశించి యిట్లనియెను. ఓ దిగంబరా! దేవదేవా! సర్వభూతాధినాథుఁడవు, సర్వదేవతాసార్వభౌముఁడవు నగునిన్నుఁ బతిగాఁ బడయుటచే నీవిశ్వమునందు నాకంటెఁ బుణ్యవతు లగుసతు లెందును లేరని యానందించుచున్నాను. శ్మశాన ప్రదేశములయందుఁ బ్రమథగణసహితుండవై యానందతాండవము గావించునప్పుడు పరమైశ్వర్యసమన్వితమును, భస్మవిభూషితము నగునీ దివ్యమూర్తిని నేను సందర్శించుచుందును. సకలశుభకరంబులగునభిలషితవరంబులను భక్తులకుఁ బ్రసాదింపఁగల సమర్థుఁడవగునీవు సకలాంగకములను విభూతిరజోలేపనముం గావించుకొనుటకుఁ గారణమేమి? చందనగోరోచనాది పరమోత్కృష్టవిలేపనములుండఁగా నీవు కేవలము

ను విభూతిని నీయర్ధాంగినగునాకంటెను బ్రియంబుగాఁ దలంచి యుపయోగించుటకు నిమిత్తమేమి? దేవాదిదేవా! బాలేందుశేఖరా! ఈ భూతిజన్మస్థానంబును, ఇది నీకతిప్రియం బగుటకు నిమిత్తమును విస్పష్టముగా నాకెఱింగింపఁగోరెదను.

అనియిట్లతికుతూహలముచేఁ బ్రార్థించుచున్న ప్రజ్వలానల సన్నిభసముజ్జ్వలాంగి యగు దుర్గాదేవిని గాఢాలింగనపూర్వకముగా నాదరించి పరమేశ్వరుం డిట్లు చెప్పందొడంగెను.

ఓగౌరీ! చంద్రముఖీ! నేను నిరంతరమును భస్మధారణముం గావించుటకుఁ గారణమును జెప్పెద నాలకింపుము. బ్రహ్మదేవునిచే సృష్టింపఁబడినయీవిశ్వమునందు మహోత్కృష్టంబగుభృగువంశమునకు భూషణమై యనుపమానతేజస్సంపన్నుఁడగునొకబ్రాహ్మణుఁ డుండెను. ఆతఁ డతికఠోరనియమముల నవలంబించి తీవ్రం బగుతపంబు గావించుట కారంభించెను. ఆనియమవ్రతుఁడు నిశ్చలదీక్షతో గ్రీష్మకాలమునందుఁ బంచాగ్నిమధ్యమున నిలిచియు, శీతకాలమునందు జలమధ్యమున శయనించియు, వర్షాకాలమున ధారాధరసమూహము నుండి వెలువడు ప్రబలజలధారలను సహించుచు నాకాశమధ్యమునం దుండియు నిర్విఘ్నముగాఁ దపంబు సేయుచుండెను.

ఇట్లు నియమాన్వితుఁడై తపశ్చరణంబు గావించుచున్నయాతనికి క్షుద్బాధ యగుచుండుటయు నాతఁడు కాలక్రమమున నాలుగు ఐదు, ఆఱు, ఏడు పదిదినములకొకసారిమాత్రము మితభాషియు మితాహారియునై కాలమును గడపుచుండెను. భల్లూక, శరభ, సింహ, శృగాలాదిజంతువులు పరిచారకులంబోలి ఫలమూలాదులం గొనితెచ్చి యమ్మహాత్మునకు సమర్పించుచుండెను. ఆతనితపఃప్రభావముచే నా తపోవనమునందలి పన్నగశార్దూలాహారము లగుమృగంబులును, కేవల

మాంసాహారములగుజంతువులును సహజములగుతమపరస్పరశత్రుత్వ
ములను బరిత్యజించి యన్యోన్యానువర్తనంబు గలిగి మెలంగుచుండె
ను. క్రమముగా నాతపోధనుండును దీప్తానలముంబోలి సముజ్జ్వలప్ర
భామయుం డయ్యెను. ఆతనియతిభీషణతపస్తాపముచే సకలలోకములు
ను దపించుట కారంభించెను.

పిమ్మట నాతఁడు లవణవిరహితంబు లగుశాకములనుమాత్రమే
భుజించుచుండుటకు నియమము చేసికొనియెను. అందుచే నానియమ
దీక్షితునకుఁ ద్రిలోకములయందును బర్ణాదుం డనునామము విఖ్యాతం
బయ్యెను. అట్లాపుణ్యపురుషుఁడు పర్ణమాత్రభోజనంబుచేతనే సంపూ
ర్ణముగ మృష్టాన్నభోజనముం గావించినంతటి సంతృప్తిం గాంచుచు
బహుదినములు, బహువత్సరములు కఠోరనియమములచేఁ గడపివై
చెను. అనంతరము గొంతకాలమున కాధర్మపరుం డగుమునివరుండు
తనలోఁ దానే, “ నేను నిరంతరమును సత్యధర్మముల నవలంబించి
చిరకాలమునుండి తపోనుష్ఠానముం గావించుచుంటిని. కాని యెంతకా
లమువఱకు నాశరీరమునందలిరక్తము శాకరసరూపమునఁ బరిణమింప
దుండునో యంతకాలమువఱకును మదనుష్ఠితం బగుధర్మము సంపూర్ణ
ముగ ఫలింపఁజాలదు.” అని నిశ్చయించుకొనియెను.

ఓపార్వతి ! ఆమహాత్ముఁ డిట్లు భావించుకొని మఱికొంతకాల
మున కొకనాఁడు స్వధర్మనిర్వహణంబునకై వనంబునఁ బ్రవేశించి పద్మ
గర్భసవర్ణంబు లగుదర్భలను సంగ్రహించుచుండెను. ఆసమయమునం
దనితీక్ష్ణం బగునొకదర్భ యామునిప్రవరునిహస్తానికిం దగిలి గీచుకొని
పోవుటచే గాయమై యాగాయమునుండి కేవలము శాకరసదృశంబగు
శోణితము స్రవింప నారంభించెను. ఆసంయమీంద్రుం డావార్తముం
గాంచినంతనే పెద్దఁ బ్రవ్వఁ బ్రవ్వుచుఁ బరమానందమున నాట్యము చేయ

నారంభించి గంభీరగర్జనంబులచే సమీపాశ్రితంబు లగుజంతువులకుఁ గూడ మహాభయమును గల్పించుచుండెను. ఆనందతన్మయుం డగు నాపరమపురుషునివికారచేష్టితములం గాంచి యటనున్న సింహశార్దూలాదిమృగంబు లన్నియును భయముచేఁ బలాయితములు గానారంభించెను.

ఓశైలేంద్రినా! ఆపుణ్యమూర్తికిఁ గ్రమముగాఁ జిత్తోన్మాదంబు గలుగునేమో యని శంకించి నేనప్పుడు వృద్ధబ్రాహ్మణరూపముం దాల్చి యాతపోధనునకుసాక్షాత్కరించితిని. అప్పుడు పాదసూపి నేనెంతగాఁ బలుకరించినను దన్మయుం డగునాపక్షాదమునీంద్రుండు నావచనములను జెవులం బెట్టకుండఁగనే యెప్పటివలె గర్జించుచు నృత్యము సేయుచుండెను. కాని నే నంతతో నూరకుండక యాతనికి మఱింత దగ్గఱగాఁ బోయి నిలుచుటయు నాకస్మికముగా నాతఁడు నన్నుం గాంచి తనవికృతనటనాదులనుండి చటాలున విరతుం డయ్యెను. అప్పుడు నే నత్యాదరముతో నాతనిచేయి పట్టుకొని, విప్రశ్రేష్ఠా! ఇదియేమి? ఇప్పుడు నీకిట్టియభూతపూర్వం బగుభావోదయ మగుటకుఁ గారణ మేమి? చంద్రునినుండి యంధకార ముదయించుట యెట్లసంభవమో, యట్లే పుణ్యమూర్తివగు నీహృదయమునుండి యిట్టివికృతభావ ముదయించుట యనుచితముగదా! ఆత్మశ్లాఘనమును బరిత్యజించినవో నశ్రమంబునఁ దపోధనలాభంబు సిద్ధించును. యజ్ఞస్వరూపమును, కీర్తిస్వరూపమును దపమే గావునఁ జిరసంచిత మగుతపఃఫలమును వినాశము చేసికొనకుము.

నేను సుందరుండ నని చంద్రుండును, నేను తేజోమయుండ నని సూర్యుండును, నాకంటెదహించువా రెవ్వరును లేరని యగ్నియు, నెన్నటికి నహంభావమును బ్రకటించుటలేదు. మునీంద్రా! జన్మసంచిత

మగుచుతపశ్శక్తి దానధర్మాదులచే నతివినిర్మలమై యున్నది. ఆత్మశ్లాఘనంబుచే సకలధర్మంబులును గలుషీభూతములగుచుండును గావున నీవు తపోవిషయంబున నహంకారమును సంపూర్ణముగాఁ బరిత్యజింపవలయును. శరీరరూపిణి యగునీపృథ్వి యాత్మకంటె నతిరిక్తమైనది. దానియందు నానావిధంబు లగురసంబులు పరిదృశ్యమానము లగుచుండును. కావున నీవు నాశరీరమునుండి శాకరము వెలువడుచున్నదిగదాయని విస్మయమునకు వశీభూతుఁడవు గావలదు. ఈభూమండలమునందు నీకంటెను దపఃప్రభావసంపన్నులగు సంయమిశ్రేష్ఠు లనేకులున్నారు.

విప్రోత్తమా! ఇటు చూడుము. నీవలెనే నాశరీరముగూడఁ దపస్తేజముచే నిష్కల్మషమై యున్నది. కాని “నేను నిష్కల్మషుఁడ” నని నీవభిమానపడుచున్నాఁడవు. కావున నీవు కిల్బిషకలితుఁడవని నే ననుమానించుచున్నాను. దహ్యమానం బగుతృణమునుండి యేవిధముగా భస్మము బహిర్భూతం బగునో యావిధముగానే నాశరీరమునుండికూడ వెలువడఁగలదు.

పార్వతీ! నేనిట్లు చెప్పుచు నేనాబ్రాహ్మణునిసమక్షమునందే నాతర్జన్యంగుళిచ్ఛేదనముం గావించుకొంటిని. అప్పు డాయంగుళినుండి యతివిమలంబు లగువిభూతిధారలు, యజ్ఞమునుండి వసుధారలవలెనే ప్రవహింప నారంభించెను. ఆబ్రాహ్మణోత్తముం డట్లు నాయంగుళినుండి వెలువడుచున్న భస్మధారలం గాంచి యత్యాశ్చర్యావిష్టహృదయుఁడై సాధువాదము గావించుచు, మహాత్మా! ఈపృథ్వీతలము బహురసకలితమైన దని నీవిదివఱ కానతిచ్చినమాట సత్యమైనది. నేను నాయంగుళినుండి శాకరసము వినిర్గతం బగుటం గాంచి గర్వించితిని. ఆయహంకారమును నీవు నీయంగుళినుండి భస్మధారలను బ్రవహింపఁ

జేసి సంపూర్ణముగ నెఱవేర్చితివి. మహాత్మా! నీవెవ్వరు? నీజన్మగ్రహణముచే నేవంశము పవిత్రమైనది? నీనామ మేమి? ఏవిధానము నవలంబించి నీవు తపంబు గావించుచుంటివి? ఆహా! నీయంగుళినుండి భస్మధారలు వెలువడుచున్నవి. నేను బహుసహస్రవత్సరములనుండి మహాదేవానుగ్రహముం గోరి యతికష్టముతోఁ దపం బాచరించుచుంటినని నీవు నాయందుఁ గరుణించి నవజలధర తేజోమయదివ్యస్వరూపముతో సాక్షాత్కరించినవిష్ణుదేవుఁడవు గాదుగద! నీవు మేఘవాహనుఁడగునింద్రుఁడవో, దేవాదిదేవుండగు మహేశ్వరుండవో యనుగ్రహించి నాకెఱింగింపుము. అనియిట్లువిప్రోత్తముండు ప్రశ్నించుటయు నేనప్పుడు గౌరీయుతం బగునిజస్వరూపముతో నాతనియెదుట సాక్షాత్కరించితిని. అంత నాపుణ్యపురుషుండు సంభ్రమంబున నాచరణసన్నిధానమున సాష్టాంగాలింగితధరణీతలుండై వ్రాలి యిట్లు నన్నుస్తుతింప నారంభించెను.

దేవాదిదేవా! ప్రణవస్వరూపుఁడవు, శూలధారివి, మహేశ్వరుఁడవు నగునీకు నమస్కారము. బ్రహ్మేంద్రాదులకును, విష్ణుదేవునకును బూజనీయుం డగుదేవునకు నానమస్కారంబులు. ప్రభూ! భస్మాంగరాగుఁడవు, భస్మోత్పత్తివికారుఁడవు, భస్మలిప్తశరీరుఁడవు, దుఃఖాంతఫలదాయకుఁడవు నగునీకు వందనములు.

దేవీ! ఇట్లు స్తోత్రము సేయుచున్న సద్భావవిశుద్ధచిత్తుం డగు నాతపోధనుం గాంచి నేనును విశుద్ధభావచిత్తుండనై యిట్లంటిని. ఓమునిసత్తమా! నీచేఁ గావింపఁబడిన యీస్తోత్రమునకు నేను సంతుష్టుండనైతిని. ఈస్తవంబునకు ఫలంబును నిర్దేశించెద నాకర్ణింపుము. ఈపవిత్రస్తోత్రమును బఠించువాఁడు సర్వైశ్వర్యసంపన్నుఁడును సకల, దుఃఖవివర్జితుండును గాఁగలఁడు. నీవు నాకత్యంతప్రియుండవగుగణాధిపతివి

గాఁగలవు. గోబ్రాహ్మణదేవతాగణంబులయందు నీకు నిరంతరమును శ్రద్ధాభక్తులు నిశ్చలంబులై యుండునుగాక! గణేశ్వరా! నీవు యోగబలంబుచేఁ బరమానందకందళితహృదయారవిందుండవై నాకుఁ బ్రియామంబు గావించి మేరుశైలస్థితంబును, దేవయోగ్యంబును, మద్దత్తంబు నగుసుఖావాసమునందు నివసించియుండుము. అని వరం బిచ్చి యమ్మునిశ్రేష్ఠు ననుగ్రహించితిని.

అమృతసుగంధీ! పవిత్రాకారంబుచే విభూతి నాకతిప్రియతమపదార్థం బయ్యెను. విభూతిలేపనమాత్రంబున సర్వోత్తమస్నానఫలంబు సిద్ధించును. పుణ్యంబగు సకలతీర్థంబులను, బ్రయాగతీర్థంబునను స్నానముచేసిన ఫలము విభూతిస్నానముచేతనే లభింపఁగలదు. మఱియు విభూతిస్నానముచే నమ్మనుజుఁడు, ప్రయాగాదితీర్థంబులయందు భక్తితోఁ బ్రసంకలితపుణ్యఫలంబుకంటె శతగుణాధికఫలంబు లభించును. బ్రహ్మయు, విష్ణుండును, అనంతుఁడును, శక్రుండును, యముండును, వైశ్వానరుండును, వరుణప్రభృతిదేవగణంబులును విభూతిస్నానప్రభావముచేతనే సర్వైశ్వర్యసంపన్నులై సకలప్రజలకును బూజనీయులుగాఁగలిగిరి. ద్వాదశాదిత్యులును, అష్టవసువులును, ఏకాదశరుద్రులును, మరుత్తులును, అశ్వినీదేవతలునుగూడ నీవిభూతిస్నానము నుపాసించియే దేవత్వలాభముం గాంచఁగలిగిరి. మఱియుఁ దపోధనులును, సిద్ధులును, ఉరగులును, చారణులును విభూతిస్నానమాహాత్మ్యముచేతనే మోక్షపదప్రాప్తులైరి.

ఓపార్వతీ! విభూతిస్నానము నాచరించువారికి యక్షరాక్షసపిశాచాదులవలన నెన్నఁడు నట్టిబాధలును గలుగవు. దేవీ! మత్సమానులును, యోగవిషయంబున మత్సదృశప్రభావసంపన్నులు నగు వీరందఱును విభూతిస్నానమాహాత్మ్యము చేతనే మదనుచరులు గాఁగలి

గిరి. మద్విభూతినుండి యుత్పన్నంబైనస్వర్గము పరిమితఫలప్రదాయక మైనది. కాని నావిభూతిమాత్రము వివిధపుణ్యఫలప్రదానసమర్థమైనది. విభూతినే యాధారముగజేసికొనియుండుమద్భక్తులయుత్తమకార్యములకు రాక్షసులైనను విఘ్నముల నాపాదింపఁజాలరు. పరమంబగువిభూతినాశ్రయించియుండువారు నాయాజ్ఞానువర్తులై మదీయంబగు నుత్తమలోకమునందు యథేచ్ఛావిహారములం గావించుచుందురు. ఓవామలోచనా! స్నానము లన్నిటియందును విభూతిస్నానమే సర్వోత్కృష్టమైనది. విభూతిస్నానమువలన నెట్టిఫలము లభించునో యావిషయంబంతయును గణేశ్వరుఁడు బాగుగ నెఱుంగును. గంగానదివంటితీర్థమును, వేదమువంటి శ్రుతులును, మృత్యువువంటి శాసకులును నెట్లు లేకుందురో యట్లే విభూతితో సమం బగుతపంబు మఱియొకటి లేదు. హింస్రజంతువులు పరహింసితమును, బ్రమత్తము నగుజంతువు నెట్లు హింసింపక విడిచిపైచునో యట్లే విఘ్నసమూహములు విభూతిస్నానము చేయువానిని స్పృశింపఁబోవు.

ఓకమలదళలోచనా! నేనీవిధముగాఁ బరమమునీంద్రుండగు పర్జాదు ననుగ్రహించుటకే నాసకలాంగకములయందును విభూతివిలేపనముం గావించుకొంటిని. ఓహిమాచలతనయా! ఈవిభూతి యేవిధముగా నుత్పన్నం బైనదో, యేకారణముచే నాకది యంగరాగం బైనదో యాపూర్వవృత్తాంతమును నీకిప్పు డెఱింగించితిని. మానవులు గాని, దానవులుగాని, మఱి యెవ్వరుగాని నాకతిప్రియం బగునీభస్మస్నానము నుపాసింపఁగలుగుదురేని మత్ప్రియభక్తు లగుచట్టివారు నా ప్రమథగణంబులలో శ్రేష్ఠులును, సూర్యచంద్రాగ్నిసదృశతేజస్సంపన్నులును, దేవగంధర్వసిద్ధగణప్రపూజితులును, రమణీయాకారులు నై యుందురు.

—: రుద్రవృత్తాంతకీర్తనము. :—

పవిత్రియుఁ గమలదళవిశాలలోచనయు, గిరీంద్రనందనయు, నగుదుర్గాదేవి విభూతిసంబంధమగునుపాఖ్యానము నాకర్ణించి వెండియుఁ బతి యగుపశుపతినుద్దేశించి యిట్లనియెను. ఓపరమేశ్వరా! సకలజీవులకు నంత్యకాలనివాస మైనట్టియు, శవదహనధూమముచేఁ గన్నులను మండించునట్టియు, వేలకొలఁదిచితులయందుఁ బ్రజ్వలించుచున్నచితానలజ్వాలలచే నతిభయంకర మైనట్టియు, ఎల్లదెసలయందును సిద్ధచారణాదులచే సంకులీకృత మైనట్టియు, మృతకళేబరములనరములచేతను, గ్రిల్లినమాంసఖండములచేతను దుర్గంధదూషితమైనట్టియు, వినిందితభూతప్రేతాదులచే సమాకీర్ణమైనట్టియు, మేదోరుధిరంబులచేఁ బంకిలమైనట్టియు, శివారవంబులచే నతిభీషణమైనట్టియు, కాకోలూకశతంబులచే నాకులమైనట్టియు, నానావిధమృగవిహంగాదులచే నాకీర్ణమైనట్టియు, శ్వానభైరవారావంబులచేఁ బ్రతిధ్వనితం బగునట్టియు, పశుశతంబులగునంగకములుగలశవమాలికలచే నిండియున్నట్టియు శ్మశానప్రదేశమునందు రాత్రికాలంబున వసాపూర్ణంబులగుకపాలములను జితానలంబుపై నుంచి మహిషమును బచనముసేయుచు, భయంకరాట్టహాసపూర్వకముగా నానందతాండవం బాచరించుచు సర్వభూతభయంకరుండవై యేకకాలంబున సకలదానవగణసంహారముం గావించువాఁడవుం బోలి యేల యున్మత్తవిహారంబు గావింతువు? ప్రభుగణంబులకెల్లను బ్రభుండ వగునీవు శుద్ధశాంతస్వభావుండవయ్యు నట్టియపవిత్రస్థానమునం దున్మత్తునిం బోలి యేలశయనించియుందువు?

ఓపరమేశ్వరా! ఇట్టియకార్యంబు గావించుట నీవంటివాని కుచితముగా నున్నదా? ఆప్రదేశమునందుఁ గుశాస్తరణంబులపై మృతవ్యక్తులనుద్దేశించి విడువంబడినపిండంబులును, బ్రాహ్మణశవంబులయజ్ఞ

సూత్రములును నిపతితంబులై యుండును. ముసలములు, నులూఖలములు నందందుఁ బొరలాడుచుండును. శృగాలసమూహంబులు శ్రుతికఠోరంబుగాఁ గూఁతలువెట్టుచుండును. ఆజ్యాహూతిప్రదానంబులచేఁ జితానలంబులు ప్రజ్వలితంబు లగుచుండును. మృతకళేబరసంపర్కముచే నపవిత్రంబులగుమంచములు, పీటలు, చేటలు మొదలగునవి యందందుఁ బడియుండును. మృతదేహములయందలి వస్త్రవిభూషణాదు లందందుఁ జెదరి పడియుండును. మహారణ్యమధ్యమునం గ్రూరమృగంబులకుఁగూడ నతిభయంకరమును, దుర్గంధపూరితమును, దుర్గమము నగునాప్రదేశము రౌద్రాద్భుతభయానకబీభత్సరసంబులకు లీలాభూమి యైయుండును.

ఓనాథా! నీవు వేదవేద్యుండవును, త్రిలోకనాథుండవు నగు మహాదేవుఁడవు. నీపవిత్రనామమును, దివ్యచరిత్రమునుగూడ సర్వజనస్తవనీయములైనవి. అట్టిమహాత్ముండ వగునీవిట్టియసత్కార్యము నాచరించుట యనుచితముగా నున్నది. పరమేశ్వరా! నీయాజ్ఞానుకారిణి నగుసహధర్మిణినగుటచేఁ ద్రిలోకపూజ్యురాల నైననాకుఁగూడ నీయనాచారము హృదయసంతాపకరముగాఁ దోఁచుచున్నది. సర్వదేవమయా! సకలదేవతలును నిన్నారాధించి తరించుచుండుటచే నీవు మహాదేవనామముచేఁ బ్రసిద్ధుండవైతివి. అట్టినీవిప్పని మంతనింద్యముగాఁ దోఁచుటకు నిమిత్తమేమి? జగదీశ్వరా! ఇట్టికుత్సితాచారుఁడ వగునీవు మహాదేవుఁడ వెట్లైతివి? ఇట్టియకార్యంబులు దేవోచితంబులు గానేరవు. కావున నీవంటివాఁడిట్టికార్యాచరణంబునకుఁ గడంగుట కేదియో మహత్తరకారణం బుండవలయును. దేవదేవా! ఇది యంతయు నాకవేద్యము గానున్నది. నాయందుఁ గరుణించి యీరహస్యవిషయమును విస్పష్టముగా నాకెఱింగింపఁ గోరెదను.

అని పార్వతీదేవి యనేకవిధంబులఁ బ్రార్థించుటయు మహాదే వుండు మందహాససుందరవదనారవిందుండై వికసితనయనంబులనుండి కరుణాకటాక్షముల సర్వదిక్కులఁ బ్రసరింపఁజేయుచు నిట్లు చెప్పఁదొడంగెను. ఓగౌరీ! తపఃకాలస్వరూపుఁడను, గరాళవదనుండను నగునేను పూర్వ కాలంబున రౌద్రిముహూర్తాసన్నకాలమునందు వికటస్వరముతో రోద నము చేయ నారంభించితిని. అప్పు డనాదిపురుషుండును, అవ్యయుం డును, సనాతనుండు నగునాదిదేవుండు నన్నుం గాంచి కుమారా! నీవే కారణముచే భయార్తుండవై యిట్లతిఘోరముగా రోదనము చేయుచుం టివి? అని యడుగుటయు మహావక్త యగునద్దేవుం గాంచి మహాదేవా! నాకుఁ దగిననామకరణంబు గావింపుమని కోరితిని. అప్పు డద్దేవుండు నీవనిమిత్తంబుగా రోదనము గావించుచుంటివిగావున నింతటినుండి రు ద్రనామంబున విఖ్యాతుండవు గాఁగలవని యానతిచ్చెను.

ఓమహాశివే! అప్పుడు నేనటనుండి లేచి యింకను రోదనము చేయుచుండుటం గాంచి యాపరమేశ్వరుండు మరల నిట్లనియెను. ఓనీ లలోహితా! యింకను నిట్లేడ్చుచుండుటకుఁ గారణమేమి? శోకంబును విడువుము. నీకోరిక యేమో తెలుపుము. నేను దానిని దీర్చెదను. అని యమ్మహాదేవుం డానతిచ్చుటయు నేనిట్లు దుఃఖించుచునే నాకింకను నామప్రదానంబు గావింపవలయు నని యడిగితిని. అప్పుడమ్మహాపురు షుండు నాకు మఱియును సప్తనామంబులను బ్రసాదించెను. ఓదేవీ! అప్పటికిని నేను రోదనమును విడువకుండుటం గాంచి లోకేశ్వరుండగు నాకేశవుండు స్వయముగా నాచేయి పట్టుకొని యొకానొకవిధముగ రో దనము గావించుచున్న నన్నుం గాంచి నీవు మాటిమాటికి నిట్లేల విశే షముగ రోదనముంగావించుచుంటివి? నీయీరోదనమునకునిమిత్తమేమి? అని యడుగుచు నాకింకనునేకములగునామముల ననుగ్రహించి విడ

తాత్ముం డగు నమ్మహాపురుషుండు నాహృదయాభిప్రాయము నెఱింగి నీవు సకలదేవగణంబులకును బ్రధానుండవై మహాదేవనామంబున వి ఖ్యాతుండ వగుమని యుపదేశించెను. అప్పుడు నేను నారోదనమును జాలించితిని.

ఓ ప్రియా! నాకప్పుడు లభించిన పవిత్రనామంబులయర్థంబు సర్వంబు నెఱింగించెద నాకర్ణింపుము. నేను సుందరీజనపరిత్యక్తుండనై యపవిత్రపదార్థంబుల నర్థించుచు లోకవిద్రావణుండనై విహరించు టం జేసి రుద్రుండనియు, ప్రళయకాలంబున సకలభూతసంహారంబు గావించుచుండుటం జేసి హరుండనియు, "శృ- సృ-" అనుధాతువులు గ్రసనార్థబోధకంబులుగావున నంత్యకాలంబున నేను సర్వలోకాగ్రస నంబు గావించుచుండుటంజేసి శర్వుండనియు, సర్వుండనియు, కాల స్వరూపుండనై విహరించుచుండుటంజేసి మహాకాలుం డనియు,పూర్వ భవంబులఁ దలపించి జ్ఞానసంపాదనార్థమై సాధువులగుపండితులహృద యంబులయందు భయోత్పాదనంబు గావించువాఁడ నగుటంజేసి భవుం డనియు, శ్రేష్ఠంబులగుబలిప్రదానాదులచేతనే యుగ్రత్వమును ద్యజించువాఁడనగుటంజేసి యుగ్రుండనియు, మహత్పదార్థములన్నిటి కంటెను మహాత్ముండనై మహీంతలాదిసకలలోకంబులకును మహేశ్వ రుండనై, మహాశబ్దనిరతుండనై విరాజిల్లుచుండుటంజేసి మహాదేవుం డనియు, ఈశ్వరులకు నీశ్వరుండను, సృష్టిస్థితిప్రళయకారణుండను నగు టంజేసి పరమేశ్వరుండనియుఁ బవిత్రనామంబులచేఁ ద్రిభువనంబుల యందును విఖ్యాతుండనై యుంటిని. దేవీ! లోకంబులకువిరుద్ధములగు కర్మముల నాచరించుచుండువాఁడనగుటంజేసి నాకు కౌద్రకర్ముం డను నామము నిర్దిష్టం బయ్యెను.

ఓ హైమవతీ! నాకతిప్రియంబులగు నీపవిత్రనామము లతిగోప్య

ములైనవి. ఈదివ్యనామములతో శ్మశానప్రదేశములందు నన్నుఁ బూజించువాఁడు సకలదేవతాగణపూజితుఁడై బ్రహ్మాదిలోకేశ్వరులతోఁ దుల్యప్రభావుండు గాఁగలఁడు. ఈపావననామములను బత్రమునందు లిఖించి ధారణము గావించువారు నిత్యగాణపత్యపదప్రాప్తు లగుదురు. ఫలాకాంక్షను బరిత్యజించి విధివిధానానుసారంబుగాఁ గావించిన సత్కర్మంబులు సుప్రసిద్ధంబులు గాఁగలవు. అట్లుగావించువానికాకర్మంబుల వలనిశుభాశుభఫలభోగానుభవము లేకుండును. పురుషునకవశ్యకర్తవ్యములని విధింపఁబడిన కర్మములు సుసాధ్యములైనను, దుస్సాధ్యములైనను నగుఁగాక. వానిని బురుషులు ముఖ్యముగా నాచరించితీరవలయును. లోకకర్తయగువిధాత్రునాజ్ఞకు వ్యతిరేకముగ జరిగించుట కెవ్వరును సమర్థులు గాఁగలరు. సకలభూతంబులు నాతనికి వశీకృతంబులై యుండును. ఆతఁడు సకలజీవులకును స్వస్వధర్మంబుల నుపదేశించుచుండును.

ఓవరివర్ణిని! ఇక్కలికాలంబున నేనుగూడ నమ్మహాపురుషుని యాదేశానుసారంబుగనే కర్మాచరణంబుఁ గావించుచుందును. ప్రజాసంహారకారి నగునేను గాలస్వరూపుఁడను. నాసహధర్మిణివి యగునీవు కాలరాత్రిస్వరూపిణివి. దేవి! నీవు నన్ను బాగుగ నెఱుంగుదువు. నేనును నిన్ను విశేషించి యెఱింగియుంటిని. నారాయణపదత్రయపరిమిత మగునీభువనత్రయము మనస్వరూపము. ఆచారము నీతికి విరుద్ధంబు గాకుండునట్లు విధాతచే నాకీయుచితకర్మము విధింపఁబడినది. పుణ్యమయంబును, రమణీయంబును, సిద్ధక్షేత్రస్వరూపము నగుశ్మశానభూమియే నాకతిప్రియం బగుటంజేసి నేనిందు నిరంతరమును సుఖవిహారంబు గావించుచుందును. ఈగణాధ్యక్షులందఱునుగూడ నందే విశేషసుఖులై యుందురు. వీరికోరికచేతనే నేనుగూడ నందుండెద

మానందానుభవముం గాంచుచుందును. అందుచేతనే శ్మశానము నా కతిప్రియతమస్థానమైనది. విధాత యెవ్వని నేవిషయమున నియోగించునో యాతఁడు దానినే యవలంబించి స్వచ్ఛందముగ విహరించుచుండును. అతని కదియే మహైశ్వర్యముగదా! నేను శ్మశానమే హితకరమని భావించినట్లే యందఱును విధాతృదత్తములగు విషయములు విమలగుణసంపన్నములుగా భావించి నిరంతరమును వాని నతిప్రియముగా నవలంబించి చరించుచుందురు. విభూతిస్నానముచే నాగమశ్రితీర్థాదులమూలమునం గలుగుపుణ్యఫలంబు లభించునని నేను చెప్పియుంటిని. అట్టి వేదవిహితధర్మాచరణముం గావించువాఁడనగుటం జేసి నాకు దేవదేవుఁ డగుజగన్నాథుసిద్ధత్వము లభించుచుండును.

అని సదాశివుం డానతిచ్చుటయు నుమాదేవి ప్రమథార్తిహరుం డగుమనోహరుం గాంచి యోకాలకాలా! చంద్రకళావతంసా! కాలస్వరూపా! పృథివి, అగ్ని, చంద్రుఁడు, సూర్యుఁడు, ఆకాశము, వాయువు, లింగము మొదలగువానిని భక్తిపూర్వకముగాఁ బూజించువారికిని, నృత్యగీతాదులచే నిన్నారాధించి నిర్నిమేషనయనులై ధ్యానపూర్వకముగా నీకుఁ బ్రణామంబు లాచరించువారికిని, ఘృతము, దధి, క్షీరములు, సుగంధజలము, గోమయము మొదలగువానితో నీకభిషేకముంగావించువారికిని, గంధధూపమాల్యాద్యుపచారంబులచే నిన్నర్చించువారికిని లభించుపుణ్యఫలం బెట్టిది? అపర్యుషితంబు లగుపుష్పమాల్యములను నీకర్పించువారి కెట్టిపుణ్యఫలంబు లభించును? దేవా! నాయెడలఁ బ్రసన్నుండవై యీసమస్తవిషయంబులును సవిస్తరంబుగా నాకెఱింగింపవలయు నని ప్రార్థించెను.

ఉమాపతియగు మహాదేవుండును దేవివాక్యంబుల నాకర్ణించి మధురప్రియభాషణంబులచే నామెను సంబోధించుచు నోసుభాషిణీ!

నేను నీయడిగినప్రశ్నంబుల కన్నింటికిని సదుత్తరంబుల నొసంగెద నావధానచిత్తవై యాలకింపుము. దేవీ! నాకు భక్తుం డగువాఁడు నీయెడలను భక్తియుక్తుండై యున్నవో నాతనిసకలకర్మంబులను సంపన్నంబులు గాఁగలవు. ఈవిషయమును నీవును బాగుగ నెఱుంగుదువు. ఎంతటివేదవిద్వరులైనను నితరులీయర్థంబు నెఱుంగఁజాలరు. నాభక్తులయెడల నెవ్వరుభక్తిగౌరవములు గలిగియుందురో వారిని నేను భవాంబుధినుండి తరింపఁజేయుచుందును. ఇఁక స్నానపూజాదులఫలంబుం గూర్చి చెప్పెద నాకర్ణింపుము.

ఓపార్వతీ! సుగంధజలంబులచే నన్నభిషేకించువాఁ డగ్నిష్టోమముం గావించినఫలంబు నందఁగలఁడు. సుగంధతైలముచే నన్నభిషేకించువాని యెడల నేను ప్రసన్నుండనై వానికతిరాత్రియజ్ఞఫలంబును బ్రసాదింతును. మధువుతో నన్నభిషేకించువానికి వాజపేయయజ్ఞఫలంబు సిద్ధించును. అర్చారూపంబున నన్నుఁబూజించువాఁడశ్వమేధఫలంబుం గాంచి స్వర్గలోకంబునఁ బూజ్యుఁడగును. ఈవిశ్వమంతయును లింగమయంబని యెఱింగి యెవ్వఁడు నాలింగస్వరూపము నారాధించునో యాతనికంటె నాకతిప్రియు లగువా రెవ్వరును లేరు. చతుర్దశియందు ఘృతదుగ్ధదధితైలజలంబులచే నన్నభిషేకించువారు దేవతుల్యులు, అజరులు, అక్షయులు, అమరులు, విశ్వవిజయులు, నాకతిప్రియతములు నై యుందురు. ఏకాగ్రచిత్తముతో, శివలింగమును బూజించువారు బ్రహ్మవిష్ణులోకములందును, గోలోకమునను, అమరలోకంబునందును స్వేచ్ఛావిహారులై యుందురు. శివలింగము నారాధించువారిని మహేంద్రుఁడును, సోముఁడును, భగుండును, పూషుండును, అనిలుండును, అనలుండును, దివాకరప్రభృతిదేవతలును బూజించుచుందురుగావున మానవులు సర్వదా శివలింగార్చ

సము గావించుచుందురు.

ఓ దేవీ ! లింగస్వరూపమున నన్నుఁ బూజించువాఁడు గంధర్వులయు, నప్సరస్సుందరులయుగీతవాద్యములచే సేవింపఁబడుచుండును. ప్రతిమారూపమున నన్ను శతవత్సరములపర్యంతము పూజించినఫలము, లింగస్వరూపముచే నన్నొకదినమాత్రము పూజించుటచే లభింపఁగలదు. శివలింగపూజార్థమై యుపహారములను సేకరించువాఁడు గాణపత్యపదప్రాప్తుండై యభిలషితోపహారంబుల నుపభోగించుచుండును. పర్యుషితంబు లగుపుష్పమాల్యాదులను శివలింగమునుండి యపనయించువాఁడు స్వర్గలోకమునందు బహుకాలంబువఱకును సుఖభోగముల ననుభవించుచుండును. శివలింగమున కుపహారంబులను, వివిధములగు పుష్పమాల్యాదులను సమర్పించువారును, దధిక్షీరఘృతాదులచే శివలింగము నభిషేకించువారును, విశుద్ధభావముతో మాటిమాటికి శివలింగమును బూజించువారును మిగులఁ బరిశుద్ధమూర్తులై స్వర్గమునధిగమించి ప్రశంసనీయులై విరాజిల్లుదురు. ఓ దేవీ ! నేను నీతోఁ గలసి యెల్లవిలాసవిహారముం గావించుచుందునో యట్లే వారును స్వర్గమునందుఁ దమతమభార్యలతో సుఖవిహారముం గావించుచుందురు. పింగళరుద్రు నారాధించువాఁడు దేవాదిదేవుండ నగునాకుఁ బుత్రస్వరూపుఁడు గాఁగలఁడు.

ఓ కాంచనాంగి ! లింగార్చనతోషంబున నన్ను సంతుష్టునిం గావించువారికి బ్రహ్మాణత్వము నెంత ? అట్టిపుణ్యపురుషులకుఁ బొందరానిదేదియును లేదు. దేవీ ! నీవేవిషయములను వినవలయునని విశేషముగఁ గుతూహలపడుచుంటివో వాని నన్నిటిని సంపూర్ణముగా నెఱింగించితిని. పర్వసమయములయందు బ్రహ్మసభామధ్యంబునఁ బూజాప్రణామాదులం గావించి వేదపాఠ సహితముగా నీయధ్యాయమును

జపించువారు దేహాంతమునందు మత్సాయుజ్యలాభముం గాంచఁగలరు.

—: అష్టషష్టిక్షేత్రవివరణము. :—

మందరాచలమున సుఖోపవిష్టుండై యున్న మహాదేవుని సందర్శించి బ్రహ్మదేవుండు స్వామీ! నీవేయేక్షేత్రములం దేయేరూపములతో సాక్షాత్కరించుచుందువో యెఱింగింపవలయునని ప్రార్థించుటయు మహేశ్వరుం డిట్లనియె.

ఓవనజాసనా! నేను వారాణసియందు మహాదేవరూపమునను, ప్రయాగయందు మహేశ్వరరూపమునను, నైమిశక్షేత్రమునందు దేవదేవస్వరూపమునను, గయాతీర్థమునందు ప్రపితామహరూపమునను, కురుక్షేత్రమునఁ గాలేశ్వరరూపమునను, ప్రభాసమున శశిభూషణరూపమునను, పుష్కరమునం దయోగంధరూపమునను, విమలేశ్వరమందు విశ్వరూపమునను, అట్టహాసక్షేత్రమునందు మహానాదరూపమునను, మరుత్కోటియందు మహోత్కటరూపమునను, శంకుకర్ణంబున మహాతేజోరూపమునను, గోకర్ణమునందు మహాబలరూపమునను, రుద్రకోటియందు మహాయోగీశ్వరరూపమునను, స్థలేశ్వరమున మహాలింగరూపమునను, అవంతియందు మహాకాలరూపమునను, మధ్యమేశ్వరమున శర్వరూపమునను, కేదారమునం దీశానరూపమునను, హిమాలయమునందు రుద్రరూపమునను, సువర్ణాక్షమునందు సహస్రాక్షరూపమునను, వృషక్షేత్రమునందు వృషభధ్వజరూపమునను, భైరవక్షేత్రమునందు భైరవరూపమునను, భద్రపథమునందు భవాకారమునను, కనఖలక్షేత్రమునం దుగ్రాకారమునను, భద్రకర్ణహ్రదంబున శివాకారమునను, దేవదారువనంబున భిన్నాకారమునను, కభిజంగిలంబున చండాకారమునను, పురండక్షేత్రమునం దూర్ధ్వకేతుమూర్తితోడను, మంగళాండము

ఐందు గపర్దిమూర్తితోడను, కృత్తివాసక్షేత్రమునందు వరదాకృతితో డను, ఆమ్రాడికేశ్వరమునందు సూక్ష్మాకృతితోడను, కాలంజరక్షేత్రమున నీలకంఠాకృతితోడను, ధ్యానసిద్ధేశ్వరమున యోగాకృతితోడను, ఉత్తరేశ్వరమున గాయత్ర్యాకృతితోడను, కాశ్మీరమున విజయరూపము తోడను, మరుకేశ్వరమున జయమూర్తితోడను, యమాంగక్షేత్రమున స్థాణుమూర్తితోడను, కరవీరక్షేత్రమునఁ గాపిలమూర్తితోడను, కాయావతారక్షేత్రమున లగుడస్వరూపముతోడను, దేవికాక్షేత్రమునం దుమాపతి, హరిశ్చంద్రేశ్వరరూపములతోడను, పురచంద్రక్షేత్రమున శంకరమూర్తితోడను, కాలేశ్వరమున జటిమూర్తితోడను, కుక్కుటకేశ్వరమున సౌమ్యమూర్తితోడను, సంధ్యాక్షేత్రమునఁ దామ్రమూర్తితోడను, బదరికాక్షేత్రమునఁ ద్రిలోచనమూర్తితోడను, జలేశ్వరమునఁ ద్రిశూలమూర్తితోడను, శ్రీశైలమునఁ ద్రిపురాంతక మూర్తితోడను, లేపక్షేత్రమునఁ బశుపతిమూర్తితోడను, అంగేశ్వరమునఁ దీప్తమూర్తితోడను, గంగాసాగరక్షేత్రమునం దమరమూర్తితోడను, అమరకంటకక్షేత్రమునం దోంకారమూర్తితోడను, సప్తగోదావరీ క్షేత్రమున భీమమూర్తితోడను, పాతాళమునందు హాటకేశ్వరాకృతి తోడను, కర్ణికారక్షేత్రమున గణాధ్యక్షాకృతితోడను, కైలాసమునఁ ద్రిపురాంతకాకృతితోడను, హేమకూటమున విరూపాక్షాకృతితోడను, గంధమాదనమున భూర్భువస్స్వరూపముతోడను, డిడేశ్వరమునం దనల స్వరూపముతోడను, స్థలేశ్వరమునందు జ్వలల్లింగస్వరూపముతోడను, భూతేశ్వరమునందు గణాధ్యక్షాకృతితోడను, కిరాతకక్షేత్రమునందుఁ గైరాతాకృతితోడను, వింధ్యాచలమునందు దానవవినాశార్థమై వరాహాకృతితోడను, గంగాహ్రదంబున హిమస్థానాకృతితోడను, బదరాముఖంబున మాధవాకృతితోడను, తీర్థమునందు శ్రేష్ఠికోటీశ్వరాకృతితోడ

ను, ఇష్టకాపథంబున విశిష్టాకృతితోడను, కురుసుపురంబున బ్రిహాసాకృతితోడను, లంకయం పలకేశ్వరాకృతితోడను, నివసించి యుందును. ఈవిషయమును మహాత్ముం డగుబ్రహ్మాయు, సకలపౌరాణికులును గానము చేసియున్నారు. నియమపూర్వకంబుగా విశుద్ధహృదయమునోనుభయసంధ్యలయందును దీనిని బారముసేయువాఁ డేకకాలంబున దశాశ్వమేధంబులు గాంచినపుణ్యఫలంబును బడయఁగలఁడు.

—♦ శివవిభూతిమాహాత్మ్యము. ♦—

నానారత్నవిభూషితంబగు మందరాచలశిఖరమునం దాసీనుఁడై యున్న దేవదేవుం డగుమహేశ్వరుని నందీశ్వరుండు సందర్శించి సకలదేవతాధీశ్వరా! త్రిపురాంతకా! భవదీయం బగువిభూతిం (ఐశ్వర్యము) గూర్చి యనుగ్రహపూర్వకముగా నాకు బోధింపవలయు నని ప్రార్థించుటయు భక్తసులభుండగు మహేశ్వరుం డిట్లనియెను.

నందీశ్వరా! నావిభూతిమాహాత్మ్యముం దెలిపెద నాకర్ణింపుము. నేను నిరంతరము సప్తిప్రాకారకోటిచే నావృతుండనై యుండి సురాసురగణసమక్షమునఁ జతుస్సముద్రముద్రిత మగుపీభూమండల మంతటను నిస్సంశయముగా సంచరించుచుందును. అనావృతంబులగు చత్వరాదిస్థానములయందు యథేచ్ఛముగ నివసించియుందును. మఱియు దేవీసహితుండనై పరమానందముతో నెల్లప్పుడును బర్వతముల యందు విహరించుచుందును. అట్టినన్నుద్దేశించి భక్తితోఁ బ్రదక్షిణంబు గావించువాఁడు నూఱుగోదానములు గావించినఫలముం గాంచఁగలుగును. మఱియు నాకుఁడు శతసహస్రగోదానఫలప్రాప్తిం గాంచుననుటకునుసందేహముపేదు. నేను చంద్రుఁడను; వరుణుఁడను; నిరంతరము నీప్రపృథ్వీరలయము నివసించి యుందును. నేనే దినమును, రాత్రి

యు, సంధ్యలును, గాలమును, మృత్యువునై యుంటిని. ప్రళయకాలముసందైనను నాకు వినాశనంబు లేదు. వేదవాదులు నన్ను ఛందస్స్వరూపునిగా వ్యవహరించుచుందురు. నేనింద్రియస్వరూపుఁడనై విషయంబుల నుపభోగించుచుందును. నేను నిత్యానిత్యస్వరూపుఁడను; సర్వభూతబీజయుండను, మఱియు వినాశకుండను. దేవతలును దానవులును, పవనుండును, దహనంబును నాస్వరూపములే. నేను వాయురూపుఁడనై మేఘసంచాలనమూలంబున జలమును వర్షించుచుందును. నేను జలస్వరూపుఁడను. నేను సకలభూతంబులను సృష్టించి ప్రతియుగమునందును సంహరించుచుందును. నామాయాబలంబుచే జీవులు శతసహస్రగర్భంబులఁ బరిభ్రమించుచుందురు. నేను గోపించిన దో ఖేచరులంపటులు భూపతితులై పోవుదురు.

నిశ్వాసపవనమాత్రముననే త్రిభువనములను గంపింపఁజేయుసామర్థ్యముగలనేను మహాబలుండనై సకలదానవసమూహమును నశింపఁజేయుచుందును. నిశ్చయంబుగా నేను సకలభూతసంక్షయంబుగావించుచు మరల సర్వభూతములను యథాస్థానమున నెలకొల్పుచుందును. వేదపురాణేతిహాసాదులు నానిత్యనివాసంబులై యుండును. నేను లేనిప్రదేశ మేదియును లేదు. నేను సర్వదా నాభక్తగణంబుల యెడలను, నన్నాశ్రయించినభూతగణంబులయెడలను, నిశ్చలచిత్తముతో నన్నారాధించుచుండువారియెడలను బ్రసన్నుండనై వారికి గాణపత్యపదంబును బ్రసాదించుచుందును. నేను సర్వదా పుష్పితలతలయందును, ఫలవృక్షములయందును, నారీమణులరూపయౌవనములయందును నివసించియుందును. నేనేకకాలమునందే నియోజ్యనియోజకభావములతో భృత్యుండను, ప్రభుండనుగూడ నై యుందును. అహంకార, దర్ప, దంభ, స్నేహ, తమోగుణస్వరూపుఁడను నేనే.

ఓనందీశ్వరా! మదీయంబగు నీవిభూతిమాహాత్మ్యమును శ్రద్ధాభక్తులతోఁ బఠించువాఁడు సర్వతీర్థగమనఫలంబును, సకలోపవాసానుష్ఠానఫలంబును గాంచఁగలఁడు. ఆతని కెట్టివ్యాధులును గలుగఁబోవు; ఆతనికిఁ దీరనికోరిక లేవియు నుండవు. బ్రహ్మచారులు, సత్యవాదులు మొదలగువారికి లభించు సకలపుణ్యఫలంబులు నాతనికి సిద్ధింపఁగలవు. మహాత్ముఁ డగునాతఁడు, సర్వజనశ్రేష్ఠుఁడై, జరామరణవివర్జితుఁడై, సకలపాపవిముక్తుఁడై రుద్రలోకమునఁ బూజాభాజనుండు గాఁగలఁడు.

ధ్యానఫలకథనము

సనత్కుమారుం డిట్లనియెను. ప్రమథగణసహితుం డగుమహేశ్వరునిం బోలి యెవ్వరాత్మీయజనపరివృతులై శాంతభావముతో సుఖాసీనులై సత్కర్మములనాచరించుచుందురో యట్టివారు తమకర్మప్రభావముచే సకలదానఫలంబులను, సకలశుభములను, సకలశుభలోకనివాససుఖంబులను గాంచఁగలుగుదురు. చండాలురు, శూకరపక్షిపోషకులు, క్రవ్యాదులు, సర్పోపజీవులు మొదలగునెట్టినీచవృత్తులైనను శివభక్తులైనచో సర్వపాపవిముక్తులై సర్వోత్తమగతిలాభంబు నందఁగలుగుదురు. వ్యాసమునీంద్రా! మహాదేవునకుఁ బ్రణామం బాచరించి మానవుల కధ్యాత్మధ్యానయోగంబులభించువిధానము నెఱింగించెద నాకర్ణింపుము. తమతమకర్మంబులననుసరించిపోవుచుండు మానవు లీధ్యానయోగము ననుభవపూర్వకముగా గ్రహించునంతవఱకును సంసారచక్రమునఁ బరిభ్రమించుచునేయుందురు. అసురులును, దేవతలును, ఋషులును, పితృదేవతలును, బ్రహ్మాదిదేవగణంబులును ధ్యానప్రభావముచే విరాజిల్లుచుండువిధంబుననే గృహస్థులు, బ్రహ్మచారులు, వానప్రస్థులు, భిక్షుకులుమొదలుగాఁగల మానవులుగూడ ధ్యానయోగబ

లంబున వేదవ్యాసాదులు గాఁగలరు. అట్టివారెంతమాత్రమును గర్మలిప్తులు గాకుందురు. బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులును, సంకీర్ణజాతులునుగూడ ధ్యానమహిమచేతనే తేజస్సంపన్నులగుదురు. మఱియుఁ జండాలాదులును, నిరంతరపాపకర్మరతు లగునీచజాతులవారునుగూడ ధ్యానప్రభావముచే సూక్ష్మలోకప్రాప్తులగుదురు. వారిపాపములన్నియును దగ్ధములై పోవును. వాగాడంబరవిరహితంబును, బరమగుహ్యంబును, సారభూతంబు నగు నీవక్ష్యమాణప్రబంధమును బఠించి గ్రహించినచోఁ బాపకర్మరతులగువారునుగూడఁ బరమసిద్ధులు గాఁగలరు.

సాత్యవతేయా! నీయందలిస్నేహముచే మోక్షద్వారస్వరూపమగుధ్యానయోగముంగూర్చి ప్రశంసించెద నాలకింపుము. గురుజనుల నవమానించుమూఢుల కీపవిత్రధ్యానయోగంబు విహితము గానేరదు. ధ్యానయోగము నవలంబించి మహాపాతకము, బ్రహ్మహత్య, సురాపానము, గురుతల్పగమనము, బహుజీవజంతుహింసనము, మొదలుగాఁ గలమహాపాపసమూహంబును, శుష్కకాష్ఠసంచయమును, వైశ్వానరుఁడునుంబోలె నిమిషములో దహింపఁజేయుటకు సమర్థుం డగును. పరనారీదూషణము, మాతంగగమనము, మొదలగుపాతకములు కేవలధ్యానమూలముననే నశింపఁగలవు. ప్రదీప్తానలము బంగారము నెట్లు పరిశుద్ధముగాఁ జేయునో యట్లే ధ్యానయోగియగువాఁడు, అభక్ష్యభక్షణము, అపేయపానము మొదలుగాఁగలపాపసమూహమును బరిశుద్ధముగాఁ జేయఁగలుగును. సముద్రమును జేరఁబోవునదులు తమమార్గముల నెట్లు లక్ష్యము సేయకుండునో యట్లే తత్ప్రవేశనము నాశ్రయింపఁదలఁచుధ్యానయోగులు పాపములను లక్ష్యము సేయకుందురు. ధ్యానయోగవిధుల నెఱింగినవారెయ్యును వారనావశంబున మోక్షంబును బడయఁగాలనివారు బ్రహ్మవిష్ణులోకవాసులు గాఁగాని, చంద్రసూర్యేంద్రాదిదేవ

వతాలోకములందుఁగాని స్వేచ్ఛానుసారముగ సుఖభోగముల ననుభవించుచుందురు. ధ్యానయోగావలంబి యగువాఁడు యమలోకమునందైనను దేవతాగణపూజితుండై యుండును. యథోక్తనియమానుసారముగా విశుద్ధాంతరంగముతో ధ్యానపరాయణుఁ డగువాఁడు ప్రతిపదమునందును శుభఫలముఁ గాంచుచుండును. వేదములను, వేదాంగములను, ఉపనిషత్తులనుగూడ నధ్యయనము చేసినవాఁడు ధ్యాననిరతునిపుణ్యఫలమునందు షోడశాంశమున్నను బడయఁజాలఁడు. శౌచాచారసమన్వితముగా దేవదేవుని బూజించుట, సహస్రాశ్వమేధములఁ గావించుట, శతరాజసూయములు నిర్వహించుట మొదలగుపుణ్యకర్మములన్నింటికంటెను ధ్యానమే యుత్తమమైనది. సమాధియుక్త మగుధ్యానయోగముచేఁ గలుగుపుణ్యము నూఱుక్రతువులు గావించినను లభింపఁజాలదు.

సర్వవేదాధ్యయన మంతకంటెను ధ్యానమే గురుతరమైనది. ఆకాశమున నంకసంకలితములు గానవిశేషములు ధ్యానయోగావలంబియగువాఁడు వాతశోష్యములుగ నేఁడు. ధ్యానవంతుం డగునొక్కబ్రాహ్మణుని గాఁ దృప్తుంగాఁ బెంచినయెడ నానాపిండభక్ష్యపదార్థములచే సహస్రబ్రాహ్మణులను సంతృప్తులం జేసినఫలంబు లభింపఁగలఁడు. మంత్రవిదుండగు వాఁడు మంత్రబలముచే సర్వవ్యాపకుఁ గుసహస్రబ్రాహ్మణులను మృష్టాన్నభోజనంబులచేఁ బరితుష్టులం గావించినఫలమును బడయఁగలఁడు. వేయిమందిసత్సంకల్పవంతులకును, నూఱుమందిపుణ్యస్నానపరులకును నెంతిపుణ్యములభించునో ధ్యానయోగిప్రియాపూర్వకముగా నంతఫలమును బడయఁగలఁడు. వేయిమందిధార్మికులగుగృహస్థులకంటెను, నూర్గురుబ్రహ్మచారులకంటెను, వేయిమంది వానప్రస్థులకంటెను, నొక్కయతియే యధికుఁ డగుచున్నాఁడు. సాంఖ్యయోగవిశుద్ధు లగువారిలోఁ

బవిత్రుం డగు నొక్కయోగవిదుం డెవ్వనిముఖశాలయందు భుజించి సంతృప్తింగాంచునో యాతనియజ్ఞం బాక్షణమునందే సర్వసంపన్నం బు గాఁగలదు. ధ్యానాసక్తుండు గానివాఁడు పాపరతుండగును. మూ ఢాత్ముండగువాఁ డెల్లరియొద్దను బ్రతిగ్రహంబు సేయుచుఁ బాపగ్రస్తుం డగుచుండును. ధ్యానియగువాఁడెవ్వనింగూర్చి కోపించునో యాతనికి శుభంబులు గలుగవు. ఆతఁ డెవ్వనియెడలఁ బ్రీతుండగునో యాతని సద్వంశము పుత్రపౌత్రక్రమంబుగా వర్ధిల్లఁగలదు. ధ్యానయోగినియ తుం డగువాఁడు దశదిశలయందును సంచరించుటకు సమర్థుం డగును. ధ్యానులగువారు జ్ఞానప్రదానముచే నితరులను బవిత్రులఁ గావింపఁ గలుగుదురు. వారిని బాపతమఃకల్మషంబు లంటనేరవు. మృగరాజము లుపర్వతమునాశ్రయించిసుఖించునట్లుతత్త్వవిశ్వవిదులగుబ్రహ్మణ్యులు యోగము నాశ్రయించి యానందించుచుందురు. అవిలుండు గ్రామ వాటములందలిసకలపదార్థములను దహించియు వానిచే లిప్తుండు గాని విధంబున విశ్వవిదుండగువాఁడు సర్వకర్మంబుల నాచరించియు నిర్లిప్తుం డై యుండును.

—♦ యో గా ఖ్యా న ము. ♦—

ఎట్టిధ్యానమువలన నుత్తమఫలము లభించునో, యేమంత్ర మూలంబున నట్టిధ్యానము సిద్ధించునో, ధ్యాన మెన్నివిధములు గలది యో, అక్షరులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల నెట్టిధ్యానముచే నెఱుం గనగునో పరమేశ్వరుం డుపదేశించినవిధంబున నానతీయవలయు నని సనత్కుమారుం డడుగుటయు నందీశ్వరుం డిట్లనియెను.

వామపార్శ్వంబున బ్రహ్మయు, దక్షిణపార్శ్వంబున విష్ణుండు ను, మధ్యప్రదేశమున రుద్రుండునుగా మువ్వురుపురుషులు నేకాత్ము

లై యేకశరీరులై యేకీభవించి యుందురు. పూర్వాహ్ణంబున బ్రహ్మదేవుని, మధ్యాహ్నమునందు విష్ణుదేవుని, సాయాహ్నమునందు రుద్రదేవుని ధ్యానము గావింపవలయును. కాని యీమువ్వురు నేకమూర్తులే. ఈత్రిభువనములయందును రుద్రవిష్ణుపితామహులు దేవదేవుని స్వరూపములు. లోకానుగ్రహంబుకొఱకును, భక్తజనులను బరిపాలించుకొఱకును దేవదేవుఁడు తనశరీరమును మూఁడువిధములుగా విభాగించి యుండెను. ఈమూఁడుమూర్తుల నేకమూర్తిగనే భావించి యెవ్వరు ధ్యానింతురో వారు రుద్రసాయుజ్యముం గాంతురని మహాదేవుం డగుశివుం డానతిచ్చియుండెను. ఆదేవదేవుని నిత్యంబును నిర్మలహృదయంబున స్మరించుచుండువారు పాపవిముక్తులై యంతంబున స్వర్గధామముం జేరఁగలుగుదురు.

ధ్యానతత్పరులగువారు ‘అ’ కారము విష్ణుస్వరూపమనియు, ‘ఉ’ కారము బ్రహ్మస్వరూపమనియు, ‘మ’ కారము స్వయముగ రుద్రస్వరూప మనియు నెఱుంగవలయును. ఓంకారప్రయోగసమయమునందు ముందు ‘అ’కారమును గొలఁదిగా నుచ్చరించి యనంతరము ‘ఉ’కార ‘మ’కారములను మాత్రాసహితముగ నుపయోగింపవలయును. అకారము హృదయమునం దుత్పన్నమైనంతనే, ఉకారమును దానితోఁ జేర్చి మకారమును మృదుస్వరముతో నుచ్చరింపవలయును. ఈవర్ణత్రయంబును గలసి ప్రణవరూపముగాఁ బరిణమించుచున్నది. అకారోకారసంయుత మగుమకారము బ్రహ్మజ్ఞానస్వరూప మనిచెప్పంబడియెను. మఱియు అకారోకారములను విడిచి మకారము ప్రత్యేకముగ నిలిచి విరాజిల్లుచుండును. అక్షరత్రయాత్మక మగునీయోంకారమును బరబ్రహ్మస్వరూపముగా భావించి ధ్యానించువానికిఁ బునర్జన్మంబు లేకుండును. యోగవిదుం డగువాఁ డోంకారమును హృదయ

ముందుంచి ధ్యానింపవలయును. ఓంకారనాథుఁ డగువాఁ డోంకారమునుండి బ్రహ్మస్వరూపమును దర్శింపవలయును. ఓంకారయోగముచే మనస్సు సర్వోత్కృష్టంబు గాఁగలదు. ఈవిధమున సర్వేంద్రియములను నిగ్రహించి హృదయమున దమ్మహాదేవు నంగుష్ఠమాత్రస్వరూపునిగా భావించుచు ధ్యానము గావింపవలయును.

మఱియు, సాంఖ్యశాస్త్రగుణవిశిష్టుండును, విఖ్యాతుండు నగుపురుషుని భ్రూమధ్యంబునను, అచ్యుతుండును, లోకపావనుండును, చంద్రప్రభుండు నగుపురుషుని లలాటమధ్యంబునను, అవ్యయుండును సూక్ష్మభావుండును బ్రభుండు నగుశివుని మస్తకంబునను భావించి ధ్యానింపవలయును. విశ్రాంతుండై యోగము నవలంబించి యోంకారమును బ్రహ్మస్వరూపముగా భావించి ధ్యానింపవలయును. కేవలమాత్ర బ్రహ్మోచ్చారణమూలంబునఁ బ్రశాంతబ్రహ్మము ప్రాప్తమగును గావున నట్లు గాకుండునట్లు యుచ్చారణంబు సేయుచుండవలయును. బ్రహ్మత్రయాత్మకంబును, గుణత్రయాత్మకమును, స్థానత్రయాత్మకమును, అక్షరత్రయాత్మకమును, మాత్రాత్రయాత్మకమును, అర్ధమాత్రాత్మకమును నగుబ్రహ్మము ననుభవముచే నెవ్వఁడు తెలిసికొనఁగలుగునో వాఁడే వేదవిదుండు. అన్యవిధుం డగువాఁ డట్లుచ్చారణంబు సేయుచున్నను నాత్మసంయమంబు గావించువారి ప్రాణాయామమూలంబునఁ గాలకాలమువఱకును మాటిమాటికిఁ బ్రాణసంయమంబు సేయుచు నిమేషమాత్రంబైనను ధ్యానయోగంబు గావింపవలయును. యోగవిదుం డగువాఁ డోంకారసంయోజనంబు గావించి నిత్యము ధ్యానించుచుండవలయును. అట్టివాఁడు సకలసంసారబంధవిముక్తుండై యవ్యయుండగు శివపదంబును బడయఁగలఁడు.

బుధుం డగువాఁడు సుఖపక్షంబులగు తనసర్వేంద్రియములను

కూర్మము తన యంగకములనుం బోలి సంహృతంబులుగాఁ జేసి యాత్మ నునిర్వాతప్రదేశమునందలిదీపకళికవలెఁ బ్రకాశమానముగాఁ జేయవలయును. ధీరుం డగువాఁడు సుస్థితనిస్వనుం డై విశుద్ధంబగునంతరాత్మచేఁ దైలధారంబోలి యవిచ్ఛిన్నంబుగా నోంకారమును ధ్యానించుచుండును. అప్పు డాతనికి కంపనమును, ఉచ్ఛ్వాసనంబును, అంగవిక్షేపంబునుగూడ లేకయుండును. ప్రాణాయామముచే వాయువును శక్త్యనుసారముగా స్తంభింపఁజేసి ప్రత్యాహారముం గావింపవలయును. ఇట్లు ప్రాణాయామములచే మనం బునుగూడ స్థిరముగా వశపఱచుకొనవలయును. అకారోకారమకారములను త్రయమును నం దొక్కొక్కటియే ప్రత్యేకముగ మూర్తిత్రయాత్మకములుగాఁ బరిగణితంబు లగుచుండును.

అని నందికేశ్వరుం డుపదేశించుటయుఁ దపోధనుండగుసనత్కుమారుండు పరమానందంబున నాతని గౌఁగిలించుకొని యభినందించి పరమేశ్వరుం డగుచంద్రశేఖరు ననేకవిధంబుల సన్నుతిసేయ నారంభించెను.

—♦ యోగవిధి. ♦—

శివప్రోక్తంబు లగుసనాతనయోగశాస్త్రములను సవిస్తరముగా నాలించుచున్నట్టి తపోధనుండగుసనత్కుమారుండు వ్యాసునుద్దేశించి యిట్లనియెను.

వ్యాసమునీంద్రా! ప్రాణాయామము, ప్రత్యాహారము, ధ్యానము, ధారణము, యోగము ననునివి పంచధర్మములుగాఁ బరిగణింపఁబడుచుండును. మహాదేవుం డాంతరిచ్ఛావిశేషంబున నీపంచధర్మములకును బ్రత్యేకభిన్నస్వరూపలక్షణాదులను వర్ణించెను. పంచప్రాణనియమను [illegible] చెప్పఁదొడంగెను. ప్రాణాయామము

మందము, మధ్యమము, ఉత్తమము అని మూఁడువిధంబులఁ బరగుచుండును. ద్వాదశప్రణవము లుచ్చరించుట కెంతసేపు పట్టునో యంతసేపటివఱకును బ్రణవధ్యానమూలంబునఁ బ్రాణాపానాదివాయువుల నిరోధించుటయే ప్రథమం బగుమందప్రాణాయామము. చతుర్వింశతిమాత్రోచ్చారణకాలమువఱకు నట్లాచరించినచో ద్వితీయం బగుమధ్యమప్రాణాయామం బగుచున్నది. ముప్పదియాఱక్షరముల నుచ్చరించునంతకాల మట్లు సాధించునది యుత్తమప్రాణాయామము. ఇది ప్రాణాయామభేదలక్షణంబు.

ఖచరంబు లగుగజసింహాదిక్రూరమృగంబులును, జలచరంబు లగుమకరాదిజంతువులును యోగనిష్ఠుం డగుమహాత్ము నెంతమాత్రమును బాధింపఁజాలవు. అట్టియోగీంద్రుం డెందును దోషలిప్తుండు గాకుండును. అశ్వములు, సింహములు, మదగజములు మొదలగువనజంతువు లుపాయమూలమునఁ గ్రమముగా మానవులకు వశీభూతము లై నిరంతరపరిచితంబులగువానివలెనే సంచరించుచుండునట్లు యోగాభ్యాసముం గావించువారికిఁ గాలక్రమంబున వాయువులు వశీభూతంబు లై పోవును. క్రమముగా నాతనికి వశ్యత్వసిద్ధి లభించును. ప్రాణాయామాభ్యాసముచే దేహస్థితంబులగుసర్వదోషంబులను నశింపఁజేయు సామర్థ్యము గలుగఁగలదు. తీర్థసేవనాదులు, నియమములు, వ్రతములు, యజ్ఞములు మొదలగుసత్కర్మములవలన నెట్టిఫలము లభించునో యేకప్రాణాయామమూలమున నట్టిపుణ్యఫలము సిద్ధించును. ప్రాణాయామములచే సకలదోషములును, ధారణలచే సకలకిల్బిషములును, ప్రత్యాహారములచే సకలేంద్రియవృత్తులును, ధ్యానముచే సకలగుణములును నశింపఁగలవు. కావున యోగతత్పరుఁడగువాఁడు సర్వదా ప్రాణాయామాచరణంబు గావించుచుండవలయును. అట్లాచరించువాఁడు

సకలపాపవిముక్తుండై బ్రహ్మపదలాభముం గాంచఁగలుగును.

స్వస్తికాసనము, బద్ధాసనము, భద్రాసనము అని యాసనములు మూఁడు విధంబులు. ఒకపాదమును రెండవపాదముపై నుంచి పాణితలంబులపై నిల్పియుంచి నిశ్చలచిత్తముతో స్థిరగ్రీవుండై పదములను సంగ్రహించి పాదతలముల నూరుజానుమధ్యంబుల నెలకొల్పి సమగ్రీవమస్తకుండై యున్నచో స్వస్తికాసనం బగును. ఊరుద్వయోపరిభాగమున నుభయపాదతలంబులను సంస్థాపించి వామహస్తముతో దక్షిణాంగుళిని, దక్షిణహస్తముతో వామపాదాంగుళిని గ్రహించియున్నచోఁ బద్ధాసనం బగును. ఈయాసనంబువలనఁ బాపరోగభయంబులు నశింపఁగలవు. అండంబులక్రిందిదేశమునందున్నయుభయశిఖలయందు గుల్ఫద్వయమును నిక్షేపించి జానుపార్శ్వద్వయమును బాహుద్వయముచే బంధించి పట్టియుంచినచో భద్రాసనం బగును. ఈభద్రాసనమువలన విషరోగములు వినాశము లగును.

సంవృతాస్యుండును నిమీలితాక్షుండును నై యుండి వాక్సంయమంబు గావించి కాలిమడమలచేతను, శేఫముచేతను అండములను సంవరణంబు గావించి నిరంతరమును రక్షింపవలయును. మొగము నించుక వంచి దంతములచే దంతములను స్పృశింపకుండ నిశ్చలజిహ్వుండై పాషాణమూర్తింబోలి చలింపకుండవలయును. రజోగుణముచే దమోగుణము నాచ్ఛాదించి సత్త్వగుణముచే రజోగుణమును నివారింపవలయును. ఇట్లు యోగి యోగబలంబుచే నిశ్చలుండై సమాధి నవలంబించి యింద్రియములను, నింద్రియార్థములను, మనంబును, బంచవాయువులను నిరోధించి కచ్ఛపంబును బోలి సకలాంగములను సంకుచితంబులుగాఁ జేయుచు విషయనివృత్తిసూచకం బగు ప్రత్యాహారము నారంభింపవలయును. అనంతరము ద్వాదశమాత్రో

చ్ఛారణకాలము ప్రాణాయామముం గావింపవలయును. ద్వాదశప్రాణాయామములచే ధారణ నభ్యసింపవలయును. అధ్యాత్మయోగి ప్రతిదినమును పదినుండి యారంభించి క్రమముగాఁ బండ్రెండు, ఇరువది, ఇరువదినాలుగుధారణల నభ్యసింపవలయును. ఈరీతి యోగముచే నెవ్వఁడు దివ్యంబగుపరమాత్మ సాక్షాత్కారముం గాంచునో యాతని కీశఁ బునర్జన్మ మెక్కడిది? అట్లు యోగీంద్రుండు శక్త్యనుసారముగా ధారణ నభ్యసించి ప్రత్యాహారమును సాధింప నారంభింపవలయును. సర్వేంద్రియములను మెల్లమెల్లగా వశపఱచుకొనుచు ధ్యానమునకుఁ గడంగవలయును. అజితేంద్రియుఁ డగువాఁ డెంతటి మహాత్ముఁడైనను విషయాకృష్టుఁడై మూఢుం డగునుగావున నెల్లవిధముల నింద్రియంబులను జయింపవలయును.

ప్రాణవాయువుల స్వైరవిహారమును నిరోధించుటయే ప్రాణాయామము. అంతరంగమునందు వాయుధారణ గావించుటయే ధారణ. విషయనివృత్తియే ప్రత్యాహారము. ఈయన్నింటిసహాయమునను యోగలక్షణ సిద్ధించును. ధ్యానయోగి జలంబులందోఁచుచంద్రునింబోలి తనయాత్మయందుఁ బ్రతిబింబించుపరమాత్మను దర్శింపఁగలఁడు. పరమాత్మసాక్షాత్కారముచే మోక్షప్రాప్తి యగును. ఈతత్త్వలక్షణము దేశకాలవిమలకు విజ్ఞేయమైనది. ఇతరుల కిది యతిదుర్లభమైనది.

ధ్యానమాహాత్మ్యము.

యోగప్రకారము నింకను విస్పష్టముగాఁ దెలుపవలయు నని వ్యాసుం డడుగుటయు సనత్కుమారుం డిట్లనియెను. మునిశ్రేష్ఠా! సుఖాసీనుండై యున్న స్వయంభువగు మహాదేవుని సందర్శించి దుర్వాసుం డిట్లు ప్రశ్నించెను.

పరమేశ్వరా! పాపవృత్తు లగు బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులును, సహజపాపులగు శ్వపాకమ్లేచ్ఛచండాలసూకరజీవపక్షిఘాతకులును, పాపాశ్రియులగు బుద్ధకృతఘ్నులును, హవిఃప్రతిబంధకులును, కన్యాదూషకులును, కులఘ్నులును, నపుంసకులును, మాతృత్యాగులును, పితృత్యాగులును, రాజఘాతకులును, పరద్రవ్యాపహారులును, రణపరాఙ్ముఖులును, పరవృత్తిహరులును, మత్స్యఘాతకులును, అగమ్యాగమనాసక్తులును మొదలగుపాపాత్ములకును ముక్తిలాభము సిద్ధించుటకుపాయ మేమి? ఇట్టివారు పాపగతినుండి యెట్లు నిష్కృతిం గాంచఁగలుగుదురు? ఈనాసంశయమును దీర్పవలయుననిప్రార్థింటయు మహాదేవుం డిట్లనియెను.

మునీంద్రా! పాపపరాయణు లగుమానవు లేజాతివారైనను క్షణమాత్రమున నిశ్చలధ్యానబలంబుచే సకలపాపసమూహమును దగ్ధము సేయఁగలుగుదురు. ధ్యానమూలంబున నాత్మవిదులును విశుద్ధబుద్ధులు నగుయోగులకు మోక్షము లభించును. శుద్ధధ్యానముచే సర్వసిద్ధులును లభించును. ఏకాగ్రచిత్తముతో ధ్యానచింతాతత్పరు లగు ధ్యానయోగు లేకధ్యానయోగముచేతనే సకలపాపములను దహింపఁజేయుదురు. పితృభ్రాతృపత్నీగమనము, భగినీగమనము మొదలగు మహాపాపములు ధ్యానబలముచే నశింపఁగలవు. దృఢవ్రతుండై నిత్యాభ్యాసము గావించువారికిఁ బరిశ్రమమూలంబున ధ్యానము సుస్థిరమై ధారణాబలము సిద్ధించును. యతియగువాఁ డతిప్రయత్నముతో ధారణాలాభతత్పరుండై యుండవలయును. ధారణాలాభముచే సర్వసిద్ధులును లభింపఁగలవు. ధ్యానతన్మయుం డగుపురుషునకు మోక్షము మస్తకమునందే చేరియుండును. ఆతఁడు రుద్రలోకము, సూర్యలోకము, అగ్నిలోకము, ఇంద్రలోకము, విష్ణులోకము మొదలగువానిలో

దేనిని వాంఛించినను, బ్రజాపతిలోకమును, బ్రహ్మత్వమును, మోక్ష మును వాంఛించినను దప్పక సిద్ధించును. అతని కప్రాప్యమగునది యేదియు లేదు.

కాశీవాసనిర్దేశము.

మహాదేవుం డిట్లు బోధించుటయు దుర్వాసుండు వెండియు నిట్లు ప్రార్థించెను. దేవదేవా! ధ్యానమన నెట్టిది? ఎట్టివాఁడు నిశ్వము ను ధ్యానించుచుండవలయును? ఈసకలవిషయములును నాకు బోధించి నన్నుఁ గృతార్థుని జేయుము అనుటయు మహేశ్వరుండు చెప్పం దొడంగెను.

ధ్యానయోగము మోక్షద్వారవిమోచనోపాయము. యోగిం ద్రుండు పరమధ్యానస్వరూపమగునోంకారము నుపయోగించి గురు గణంబులకు నమస్కారపూర్వకముగా సమ్యంత్రమును ధ్యానించుచు నుపయుక్తాసనమున నుపవిష్టుండై యతిప్రయత్నముతో బ్రాణనియ మనంబు కనుయుక్తమగుయోగమును బ్రయోగింపవలయును. పద్మ మండలము, స్వస్తికము, రుద్రపీఠము, వజ్రదండోన్నతము మొదలు గాఁగల వివిధాసనవిశేషములును, వాసలక్షణములును, గుణములును శాస్త్రంబులయందు నిర్దిష్టంబులై యున్నవి.

యోగవిదుం డయ్యాసనంబులలో నొకయాసనమును గ్రహించి నియమితాహారుండును, జితక్రోధుండునై నిర్జనస్థానంబున నిరామయ భావముతో శిష్టసంసర్గమునుగూడఁ బరిత్యజించి, సాధారణజనదర్శనం బును, వదభిగమనంబును వర్జించి శాస్త్రోపదేశానుసారముగా నిరంతర ధ్యానచింతానిమగ్నుండై యుండవలయును. ఈవిధముగా నేకాగ్ర చిత్తుం డగుసాధకునకు యమంబు సిద్ధించును. ఉత్పన్నంబైనయీశరీరం

బవశ్యము వినాశంబు గాఁగలదని యేకాగ్రచిత్తముతోఁ జింతించు చుండవలయును. ఈదేహము నెంతమాత్రమును హింసింపరాదు. ‹‹శుక్లశోణితమూలంబున నిర్మితంబై నయీశరీరముతో నుపయోగ మేమున్నది? అనిత్యం బగునీదేహము మేదోమాంసపరిపూర్ణమైనది. నాడీజాలావృతంబగు నీశరీరరూపనగరము, ఇంద్రియరూపము లగునవ ద్వారములతోఁ గూడియున్నది. శ్లేష్మమూత్రపురీషాదినీచస్థానముల నుండి యుత్పన్నంబులగుదుర్గంధములచేతను, వ్యాధులచేతను, శోకా దులచేతను నతిభయంకరం బగునీశరీరమునందు మూఢుఁడు మమకార ము గలిగియుండును. కాని, యోగవిధుండగువాఁడు మాత్రమాయొక్కటి యే నిత్యంబనియు, శరీరము కేవలమనిత్యమనియు భావించుచుండును.

ఈశ్వరుఁ డగుమహాదేవుఁడు రుద్రావాసమగుకాశీధామమునం దు విరాజిల్లుచుండును. ప్రాణసమూహము రుద్రస్వరూపము గావున నట్టిరుద్రకావాసంబగునీశరీర మవిముక్తం బని భావింపవలయును. ఇది యభ్యంతరయోగము. ఇఁక లోకహితార్థమై బాహ్యయోగము నభివర్ణించెదను. యోగవేద్యం బగుపరమయోగము నిత్యశ్రవణ యోగ్యమైనది. త్వక్కు, చక్షుద్వయము, శ్రోత్రద్వయము, జిహ్వ అనునీయైదును, అవ్యక్తము, బుద్ధి, అహంకారము, మనస్సు, చిత్తము ననునీయైదును, పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము ను నీయైదుభూతములును జ్ఞానస్వరూపములని బ్రహ్మభావార్థము జ్ఞానా భ్యాసముం గావింపవలయును. అవ్యక్తవిచారముకొఱకు నారంభింపఁ బడినప్రాణాయామమే ధారణ యగుచున్నది. మేధావి యగువాఁడు సకలేంద్రియసంచాలక మగుమనంబును బ్రాణాయామముచే వశీభూ తంబుగావించుకొని మనోమూలంబునఁ బ్రాణయోగంబు నాచరింప వలయును. మనస్సునుల్లంఘించి యేకర్మమును జేయరాదు. మనమే

సకలంబునకును మూలమైనది. అనంతరము యోగముచే మస్తకము నందు సకలతత్త్వములను వేఱువేఱుగా భావించుట నభ్యసింపవలయును. మనఃప్రాణేంద్రియంబుల నైక్యంబు చేసి యాత్మచే నాత్మను భావించుచు నోంకారమును ధారణగావింపవలయును.

—♦ వివిధయోగవిధి. ♦—

ఆత్మబలంబుచేఁ బంచవాయువులను నాత్మయందు ధారణ గావింపవలయును. నఖములు, అంగుళులు, పర్వసంధులు, పాదములు ఊరువులు, జంఘలు, శేఫము, అండములు, పాయూపస్థలు, కటిస్థానము, బాహువులు, హృదయమధ్యము, పృష్ఠము, లలాటము, జిహ్వాగ్రము, తాలుమధ్యము, చక్షువులు, నాసిక, భ్రూమధ్యము, శ్రోణిభాగము, మూర్థము ననునీస్థానములయం దీపంచవాయువులును సంచరించుచుండును. మఱియునీశరీరమునందు నాభీమధ్యమున జ్వాలామాలికాసహస్రములచేఁ బ్రజ్వలించుసూర్యమండలము విరాజిల్లుచుండును తన్మధ్యమునందు వెలుంగుచున్న సుందరచంద్రమండలమునందుఁ బరమాత్మ యధిష్ఠించి యుండును. నీల, శ్వేత, రక్త, శ్యామల, పింగళ, లోహిత, శబలాదివర్ణంబు లాపరమాత్మకులేవు. అతఁ డష్ఠిస్నాయుశిరామాంసవివర్జితుఁడై, దుఃఖాతిరిక్తుఁడై ప్రకాశించుచుండును. విచక్షణులగువా రాపరమాత్మ నాదిత్యవర్ణుండగుపురుషునిగా భావించుచుందురు. చింతనీయుం డగునయ్యీశ్వరుండు లోకకర్తగాఁ బ్రశంసితుండగుచుండును. శుద్ధస్ఫటికాసంకాశుఁడగునాపురుషునిదివ్యస్వరూపము చక్షుర్గోచరంబు గాదు. సముద్రమును జల మావరించినవిధంబున నాపురుషుండీవిశ్వమంతటను వ్యాపించి యుండును.

అమ్మహాదేవుఁడు విలాసముకొఱకును, విఖ్యాతికొఱకును జగ

త్సృష్టిఁ గావించుచు సకలజీవులను గ్రీడాపరికరములుగాఁ జేసికొని క్రీడించుచుండును. పలాశపత్రమునం దంతటను దంతుసమూహము వ్యాపించియున్నట్లు పరమాత్మ సకలలోకములందును వ్యాపించియుండును. సూర్యరశ్మిసకలతేజములను వహించియున్నట్లు పమాత్మ సకల రూపములను దాల్చి విరాజిల్లుచుండును. ఈవిధముగా జ్ఞానాభ్యాసముంగావించి పరమాత్మస్వరూపమును గ్రహింపవలయును. ఆత్మచే నాత్మయందు సకలభూతంబుల దర్శించుచు నిష్ఠాజ్ఞానాభ్యాసబలంబునఁ బరమాత్మస్వరూపమును దర్శింపవలయును.

ప్రాణవహంబు లగుపదినాడులు శరీరస్థితంబులై యుండును. అధఃప్రదేశమునందు నాలుగునాడులును, పార్శ్వములందు రెండునాడులును, ఊర్ధ్వప్రదేశమునందు నాలుగునాడులును గలసి పదినాడులు. ఇంకను శరీరమునందు డెబ్బదిరెండువేలనాడులు గలవని చెప్పుదురు. మాంసముపైఁ దైలమువ్యాపించిన ట్లానాడులు శరీరమునం దంతటను వ్యాపించి యుండును. హృదయప్రదేశమునందు పద్మసంకాశంబగు నొకస్థానము గలదు. అందు సూక్ష్మస్వరూపుఁడును, శుద్ధస్ఫటికతేజుండును, నిర్గుణుండును, నిత్యుండును, ధ్రువుండును, నిరంజనుండును, మద్భక్తపరతంత్రుండును, అక్షరుండును, అవ్యయుండును, బరమాత్మస్వరూపుండు నగుపురుషుండు వెలుంగుచుండును. ఆతఁడే సర్వశరీరస్థితుఁడు, సర్వతీర్థస్రష్ట, విధాత; ప్రయోక్త; భవకారణుఁడు; సకలలోకకర్త; ప్రవర్తకుఁడు; సృష్టిసంహారకర్త; ఆతఁడే యగ్నిస్వరూపుఁడు; ఆతఁడే యాదిత్యస్వరూపుఁడు:—అని యీవిధముగా విజ్ఞానులగువారు భావించుచు యోగాభ్యాసముం గావించుచుందురు.

—. యోగలక్షణము. —

ప్రాణాదివాయువులు నాలుగు నూర్ధ్వగతంబులై యుండును. ఆవాయుసాహాయ్యముచే నెవ్వఁడు పరమాత్మ నాత్మయందు సంచరింపఁజేయఁగలుగునో యట్టిధ్యానపరాయణుఁ డగుపురుషుఁ డాక్షణము నందే యోగీంద్రనామమున కర్హుం డగును. పాపాత్ము లీమార్గమునఁ బరమాత్మను దర్శింపఁజాలకుందురు. నిత్యపాపకర్మరతుం డైనను నిత్యధ్యానపరాయణుండు గాఁగలిగిన వో నాతని కెట్టిపాపములును గలుగకుండును. అనలజ్వాలచే నరణ్యకాష్ఠములు దగ్ధములైనవిధంబున ధ్యానానలముచే నఖిలకర్మంబులును దగ్ధములై పోవును. వేదాధ్యయనములు, యజ్ఞములు, జపములు, యోగములు, శౌచములు, మానసారాధనములు, బ్రహ్మచర్యాదినియమములు, మొదలగువానివలనఁగూడఁ బడయరానిపరతత్త్వజ్ఞానము కేవలధ్యానసాగరసేవనమువలన మానవులకనాయాసముగా లభింపఁగలదు. ధ్యానార్ణవమును సేవింపఁజాలనివానికెంతమాత్రమును బరమపదప్రాప్తి గానేరదు. అతనికిఁ బుణ్యనదీజలస్నానము, తీర్థసంసేవనము, దీక్షావిధానము, శిరోముండనము, దేవపూజ, త్రిదండధారణము మొదలగువానివలన నెట్టిప్రయోజనమును లేదు. సర్వత్ర సమదర్శనుఁడై సర్వభూతముల నాత్మస్వరూపములుగా నెంచుచు, సర్వమునాత్మస్థితంబుగా భావించుచుండు మహాత్ముఁడే సిద్ధుఁడు.

—♦ షడంగయోగాదికథనము. ♦—

మఱియు మహాదేవుం డిట్లనియెను. ప్రాణాయామంబును ధ్యానంబును గలసి ధారణాయోగం బగుచున్నది. ప్రాణవాయువులను నిగ్రహించుటయే ప్రాణాయామము. యోగప్రవృత్తుం డగువాఁడు నిగ్ర

స్థానంబున నిశ్చలహృదయముతో నోంకారమును ధ్యానించుచుండ వలయును. ధ్యానమువలననే మహత్త్వంబు వర్ధిల్లుచుండును. సకలేంద్రియములను, సకలేంద్రియవిషయములను బుద్ధిబలముచే సంకోచింపఁ జేయుటయే ప్రత్యాహారము. దశేంద్రియంబులకు నోంకారసంయోగంబు గావించి జపించుటయే యోగం బనఁబడును. అహింసయు, సత్యభాషణంబును, అస్తేయమును, అకాపట్యమును, బ్రహ్మచర్యము ననునివి యైదును నియమములు. అక్రోధనము, గురుసేవనము, శౌచము, సంతోషము, అధృతి యనునివియైదును నియమంబులు. ఈయైదును శుద్ధవిజ్ఞానమును గలసి షడంగయోగం బగుచున్నది. షడంగయోగసిద్ధునకు నిత్యం బగు పరమపదంబు సిద్ధింపఁగలదు. ప్రథమమునందు నియమసాధనంబుల కనముద్ధం బగుశరీరము నియమాదులం సిద్ధించి అంతనే సర్వసమర్థంబై యెట్టిభంగంబును లేకయుండును.

నిరంజనమును, అవ్యక్తము నగుజ్ఞానమే త్రిగుణాత్మకప్రకృతి యని పండితులు చెప్పుదురు. ద్రష్టయు, స్రష్టయు, పితయు, మంతయు, బోద్ధయు, ధ్యానపరులచేతనే దర్శనీయుండును, నిత్యుండు నగుసూక్ష్మస్వరూపుఁడే పురుషుండని ప్రశంసింపఁబడుచుండును. ఆతని దర్శింపవలయు ననుకుతూహలముతో ననేకవిధంబులగు యోగముల నవలంబించి ప్రయత్నించుచుందురు. యోగసిద్ధు లగువారి కాతనిసాక్షాత్కారము లభింపఁగలదు. ఈశరీరమునందు మనస్సు, బుద్ధి, అహంకారము, అవ్యక్తము, త్రిగుణాత్మకయగుప్రకృతి శాశ్వతుఁడగు పురుషుఁడును సంస్థితులై యుందురు. జీవుండు రజస్తమోగుణంబులచే నష్టదృష్టియై, సదసద్విచారణంబు లేనమూఢుండై సర్వము పురుషుఁడే హృదయమునందుండి చతుర్గతికిఁ గారణుం డగును. ఎవ్వఁడీపంచవింశతితత్త్వములయుత్పత్తినాశములను భావాభావములను మహాదేవుని

యందు భావనసేయఁగలుగునో యాతఁ డష్టావింశతిదర్శకుం డగును.

మోక్షమును బ్రమాణాదులచేఁ దెలిసికొనుట యసంభవము. పంచవింశతత్త్వముల నెఱుంగఁజాలినవారు తత్ప్రతిపాద్యుం డగునీశ్వరు నెఱుంగుటకు సమర్థు లగుదురు. సకలంబునకు నూర్ధ్వభాగంబున రుద్రావాసమునందు సంచరించుచుండు నోంకారమును దర్శింపఁగలిగిన పురుషుఁ డవిముక్తుండుగాఁ బ్రశంసితుండు గాఁగలఁడు. దేనిమూలమున మోక్షము లభించునో, దేని నెఱుంగుటవలన మోక్షమార్గము విదితంబగునో గ్రహింపఁగలవిజ్ఞాన మాతనికిఁ గరతలామలకం బగును. పురుషుఁడు పంచవింశతితత్త్వరూపుఁడనియు, షడ్వింశతిస్వరూపుఁడనియు, ఊనవింశతితత్త్వస్వరూపుఁడనియుఁ దత్త్వజ్ఞానియగువాఁడెఱుంగఁగలఁడు. ఆతఁ డాపురుషుని వింశతితత్త్వాత్మకునిగా నెఱింగి ముక్తిలాభముం గాంచును. సప్తవింశతితత్త్వస్వరూపుఁ డధ్యక్షుఁడనియు,అష్టావింశతితత్త్వాత్మకుఁడు పురుషుం డనియు, త్రింశత్తత్త్వవేద్యుం డగువాఁడు పురుషలోకధరుం డనియు వ్యవహరింపఁబడుదురు.

ఎవ్వఁడు శస్త్రాదులచే నచ్ఛేద్యుఁడై యుండునో, స్వరవ్యంజనాదివర్ణంబులచే నెవ్వనిస్వరూపము నిర్ణీతంబు గాకుండునో, మాత్రాక్షరవిరహితుం డగు నెవ్వనిమూర్తిని యతీంద్రులు నిరంతరమును ధ్యానించుచుందురో, కాశీధామమునం దెవ్వఁడు గౌరీదేవిదక్షిణభాగంబున విరాజిల్లుచుండునో పంచాయతనక్షేత్రస్థంబగునట్టియోంకారశివస్వరూపమే శోకమోహభయవినాశకం బగుపరమేశ్వరస్వరూపము. ఆదేవుని యనుగ్రహంబుచేతనే మానవులు మాయావిరహితు లగుదురు. ఆ యీశ్వరుఁడే నిష్కళుం డని యోగీంద్రులు నిత్యమును ధ్యానించుచుందురు.

అని మహాదేవుఁ డుపదేశించుటయు దుర్వాసుఁడు మహాత్మా!

అయీశ్వరుండు మాత్రాక్షరవిరహితుండని యానతిచ్చితిరి. అట్టివానిని దెలిసికొనుటయెట్లు? పరమగోప్యం బగునీవిషయమును విస్పష్టంబుగాఁ దెలిపి నన్ను సంతుష్టునింగావింపవలయు నని వేడుకొనియెను. అప్పుడు మహాదేవుండు వెండియు నిట్లు చెప్పందొడంగెను.

ఓంకారమే పరమం బగుబ్రహ్మస్వరూపము. దానికంటె నన్యం బగునది యేదియునులేదు. ఆబ్రహ్మము పంచమాత్రాత్మకంబుగాఁ బ్రకీర్తిత మగుచుండును. ఆతని ప్రథమద్వితీయమూర్తులు స్వరవ్యంజనాత్మకములు. తృతీయమూర్తి యతిసూక్ష్మమైనది. దానిని యోగులు ధ్యానించుచుందురు. అది యతిసూక్ష్మపదార్థంబులకంటెను నర్థాంశసదృశసూక్ష్మంబును, నిర్గుణంబును, బ్రశాంతంబును, అక్షయం బునై యుండును. దాని నెఱింగినవారు ముక్తులగుదురు. అకారము తేజస్స్వరూపము. ఉకారమక్షరస్వరూపము. మకారముతురీయమును సూక్ష్మమును:—వీనినుండి యోంకార మయ్యెను. అకారము బ్రహ్మస్వరూపమనియు, ఉకారము విష్ణుస్వరూప మనియు, మకారము ఉమాస్వరూపమనియుఁ దెలియందగును. వీనినుండి నిత్యబ్రహ్మస్వరూప మగునోంకార ముత్పన్నం బయ్యెను. ఈయోంకారము నుచ్చరించుచు స్మరించుచు యోగసాధనముం గావించుయోగీంద్రులు సర్వసిద్ధులను బడయఁగలుగును.

శరీరనిరూపణము.

మహేశ్వరుండు దుర్వాసుంగాంచి మఱియు నిట్లనియెను. ఓ మునికులతిలకా! ఈశరీరము సర్వదేవతామయమైనది. ఇందేయేయంగకములం దేయేదేవతలుందురో చెప్పెదను వినుము. పాదములయందు విష్ణుండును, జంఘలయందుఁ బవనుండును, జానువులయం దశ్వినీ

కుమారులును, ఊరువులందు వరుణుండును, పాయుస్థానమునందు మిత్రావరుణులును, గుహ్యాంగమునందు బ్రహ్మయు, కటిప్రదేశమునందు యక్షగణసహితుండగు కుబేరుండును, అంత్రములందు సముద్రములును, ఉదరమునందుఁ బంచదేవతలును, హృదయమునందు సావిత్రియు, వక్షస్థలంబునఁ జంద్రుండును, హస్తములయం దింద్రుండును, చర్మమునందు విద్యుత్తును, నఖంబులయందోషధులును, కేశములయందు వనస్పతులును, రోమకూపంబులయందు ధర్ముండును, మూర్ధమునం దాదిత్యులును, సంధులయందు సప్తర్షులును, నయనంబులయందు సూర్యుండును, శ్రోత్రంబులయందు దిక్కులును, ఘ్రాణప్రదేశమునం దుఁ బర్వతంబులును, లలాటమునందు వసువులును, మస్తకమునందు స్వయంభువగు శివుండును, గృష్ఠప్రాణములయందు యముండును నవబ్రహ్మలును, పృష్ఠభాగమునందు రాత్రియు, పార్శ్వములయందు దేవతలును, కంఠమునందుఁ బ్రాణాగ్నియగు వృషభధ్వజుండును, అహంకారమునందు రుద్రుండును, బుద్ధియందుఁ బ్ర[illegible]లియగు బ్రహ్మము నధిష్ఠించి యుందురు. ఈవిధముగా శరీరమంతయు సర్వదేవతామయం బని భావించువారికిఁ బరమగతిలాభంబు గలుగును.

అని చెప్పటయు దుర్వాసుండు మహాత్మా! ఈదేవతలును మహర్షులును శరీరము నధిష్ఠించియుందురని తెలిపితివి. వీరెందఱును బ్రాహ్మణాహుతు లెట్లు లభించునో విస్పష్టముగా బోధింపవలయు నని ప్రార్థించెను. అంతనమ్మహేశ్వరుండు మరల నిట్లని చెప్పందొడంగెను.

ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము ననునీపంచవాయువులును శరీరమునందు సంచరించుచుండును. బ్రాహ్మణుఁడు ప్రతిదినమును దేహంపవాయువులకొఱకు స్వాహాకారప్రదానముం గావింపవలయును. అప్పుడు ముందే ప్రాణవాయువునకుఁ గాని

చినయాహుతివలన సావిత్రియు, షడంగపదక్రమసహితంబు లగునాలుగువేదములును, ఓషధులును, వనస్పతులును, చంద్రుడును, భాస్కరుడును, వాయుదేవుండును సంతృప్తు లగుదురు. రెండవసారి యపానమునం దాహుతిగావించిన యన్నమువలన నాగగణంబులును, సప్తసముద్రంబులును, సకలనదులును, మహర్షులును, బిశ్వదేవతాగణంబులును, వాయుప్రభృతిదేవతలును సంతృప్తు లగుదురు. తృతీయపర్యాయము సమానవాయువునం దాహుతిగావించిన యన్నమువలన అశ్వినీదేవతలును, మరుద్గణంబులును, విష్ణుదేవుండును, వరుణుండును, యముండును, బ్రజాపతియును, కుబేరప్రభృతిదేవతలును సంతృప్తు లగుదురు. చతుర్థపర్యాయ ముదానవాయువునందు హోమముగావించినయన్నమువలన నేనును, భవుండును, పరమేశ్వరుండును, పార్వతీదేవియు, మనస్సును, ప్రాణసమూహములును, బ్రహ్మయును సంతుష్టు లగుదురు. మునీంద్రా! ఐదవసారి వ్యానవాయువునందు హోమము గావించినయన్నమువలన నక్షత్రగణంబులును, సప్తద్వీపములును, సప్తలోకములును, భూమండలమును, సకలభూతసహితంబగుబ్రహ్మాండమండలమును, యక్షరాక్షసప్రభృతులును సంతృప్తు లగుదురు.

ఈవిధముగా బ్రాహ్మణులు ప్రణవమంత్రోచ్చారణపూర్వకముగా హోమంబు గావించినచో జండాలాన్నభోజనముచేసినను పాపలిప్తులు గానేరరు. బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులలో నెవ్వరైన నీవిషయమును బారముగావించిరో వారు సకలపాపములనుండియు విముక్తులై శ్రద్ధావంతు లగుదురు.—« ఆదిత్యవర్ణుండును, దమోగుణాతీతుండు నగునమ్మహాపురుషుని నేనెఱుంగుదును. ఆతని నెఱుంగఁగలిగినచో జన్మమృత్యుపరస్పరానుబంధం బగుసంసారమునుండి ముక్తిలాభంబు గలుగును. మోక్షరూపం బగుసద్గతిం గాంచుట కంతకంటె

వేఱుమార్గంబు లేదు. జీవరక్షగావింపవలయు ననునభిలాష యున్నవో మోక్షప్రాప్తికి సాధనం బగునుపాయము నవలంబింపవలయును. అట్టి వానికి హాలాహలమును బానము చేసినను మృత్యువు గలుగదు." అని యీవిధముగాఁ బరమేశ్వరునిం గూర్చి నిశ్చలహృదయమున భావింపఁ గలిగినచో నవశ్యము ముక్తిలాభంబు గాఁగలదు.

—♦ నా డీ వి వ ర ణ ము. ♦—

యోగనాడీవిషయంబును, తదాశ్రితవిషయంబును నాకు స్పష్టముగా బోధింపవలయు నని యడుగుటయు సనత్కుమారుం డిట్లు చెప్పందొడంగెను.

అవ్యయుం డగుసకలలోకేశ్వరునకు వినయవినమితమస్తకుండనై ప్రణామంబు లాచరించి నిశ్చలభక్తిపూర్వకంబుగా రుద్రాణియగు కాత్యాయనికి నమస్కారంబులఁ గావించెదను.

హరిహరబ్రహ్మలచే నీయోగశాస్త్రము సముదాహృతంబైనది. ఇది నాడీసంచారసంస్థితం బగుపరబ్రహ్మజ్ఞానము. శ్రీమంతుఁడగువిశ్వమూర్తి దేహస్థుఁడై క్రీడించుచున్నకాలమునం దాతని యనంతతేజోమయూఖములు జగద్దేహప్రసరితంబు లగుచుండును. హృదయస్థితంబులగు యోగనాడులంగూర్చి వర్ణించి యుంటిని. ఇఁక శరీరమునందుఁ బూర్వదక్షిణపశ్చిమోత్తరభాగంబుల నాశ్రయించి యథఃప్రదేశమునందుండు నాడులవర్ణంబుల నభివర్ణించెద నాకర్ణింపుము. ఉత్తరనాడీసమూహము పీతలోహితకృష్ణవర్ణంబు గలిగియుండును. పూర్వభాగస్థితం బగునాడీసముదాయము పాండుపింగళవర్ణంబులతో నొప్పుచుండును. దక్షినాడీసమూహము శ్వేతవర్ణయుతంబును, బశ్చిమనాడీసమూహము కృష్ణపింగళసంకలితంబునై యుండును. ఊర్ధ్వస్థితంబులగునాడు

లన్నియును గృష్ణవర్ణమయంబులై యుండును. హృదయస్థానస్థితంబు లగునాడులతో నీనాడులన్నియును బంచపంచప్రకారములవిరాజిల్లుచుండును. ఏకోత్తరశతనాడులను యోగీంద్రు లుపాసించుచుందురు. ఈ నాడుల నన్నింటిని విడిచి యొక్క బ్రహ్మనాడి నాశ్రయింపవలయును. ప్రభాకరుం డగుసూర్యుఁ డుదయించి తనతేజోమయకిరణములచే నంధకారసమూహమును వినాశంబు గావించి నభోమండలమును ప్రకాశింపఁజేయుచున్నట్లే హృదయస్థితుం డగుపరమాత్మ సకలకలుషసమూహమును దూరీభూతముగాఁ జేసి సర్వంబును బ్రకాశమానముగాఁ జేయుచుండును.

అతితరంబు లగుక్రీడామోహాదులు నాభినాడులచే దూరీకృతంబులగును. హృదయస్థానమునందుఁ దొంబదియాఱువేలనాడు లుండును. పూర్వస్థితంబు లగునైదునాడులును బంచప్రాణములుగాఁ బరిగణితంబు లగుచుండును. దక్షిణభాగమునందలినాడు లైదును జలనాడు లనియు, బశ్చిమభాగమునందలినాడు లైదు నుదాననాడు లనియు, ఉత్తరభాగమునందలినాడు లన్నియు నుత్తరనాడులనియుఁ బ్రశంసింపఁబడుచుండును. మఱియు నధోదేశమునం దున్ననాడులన్నియు సమానస్థనామముచే విఖ్యాతంబులై యుండును. ఊర్ధ్వభాగమునందును అధోభాగమునందును వ్యాపించియుండు నీయుభయనాడీసమూహమును హృదయమధ్యమునం దాశ్రయించి యుండును. ఈవిధముగా నాడీ ప్రమాణము నిర్దిష్టం బయ్యెను. ఎవ్వనిచే నీవిశ్వమండలమంతయుఁ బ్రతిష్ఠితం బయ్యెనో యావిశ్వకర్మ యతిసూక్ష్మంబు లగునీనాడుల నన్నిటినిగూడ నధఃప్రదేశమునందలి నాడీచతుష్టయముతోఁ గూర్చి యుండెను. విశుద్ధనాడి హృదయమునందును, మస్తకమునందును లక్షితమగుచుండును. తత్త్వజ్ఞాననిధులగువిజ్ఞానయోగులు దానినేబ్రహ్మ

నాడి యందురు. దానియందు మనంబును సంయోజితంబుగఁ జేసిన జ్ఞానేంద్రియసమూహము రక్షితంబుఁ గాఁగలదు. కర్మేంద్రియపంచకంబుతో నింద్రియపంచకము సంయుక్తంబై యుండును. యోగబలంబుచే హృదయసంబంధము లగునాడులన్నియును బాదస్థితంబులు గాఁగలవు. సహస్రనాడీసమూహమధ్యమునందును బూర్వాదినాడీచతుష్టయము గుణసంబంధమైనది.

యజ్ఞములును, సకలవేదములును హృదయమునందుఁ బ్రతిష్ఠితంబులై యుండును. దానివలననే యాత్మతత్త్వజ్ఞానము లభించును. మఱియుఁ బ్రణవమువలన నూర్ధ్వగతిప్రాప్తి యగును. నాసికారంధ్రములనుండి మస్తకమునందును, మస్తకమును భేదించి యాకాశమునందును వాయుసంచార మగును. శుక్రవాహంబులును, మూత్రవహంబులు నగునాడులు పరస్పరమిశ్రితంబులై యేకీభవించి యుండును. శుక్రనాడులు శుక్రమూలంబున సంతానోత్పాదకంబులై యుండును. మూత్రనాడులు మూత్రవిస్రావకంబులై యుండును. ముఖమునందుమనోమిళితంబగుబ్రహ్మనాడిని, హృదయమునం దీశ్వరుని సుస్థిరంబుగా నిలిపి యాత్మ నాకాశగతంబుగను, విశ్వవ్యాప్తంబుగను భావించుచు నేకాగ్రచిత్తంబున ధ్యానించువానికి నిర్మలజ్ఞానసిద్ధి యగును. సూక్ష్మముకంటెనుఁ నతిసూక్ష్మం బగుతత్త్వ మాతనికిఁ బరిస్ఫుటంబు గాఁగలదు. ఇట్టితత్త్వజ్ఞానలాభమువలన నాతని కిఁక సంసారసంబంధములేకుండఁ బోవును. సోమసూర్యకరసహస్రంబులచేఁ బ్రఫుల్లవిలసితమగు సహస్రారకమల మాతనికి వేద్యంబగును. శిరస్థితం బగునాసహస్రారకమలంబునందే యోగీంద్రు లాత్మసంయోజనంబు గావించుచుందురు.

ఆసహస్రారకమలమే సంసారవిమోచనమునకు సాధనమైనది. జ్ఞాన, శాస్త్రసాహాయ్యముచే దానిని నిరీక్షింపఁగలవైనపిమ్మట నిర్మలచిత్తు

ధేవభావాదిజన్మములనుండి విముక్తులై, బహుజనప్రశంసితులగు బ్రహ్మ వేత్త లాత్మస్వరూపలాభమునకు సమర్థులగుదురు. నాడీసంచారసూచిత మగునీపవిత్రయోగశాస్త్రము సనత్కుమారప్రోక్తమైనది. ఇది నిశ్చయముగా మోక్షశాస్త్రము. సునిశ్చితం బగునీయోగశాస్త్రము బ్రహ్మాదిసకలర్షిగణంబులచేతను బ్రకీర్తితమైనది. పాపనాశకంబగునీశాస్త్రము పవిత్రశాస్త్రములన్నిటికంటెను బవిత్రమైనది. నాడీముఖచింతకుఁ డగు వాఁడు సర్వపాపవిముక్తుం డగును.

శుక్లశోణితసంభూతుఁడు, స్థూలదేహాభిమానియు నగువిశ్వనామకచైతన్యమూర్తి నాడీమధ్యసంస్థాపితుం డైనంతనే నిర్మలుండు గాఁ గలఁడు. గోమూత్రినామకనాడీధ్యానమువలన సప్తజన్మార్జితంబగు పాపము నశింపఁగలదు. కావున శ్రద్ధతో నానాడిని శిరోదేశంబున కధోభాగంబున నియోజితంబుగావించి యానాడీమూలముననే యాత్మచింతనంబు గావింపవలయును. అట్లుగావించినచో విశ్వమయంబగు నాత్మస్వరూపము హృదయమునందు సుప్రతిష్ఠితంబగును. పూర్వర్షిగణంబు లిట్లే యాత్మచింతకులు, నాత్మపరాయణులునై యాత్మను హృదయమునందుఁ బ్రతిష్ఠించి ధ్యానించిరి. ఆత్మతత్త్వజ్ఞానము సంపూర్ణముగ లభించువఱకును దృఢభావముతో నిట్లే ధ్యానయోగంబు గావించుట యవశ్యకర్తవ్యము. సూక్ష్మమార్గసంచారంబు లగునాడుల యూర్ధ్వగమన ముత్తరాయణ మనియు, వానియధోగమనము దక్షిణాయన మనియు నీరెండుమార్గములును గలస్నాయుమయంబగుశరీరము సంవత్సరంబనియుఁ బ్రశంసింతురు. ఉత్తరాయణమార్గమునం బోవువారికిఁ బునర్జన్మంబు గలుగదు.

నాభియం దుత్పన్నములైనవి మూఁడువేలనాడులు. తొంబది యాఱువేలనాడులు హృదయమునుండి జనియించినవి. శుభదాయకం

బు లగునానాడులయందు విశ్వమూర్తి సుప్రతిష్ఠితుండై యుండును. ఈనాడుల నన్నిటిని బరిత్యజించి కేవలము బ్రహ్మనాడి నాశ్రయింప వలయును. సముద్రమునుండి తరింపఁజేయునౌకవలె నీబ్రహ్మనాడి తన్నాశ్రయించినవానిని సకలదుఃఖసమూహమునుండియు నుత్తీర్ణునిం గావించును. నిరాలంబ యగునొకనాడి తాలుమధ్యమునుండి మస్తక మువఱకును వ్యాపించియుండును. స్వర్గగామిని యగునానాడి యోగీం ద్రులకు మోక్షప్రదాయకమైనది. శుక్రశోణితంబులవలనరూపొంది మేదోమాంసకఫపిత్తాదులచే నతిదూషితంబైనయీశరీరము ధ్యాన యోగప్రవాహముచే సకలదోషవిముక్తంబు గాఁగలదు. ధ్యానయో గసిద్ధుఁడు మస్తకమునందలియీశ్వరస్థానమునుండి యూర్ధ్వగతిం గాంచి సూర్యసమతేజస్సంపన్నుఁడై యాదిత్యాగ్నిలోకంబులకంటెను నూర్ధ్వ స్థితంబగుదివ్యలోకము నధిగమించి శాశ్వతానందసంపన్నుండు గాఁ గలఁడు. ఆతఁడు సకలదేవతలు, మహర్షులు, బ్రహ్మవిష్ణుమహేశ్వరు లు, వాయువు, యముఁడు, అగ్ని, వరుణుఁడు, శశాంకుఁడు మొదలగు వారిని గ్రమముగా దర్శించుచు స్వర్గలోకగమనంబు గావించును. స్వర్గసంస్థితుండగు యోగీంద్రునిం గాంచి దేవతలందఱు నాతనిమాహా త్మ్యము బ్రశంసించుచు స్తవధ్యానగానపూజాదులచే నాతనిసన్మానిం చుచుందురు. ఈవిధముగా గౌరవింపఁబడుచు యోగీంద్రుఁడు పరమ పదం బగునీశ్వరధామమునందుఁ బరమానందముతో విరాజిల్లు చుండును.

—♦ అవిముక్తక్షేత్రమాహాత్మ్యము. ♦—

అవిముక్తక్షేత్రమాహాత్మ్యమును, ఓంకారేశ్వరప్రభావమును దెలుపవలయు నని వ్యాసుండు ప్రశ్నించుటయు సనత్కుమారుం

డిట్లనియెను. వ్యాసమునీంద్రా! ఈయుత్తమయోగము పరమరహస్య మైనది. పరమపదాభిలాషులగుదేవతలకుఁగూడ నీరహస్య మవేద్య మైనది. అవిముక్తక్షేత్రకథాప్రసంగముగూడ నతిదుర్లభ మైనది. ఆసత్యక్షేత్రమునం దెట్టిపాపములును వర్ధిల్లనేరవు. నేనీవిషయంబునం బార్వతీపరమేశ్వరసంవాదమును వినియుంటిని. ఎట్లువినియుంటినో యట్లే నీకుఁ జెప్పెదను.

ఒకనాఁడు పార్వతీదేవి మహాదేవుఁ డగుపరమేశ్వరునింగాంచి నాథా! ఉత్తమంబును, బరమరహస్యంబును, బవిత్రంబును నగుముక్తి పదతీర్థముంగూర్చి నాకెఱింగింపవలయు నని ప్రార్థించెను. అప్పుడు మహాదేవుండు బాగుగ నాలోచించి తనకతిప్రియకరంబు లగుపుణ్య క్షేత్రములలోఁ గాశీధామముకంటె నతితరం బగుపవిత్రతీర్థమేదియు లేకుండుట నిశ్చయించి పినాకధారియు, వరదుండును, జగన్నాథుండు నగుశివుండిట్లు చెప్పంగొడంగెను. ఏకారణముచే నాకాయవిముక్త క్షేత్ర మత్యంతసంతోషదాయకమైనదియో చెప్పెదను. ఏకాగ్రచిత్త ముతో నాకర్ణింపుము.

ఓసుందరీ! సకలసిద్ధాంతసారమును, సర్వస్మృతిసారమును, చతు ర్దశభువనసారమును, మోక్షప్రాప్తికి ముఖ్యసాధనమును, పరమగుహ్యం బును, స్వయంప్రకాశకంబు నగునాత్మజ్ఞానము శివనగరంబగుకాశీధా మమునందు సాక్షాత్కరించి యుండును. ఓసుశ్రోణీ! ఆకారణము చేతనే నేనాక్షేత్రమునందు నిత్యసన్నిహితుఁడనై యుందును. ఆకాశీ వియోగము నాకత్యంతమును మనస్తాపముం గూర్చుచుండును. ఆయవి ముక్తక్షేత్రమునందును, పంచాయతనక్షేత్రమునందును నివసించి యోంకారేశ్వరుం డగుమహాదేవుని బూజించుట యవశ్యకర్తవ్యము. అకార, ఉకార, మకారము లామహేశ్వరుని త్రివిధరూపములు.

అతఁడు త్రిలోకపాలకుండును, త్రిలోకభోక్తయు నై యుండును. ప్రభుం డగునోంకారేశ్వరుఁడు మాయాతీతుఁడు. సంయమీంద్రుల కాతని సాక్షాత్కారము లభించును. అట్టియోంకారేశ్వరు నెఱింగిన దృఢ వ్రతులగు శివభక్తులే యుత్తమోత్తములు. దేవీ! శివభక్తులు నాకుఁ బుత్త్రసమానులు. అట్టిమద్భక్త శ్రేష్ఠులు రుద్రావాసమును, బరమ పదంబు నగునయ్యవిముక్త క్షేత్రమును భక్తియుక్తులై సర్వదా సంద ర్శించుచుందురు.

ఓంకారము పరమపదార్థ మగుపరబ్రహ్మమని పండితులు ప్ర శంసించుచుందురు. ఆయోంకారేశ్వరుఁడే సద్యోజాతాదిపంచబ్రహ్మ మయుండై విరాజిల్లుచుండును. పంచాయతనసంస్థితుఁడగు పరమేశ్వ రుని సందర్శించువారు మోక్షపదప్రాప్తు లగుదురు. వేదవేదాంతపారంగు లును, పుణ్యకర్ములును, యతీంద్రులును, వేదశాస్త్రపరాయణులగుగృ హస్థులును, వారికంటెనధికులగుతీర్థోపవాసకులును, ఏకదండధరులును, త్రిదండులును, పరమహంసవ్రతులగుయతులును, శైవులును, పాశు పతులును గాపాలికులునుగూడఁ బరమపదం బగునయ్యవిముక్తక్షేత్ర మునందు శైవశాస్త్రానుసారముగా మానవవ్రతము నవలంబించి సర్వ దా నన్నుపాసించుచుందురు. ఇట్లు వివిధరూపంబులచే నన్నారాధించు మద్భక్తగణంబులయెడల నేనతిసంతుష్టుండనై వారివారియభీష్టంబుల ననుసరించి పరమం బగుమోక్షపదంబును బ్రసాదించుచుందును.

అయ్యవిముక్తక్షేత్రమునందు ముక్తిప్రదం బగుశ్మశానము సు ప్రసిద్ధంబైనది. పాశుపతదీక్షితులును, సకలదేవతలును, గంధర్వులును బవిత్రంబగునాక్షేత్రమును సేవించుచుందురు. అందు భక్తార్తినిస్తార కుం డగునవిముక్తేశ్వరుఁడు నిత్యసన్నిహితుఁడై యుండును. దేవీ! నేను నిరంతరమును గాశీధామమునందు నివసించియుండుటచేతనే దానికి జగ

ద్విఖ్యాతం బగునవిముక్తనామము గలిగినది. ఆదివ్యక్షేత్రమునందు సంసారభీరులకు సకలభయనివారణము గాఁగలదు. అచ్చట వెలసియున్న శ్రీవిశ్వనాథుని సందర్శించువారికిఁ బునర్జన్మంబు గలుగదు. సిద్ధక్షేత్రమును తపఃక్షేత్రము నగువారాణసి యెట్లు సర్వోత్కృష్టమైనదో, యట్లే యోంకారేశ్వరావిముక్తేశ్వరలింగములును సర్వోత్తమంబులైనవి. భవమోచనుం డగునవిముక్తేశ్వరుని నిత్యమును సంస్మరించుట యావశ్యకర్తవ్యము.

విశ్వేశ్వరునకు సమీపమునందున్న జ్ఞానవాపియందలిదివ్యజలంబును సందర్శించుమానవులు భూమండలంబునఁ గృతార్థు లగుదురు. అమృతోపమానంబు లగునవ్వాపీజలంబులు కలికాలంబున దేవతలకుఁ గూడ నతిదుర్లభములైనవి. ఆపుణ్యోదకంబులు సకలజీవనిస్తారకంబులును, సకలపాపవినాశకంబులునై యుండును. ఆవాపీతీరమునందుఁ బూర్వము జైగీషవ్యుఁడను మునీంద్రుఁడు క్రోధమూర్తియగుమృత్యువును బరాభవించెను. అచ్చట సంధ్యోపాసనంబు గావించినచో నక్షయం బగుబ్రహ్మస్వరూపప్రాప్తి యగును. అందొకసారి సంధ్యోపాసనంబు గావించినచో దశమాసంబులు త్రిసంధ్యలయందు నాచరించిన ఫలంబు లభించును. ఏదివ్యక్షేత్రమునందు దేవదేవుం డగువిశ్వేశ్వరుండును, నదీలలామ యగుగంగాదేవియు, ముక్తిదాయకం బగుమరణంబును సుప్రశస్తంబులై యుండునో యట్టికాశీధామమునందు నివసింపవలయునను సత్సంకల్పము గలుగనివా రెవ్వరుందురు?

—♦ హరికేశచరిత్రము. ♦—

సనత్కుమారుం డిట్లనియెను. శ్రీమంతుఁడును, బ్రహ్మనిష్ఠుఁడును, ధార్మికుండు నగుహరికేశుం డనునొకయక్షుండుగలఁడు. ఆతఁడు

యక్షగణంబులలోఁ బ్రబలప్రతాపశాలియై యుండెను. ఆతనిజన కుఁడు పూర్ణభద్రుఁడు. ఆహరికేశుఁడు జన్మించినప్పటినుండియు శివప్రీతుఁడై మహాభక్తిసంపన్నుఁడై యుండెను. శివనిష్ఠుఁడును, శివప్రణతుఁడును, శివభక్తుఁడును, శివపరాయణుఁడునగునమ్మహాత్ముఁడాసన శయన గమనావస్థానానుగమన భోజన ధావనాదిసకలసమయములయందును శివస్వరూపధ్యానతత్పరుఁడై విరాజిల్లుచుండెను.

హరికేశుం డిట్లు నిరంతరశివచింతాతత్పరుండై యుండుటం గాంచి యాతనితండ్రియగు పూర్ణభద్రుఁడు, కుమారా! నీవీరీతి నన్య భావంబున మెలంగుచున్నంతవఱకు నేను నిన్నుఁ బుత్త్రునిగా భావింపఁ జాలను. యక్షవంశమున జన్మించినవారి కిట్టిసంకల్ప ముచితముగాదు. గుహ్యకులు స్వభావముచేతనే క్రోధచిత్తులును హింసకులును మాంసభోజనులు నై యుందురు. నీవిప్పు డేధర్మము నవలంబించితివో యది నీకిప్పటికిని యుక్తమైనది గాదు. మహాత్ముల కీవిధాన మచితమైన నగుఁగాక! స్వయంభూవివేచనచే మానవు లెవ్వనిఁ బూజనీయునిగా భావించుచుందురో యాతఁడు యక్షులకును బూజ్యుండు గానేరఁడు. మఱియు నన్యాశ్రమకర్మంబులు గృహస్థుల కుచితంబులు గావు. మేమనేకవిధంబులగు సత్కర్మములం గావించి తత్ప్రభావముచే మనుష్య భావము నతిక్రమించి దేవయోనిత్వరూపంబగు శ్రేష్ఠపదంబును గాంచఁగలిగితిమి. నీవిప్పు డాచరించుచుండుసకలకర్మంబులును మానవభావవిశిష్టులైనవారి కుచితములైనవిగాని మనవంటియక్షులకుఁ దగినవి గావు. నేనట్టిధర్మప్రాప్తిని గోరువాఁడఁ గాననియు నిశ్చయముగా నెఱుంగుము. అని యిట్లు ప్రతాపవంతుండగు పూర్ణభద్రుఁడు తనకుమారుని నిందించుచు నీవతిశీఘ్రముగ నిచ్చటినుండి నీయిచ్చవచ్చినచోటికిఁ బొమ్మని యాజ్ఞాపించెను.

అనంతరము మహాత్ముండగుహరికేశుఁడు తండ్రియానతి ననుసరించి నిజగృహంబునుండి వెలువడి వారాణసీధామమునకుఁ బోయి యచ్చట నతివినిర్మలభావముతోఁ దపంబు సేయఁదొడంగెను. ఆతపస్సమయమునం దాతఁడు స్థాణువువలెను, శుష్కకాష్ఠమువలెను, శిలావిగ్రహమువలెను నిశ్చలుఁడై యుండెను. ఆతఁడు కులమును, జాతిని, వృత్తినిగూడఁ బరిత్యజించియుండెను. ధర్మాత్ముఁ డగుహరికేశుఁడు కాశీధామముం జేరి మహాయోగులందఱిచేతను నిత్యారాధితుం డగుశ్రీగోకర్ణేశ్వరునిదివ్యాలయంబునకు సమీపమున నేకాగ్రంబగుప్రసన్నచిత్తముతో నధివసించియుండి జితేంద్రియుఁడై నిశ్చలభావముతోఁ దపశ్చరణంబు గావించుచుండెను.

ఈరీతిగా వేయిసంవత్సరములు గడచిపోయెను. అప్పటికి మహాదేవుం డాతనియెడల ననురక్తుండయ్యెను. ఆతనిశరీరమంతయును వల్మీకమయమైపోయెను. చీమలు, చెదలు మొదలగునవి యాతనిశరీరమునంతను దొలిచివేయుచుండెను. నిరంతరమహాదేవచింతాపరాయణుఁడై యున్నయాతనిశరీమంతయు నీవిధముగా రక్తమాంసవివర్జితమైపోయెను. అస్థిమాత్రావశిష్టంబగునాతనిదేహము కుందేందుశంఖప్రభాసంపన్నమై విరాజిల్లుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు పార్వతీదేవి యాత్మేశ్వరుం డగుపరమేశ్వరుం గాంచి దేవరయుద్యానవనము మరలనొకసారి దర్శింపవలయునని నాకతికుతూహలముగానున్నదని ప్రార్థించుటయు, మహేశ్వరుండు తత్క్షణంబ పార్వతీసహితుఁడై బయలుదేఱి పోయి యాదేవి యడిగినప్రశ్నంబులకుఁ దగినయుత్తరంబులను బ్రసాదించుచు నుద్యానవనసౌందర్యము నామెకుఁ బ్రదర్శించుచుండెను.

వివిధంబులగుపుష్పితతరులతాగుల్మంబులును, బ్రఫుల్లకుసుమ

సంశోభితంబులగు కేతకీవృక్షములును, రమణీయం బగునాయుద్యానవనమునకు శోభాసౌరభసంపాదకములై విలసిల్లుచుండెను. అందందుఁ బరిమళించుచున్న పువ్వులచేఁ జీకటిమ్రాకులగుంపులు, నిండారఁబూచినకొండగోఁగులు, పొగడలు, అశోకములు, సురపొన్నలు మొదలగువానియందుఁ దుమ్మెదలుమూఁగి ఝుంఝుమ్మనునాదలచేఁ జెవులపండువు సేయుచుండెను. అందందు వికసించినతామరపూవులనుండి వెలువడుపుప్పొడులు దిక్కు నిచక్కనిజొక్కులపై బంగరుహారంగులఁ దుఱంగలించుచు వివిధసౌరభముల వెదచల్లుచుండ రాయంచలును, జక్కవలు, నతిరమణీయంబులగుకలకూజితంబులొనర్చుచుండెను. ఒకచోఁ బక్వజంబూఫలరసపుష్టంబులగు కలవిహంగముల సరళకంఠస్వరము లమృతమధురరసమును గురియించుచుండెను. ఒకచోఁ గలహంసకారండవాదిజలవిహంగమకులంబులును, మధుమత్తాళికులంబులును దమయుత్తమాలాపంబులచే నాప్రమోదవనరామణీయకమును ద్విగుణీకృతముఁ గావించుచుండెను. ఇంకొకచోట నప్రతిమానచారుసౌరభసంపన్నములైన పుష్పంబులచే నిండి యొప్పుచుండిన వృక్షరాజంబులచుట్టును భ్రమరాంగనాగణంబులు మూఁగుచు నాదసేయుచుండెను. వేఱొకచోటఁ బుష్పవంతంబులైన సహకారవృక్షంబులును, ప్రసూనభారంబున నేలకొఱఁగుచున్న బొట్టుగుచెట్లును కన్నులపండువు గావించుచుండెను. మఱియొకచోట సవిలాసంబుగఁ గన్నెపర్వ మొనర్చుచుఁ బాటలుపాడుచున్నవిద్యాధరచారణగణంబులును, ఆచారుగానంబుల కానందించుచుఁ దదనుసరణంబుగ నృత్యములు సలుపుచున్నయప్సరోగణంబులును నొప్పారుచుండెను. ఒక్కయెడఁ బ్రహృష్టంబు లగునానావిధపక్షికులంబులు మనోహరకూజితంబు లొనర్చుచుండ, నింకొక్కయెడఁ బ్రమత్తంబు లగుపసుపుపిట్టలు చిత్రచిత్రంబుగఁ గూయుచు వీనులకు

వింతలు గూర్చుచుండెను. వేఱొక్కయెడ, మృగేంద్రంబు లతిభయకరంబుగ నొసర్చుగర్జారవంబులకు భీతిల్లి మదపుటేనుంగులు పరువులు వాఱుచుండ, మఱియొక్కయెడ నితరమృగంబులు గుంపులుగుంపులుగఁ గూడి యొదిఁగియొదిఁగి డాఁగుకొనుచుండెను. ఒకచోఁ బ్రఫుల్లనానావిధమహోత్పలవనంబులచే మనోజ్ఞంబు లగుచున్న బహువిధకాసారంబు లాయుద్యానవనశోభకు వన్నె వెట్టుచుండెను. వేఱొకచో సాంద్రనిభుశవృక్షపంక్తి తనవినీలకాంతులచే జలధరభ్రాంతిని గూర్చుచుండ నీలకంఠనివహంబులు మనోహరారావంబులు సలుపుచు నృత్యములొనర్చుచుండెను. మఱియొకచోటఁ బ్రమోదమత్త నానావిధ విహంగమంబులు చారునినాదంబులు గావించుచు హాయిం గూర్చుచుండెను కుసుమితతరుశాఖలయందు మదమత్తద్విరేఫంబులు వ్రాలి విలీనములగుచు వింతలుగొల్పుచుండ, నవకిసలయయుక్తంబు లగు తరుశాఖలు ప్రాంతభాగంబులకుసయితము వినూత్నశోభను జేకూర్చుచు నయ్యారామరామణీయకమును బెంపొందించుచుండెను.

రమ్యతరం బగు నయ్యుద్యానవనవాటికయం దొక్కొక్కచోట ద్రాక్షాదిలతాప్రకాండములు మిక్కిలియుఁ బొదిగొని యొండొంటిని ముద్దులుగొనుచున్నవో యనునట్లు దట్టముగా నల్లుకొనియుండ, నొక్కొక్కచోట నానావిధలతామతల్లికలు మనోహరవృక్షరాజంబులను సవిలాసంబుగ నాలింగన మొనర్చుచున్నవో యనునట్లు చుట్టుకొని యలరారుచుండెను. అతివిశాలం బగు నాసుందరోద్యానంబునందు చారువిహారంబు లొనర్చుచు నలసి సొలసి యున్న కిన్నరవిలాసినీమణుల యొయ్యారంపునడకలయొప్పిదంబు లెంతయు నింపులు సంపాదించుచుండెను. అచ్చటచ్చట నాకాశము నొరయుచున్న చారుశృంగములయందు పారావతగణంబులు మురిపంబులు గులుకఁ గలధ్వానంబు

లొనర్చుచు వినోదించుచుండెను. అచ్చటచ్చట జాతి పడియున్న ధవళ ప్రసూనంబులు దేవతోద్యానంబులను హసించుచున్నవో యనునట్లు విలసిల్లుచుండెను. ఆరమణీయవనంబునం గల జలాశయంబులు వికసించుచున్నయుత్పలములచేతను, సారసములచేతను, జలపక్షులచేతను హంసరాజంబులచేతను దేవమార్గంబులను బ్రకాశింపఁజేయుచుండెను. పుష్పమాలాగళితములైన కుసుమనికరంబులు సుందరమందిరంబులకు నలంకారశోభను సమకూర్చుచున్నట్లు పెనఁగొన్న గుల్మములతో నెసంగువృక్షశాఖలు విహంగశ్రేణులతో విలసిల్లుచుండెను. పుష్పస్తబకతరళములైన నీలాశోకశాఖాగ్రములు ఝంఝుమ్మని రొదసేయుచున్న మత్తభ్రమర మధురసంగీతములచే శోభిల్లుచుండెను. పుష్పించియున్న బొట్టుగు చెట్లకొమ్మలు రాత్రికాలములయందు ప్రకాశించుచుఁ జంద్రకిరణకాంతులతో సల్లాపములు సలుపుచుండెను. వృక్షచ్ఛాయలయందు నిద్రించుచుండిన హరిణకులంబులు మేల్కాంచి యయ్యుద్యానవనంబునందున్న కుశాంకురాగ్రంబులను బ్రీతిమెయిఁ గొఱుకుచుండెను. విశాలజలాశయంబులయందలి స్వచ్ఛనీరంబులును నీరేజంబులును మరాళకులంబుల పక్షసమీరణంబులచే వికంపితంబు లగుచుండెను. ఆ కాసారతీరంబులం గల కదళీవనంబులయందు మయూరగణంబులు మనోహరంబుగ నృత్యంబులు సేయుచుండెను. మయూరగణంబుల పక్షవిక్షేపప్రవిమలకాంతులు ప్రసరించిన తావు లెల్లఁ జిత్రవిచిత్రశ్రీలచే నెసలారుచుండెను. మఱియు, ననేకస్థలంబులయందు ప్రముదితంబులగు హారీతపక్షికులంబులు నృత్యంబు లొనర్చుచుండెను. ఒకచోట హరిణనికరంబులు నిర్భయముగ విహరించుచుండెను. మఱియొకచోట విచిత్రవర్ణసహితంబు లగు కుసుమచయంబులు విలసిల్లుచుండెను. ఇంకొకచోటఁ గృష్ణవర్ణశోభిత లగు కిన్నరకామినీమణులు మధుపయు

క్తంబులును మనోహరంబులును నగుపచ్చనిచెట్లనీడల విహరించుచుండిరి. వేఱొకచో మునీంద్రులయాశ్రమములయందున్న పాదపశ్రేణు లావాసయోగ్యములై విశాలములై శాంతిప్రదములై నయ్యారామవాటిక నలంకరించుటకు సమ్మిళితములైనట్లు శోభిల్లుచుండెను. ఒక్కెడఁ బ్రఫుల్లములైన మాధవీలతామండపాభ్యంతరంబులయందు సిద్ధగణంబులు పరస్పరము నామోదించుచుండిరి. సిద్ధకామినీమణుల సువ్యక్తమధురప్రియవాక్యములచే నయ్యుద్యానవనభాగము మనోహరంబగుచుండెను. అచ్చటచ్చటఁ బ్రేంకణపుఁజెట్లపూవుగుత్తులయందు మధుపనివహంబులు గుమిగూడి విలీనములగుచుండెను. మఱియు, నరవిరిసిన కదంబపుష్పంబులు భ్రమరగణసంయోగంబున నుత్ఫుల్లములగుచుండెను. కుసుమోత్కరశాఖల నూఁచివైచుచున్న సమీరణునిచే సమీపముననున్న వెదురుపొదలు నేలనంటుచుండ నచ్చట డాఁగియున్న మృగసమూహంబులు బెదరి కొండొకనివాసంబులకుఁ బరువులెత్తుచుండెను. అతివిస్తర మేల? పరమపావనం బగు నయ్యుద్యానభూమి తన్నాశ్రయించియున్న లతావృక్షాదిప్రాణికోటులకునయితము ముక్తిని సంపాదించు ననుట నిశ్చితార్థంబ. చంద్రికిరణోజ్జ్వలంబులగు మనోహరతిలకంబులును, సిందూరకుంకుమకుసుంభసన్నిభాశోకంబులును, సువర్ణవర్ణకర్ణికారంబులును, ఫుల్లారవిందపదచిత్రితంబులగువిశాలవృక్షంబులును, నప్పవిత్రారామంబున నొప్పారుచుండెను. ఒకచోనింద్రనీలమణిసన్నిభకృష్ణవర్ణంబులును, నింకొకచో పద్మరాగమణిసంకాశరక్తవర్ణంబులును, వేఱొకచో మనోహరహీరమణిసదృశశుభ్రవర్ణంబులును నగు కుసుమరాజంబులచే నయ్యుద్యానంబు విరాజిల్లుచుండెను. పున్నాగవృక్షాగ్రములయందు గూర్చుండి పక్షిగణంబులు కలకూజితంబు లొనర్చుచుండెను. రక్తాశోకకుసుమస్తబకంబులు సమీరవశం

బునఁ గంపితము లగుచుండెను. శ్రమాపహారణుఁ డగు సమీరణుం డారమణీయవనంబున మెల్లఁగ విహరించుచుండెను. వికసితకమలవనంబుల భ్రమరంబులు నృత్యంబులు సేయుచుండెను.

ఆమనోహరసమయంబున మత్తహృష్టప్రాణిపూర్ణంబును, వివిధవిశాలతరుసంపన్నంబును నగునయ్యుద్యానవనంబునకు హిమాలయశిఖరవాసియు, సకలభువనకర్తయు, లోకనాధుండునునగుమహాదేవుండు కొందఱు గణనాయకులతో పార్వతీదేవీసహితంబుగ విచ్చేసి భవానిఁ నవలోకించి యయ్యారామరామణీయకంబు నామెకుఁ జూపుచు వర్ణించుచుండ, నద్దేవి యమ్మహాదేవున కిట్లనియెను. దేవా! పరమశోభాసంపన్నం బగు నియ్యుద్యానవనంబును బ్రహర్షంబుతో నవలోకించితిని. ఇఁక నవిముక్తక్షేత్రమాహాత్మ్యమును గ్రమ్మఱ వర్ణింపఁగోరెదను. ఈక్షేత్రమాహాత్మ్యము నింతకుమున్న గొంత వినియున్నను దానియందు నాకుఁ బరితృప్తి కలుగలేదు. కావున, నింకను విపులముగ వినఁగోరుచున్నాను. అనుటయు దేవదేవుం డిట్లు చెప్పందొడంగెను.

దేవీ! వారణాసి సుఖ్యాతరమైన మదీయపుణ్యక్షేత్రము. ఈక్షేత్రము నిఖిలప్రాణులకు నిరంతరముక్తికి హేతుభూతమైనది. ఈస్థానంబునందు మదీయలోకప్రాప్తి నిచ్ఛగించుసిద్ధగణంబులు శివచిహ్నధారులై యస్మద్వ్రతావలంబనంబుచే సంయతచిత్తులును, జితేంద్రియులునై సంతతపరమయోగాభ్యాసమును జేయుచుందురు. నానావృక్షసమాకీర్ణంబును, నానాపక్షివిరాజితంబును, కమలకల్హారాది సుమపరిశోభితసరోవరసంయుతంబును, గంధర్వాప్సరోగణసంసేవితంబును నగు నీక్షేత్రంబునందు నెల్లప్పుడు నేను నివసించియుండుటకుఁ గలకారణంబును వివరించెద నాలింపుము. ఈస్థానంబునం దుండి మామకభక్తుండును, మదర్పితచిత్తుండును, మత్సమర్పితకర్ముండును నగువాఁ డెవ్వఁడై

నను ముక్తిలాభము నందునట్లు మఱియెవ్వఁడైనను వేఱొకచోటనుండి దానిని బొందఁజాలఁడు. ఈనాదివ్యక్షేత్రము గోప్యంబులలో నతిగోప్యమైనది. బ్రహ్మాదిదేవగణంబులు ముముక్షువు లగు సిద్ధగణంబులు మాత్రమే దీని నెఱుంగుదురు. దీనిని నే నెన్నఁడును విడిచియుండకపోవుటచేతనే దీనికి ‘‘అవిముక్తక్షేత్ర’’ మను నామము గలిగినది. నైమిశారణ్యంబునఁగాని, కురుక్షేత్రంబునఁగాని, హరిద్వారంబునఁగాని, పుష్కరతీర్థంబునఁగాని స్నానావాసంబులఁ గావించువారికైనను లభింపని ముక్తిలాభము తప్పక యీక్షేత్రంబువలనఁ జేకూరుచున్నది. ఇందువలననే యిది సర్వోత్కృష్ట మని యెంచఁబడుచున్నది. ముక్తిదాయకమును, మత్పరిగృహీతంబును నగుక్షేత్ర మిదియే. తీర్థరాజం బగు ప్రయాగకంటె నీక్షేత్రమే శ్రేష్ఠమైనది. ఇందుండియే యింద్రియజిగీషువులును, మహాతపస్సంపన్నులును నగువారు పరమసిద్ధిలాభము నందఁగలుగుచున్నారు. మఱియు, నిందు నన్నుఁ జింతించి, నాయందు భక్తి కలిగి మెలంగువాఁడు యోగిజనసాధ్యం బగుజ్ఞానసంపద నందఁగలుగుచున్నాఁడు. అట్టివాఁ డీక్షేత్రంబున నివసించి నిశ్చలచిత్తముతో నన్ను ధ్యానించుచు, యోగబలంబు నంది పరమనిర్వాణపదప్రాప్తుఁ డగుచున్నాఁడు.

దేవదుర్లభంబును, పరమకైవల్యప్రాప్తిభూతంబును నగు నవ్యక్తలింగ మీక్షేత్రమునందే విరాజిల్లుచున్నది. సర్వసిద్ధాంతవేత్త లగు మునీంద్రు లన్యస్థానదుర్లభం బగుముక్తి నిందే పొందఁగలుగుచున్నారు. నేను వారికి సప్రతిమానంబగు యోగైశ్వర్యంబును, నాత్మసాయుజ్యంబును, అభిలషితస్థానంబును నిచ్చుచున్నాను. యక్షాధినాయకుం డగుకుబేరుండు మదర్పితకర్ముండై యీక్షేత్రమున నన్ను భజించినవాఁడై, గణేశ్వరత్వప్రాప్తి నందినవాఁ డయ్యెను. ఓదేవీ!

సంవర్తభావితార్థు లను మహర్షు లిందుండియే భక్తిశ్రద్ధలతో నన్నా రాధించి యథాక్రమముగ సిద్ధిలాభము నందఁగలిగిరి. ఓకమలనేత్రీ! భవిష్యద్ధర్మవక్తయు, వేదశాస్త్రవిభాజకుండును, బరాశరనందనుండును, యోగిపుంగవుండును, మహాత్ముండును, మునిశ్రేష్ఠుండును, నగువ్యాసమహర్షి యీక్షేత్రమునందే సుఖావాసము నందినవాఁ డయ్యెను. సుపవిత్రా! సమస్తఋషిగణంబులును, బ్రహ్మవిష్ణుసూర్యేంద్రాది సకలదేవతలును నిందే న న్నుపాసించుచున్నారు. ఇతరులగు సిద్ధయోగిగణంబులునునీస్థానంబునందేపచ్ఛన్నంబుగ మహావ్రతావలంబనంబుఁగావించి యనన్యమనస్కులై నిరంతరము నన్నుధ్యానించుచున్నారు. నాయనుగ్రహంబును గాంచి ముక్తికామిని కలంకారప్రాయమగు నీనగరరాజమునం దధివసింపఁగల మానవుండు తొలుతఁజాతుర్వర్ణ్యసమాజులంబును, జనపదాకీర్ణంబును నగు విశాలరాజ్యము నంది పిదప నాయందు సర్వము నర్పించి నన్నుఁ బొందఁగలుగుచున్నాఁడు.

ఓసుందరీ! ఈక్షేత్రంబున నివసించువాఁడు గృహస్థుండైనను, బ్రహ్మచారియైనను, మద్భక్తుండును, మదర్పితచిత్తుండును నై మదనుగ్రహంబున పరమదుర్లభం బగుముక్తిలాభము నందఁగలుగుచున్నాఁడు. విషయాసక్తచిత్తుండును, ధర్మత్యాగియు నైనమానవుండునయితమిచ్చట మృత్యువును బొందెనేని మరల నెన్నఁడు నిహసంసారమునఁ బ్రవేశింపఁడు. మఱియు, మాయామమతావిహీనుండును, సత్త్వగుణసంశోభితుండును, జితేంద్రియుండును నగువాఁడు విజనప్రదేశంబున నిష్ఠాపరుండై సర్వదా నన్నుఁ జింతించి సంగత్యాగియై మదీయప్రసాదంబున మోక్షపదము నందఁగలుగుచున్నాఁడు. యోగీంద్రులైనవారనేకసహస్రజన్మంబుల కైనను బొందఁజాలనిముక్తి యీమహాక్షేత్రంబున మృతిఁజెందుప్రాణికోటికిఁ గరతలామలక మగుచున్నది. దేవీ! పరమర

హాస్యం బగునీక్షేత్రమాహాత్మ్యమును సంగ్రహముగ నీ కనువదించితిని. ఇది యాశ్రమగణంబుల కశేషఫలజనకమైనది. దీని కతిరిక్త మైన రహస్యసిద్ధి యింక లేదని యెఱుంగుము. మహాయోగీంద్రులుమాత్రమే యీరహస్యము నెఱుంగుదురు. ఇదియే పరమజ్ఞానము. ఇదియే పరమకల్యాణజనకము. ఇదియే పరబ్రహ్మస్వరూపము. ఇదియే పరమపదము. గిరినందనా! ఈవారణాసీనగరము త్రిభువనసారభూతమైనది. పరమరమణీయమైనది. పరమపాపాత్ముఁడు నయిత మిందుండి పాపవిమోచనుఁ డగుచున్నాఁడు. సుందరతరులతాగుల్మాదిపరిశోభితంబును నాకతిప్రియంబును నగు నీపుణ్యక్షేత్రము స్మరించు స్వాధ్యాయనియమశూన్యుఁ డగుజ్ఞానిసయితము పరమపదప్రాప్తి నందుచున్నాఁడు. సందియములేదు. ఇట్లు చెప్పుచు నాసమయమున మహాదేవుఁడు భక్తశ్రేష్ఠుం డగుహరికేశునికి వర మనుగ్రహింపనెంచి పార్వతిం గాంచి మరలనిట్లు వచించెను. ఓవరవర్ణినీ! ఈయక్షకుమారుండు నాకుఁ బరమభక్తుండు. నిరంతరతపోనియమాదులచే నీతండు పాపవిముక్తుండై యిప్పుడు మదీయవరప్రసాదంబున కుపయుక్తుండై యున్నాఁడు.

—♦దండపాణివరప్రదానము.♦—

ఈప్రకారము జగత్పతి యగుపరమేశ్వరుండు వలికి దేవీసహితుండై హరికేశుని సమీపించెను. కల్యాణశీలుండై యున్న యాయక్షుండు దేవదేవుం గాంచి భక్తిపూర్వకంబుగఁ బ్రణతుం డయ్యెను. అంతట వృషభధ్వజుం డతనికి దివ్యచక్షువుల ననుగ్రహించుటయుఁ దత్ప్రభావంబున నయ్యక్షుండు ప్రమథగణాధినాయకుం డగు నప్పరమేశ్వరు నవలోకింపఁ గలిగినవాఁ డయ్యెను. అప్పుడు దేవదేవుం డనుగ్రహపూర్వకంబుగ నిట్లనియెను—వత్సా! త్రిలోకదుర్లభం బగు వరంబును నీకు నొసంగుచున్నాను. సంపూర్ణసౌందర్యశరీరుండవై నన్ను సమీ

పింపుము—అనుటయు వరదానకలితుం డగు నయ్యక్షుండు పూర్వరీతిఁ బరిపుష్టశరీరుండై పరమేశ్వరుని పాదమూలంబులం బడి ప్రాంజలిబద్ధమస్తకుండై యిట్లు ప్రార్థించెను—ప్రభూ! నీయందు నాకు నెల్లప్పుడు వినిశ్చలమును, వినిర్మలంబును నగు భక్తి యుండునట్లును, నక్షయ్యంబగు గాణపత్యలాభంబు నంది లోకంబున నన్నదాతనై యుండునట్లును, అవిముక్తదుత్తరవనంబున నివసించుచు నిరంతరము నిన్నుఁ జూచుకొనుచుండునట్లునాకు వరముం బ్రసాదింపుము.ఇదియే నాకోరిక. అని వేఁడుటయు నప్పుడు మహాదేవుం డిట్లు పలికెను. కుమారా! నీవు జరామరణాదిసర్వదుఃఖవిహీనుండవై నాగణంబుల కధిపతివి గమ్ము. ఎల్లరకును బూజ్యుండవై వరప్రదాత వగుము. ని న్నెవ్వరును బరాభూతునిఁ జేయఁజాలరు. నీవు యోగబలసంపన్నుండవును, నైశ్వర్యయుక్తుండవును నై లోకంబున నన్నదాతవును, క్షేత్రపాలకుండవును గమ్ము. నీవు మహాబలపరాక్రమవంతుండవై నాకును బ్రహ్మకును బ్రియపాత్రుండ వగుము. యక్షేశ్వరుండవును, దండపాణివియు,మహాయోగివియు నగుదువుగాక! ఉద్భ్రముఁడు, సంభ్రముఁడు నను ప్రమథు లిరువురును నీకు సేవకులై నీయాజ్ఞను బరిపాలించుచుందురు—ఇట్లనుగ్రహించి మహాదేవుండు రుద్రావాసంబునకుఁ జనియెను.

—♦ ఓంకారేశ్వరవర్ణనము. ♦—

అనంతరము సనత్కుమారుండు వ్యాసమహర్షితో నిట్లు చెప్పెను. ద్విజశ్రేష్ఠా! పూర్వకల్పంబున వారాణసీనగరోత్తరభాగంబునఁ బంచాయతనం బనుతీర్థరాజం బొకండు గలదు. తత్తీర్థవృత్తాంత మత్యంతాశ్చర్యకర మైనది. దాని నిప్పుడు నీకుఁ జెప్పుచున్నాను. అనన్యస్వాంతుండవై యాకర్ణింపుము—అత్యుత్తమం బగునాపంచాయతనదివ్యతీర్థంబునఁ బూర్వ మొకమండూకి (ఆఁడుకప్ప),యోంకారేశ్వ

తసన్నిధిని జేరి సుకృతవశంబునఁ దత్స్వామినిర్మాల్యమును భక్షించెను. కొన్నివాళ్ళకుఁ బిదప నామండూకి కాలవశంబునఁ బంచత్వంబుం గాంచి, యనంతరము జాతిస్మరణముతో సుమనసుఁడను నొకరాజునకుఁ గూఁతురై జన్మించెను. కాలక్రమంబున నామె సంప్రాప్తయౌవన యగుటంజేసి, యామెతండ్రి యగు సుమనోమహారాజు తనకూఁతును దగినవరున కిచ్చి వివాహంబుం గావింపఁ బ్రయత్నములు సలిపెను. పూర్వజ్ఞానము గల యారాజకుమారి తనతండ్రియభిప్రాయము నెఱింగి తనకు వివాహంబు వలదని వారించి, వైరాగ్యబుద్ధితో వారాణసీపురంబున కరిగి యచ్చటి పంచాయతనస్థవాసి యగు నోంకారేశ్వరమహాదేవుని సందర్శించుచు నచ్చటనే స్థిరనివాసము నేర్పఱచుకొనియెను. అనంతరము కొంతకాలమున కామె కాలమునకు లోనై భౌతికశరీరమును ద్యజించి శివసాయుజ్యము నందెను. బ్రహ్మోత్తమా! మండూకి (అనఁగ కప్ప) యయ్యు నప్పుణ్యతీర్థనివాసమహిమచే నెట్టిపరమపదమును బొందినదో కనుఁగొనుము! పూర్వకాలమున నీస్థానమున జరిగిన యీచిత్రవృత్తాంతమును నీకుఁ జెప్పితిని. ఈదివ్యతీర్థమున ఘటిల్లిన వేఱొకవిశేషమును జెప్పెదను వినుము—

పూర్వము పరమధార్మికుం డగు ప్రతాపముకుటుం డనుమహారాజొకఁ డుండెను. ఆతనికిఁ గల పుత్త్రులలో జ్యేష్ఠకుమారుఁడు మిక్కిలి ధర్మాత్ముం డగుటయేకాక బ్రహ్మజ్ఞానియు నై యుండెను. కొంతకాల మైనతరువాత మహారాజు తనపుత్త్రునిం గాంచి యిట్లనియెను—పుత్త్రా! వివాహయోగ్యమైన ప్రాయము గలవాఁడ వైతివి గావున దారగ్రహణ మొనరింపుము. అట్లు సేయుదు వేని నేనీసంసారభారమునుండి విముక్తుండనై యత్యంతసౌఖ్యమును గాంచఁగలను. తండ్రి యిట్లు పలుకఁగాఁ గుమారుఁడు వినీతుఁడై "తండ్రీ! ఈవిష

యమునమాత్రము నేను నీయాజ్ఞను జెల్లింపఁజాల నని చెప్పుటకు మిక్కిలియుఁ జింతించుచున్నాను.” అని వాక్రుచ్చెను. అప్పుడు రాజు “ వత్సా! నేను నీకు జనకుఁడనే కాక ప్రభువునుగూడ నై యున్నాను. కావున నాయాజ్ఞను బ్రతిపాలింపుము. నీ వవివాహితుఁడవై నాకుల మెల్లఁ జిరకాలనరకనిమగ్న మగునట్లు చేయకుము.” అని వచించెను.

జనకునియీయాదేశమును విని బలవంతుఁ డైన యానృపకుమారుఁడు, పూర్వజన్మానుభూతము లైన సాంసారికవైచిత్ర్యము లెల్ల స్మరణకు రాఁగాఁ, దనతండ్రి కిరీటిని విన్నవించెను—పితా! తత్త్వజ్ఞానాత్మకంబులును, సహేతుకంబులును నగు నావాక్యంబులను సావధానచిత్తుండవై యాలింపుము. నేను శతసహస్రజన్మంబులను ధరించితిని. సారెసారెకు జరాదుఃఖము ననుభవించుచు మృత్యుముఖమునఁ జొచ్చుచు నుంటిని. మఱియు శతసహస్రవారంబులు దారపుత్రాదులతోడి సంయోగసుఖంబులను వియోగదుఃఖంబులను ననుభవించి యనుభవించి వేసరితిని. తండ్రీ! తృణ, గుల్మ, లతా, వృక్ష, సరీసృప, పక్షి, మృగ, పశ్వాది నానాయోనులయందు స్త్రీపురుషాకారంబు లగుజన్మములు నాచేఁ బరిగ్రహింపఁబడినవి. ఇంకను దేవ, కిన్నర, గంధర్వ, విద్యాధర, మహోరగ, యక్ష, రాక్షస, గుహ్యక, దాన, వాప్సరోజన్మంబులను నయిత మెత్తితిని. ఏమిలాభము? ప్రతిసృష్టియందును, సృష్టింపఁబడుచుఁ బ్రతికల్పంబునందును సంహరింపఁబడుచు హద్దులేని జన్మపరంపరలను గాంచుచుంటిని. జనకా! దారపరిగ్రహణము కేవలము విడంబనామాత్రము. కేవలము రాజత్వాభిమానమును విడిచినంతమాత్రమున నెన్నఁడును ముక్తి కలుగనేరదు. సర్వదా, శరీరాభిమానత్యాగంబే మోక్షకారణం బగుచున్నది. రాజ

త్వాభిమానవిముక్తుండయ్యును, శరీరధర్మముతోఁడి సుఖంబుల ననుభవించు మానవునిసుఖంబు శత్రుసుఖంబు వంటిసుఖంబు మాత్రమే యగుచున్నది—అనఁగా సౌఖ్యంబని భావింపఁబడుదుఃఖంబే యగుచున్నది. మృత్యువును, నాశనములేనిదియు, ఎల్లప్పుడు నుండునదియు నగు బ్రహ్మమును ద్వ్యక్షరములు.* కావున నోరాజా! బ్రహ్మమృత్యువులు రెండును వ్యవస్థితములే యని నేను భావించుచున్నాను. తండ్రీ! ఇవి యిట్టి వని భూతకోటులచే నెఱుంగంబడనివై వానికి నిత్యత్వ పంచత్వముల నాపాదించుచున్నవి. ఎవ్వఁడు సర్వభూతశరీరభేదనముం గావించియు నహింసను ప్రతిపాదించుచున్నాఁడో, స్థావరజంగమాత్మకంబగు నీసమస్తప్రపంచంబునందును మెలంగుచుండియు దేనియందును మమకారము లేక వర్తించుచున్నాఁడో—అట్లుగాదేని, యెవ్వఁడు వనమధ్యమున సంతతము నివసించుచుఁ గందమూలఫలాదులచే జీవనధారణము నొనర్చుచున్నాఁడో, అట్టివానికి రాజ్యముండుటవలనిప్రయోజనంబేమి? ఇంద్రియంబుల ననుకరించు స్వభావము గలవాఁడై మమత్వమును జెందువాఁడు మృత్యుదేవతకు వశీభూతుం డగుచున్నాఁడు. పరబ్రహ్మసాక్షాత్కారంబునుం గాంచునాతఁడు మృత్యుభయమునుండి పరిరక్షింపఁబడుచున్నాఁడు. కామసంబద్ధుఁ డగువాఁడు కామసంబద్ధమగు లోకముచేఁ బ్రశంసింపఁబడుచుండును. కొందఱు కోరికలను మనంబులం దిడికొని వేదాధ్యయనహోమంబులను, దీర్ఘయాత్రాసంసేవనంబువలనను దపస్సు గావించుచుందురు. మఱికొందఱు మోక్షార్థులై దాని(ముక్తి)కొఱకే యట్టితపంబు నొనరించుచుందురు.

---

*మృత్యు—బ్రహ్మ శబ్దములు రెండును రెండేసి యక్షరములు గలవి గావున ద్వ్యక్షరములని చెప్పంబడుచున్నవి. అందు మృత్యు వనఁగా సంసారము. బ్రహ్మము అక్షరమును, శాశ్వతమును.

కావున నో తండ్రీ! ఉత్తమంబైన పంచాయతనతీర్థంబునే యచ్చటి యీశ్వరునే నిత్యమును నే నభిలషింతును. పవిత్రమైన యీయవిముక్తమహాక్షేత్రంబున సంవసించు నోంకారేశ్వరునియారాధనంబుకొఱకు నేనిప్పుడు పావనపంచాయతనతీర్థంబునకుఁ బోయి యీదేవదేవుని సంసేవించుచు నచ్చట నివసింతును. పితా! ఇప్పటికిఁ గల నావెనుకటి జన్మంబులను, అందు నా కతీర్థరాజంబువలనఁ దెలియవచ్చిన మాహాత్మ్యవిశేషంబులను నీ కిప్పుడు వివరించి చెప్పుచున్నాను వినుము—

బ్రాహ్మణ, గంధర్వ, నాగ, విద్యాధర, ఖగ, కిన్నరాది కులంబులయందు నే ననేకజన్మంబుల నెత్తి యెత్తి పిమ్మట విశుద్ధమైన వైశ్యకులంబునందు పుట్టితిని. ఆజన్మమున మంగళప్రదాయకుండును, సౌఖ్యనిధానుండును, త్రిపురవైరియు నగు మహాదేవునియందు నాకు నచంచలమైన భక్తి గుదిరెను. అంతట నేను వ్రతోపవాసాదినియమంబులచేతను, అనేకవిధస్తోత్రంబులచేతను త్రిశూలధారి యగు నద్దేవదేవుని సంతుష్టస్వాంతునిఁ గావించితిని. ఆవైశ్యజన్మంబుననే నే నొనర్చిన సభక్తికం బగు బహుకాలతీర్థపర్యటనంబునం దొకప్పుడు పుణ్యావశంబున నతిరహస్యం బగు నయ్యవిముక్తక్షేత్రంబునం బ్రవేశించు నదృష్టము నాకు సంప్రాప్తం బయ్యెను. ఆక్షేత్రంబునఁ బంచాయతనతీర్థవాసి యగు నోంకారేశ్వరుని సందర్శించి యీదేవదేవుని యెదుట నున్న రుద్రావాసంబున నుపస్థితుండనై, వైశాఖమాసంబున రాత్రులయందు జాగరణంబులు సలుపుచు నాస్వామిని భజించితిని. అప్పటి నాసంసేవనంబుల నెల్ల దేవ కిన్నర గంధర్వాదులు పరికించి యాశ్చర్యమగ్నమానసు లగుచుండిరి. జనకా! ఆనాపుణ్యకర్మంబుచేతనే శుభనిధానం బగు భవదీయగేహంబున జనియించు మహాభాగ్యంబు నాకు లభియించెను.

తండ్రీ! ఇప్పుడు బద్ధాంజలినై నీయనుమతిని వేఁడుకొనుచున్నాను. శీఘ్రముగా నే నవిముక్తక్షేత్రంబునకుఁ బోవున ట్లనుగ్రహింపుము. ఓంకారదేవదేవునిమహాప్రసాదంబుచేతనే దేవతలకైనను లభింపరాని యీయుత్కృష్టజ్ఞానంబు నాకుఁ బొడమినది. సంసారంబునందుండినను నేను మాయాతీతుండగు నప్పరమాత్మునియందే దృష్టిగలిగియుందును. కావున నవిముక్తక్షేత్రంబునఁ బంచాయతనతీర్థంబున నున్ననిశ్చలబ్రహ్మం బగు నోంకారేశ్వరుని సందర్శింప నిప్పుడ నేఁ బరుగుచున్నాను; ఆపుణ్యక్షేత్రంబున నాస్వామి నొక్కసారి సందర్శించినవానికిఁ బునర్జన్మంబు లేదు గావున నేను నచ్చటికిఁ బోయి యామహాదేవుని వీక్షించి జన్మరహితుండ నయ్యెదను.

కుమారుం డిట్లు పలుకఁగా మహారాజిట్లనియెను — పుణ్యాత్ముండ వైన యోపుత్త్రకా! నీవేపుణ్యతీర్థంబునకుఁ బోవుదువో నేను నాతీర్థంబునకే వచ్చెదను. జాతిస్మరణవశంబున నామనంబును నచ్చటికే నేఁగ నుద్విగ్నమగుచున్నది. సంసారమునం దుండినను, బురుషునకు సర్వదా వైరాగ్యంబు సముత్పన్నంబగుచున్నది — వంశానుగతికంబో, జాతిమూలకంబో యైనవృత్తిని బరిత్యజించి ప్రియంబులును, నప్రియంబులును నగువస్తువులు మాయావిశిష్టంబు లని యెఱింగి, వానియందు మమత్వాహంకారంబు లుడిగి సకలకర్మంబుల నుజ్జగించి యాత్మశుద్ధిధారణచేఁ గర్మసన్న్యాసినై యిమ్మట నవిముక్తక్షేత్రంబును జేరఁగలుగుచున్నాఁడు. అమ్మహాక్షేత్రంబున కరుగువానికి నితరపుణ్యక్షేత్రంబుతోఁ బనిలేదు. అవిముక్తక్షేత్రోపాసకు లాత్మత్యాగం బొనర్చి శాంతి (శమ) దాంతి (దమ) క్షాంతు (క్షమ) లును, నింద్రియజయంబును గలిగి తమయం దాత్మను నిలుపుకొనఁగలుగుటయే కాక, సర్వభూతంబులయందును నోంకారేశ్వరునిఁ, దమయాత్మలనుగూడ సంద

ర్శింపఁగలుగుదురు. అమ్మహాక్షేత్రంబునందు ‘అవ్యక్తలింగు’ లను పేరం బరగు సన్న్యాసులు శతరుద్రీయస్తోత్రంబులచే దేవోపాసనలఁ గావించుచుఁ బరమందు పరమపదంబు నంది యోంకారేశ్వరునియందు ప్రవేశించి లీన మగుచున్నారు. సమస్తవేదంబులు నేమహాపదంబును బోధించుచున్నవో, తపశ్శాలు లేమహాపదంబు నభివర్ణించుచుందురో, బ్రహ్మచర్యవ్రతావలంబు లేమహాపదంబు నభిలషించుచుందురో యుట్టిపరమపదం బవిముక్తక్షేత్రంబునందు నిహితంబై యున్నయది.

ఈరీతిం బలికి యమ్మహారాజు నిండుమనంబుతో నోంకారేశ్వరుని సంస్మరించి, కనిష్ఠపుత్రుని రాజ్యాభిషిక్తుం గావించి తనపూర్వచారిత్రముం దలపోసి వైరాగ్యంబు నొందినవాఁ డయ్యెను. మఱియు నాతఁడు పంచాయతనసంస్థితుండును, పరబ్రహ్మంబును నగు నోంకారదేవునిఁ బలుమాఱు మనఃపూర్వకంబుగ సంస్మరించి వారాణసీనగరంబునకు నరిగి యచ్చట నోంకారేశ్వరునిఁ బొందినవాఁడయ్యెను.

ఇట్లు చెప్పి సనత్కుమారుండు మరల నిట్లు పలికెను.

వ్యాసమునీంద్రా! ఈరాజు పూర్వజన్మంబున ఖగశ్రేష్ఠంబగు కపోతంబై యుండి పంచాయతనక్షేత్రంబున నివసించుచు నచ్చటి యోంకారేశ్వరునికి నిత్యంబును బ్రదక్షిణంబు లొనర్చుచు నాదేవదేవుని స్తుతులతో సేవించుచుఁ బిమ్మటఁ బంచత్వంబు నొంది యీజన్మంబున రాజై జనియించెను. ఇప్పుడారాజును, నాతనికుమారుండును దేవదేవుం డైనయోంకారేశ్వరుని సంస్తవాదిరూపంబుల నారాధించి పుణ్యులైరి.

సనత్కుమారుని యీవాక్యంబుల నాకర్ణించి కృష్ణద్వైపాయనుండు విస్మయచిత్తుండై ‘‘మహాభాగా! ఎవ్వనినామోచ్చారణంబుఁ గావించినంతమాత్రంబున నాత్మవికాసంబు గలుగుచున్నదో యాత్రి

శూలధారియైనపరమేశ్వరునియనుగ్రహంబుఁ బొందుట కారాజును, దత్పుత్త్రుండును నేట్టివ్రతం బాచరించిరో యానతిమ్ము." అని యడుగుటయు సనత్కుమారుం డిట్లని చెప్పందొడంగెను.

ఋషిసత్తమా! అతిగోప్యంబు, నుత్తమంబు నగు రహస్యయోగంబు వక్కాణించెదనాకర్ణింపుము—"అవిముక్తక్షేత్రంబున నున్నమృత్యుంజయుండు పరమయోగస్వరూపుండును, శివశబ్దవాచ్యుండును, అనాద్యుండును, అజుండును, అవ్యయుండును నై యున్నాఁడు. ఆతఁడు స్వయంభువు; అనిర్దిష్టస్వరూపుఁడు, సకలకారణుండు; సృష్టిప్రళయస్వభావుండు, అచింత్యుఁడు, అచలుఁడు, మోక్షస్వరూపుఁడు, భయపాపరహితుండు; నిత్యుండు, నిరపేక్షుండు, అనాశ్రియుండు; నిస్తుతి; నిర్నమస్కారుండు, నిస్సంగుండు, నిరుపద్రవుఁడు; నిరంజనుఁడు; నిరుద్భవుండు; నిరాలంబుఁడు, నిర్మలుండు, నిరుపమానుండు; అపవర్గస్వరూపుండు; అవిజ్ఞేయుండు; అనామయుండు; అనిత్యుండు, సర్వకారణుండు, అలగ్నుండు, సర్వతోముఖుండు; అనాసక్తుండు, మహాదేవుండు; విశుద్ధుండు; జ్ఞాననిర్మలుండు; మంగళమూర్తి; అతీంద్రియుండు; ఆచారవివర్జితుండు; కాలాతీతుండు; మోక్షాధారభూతుండు; భయశంకావిరహితుండు; జ్ఞానపతితవిమోచనుండు.

"అమ్మహాత్ముండు స్థావరంబులకంటె భిన్నుండై, యనంతనామంబులు గలిగి చైతన్యతేజస్స్వరూపుండై యొప్పుచున్నాఁడు. ఆతఁడు జీవులశరీరంబులయందు ప్రవేశించి జ్ఞానదీపకుండై వెలుంగుచున్నాఁడు. మఱియు నుపదేశంబులవలన విదితుం డయ్యు నతండు విలుప్తవిగ్రహుండై, యాత్మజ్ఞానంబుచేతనే తెలియఁదగినవాఁ డగుచున్నాఁడు. జ్ఞానమే యాతనిదృష్టియైయున్నది. ఆతనికి సంగము లేదు. ఆతండు వెలుపలను లోపలను నిండియున్నాఁడు, చిత్యావకాశశూన్యుండు;

శ్రావ్యాశ్రావ్యాదిపదార్థంబుల కగోచరుండు, ఏకకాలమునందే యాతండు విస్తరించి వ్యాపించినవాఁడయ్యెను. అతండు దేవాదిదేవుండు, దేవతాస్వరూపుండు. యుక్తిప్రమాణంబులకు నధీనుం డగువాఁడుగాఁడు, ఆతనిం గూర్చి మనమెన్నికల్పనలను జేసికొన్నను వానికన్నిటికి నాతఁడు వేఱుపడియే యుండును. కేవలచింతావృత్తిమాత్రమే యాతండు గోచరుం డగుచున్నాఁడు. ఆకాశమువలెనే మిక్కిలి విశాలమైనవాఁడు. ఆతనికిఁ గంపముగాని విషయసుఖదర్శనములుగాని లేవు. ఆతఁడు సమస్తలోకప్రసిద్ధమార్గంబులయందును నవస్థితుండై విలసిల్లుచుండును. అన్నియుఁ దానే యై యుండియు నాకారరహితుండై యున్నాఁడు. ఆతఁడు స్వభావరూపుండు గావునఁ జింతనలచేతనే గ్రహింపఁదగినవాఁడై యున్నాఁడు. జగంబులకెల్ల నతీతుండగు నాతఁడు సలక్షణుండై యొప్పుచుండును. వాగ్వాదంబుల కాతండు బహిర్భూతుండై యుండును. పంచభూతములకును నధీనము గాని పరమాత్మ యయ్యు, జ్ఞానగమ్యుఁడై, సకలపదార్థములకును ముఖ్యకారణుఁడగుచున్నాఁడు. సమస్తస్థానంబులయందునిండియుండియు నాతండెవ్వనిచేతను స్పృశింపఁబడనివాఁడై యున్నాఁడు. మఱియు నాతఁడు శబ్దాదిగుణసమూహమునకుఁ గారణుఁడగుటయేకాక శబ్దబ్రహ్మమయుండునై యున్నాఁడు. శమదమాది సమస్తగుణంబులకు నాశ్రయభూతుండైనవాఁ డాతఁ డొక్కఁడే. ఆ దేవునిస్వరూపంబు శబ్దంబుల కతిరిక్తంబైనది. నిఖిలజ్ఞానంబులకును నాతండే యాశ్రయుఁడు. ఆతం డనాది; అచ్యుతుండు; దివ్యుండు; ప్రమాణంబులకు గోచరుం డగువాఁడు గాఁడు. ఊర్ధ్వాధోభాగంబుల నెల్ల నాతండు నిండి వర్తించుచున్నాఁడు. నిత్యుండయ్యు నాతండు జీవస్వరూపుండై యున్నాఁడు. ఆతఁడు హేతుసంస్థితుండై యుండును. దశేంద్రియమనోహంకారంబుల నడుమ నుపస్థితుం డయ్యు నామహా

త్ముండు సకలేంద్రియంబులకును గ్రహింపరానివాఁడై యున్నవాఁడు. ఆతం డాత్మయేయింద్రియములుగాఁ గలవాఁడు. ఆతనియాత్మ నిష్కలంకమైనది. ఆతండు సర్వలోకవిభుండు; స్వరాదివ్యంజనంబు లాతని వర్ణింపనేరవు. శ్వేతరక్తాదులలో నొక్కవర్ణంబును నాతనికి లేదు. అమ్మహేశ్వరుండు వాచామగోచరుండు; ఓంకారమునకుసైత మందనిరూపము గలవాఁడు. తర్కంబుల కాతఁ డందఁడు. సృష్టి కతీతుఁడు— ఉత్పత్తిసమయంబు లాతనికి లేవు.

ఆతఁడు నిశ్శంకుఁడు; నిశ్చలుఁడు; సౌమ్యుఁడు; దేహాతీతుఁడు; పరాత్పరుఁడు. పంచభూతములకును నందరానివాఁ డాతఁడే. సర్వదా నిశ్చలభావముతో నాతఁ డేకాకృతినై యొప్పుచుండును. ఆతం డచింత్యుండు; పరముండు, సూక్ష్మాతిసూక్ష్ముండు. చతుర్వేదములు, నాగమములు నాతనిఁ బ్రతిపాదించుచున్నవి. ఆతఁడు యథార్థజ్ఞానమున కుసయిత మందనివాఁడు. ఆతఁ డనంతములైన నేత్రములతో నెప్పుడును మనలను బరీక్షించుచుండును. ఆతనికి నెన్నఁడును నాశములేదు. ఆతఁడు కామరూపి. సకలభూతంబులయుత్పత్తికిని, సర్వబీజసంభూతికిని గారణభూతుఁ డాతండే. సమస్తబ్రహ్మాండములయందు నాతఁడు వ్యాపించియున్నవాఁడు. ఆతఁడు కామస్వరూపుఁడు; అచ్యుతుఁడు; పరముఁడు. ఆతఁడేమహాత్ము. స్థూలసూక్ష్మవిభాగి యైన యాతఁడే ప్రకృతియుఁ బురుషుండు నై సనాతనుండై యున్నవాఁడు. ఆమహాత్ముఁ డాదిమధ్యాంతరహితుఁడు. ఆతనికి నాదియు, వినాశంబును లేవు. ఆతఁడు భూతస్వరూపుఁడు; మహాకాయుండు; శుభదాయకుండు; మోక్షప్రదాత; యోగక్రియావినిర్ముక్తుండు; మృత్యుంజయుండు; మహేశ్వరుండు; ఉపాధిశూన్యుండు; సూర్యసన్నిభుండు; అవ్యక్తుండు; నిత్యుండు; కేవలుండు; అద్వయుండు. ఆతనికంటె నన్యంబగు తేజం

బు లేదు. అవిముక్తక్షేత్రనివాసుఁడు; సర్వేశ్వర ఖ్యుండు; భగవంతుండు; ఈశానుండు, ఓంకారదేవుండు, సర్వమంగళప్రదాయకుండు; దేవదేవుండు; మహాదేవుండు; పంచవక్త్రుండు; వృషభధ్వజుండు; సదాశివుండు; విరూపాక్షుండు; త్రిశూలహస్తుండు, జటాధరుండు—*

ఇత్యాదిమహామహిమలతోడి దివ్యగుణనామంబులు గలమంగళస్వరూపుఁ డగుమహాదేవుని హృత్పద్మకోశమధ్యంబున నిలిపికొని నమస్కరించుచున్నాను. సకలజంతుజాలంబులయుత్పత్తికిని హేతుభూతుండును, వారాణసీనగరసంస్థితుండును, పరమపదుండును నగునోంకారదేవునికిఁ బునఃపునఃప్రణామంబు లాచరించుచున్నాను.”

సనత్కుమారుండు మరలఁ జెప్పుచున్నాఁడు.

వ్యాసమునీంద్రా! పైప్రకారమోంకారదేవసంస్తవముం గావించి యాస్తోత్రపఠనాంతంబున నాప్రతాపముకుటమహారాజును ఆతనిపుత్రుఁడును కోటిసూర్యాగ్నిప్రభాభాసమానం బగుదివ్యతేజముం గాంచినవారయిరి. అవిముక్తమహాక్షేత్రంబున సంయతాత్ములై, యోంకారనిర్దిష్టమైన శంభుస్తవమును బఠించుపుణ్యాత్ములకు దివ్యసిద్ధి (ముక్తి) యెల్లప్పుడు నఱచేతిలో నుండును. ఈస్తవమును శ్రద్ధాభక్తులతో బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులలో నెవ్వండు పఠించునో యాతండు సమస్తపాపంబులనుండియు ముక్తుండై ముక్తిగ్రహణంబు నొనర్చుచున్నాఁడు.

---

* ఈస్తోత్రమునకు మొదటనున్న ‘మృత్యుంజయ’ శబ్దము మొదలుగ నాదేవదేవునినామము లెల్ల మూలమున ద్వితీయైకవచనములుగా నున్నవి అయినను, భాషాసంప్రదాయమునుబట్టి పఠనసౌకర్యార్థము వై భగవద్విశేషణంబు లన్నియుఁ బ్రథమైకవచనంబులుగా వ్రాయఁబడియె.

శ్రుతి—"వే దాహ మేతం పురుషం మహాన్త
మాదిత్యవర్ణం తమసః పరస్తాత్
తమేవ విదిత్వా న భవేన్మృత్యు
ర్నాన్యః పన్థా విద్యతే హి జనానామ్."

"సూర్యసమతేజోవిరాజితుం డగు మహాపురుషుని నేను దెలిసికొంటిని. ఆమహాత్మునే తెలిసికొన్నయెడల నిఁక సంసారబంధమే లేదు. ఇంతకంటె నీమాయాప్రపంచమునుండి యుద్ధరింపఁబడుటకు మఱియొక యుపాయమును లేదు."

ఎవ్వఁడు సహస్ర, లక్ష, కోటిముఖంబులు గలిగి ప్రకాశించుచున్నాఁడో, అట్టియోంకారదేవుని వర్ణించుట యెవ్వరికిని సాధ్యంబుగాదు. అయిన నిప్పుడు నాయోపినంతవఱకు నోంకారేశ్వరునిమాహాత్మ్యంబు నభివర్ణించి చెప్పితిని. మునీంద్రా! సహస్రముఖంబులు గలవార లసంఖ్యాకులు చేరియు నామహాదేవునింగూర్చి సులభముగ వచించుటకు శక్తులు గారుసుమా!

శ్రీదేవాయ నమః

పురాణగ్రంథమాలిక,

పిఠాపురము.

మనపూర్వులమహామహిమలు, సత్యచారిత్రములు, భగవన్మహిమలు, ధర్మములు, నీతులు, నీతిబోధకములగు కథలు, దేవతల చరిత్రములు, రాక్షసులచర్యలు, భగవంతునియనుగ్రహము—ఇత్యాదివిషయములతో నిండియున్న యిహపరసాధకంబు లగుమనపురాణోపపురాణములు, ఇతిహాసములు మొదలగునుత్తమగ్రంథములను సులభశైలిని వచనరూపమున నాంధ్రీకరించి యాంధ్రమహాజనులహస్తముల కందించుటకై స్థాపింపఁబడినది. రెండేసినెలల కొక్కొక్కసంపుటము చొప్పున 200—250 పుటలవంతున డెమ్మీసైజునఁ బ్రకటింపఁబడుచుండును. ఆంధ్రమహాజను లందఱును మాయుద్యమమునకుఁ దోడ్పడి గీర్వాణభాషయందున్నయీమహాపురాణాదులను మనతెలుఁగువారికిఁ దెలియునట్లుగా నొనర్చుచున్నమాకుఁ బ్రోత్సాహముఁ గలిగింతురుగావుత మని వేడికొనుచున్నాము.

నిబంధనలు.

(1) ఇందుఁ జందాదారులగువారు రు 0-4-0 ప్రవేశరుసుము చెల్లింపవలయును.

(2) చందాదారులకు పోస్టేజీ మనీఆర్డరుకర్చులు మేమే భరించి ఒక్కొక్కసంపుట మొకరూపాయకుమాత్రమే పంపుచుందుము. (చందాదారులుకానివారికి పోస్టేజిగాక రు 1-8-0 లు.)

(3) నైజాము ఇలాకాగ్రామములవారికి వి. పి. సౌకర్యములు లేవు కా

…ట్టివారు ప్రవేశరుసుముగా రు 5-4-0 ముందుగాఁ జెల్లించినచో వారికి ఆయా సంపుటములు ప్రకటింపఁబడినప్పుడెల్ల రిజష్టర్డుబుక్కు-పోస్టుగాఁ బంపుచుందుము.

సహాయులు.

సంవత్సరమునకు ముందుగ రు 10 లు నొసఁగువారిని సహాయులుగాఁ జేర్చుకొని వారినామములను సహాయులపట్టికలోఁ బ్రకటించుచు వత్సరమున వెలువడు ఆయా సంపుటములను రిజష్టర్డుపార్సెలుగాఁ బంపుచుందుము.

పోషకులు.

ఒక్కసారిగ నూటపదియాఱురూప్యములు గ్రంథమాలికకు విరాళముగ నొసఁగిన భాషాభిమానులను పోషకులుగాఁ జేర్చుకొని వారి నామములను గ్రంథములలోఁ బ్రకటించుచు నీగ్రంథమాలికనుండి వెలువడు గ్రంథములన్నిటి నెప్పటి కప్పుడు అన్ రిజష్టర్డుపార్సెలుగాఁ బంపుచుందుము.

రాజపోషకులు.

ఒక్కసారిగ రెండునూటపదార్లనుగాని అంతకుఁబైఁగ వారియుదారహృదయమునకుఁ దోఁచునంతటి ద్రవ్యముఁగాని దయచేయు శ్రీమంతులను జమీందారులను రాజపోషకులుగాఁ జేర్చుకొని యిందు ప్రకటింపఁబడు గ్రంథములన్నిటిని రిజష్టర్డుబుక్కుపోస్టుగా నందించుచుందుము.

పురాణగ్రంథమాలిక,
పిఠాపురము.
తూర్పుగోదావరిజిల్లా. } నడకుదుటి వీరరాజు పంతులు
సంపాదకుఁడు.

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము చందాదారులను, వారుకోరినయెడల, అడ్మిషన్ ఫీ 0-4-0 అక్కఱలేకుండ, చందాదారులుగాఁ జేర్చుకొని మాగ్రంథములు వెడలినప్పుడెల్ల ఒక్కొక్కరూపాయునకు వి. పి. గాఁ బంపుదుము.

ముందురాఁబోవు పుష్పము.

శివపురాణము.

(నాలుగవ సంపుటము.)

సనత్కుమారసంహిత—చివరభాగము.

వాయవీయసంహిత—పూర్వభాగము.

వాయవీయసంహితలోని కథలు, నీతులు, ధర్మములు మొదలగునవి యద్భుతములు! అపూర్వములు!! శ్రీకృష్ణుఁడు సంతానము కొఱకు శివునింగూర్చి తపస్సుచేయుట; శివుఁడు ప్రత్యక్షమగుట ... దక్షునియజ్ఞము ... వీరభద్రజననము; శుంభనిశుంభవధ కొఱకు పార్వతీదేవి యవతారము. . . మొదలగునవి గలవు. ౧౯–౨౬ సం. మేనెల ౨౦ తేదీని వెలువడును.

చందాదారులకు పోష్టేజిమనీఆర్డరుఖర్చులు సహా రు 1-0-0

ఇతరులకు ఖర్చులుగాక రు 1-8-0

పురాణగ్రంథమాలికా కార్యస్థానము, విడాఛ్ప్రాపు.

శ్రీ ఆదిశైవ పత్రిక.

శైవసంఘాభివృద్ధికై శివాగమములును, శైవపురాణాదులందు వర్ణింపఁబడిన శైవధర్మములును, ఉపనిషత్సారభూతములయిన శైవ రహస్యములును, శివభక్తులచరితములును, సనాతనధర్మములు మొదలగుసద్విషయములు తేటతెల్లముగ ప్రచురించెడి మాసపత్రిక. డెమ్మీ సైజున గ్లేజుకాగితములపై చక్కగా ముద్రింపఁబడుచున్నది. ప్రతి వారును చందాదారులుగాఁజేరి శివధర్మోద్ధరణ మొనర్ప ప్రార్థించుచున్నారము. సంవత్సరముచందా రు 3-0-0 లుమాత్రమే.

ఎడిటర్, శ్రీ ఆదిశైవపత్రిక,

గురుకులాశ్రమము,

చిలుమూరు, అంతపరంపోష్టు, గుంటూరు జిల్లా.